

జలహోసం!

కృష్ణమ్మ దీవెనతో బుక్కపట్నం చెరువు సుజలాలతో హోరెత్తుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా.. కరవు తీరా దరి చేరిన నీళ్లను చూసేందుకు ప్రజలు శనివారం భారీగా తరలివచ్చారు. చిన్నారులు, యువతీ, యువకులు, గృహిణులే కాక పండుటాకులు సైతం విచ్చేసి జలహారతి ఇచ్చారు. - 16లో

ఈనాడు అనంతపురం

ఆదివారం 7 జనవరి 2018 16 పేజీలు

తూకం లెక్క...
మోసం పక్కా!



- చౌక బియ్యం సరఫరాలో మాయ
- ఆధునికమైనా ఆగని దోపిడీ
- సంచి 50 కిలోలు.. ఉండేది 45 కిలోలే

న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

ప్రజాపంపిణీ వ్యవస్థలో మాయాజాలం జరుగుతోంది. పౌరసరఫరాల గోదాం నుంచి చౌకదుకాణాలకు అందే బియ్యం సంచుల బరువులో తేడా ఉంటోంది. 50 కిలోల పేరుతో అందే సంచుల్లో రెండు నుంచి ఐదు కిలోల వరకు బియ్యం తక్కువగా ఇస్తున్నారు. వీటిని పొందిన డీలర్లు రేషన్‌కార్డు లబ్ధిదారులకు, మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తుండటంతో క్షేత్రస్థాయిలో కోత విధిస్తున్నారు. వెరసి సంక్షేమ ఫలాలు అర్హులకు పూర్తిస్థాయిలో అందని దైన్యమిది. ఈ నయా మిగతా 12లో

ధర్మవరం వైఎస్సార్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన 50 కేజీల బియ్యం బస్తాను తూకం వేయగా 45 కిలోలు ఉంది. సంచి కుట్లు విప్పకుండా అందులోంచి ఐదు కిలోల బియ్యం తక్కువగా ఉన్నాయి. డీలర్లు మాత్రం 50 కిలోల పేరుతో కేంద్రానికి సరఫరా చేశారు. ప్రతి నెల ఈవిధంగానే జరుగుతోంది.



ఆగండి.. ఆపండి!

"ఆ కాల్వ పరిధిలో అన్ని చెరువులకు నీరిస్తామని చెప్పారు. ప్రతి చెరువునూ కచ్చితంగా సగమైనా నింపుతామన్నారు. ఆ తర్వాత నీటి విడుదల మొదలైంది. అంతే నాయకుల ఒత్తిళ్లు మొదలయ్యాయి. రైతులు కూడా ఎడాపెడా కాల్వపైకి వచ్చి గండ్లు కొట్టి నీటిని మళ్లిస్తున్నారు. కాల్వ దిగువ నుంచి మొదలుకొని ఎగువకు వరుసగా చెరువులకు నీరివ్వాలనే లక్ష్యం దారి తప్పుతోంది. పదేపదే గండ్లు పూడ్చుకోవడానికి నీటి విడుదలను ఆపేస్తున్నారు. ఇప్పటికైనా అడ్డగోలుగా గండ్లు కొట్టడం ఆగాలి. ఈ తీరును ఆపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే క్షేత్రానికి కదిలి సమర్థంగా వ్యవహరించాలి. లేకుంటే అందరికీ సుజలాలు దరి చేరే పరిస్థితి కన్పించదు."

- పీఏబీఆర్ కుడికాల్వకు ఎడాపెడా గండ్లు
- అన్ని చెరువులకు నీరిస్తామన్నా వినరే
- గస్తీలు ఉన్నా ఆపలేక పోతున్న దైన్యం
- నీటి కోసం ప్రజాప్రతినిధుల తీవ్ర ఒత్తిళ్లు



ముకుందపురం వద్ద కాల్వకు గండి

ఈనాడు - అనంతపురం

పెన్నాఅహోబిలం సమతుల జలాశయానికి (పీఏబీఆర్) తుంగభద్ర నుంచి వస్తున్న నీరే కాకుండా, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం (హెచ్‌ఎన్ఎస్ఎస్) ద్వారా వచ్చే నీటిని కూడా నింపుతున్నారు. దీంతో జలాశయం క్రమంగా నిండుతోంది. ప్రస్తుతం ఈ జలాశయంలో 4.2 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది. ఇంకా అటు తుంగభద్ర నుంచి ఇటు హంద్రీనీవా ద్వారా కొద్ది రోజులు నీరిచ్చే వీలుంది. దీంతో పీఏబీఆర్ కుడికాల్వకు గత నెలలో అధికారులు నీటి విడుదల ఆరంభించారు. అయితే ఈ కాల్వలో నీటి ప్రవాహం సాఫీగా సాగడం లేదు. ఎక్కడిక్కడ రైతులు నీటి మళ్లింపునకు పోటీపడుతున్నారు. తూములు తెరవడానికి, అవకాశం లేకపోతే మిగతా 7లో

స్వచ్ఛ సంకల్పం

... 8లో...



తర్జనభర్జన!

- హెచ్చెల్సీకి 4.7 టీఎంసీలు వచ్చేనా
- 2 వేల క్యూసెక్కులపై సమాలోచన
- ఫిబ్రవరి 10వ తేదీ తుది గడువు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గుతున్న తరుణంలో హెచ్చెల్సీ ఇండెంట్ తెచ్చుకోవడంపై జిల్లా అధికార యంత్రాంగం తీవ్ర తర్జనభర్జన పడుతోంది. నెల రోజుల్లోగా తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు ఖాళీ అయ్యే పరిస్థితి తలెత్తింది. ఈలోపు నిర్దేశించిన హెచ్చెల్సీ వాటాను తెచ్చుకోవడం సాధ్యమేనా అనే అనుమానం తెరపైకి వచ్చింది. హెచ్చెల్సీ వాటాతోపాటు.. కేసీ కాలువ మళ్లింపు జలాలు కూడా జిల్లాకు కేటాయించే వీలుంది. ఈ రెండింటిని గడువులోగా తెచ్చుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ప్రస్తుతం రోజూ 1,500 క్యూసెక్కుల ప్రకారం తీసుకుంటున్నాం. ఏపీ సరిహద్దుకు 1,100 క్యూసెక్కులు వస్తున్నాయి. ఈ ప్రకారం తీసుకుంటే కనీసం నెలన్నర రోజులు పైగా పడుతుంది. ఈలోపు నిర్దేశించిన వాటా జలాలను తీసుకోవడం కష్టమే అనే భావన ఏర్పడింది. అందుకే రోజూ 2 వేల క్యూసెక్కుల ప్రకారం ఇండెంట్ తీసుకుంటే గడువు లోపు దాదాపు మిగతా 7లో



ఆకతాయిలపై నిఘా పెంచాలి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అమ్మాయిలను వేధించే ఆకతాయిలపై దృష్టి సారించి మరింత కఠినంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. మహిళా రక్షక్ బృందాల పనితీరుపై ఎస్పీ శనివారం సబ్‌డివిజన్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వారంలో 25 మంది ఈవ్‌టీజర్లను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో మహిళా రక్షక్ బృందాలు పౌర దుస్తుల్లో ఉంటూ అమ్మాయిలను వేధించే వారిని గుర్తించినట్లు తెలిపారు. న్యాయవాది పరిటాల శైలజ, విశ్రాంత ప్రిన్సిపల్స్ ఇందిర, నిర్మలమ్మ కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. మహిళా వసతి గృహాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కళ్యాణదుర్గం, కదిరి, గుంతకల్లు, ధర్మవరం, తాడిపత్రి, పెనుకొండలలో అదే తరహాలో కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు.

ప్రమాదవశాత్తు రైతుకు గాయాలు


గాయపడిన రైతు

కదిరి, న్యూస్‌టుడే: కౌలేపల్లి వద్ద పొలంలో కందిపంటకు అంటుకున్న నిప్పును ఆర్పేప్రయత్నంలో రైతుకు నిప్పంటుకుని గాయాలయ్యాయి. కౌలేపల్లికి చెందిన బాల ఆంజనేయులు గ్రామానికి సమీపంలోనే ఎకరాన్నర పొలంలో కందిసాగు చేశాడు. పంట బాగా పండింది. కోసి కుప్పలు కూడా వేశారు. మధ్యాహ్నం పంటకుప్పలను చూసి మురిసి పోయారు. ట్రాక్టర్‌ను తీసుకొచ్చి ఇంటికి తీసుకెళ్లాలని గ్రామంలోకి వస్తున్నాడు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత వెనక్కి తిరిగి చూశాడు. ఇంతలో పొగలు రగులుతుండటం గమనించాడు. దీంతో మళ్లీ పరుగున వెళ్లాడు. అప్పటికే కుప్పలువేసిన కందిపంటకు నిప్పుఅంటుకుని కాలుతోంది. దాన్ని ఆర్పే ప్రయత్నం చేశాడు. ఈ ప్రయత్నంలో రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది పంటకు అంటుకున్న మంటలను ఆర్పేశారు. అప్పటికే నష్టం జరిగిపోయింది. కాలిన గాయాలతో రైతును కదిరిప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాయగాళ్లు!

ఆభరణాలతో పరారీ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతలో చిల్లర దొంగలు విజృంభిస్తున్నారు. శనివారం పాతూరులోని ఓ బంగారు నగల దుకాణంలో ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఒకటవ పట్టణ ఇన్‌ఛార్జి సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల మేరకు ఇద్దరు దొంగలు నగల దుకాణంలోకి వెళ్లారు. తాము తాడిపత్రి కూడలిలో పానీపూరి విక్రయించే వ్యాపారులమని పరిచయం చేసుకున్నారు. బంగారు కమ్మలు కొనుగోలు చేస్తామని బేరమాడారు. ఇదే క్రమంలో 8 జతల కమ్మలను దుకాణంలోని నిర్వాహకురాలు చూపించారు. అయితే దొంగలు 3 తులాల కమ్మలను చేతిలో పట్టుకుని బయటికి పరిగెత్తారు. అప్పటికే రోడ్డుపై ఓ ద్విచక్ర వాహనం సిద్ధంగా ఉంది. అందులో కూర్చొని దర్జాగా వెళ్లిపోయారు. దుకాణం నిర్వాహకుడు అదే సమయంలో అక్కడికి చేరుకున్నాడు. ద్విచక్ర వాహనాన్ని కొంత దూరం వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. దొంగలు తప్పించుకున్నారు. బాధితుడు గంగాధర్ ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తొమ్మిది గంటలు ఆలస్యంగా రాజధాని ఎక్స్‌ప్రెస్

అనంతపురం(రైల్వే), న్యూస్‌టుడే: హజరత్ నిజాముద్దీన్ నుంచి బెంగళూరుసిటీకి వెళ్లే 22692 రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం సుమారు 9 గంటలు ఆలస్యంగా నడిచింది. సాధారణంగా అనంతపురానికి తెల్లవారుజామున 2 గంటలకు చేరుకుని బెంగళూరు సిటీకి ఉదయం 6.40 గంటలకు వెళ్లాల్సి ఉంది. శనివారం ఉదయం 11 గంటలకు అనంతపురానికి చేరుకుంది. బెంగళూరు సాయంత్రానికి చేరుకుంది. ఉత్తర భారతదేశంలో పొగమంచు కారణంలో రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఉత్తరాది నుంచి వచ్చే అనేక రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

మట్కా కేంద్రాలపై దాడులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: మట్కా నిర్వహిస్తున్న పలు కేంద్రాలపై పట్టణ పోలీసులు దాడులు చేసి ఇద్దరు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాఘవరెడ్డి పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు శనివారం క్రిష్ణాపురం '0' రోడ్డులో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు చేసి సాయిప్రసాద్‌రెడ్డి, చెన్నప్ప నాయక్ అనే నిర్వాహకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 45,590 నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సైలు శివప్ప, శ్రీధర్, సిబ్బంది శివారెడ్డి, నాగరాజు, మోహన్‌బాబు పాల్గొన్నారు.

హత్యాయత్నం కుట్రదారుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు

కదిరి, న్యూస్‌టుడే: కదిరి పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల హత్యకు కుట్రపన్నిన నిందితులను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సీఐ గోరంట్ల మాధవ్ వివరాలను వెల్లడించారు. సున్నపుగుట్టతండాకు వెళ్లే దారిలోని మున్సిపల్ వాటర్ ట్యాంకు వద్ద కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నట్లు డీఎస్పీ శ్రీలక్ష్మికి సమాచారం అందింది. దీంతో ఎస్సైలు హేమంత్, గోపాలుడు, సిబ్బందితో వెళ్లి మారణాయుధాలు కలిగి ఉన్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో జరిపిటి రవీంద్ర, ఎస్. మౌల, ఎస్. షాఉద్దీన్, ఫారుఖ్ షంషీర్, ఎస్. బాబ్జాన్‌లను విచారించారు. కుమ్మరవాండ్లపల్లికి చెందిన రవీంద్ర, భాగ్యమ్మ అనే మహిళతో వివాహేతర సంబంధం కలిగి డబ్బుతీసుకుని చేసిన హత్యకేసులో నిందితులుగా అంగీకరించారు. గతంలో జరిగిన హత్యకేసులో వీరంతా సబ్‌జైలుకు వెళ్లి వచ్చారు. రిమాండ్‌లో ఉన్నప్పుడు రవీంద్ర భార్య పట్ల అతని తండ్రే అసభ్యకరంగా ప్రవర్తించటంతో పాటు లైంగికంగా వేధించాడు. బెయిల్‌పై విడుదలయిన రవీంద్ర విషయం తెలుసుకుని తండ్రి గంగరాజును హతమార్చాలని నిర్ణయించుకున్నారు. దీంతో పాటు మూర్తిపల్లికి చెందిన రాంబాబుకు పెద్ద నాన్న కుమారుడు వెంకటరమణకు భూవివాదాలు ఉన్నాయి. దీంతో వెంకటరమణను హత్యకు రూ. 3 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందస్తుగా రూ. 20వేలు తీసుకున్నారు. హత్యకు ముందుగానే రూపొందించుకున్న పథకం ప్రకారం వేటకొడవళ్లను కొనుగోలు చేసి సున్నపుగుట్టకు వెళ్లే దారిలోని పొదల్లో దాచిపెట్టారు. శనివారం వాటిని తీసుకుని హత్యచేయటానికి వెళ్తుండగా సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారంతో మూర్తిపల్లి క్రాస్‌లో రాంబాబును అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు. అరెస్టయిన ఆరుగురు నిందితుల నుంచి మూడు వేటకొడవళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టయిన వారిపై కేసునమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సీఐ మాధవ్ తెలిపారు.

పెట్రోలు పోసి తగలబెడతా!

● నగరపాలికలో ఫ్లెక్సీ వివాదం ● కార్పొరేటర్లు, అధికారుల మధ్య వాగ్వాదం

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో డిప్యూటీ ఇంజినీరుపై దాడి జరిగిన సంఘటన మరచిపోకముందే మరో వివాదం నెలకొంది. కొందరు కార్పొరేటర్లు, పట్టణ ప్రణాళిక అధికారుల మధ్య శనివారం సాయంత్రం తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఫ్లెక్సీల తొలగింపు వివాదం తారాస్థాయికి చేరింది. పెట్రోలు పోసి నగరపాలక సంస్థ కార్యాలయాన్ని తగులబెడతామని ఓ కార్పొరేటర్ సోదరుడు అధికారులపై ధ్వజమెత్తాడు. అసలేం జరిగిందంటే.. నడిమివంక సమీపంలోని బళ్లారిరోడ్డులో ఓ కార్పొరేటర్ జన్మభూమి పురస్కరించుకుని ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూ ఫ్లెక్సీ కట్టారు. ఆ డివిజన్‌లో జన్మభూమి కార్యక్రమం ముగిసిందని పట్టణ ప్రణాళిక సిబ్బంది ఫ్లెక్సీని తొలగించారు. అదే ప్రాంతంలో మరో మహిళా నేత ఫ్లెక్సీ కూడా ఉంది. ఇరువురి ఫ్లెక్సీలను తొలగించారు. అయితే రెండు ఫ్లెక్సీలు ఒకేసారి తొలగించకుండా ఒక్కో ఫ్లెక్సీ ఒక్కో రోజు తొలగించారు. ఇదే వివాదానికి దారి తీసింది. అధికారులు పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. అయితే ఫ్లెక్సీని తొలగించినా ఒకరు మళ్లీ కట్టినట్లు అధికారులు చెబుతున్నారు. కార్పొరేటర్లు, వారి బంధువులు సుమారు 10 మంది పట్టణ ప్రణాళిక అధికారులపై విరుచుకుపడ్డారు. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌పై మండిపడ్డారు. కోపోద్రిక్తులైన ఓ నాయకుడు తగులబెడతానని హెచ్చరించాడు. దీంతో అధికారులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పంచాయితీ కమిషనర్ వద్దకు వెళ్లింది. కమిషనర్ ఛాంబర్‌లోనూ ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఇరువురికి కమిషనర్ తగిన సమాధానం చెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

అధికారుల మధ్య విభేదాలే కారణం

టౌన్‌ప్లానింగ్ అధికారుల మధ్య అంతర్గత విభేదాలున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారుల మధ్య విభేదాలే రాజకీయ గొడవకు కారణమైనట్లు తెలుస్తోంది. ఓ అధికారితో అనుమతి తీసుకుని ఫ్లెక్సీ కట్టినట్లు కార్పొరేటర్లు చెబుతున్నారు. కానీ ఆ అధికారి అనుమతి తీసుకున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదు. మరో అధికారి నేతృత్వంలో ఫ్లెక్సీలు తొలగించారు. అనుమతి తీసుకున్నట్లు సమాచారం ఇచ్చిఉంటే ఇంత గొడవ జరిగేది కాదు. ఓ ప్రముఖ నేత సిఫారులతో ఫ్లెక్సీ కట్టారు. నేత చెప్పినా సరే తొలగించారని కార్పొరేటర్లు మండిపడ్డారు.

నిబంధనలిలా..

ఫ్లెక్సీల ఏర్పాటుకు కొన్ని నిబంధనలున్నాయి. నగరంలో ఎక్కడ ఫ్లెక్సీ కట్టాలన్నా నగరపాలకసంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. వాణిజ్యపరమైన ప్రకటనలకు పన్ను కూడా చెల్లించాలి. ఫ్లెక్సీ వైశాల్యం ప్రకారం పన్ను విధిస్తారు. రూ. 500 నుంచి రూ. 5 వేల వరకూ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ ప్రకటనలు, ప్రభుత్వ కార్యక్రమాలకు పన్ను లేకుండానే అనుమతులిచ్చే సంప్రదాయం కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగానే ఫ్లెక్సీలు ఎక్కువగా నిర్మిస్తున్నారు. ఈ విషయంపై అనేకసార్లు గొడవలు చోటు చేసుకున్నాయి. రాజకీయ నేతలు చరవాణిలోనే అధికారులను బెదిరించిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్లెక్సీలు తొలగిస్తుండటంతో వివాదానికి దారి తీసింది.

విద్యుత్తు కష్టాలు తీర్చండి

అనంతపురం(విద్యుత్తు): రైతులకు విద్యుత్తు కష్టాలు తీర్చాలంటే హెచ్‌వీడీఎస్ పథకాన్ని జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అమలు చేయాలని జిల్లా పండ్లతోటల సంఘం నాయకులు తెలిపారు. శనివారం అనంతపురంలోని విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయంలో డీఈటీ పీవీ. రమేష్‌ను ఆ సంఘం నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పండ్లతోటల రైతు సంఘం జిల్లాఅధ్యక్షుడు అనంతరాముడు, ఉపాధ్యక్షులు ఆనంద్, నారపరెడ్డి, బి. వి. చౌదరి, కొండమనాయుడు మాట్లాడారు. వ్యవసాయ కనెక్షన్లకు సొమ్ము చెల్లించి, రైతులు ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.


వివాహిత ఆత్మహత్య

మడకశిర: టి. డి. పల్లికి భాగమ్మ(32) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ లింగన్న వివరాల మేరకు... మహిళకు వివాహమై 13 ఏళ్లయిందని, ఇప్పటివరకు సంతానం కలగలేదని తరచూ స్నేహితుల వద్ద ప్రస్తావించేది. జీవితంపై విరక్తి చెంది శనివారం పొలంలో విషపుగుళికలు తినటంతో కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఆన్‌లైన్‌లో నగదు ఉపసంహరణ

గుత్తి, న్యూస్‌టుడే: మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు అనే వ్యక్తికి చెందిన ఎస్‌బీఐ ఖాతాలో ఉన్న రూ. 51 వేలను అజ్ఞాతవ్యక్తులు ఆన్‌లైన్‌లో ఉపసంహరించుకున్నారు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు.. శ్రీరాములు స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంట సహాయకుడిగా పనిచేస్తున్నారు. గుత్తి ఎస్‌బీఐలో ఖాతా ఉంది. ఇతని ఏటీఎం ఒకటి పనిచేయకపోవడంతో బ్యాంకర్లు మరో ఏటీఎం ఇచ్చారు. పాత ఏటీఎంతో ఈనెల 4న గుర్తుతెలియని వ్యక్తులు నగదును ఉపసంహరించుకున్నారు. ఈ విషయాన్ని ఆయన శుక్రవారం గుర్తించారు. శనివారం గుత్తి ఎస్‌బీఐ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎద్దులబండి కిందపడి వ్యక్తి మృతి


రాజన్న మృతదేహం

బ్రహ్మసముద్రం: ఎద్దులబండి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం మండల పరిధిలోని గుండిగానిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై రహిమాన్, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొందరు రైతులు పశువులు, ఎద్దులకు నీరు తాగించేందుకు కె. యం. రాజన్న(55)కు చెందిన వ్యవసాయ తోటలోకి వచ్చారు. అదే సమయానికి ఓ రైతు ఎద్దులబండితో తోటలోకి వచ్చాడు. నీటి తొట్టి చుట్టూ ఉన్న పశువులను చూసి ఎద్దులు బెదిరిపోయి బండితో పాటు పరుగులు తీశాయి. ఎద్దులబండిని ఆపేందుకు రాజన్న అడ్డు రావడంతో ఆయన మీదుగా ఎద్దులబండి వెళ్లింది. రాయదుర్గం ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పంచనామా కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

బ్రాయిలర్ -	కేజీ
కోడిమాంసం -	రూ. 160
కోడిమాంసం(స్కిన్‌లెస్) -	రూ. 190
బోన్‌లెస్ -	రూ. 320
హోల్‌సేల్ లైవ్ -	రూ 78
నాటుకోడి (లైవ్) -	రూ. 320
నాటుకోడి మాంసం -	రూ. 420

మటన్ ధరలు

పొట్టేలు మాంసం -	కేజీ రూ. 500
గొర్రె మాంసం -	కేజీ రూ. 400

చేపలు ధరలు

సాధారణ చేపలు	రూ. 120
కట్ల రూహు చేపలు	రూ. 130
బొంగ్డా చేపలు-	రూ. 200
బోన్‌లెస్ చేపలు-	రూ. 220
చిన్న టైగర్ రొయ్యలు-	రూ. 240
పీతలు -	రూ. 170

కోడిగుడ్లు

డజను గుడ్లు(12) -	రూ. 53
హోల్‌సేల్(100) -	రూ. 410

మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు

హిందూపురం, (న్యూస్‌టుడే):

రకము:	బైవోల్టిన్	క్రాస్‌బీడింగ్ (సిబి)
కనిష్ఠధర:	363.00	290.00
గరిష్ఠ ధర:	625.00	425.00
సగటు ధర:	558.00	340.00

అనంతపురం

- గంగ... మరణశాసనం
- గౌరి.... జుమాంజి
- గాయత్రి.. అమేజాన్
- గౌతమి... మళ్లీరావా
- త్రివేణి... టైగర్ జిందాహై
- తరంగిణి... ఒక్క క్షణం
- తేజస్విని... సారథి
- శాంతి... హలో
- సుధ.. 2 కంట్రీస్
- స్వప్న... సర్వానిక్ రాయ్
- ఎస్వీ సినిమ్యాక్స్.. ఎంసీఏ
- నీలిమ... రాజాది గ్రేట్

ఇంటర్ ప్రయోగాలు, పరీక్షలపై సందేహాలా?

రేపు 'ఈనాడు-మీతోడు' ఫోన్‌ఇన్


చంద్రశేఖర్‌రావు, ఆర్ఐఓ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికి ఇంటర్ ఎంతో కీలకం. ఎంసెట్ ర్యాంకు సాధనకు ప్రతి మార్కు ఒక్కో మెట్టుగా ఉపయోగపడుతుంది. ఈసారి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మార్కుల స్థానంలో గ్రేడింగ్ విధానం ప్రవేశపెట్టబోతున్నారు. ఫిబ్రవరిలో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 15 వరకు ఉంటాయి. ఈ క్రమంలో విద్యార్థులకు ఎన్నో సందేహాలు వెంటాడుతున్నాయి. ప్రయోగాలు, పరీక్షలకు సంబంధించి ఏతరహా అనుమానాలు ఉన్నా.. ఒక్క ఫోన్‌కాల్‌తో నివృత్తి చేసుకునే సువర్ణ అవకాశం 'ఈనాడు' కల్పిస్తోంది. ముఖ్యమైన సబ్జెక్టులు గణితం, భౌతికం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం సంబంధించిన నిపుణులతో అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చు. ఇక ఆలస్యం ఎందుకు ఒక్క ఫోన్ చేయండి.

ఫోన్ చేయాల్సిన తేదీ: 8.1.2018
సమయం: ఉదయం 10 నుంచి 11.30 గంటల మధ్యన
నంబర్లు: 08554-245380, 8008573011

8న జేఎన్‌టీయూలో ఉద్యోగమేళా

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఇన్నొవేషన్ టెక్నాలజీ అకాడమీ (ఏపీఐటీఏ) ఆధ్వర్యంలో లైఫ్‌సైన్సెస్, ఫార్మసీ విద్యార్థులకు ఈనెల 8న జేఎన్‌టీయూలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రతినిధి కిశోర్ తెలిపారు. ఏపీఐటీఏ ఫైజర్ సంస్థలో 200 ఉద్యోగాలు కల్పించనుంది. ఐటీశాఖ మంత్రి నారాలోకేష్ చొరవతో మేళాను ఏర్పాటు చేస్తున్నారు. 2010-2018 సంవత్సరాల మధ్యలో ఉత్తీర్ణులైన లైఫ్‌సైన్సెస్, ఫార్మసీ విద్యార్థులు అర్హులు. అభ్యర్థులు ఇంటర్వ్యూ జరిగే స్థలంలో ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీటెక్, ఎంటెక్, బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, ఫార్మాడీకి చెందిన విద్యార్థులు అర్హులు. వివరాలకు 9989930780 నంబరుకు ఫోన్ చేయాలని ఆయన తెలిపారు.

చేనేతకు చిక్కుముళ్లు



ఈమె పేరు హారతి. ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఈమె 15 ఏళ్లుగా మగ్గం నేస్తోంది. ఇప్పటికీ గుర్తింపు కార్డు ఇవ్వలేదు. పలుమార్లు దరఖాస్తు చేసుకొన్నా ఫలితం కనిపించలేదు. ఆరు మగ్గాలు ఉన్నా గుర్తింపు కార్డు లేకపోవడంతో ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు దక్కటంలేదు.

- పెరిగిన ముడి సరకుల ధరలు
- నోట్లరద్దు, జీఎస్టీ ప్రభావం
- కూలీ గిట్టుబాటు కాక కార్మికులకు ఇబ్బందులు

హిందూపురం, న్యూస్‌టుడే: నేత బతుకులు కష్టాలమయంగా మారుతున్నాయి. కనీస కూలీ గిట్టుబాటుకాక ఆర్థికంగా చితికి పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.60లక్షల మంది చేనేతపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరం, సోమందేపల్లి, గోరంట్లలో ఎక్కువ మంది ఉంటున్నారు. ఎక్కువ మంది మరమగ్గాలవైపు వెళ్లగా మరికొందరు చేతిమగ్గాలతోనే నెట్టుకొస్తున్నారు. ఇంకొందరు కూలి మగ్గాలు నేస్తున్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావం ఈ కుటుంబాలపై ప్రభావం చూపుతోంది.

పట్టుచీరలపై పన్ను... పట్టుచీరలపై మొన్నటివరకు ఎలాంటి పన్ను చెల్లించేవారు కాదు. ప్రస్తుతం 5శాతం జీఎస్టీ విధిస్తున్నారు. ఆ ప్రభావం కార్మికులు, పట్టుచీరల వ్యాపారులపై పడుతోంది. ఒక్క ముద్దిరెడ్డిపల్లి ధర్మవరం, గోరంట్ల, సోమందేపల్లి ప్రాంతాల నుంచి పన్ను రూపేణా ప్రతినెలా రూ.50 లక్షలు వరకు వసూలవుతోంది. మరోవైపు ముడి పట్టు ధరలు భారీగా పెరిగాయి. ముడిపట్టు వార్పునకు కొనాలంటే రూ.8వేలు ఉండేది. ఇప్పుడు అన్నీ కలిపి రూ.11వేలకు చేరింది. ఇదే తరుణంలో కూలి ధరలను కుదించేశారు. నేత కార్మికులు చీరలు విక్రయించేందుకు ఎలాంటి మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో మాస్టర్ వీవర్స్, పట్టు చీరల వ్యాపారులకు అయిన కాడికి ఇచ్చేయాల్సి వస్తోంది.

బీమాపై అవగాహనేదీ?... చేనేత కార్మికుల్లో చాలా మందికి బీమా పథకం ఉందన్న సంగతి తెలియదు. 18-50 ఏళ్ల మధ్య వయస్సునన వారు రూ.80 చెల్లిస్తే రూ.2 లక్షల వరకు ప్రమాద, సాధారణ మరణ బీమా పొందేవీలుంది. ఈ విషయం తెలియక నష్టపోతున్నారు. అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది.

దళారుల దందా... చేనేతకార్మికుల అవసరాలనే కొందరు దళారులు ఆసరాగా చేసుకుంటున్నారు. అధికారులతో పనులు చేయిస్తామని, బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇలాగే రెండువారాల కిందట నేత కార్మికుల నుంచి ఓ దళారీ డబ్బులు వసూలు చేయటంతో పోలీసులకు పట్టించారు. కేసు నమోదు చేసి జైలుకు పంపారు.

ప్రోత్సాహకాలు కొందరికే...

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 1.09 లక్షల మందికి గుర్తింపు కార్డులు అందించింది. రాయితీపై సిల్క్ కోసం ప్రతినెలా రూ.1000 అందిస్తోంది. ఇది కొందరికే పరిమితమైంది. అసలైన కార్మికులకు అందడం లేదు. కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు జౌళిశాఖ అధికారులు చెబుతున్నా పేరున్న వారికే దక్కుతున్నాయి. నేత కార్మికులకు ఎలాంటి పూచీకత్తు లేకుండానే ఇవ్వాల్సి ఉన్నా నిరుపేద కార్మికులకు అందటంలేదు. అసలైన లబ్ధిదారులు నష్టపోతున్నారు. కూలీ మగ్గాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు.


మగ్గం నేస్తున్న కార్మికుడు

అర్హులైన కార్మికులకు అండ



చేనేత కార్మికులను ఆదుకొనేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దళారులను నమ్మి మోసపోవద్దు. తమ సమస్యలను నేరుగా జౌళిశాఖ అధికారులను కలిసి పరిష్కరించుకోవచ్చు. ప్రతి చేనేత కార్మికుడు బీమా తప్పనిసరిగా చేయించుకొనేలా అవగాహన కల్పిస్తున్నాం. **-పవన్‌కుమార్, జౌళిశాఖ ఏడీ**

పీఏబీఆర్ నీరు చెరువులకు మళ్లింపు


ఇంజినీర్లతో చర్చిస్తున్న ఎస్ఈ సురేందర్‌రెడ్డి

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ కింద ఉన్న చెరువులకు ప్రాధాన్యం ప్రకారం నీటి మళ్లింపు ప్రక్రియ శనివారం నుంచి మొదలైంది. కాలువ ముగిసే 111.5 కి.మీ. వద్ద ఉన్న తాడిమర్రి మండలం ఎం.అగ్రహారం చెరువుకు నీరు ఇచ్చారు. రెండు చెక్‌డ్యామ్‌లు నిండిన తర్వాత చెరువుకు నీరు చేరాయి. ఇక్కడి నుంచి మొత్తం 49 చెరువులను నింపుతారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ప్రతి చెరువుకు 30 శాతం మేర నీరు ఇవ్వనున్నట్లు హెచ్చెల్సీ ఎస్ఈ సురేందర్‌రెడ్డి చెప్పారు. ఫిబ్రవరి ఆఖరు దాకా నీరు ఇస్తామన్నారు. కాలువ మధ్యలో రైతులు ఎవరూ రంధ్రాలు పెట్టవద్దని ఆయన కోరారు. ప్రణాళిక ప్రకారం నీరు ఇస్తున్నామని, ఎవరూ కలత చెందవద్దన్నారు. ఇదే విషయాన్ని శనివారం ఎస్ఈని కలిసిన పండ్లతోటల రైతు సంఘం నాయకులకు చెప్పారు. మార్చి ఆఖరుదాకా నీరు ఇస్తూ.. చెరువులను పూర్తిగా నింపాలని ఆ సంఘం నాయకులు అనంత రాముడు, కొండమనాయుడు, నారపరెడ్డి, వెంకటేశ్వర్‌చౌదరి, ఆనంద్ ఎస్ఈని కోరారు. మరో వైపు.. గతనెల 28వ తేదీ నుంచి పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేశారు. రోజూ 300 క్యూసెక్కుల ప్రకారం పారుతున్నాయి. శనివారం నాటికి కాలువ ఆఖరుకు చేరాయి. అక్కడి నుంచి చెరువులకు మళ్లిస్తూ వస్తున్నారు.

నగరడోన జలాశయంపై చర్చ

హెచ్చెల్సీ ఆలూరు బ్రాంచి కాలువ(ఏబీసీ) పరిధిలోని నగరడోన జలాశయంపై చర్చ జరిగింది. దీనిని రూ.60 కోట్లతో నిర్మించనున్న సంగతి తెలిసిందే. శనివారం ఎస్ఈ సురేందర్‌రెడ్డి తన కార్యాలయంలో జీబీసీ, ఏబీసీ ఇంజినీర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈనెల 7న కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఉంది. ఈ క్రమంలో హెచ్చెల్సీ పరిధిలోని ఏబీసీ కాలువకు ఎన్ని నీరు వెళ్లాయి. ఆయకట్టు ఎంత. అదనంగా మరొక జలాశయం నిర్మాణం, ఇందుకు రూ.60 కోట్లతో అంచనాలతో ప్రతిపాదనలు తదితర అంశాలపై చర్చించారు. ఇప్పటికే కాలువ లైనింగ్ కోసం రూ.280 కోట్లు మంజూరైన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ సమావేశంలో జీబీసీ డివిజన్ ఈఈ రాజశేఖర్, ఏబీసీ సబ్ డివిజన్ డీఈ రమణ, ఎస్ఈ కార్యాలయ డీఈ సుబ్బయ్య, ఉరవకొండ సబ్ డివిజన్ శ్రీనివాసులు, జేఈలు తిమ్మారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరవు జిల్లాను సస్యశ్యామలం చేశాం

హంపాపురం (రాప్తాడు), న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కరవు జిల్లా అనంతకు హంద్రీనీవా కాల్వ ద్వారా నీరు విడుదల చేసి జిల్లాలోని చెరువులకు, కాల్వలకు, నీటికుంటలకు నీరు సరఫరా చేయించి సస్యశ్యామలం చేశామని మంత్రి పరిటాల సునీత తెలిపారు. శనివారం సాయంత్రం రాప్తాడు మండలంలోని హంపాపురంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఎడారిగా మారుతున్న అనంత జిల్లాను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద ఎత్తున నీరు సరఫరా చేయించి బీడు భూములను సాగు భూములుగా మార్చారన్నారు. బోరుబావుల్లో నిండుగా నీరు రావడంతో రైతులు విరివిగా పంటలు సాగుచేస్తు జీవనం సాగిస్తున్నారు. నీరు-చెట్టు పథకంలో నిధులు మంజూరు చేయించి నీరు నిల్వకు కృషి చేశామన్నారు. నియోజకవర్గంలోని పల్లెల్లో రూ.కోట్లు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేయించడంతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పేదలకు అందించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. రైతు రుణమాఫీ చేయడంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు మంజూరు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. కలెక్టర్ వీరపాండియన్, ప్రత్యేకాధికారి రవికుమార్, జిల్లా అధికారులు కిశోర్‌కుమార్, బాలనాయక్, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సర్పంచులు గోపాల్, వెంకటేష్, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


హంపాపురంలో ఎద్దుల బండిపై వస్తున్న మంత్రి పరిటాల సునీత

సెలవురోజున జన్మభూమి నుంచి మినహాయించాలి


హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: జన్మభూమి, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు సెలవురోజుల్లో మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. జన్మభూమి కార్యక్రమానికి ఉపాధ్యాయులు మాత్రమే విధులకు హాజరుకావాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు వెనక్కి తీసుకోవాలని, లేదంటే అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు బహిష్కరిస్తామన్నారు. 9న జరిగే సీపీఎస్ ధర్నా విజయవంతం చేయాలని సూచించారు.

హిందూపురం

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ మహబూబ్ బాషా తెలిపారు. రహమత్‌పూర్, రైల్వేరోడ్, పాండురంగనగర్, అంబేడ్కర్‌నగర్, వీడీరోడ్, డీఎల్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



హొన్నంపల్లిలో ప్రసంగిస్తున్న మండల ప్రత్యేక అధికారి

హొన్నంపల్లి, (పరిగి), రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, కుటుంబ వికాసానికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మండల ప్రత్యేక అధికారి నాగరంగయ్య పేర్కొన్నారు. హొన్నంపల్లిలో సర్పంచి మైలారప్ప అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఏడుగంటల పాటు ఉచిత విద్యుత్తు అందిస్తోందన్నారు. పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పరిగి పీహెచ్‌సీ వైద్యులు ఆదిశేషు, శ్రీక్రాంతి ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలమునయ్య, తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎస్ఐ రాంభూపాల్, ఏడీఏ రవి, ఏవో చైతన్య, మండల ఇంజినీరు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మానేపల్లిలో సంక్రాంతి కానుకల పంపిణీ

మానేపల్లి(లేపాక్షి): పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెడుతున్న ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రంగనాయకులు అన్నారు. మానేపల్లిలో సర్పంచి నారాయణప్ప అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో రంగనాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమన్నారు. ఉచిత వైద్యశిబిరం, పశు వైద్యశిబిరం, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎంపీపీ హనోక్, జడ్పీటీసీ ఆదినారాయణరెడ్డి, ఇరిగేషన్‌ఎస్ఈ సుధాకర్, డ్వామా ఏపీడి పుల్లారెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో సులోచన, ఎంఈవో నాగరాజునాయక్, వ్యవసాయాధికారి సురేంద్రనాయక్, వైద్యాధికారులు శ్రీదేవి, అశ్వినికుమార్, పశువైద్యాధికారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

నేడు 5కేరన్... ఆదివారం శిరివరంలో 5కేరన్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. శిరివరం స్కూల్‌కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలు పనిచేస్తాయని ఎంఈవో నాగరాజునాయక్ పేర్కొన్నారు.



రేషన్‌కార్డులు అందజేస్తున్న నాయకులు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని కోరారు. శనివారం పట్టణంలోని 5, 12, 24, 32 వార్డుల్లో జన్మభూమి సమావేశాలు నిర్వహించారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమఫలాలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పురసేవా యాప్‌ను వినియోగించాలని మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మీ సూచించారు. ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాము, తెదేపా నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, నాగరాజు, తిమ్మయ్య, అమర్, బాచి, నజీర్, కౌన్సిలర్లు లీలావతి, భారతి, షేక్ షాతాజ్ భాను, వెంకటస్వామి పాల్గొన్నారు. ఆదివారం 6, 13, 25, 33 వార్డుల్లో సమావేశాలు నిర్వహించనున్నారు.

నేడు 5కె రన్... మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం 6 గంటలకు 5కె రన్ ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మీ తెలిపారు. అక్కడి నుంచి గాంధీ సర్కిల్ మీదుగా తెలుగుతల్లి విగ్రహం వరకు, అక్కడ నుంచి రిలయన్స్ పెట్రోల్ బంకు మీదుగా పురపాలక సంఘం వద్దకు చేరుకొంటుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఏ వీరయ్య

సోమఘట్ట(చిలమత్తూరు): సోమఘట్టలో సర్పంచి లక్ష్మినరసప్ప అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఎంపీపీ నౌజియాభాను మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలు కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెరువుకిందపల్లి ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడు రెండేళ్లుగా రావడంలేదని వేరొకరిని నియమించాలని జడ్పీటీసీ లక్ష్మినారాయణరెడ్డి కోరారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు వీరయ్య వెంటనే ఎంఈవో సురేష్‌ను పిలిచి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి రావడానికి ఎవరూ రావటంలేదన్నారు. విషయాన్ని కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కారిస్తామని వీరయ్య తెలియజేయటంతో గ్రామస్థులు శాంతించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి విశ్వనాథ, మండల ప్రత్యేకాధికారి శుభదాస్, తహసీల్దార్ మారుతిప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్, ఏవో శ్రీలత, ఏపీఎం నారాయణ, ఏపీవో అమరావతి, హౌసింగ్ ఏఈ సుధాకర్‌నాయుడు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు శివప్ప, మండల తెదేపా కన్వీనర్ బాబురెడ్డి, నాయకులు అన్సర్, పాపన్న తదితరులు పాల్గొన్నారు.



కగ్గల్లులో మాట్లాడుతున్న ఎంపీపీ సుభద్రమ్మ

పూలకుంట, కగ్గల్లు(హిందూపురం గ్రామీణం): కనీస సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని హిందూపురం ఎంపీపీ సుభద్రమ్మ పేర్కొన్నారు. ఎంపీడీఓ శ్రీలక్ష్మీ అధ్యక్షతన పూలకుంటలో, తహసీల్దార్ చల్లా విశ్వనాథ్ పర్యవేక్షణలో సర్పంచి హనుమంతరాయుడు అధ్యక్షతన కగ్గల్లులో గ్రామసభలు జరిగాయి. గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూలకుంట సర్పంచి హనుమంతరాయప్ప, హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి, ఈఓఆర్‌డీ శివన్న, ఎంఈఓ గంగప్ప, సాక్షరత భారత్ మండల సమన్వయకర్త దాదాపీర్, వ్యవసాయాధికారి ఇమ్రాన్‌ఖాన్, ఉద్యాన అధికారి సుదర్శన్, ఐసీడీఎస్ ఏసీపీఓ శ్రీలత, మండల తెదేపా సమన్వయకర్త అశ్వత్తనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత ఇవ్వాలి

హిందూపురంఅర్బన్,న్యూస్‌టుడే: మానవతా దృక్పథంతో ప్రమాద, విపత్తు బాధితులకు చేయూత ఇవ్వాలని రాయలసీమ ప్రాంతీయ రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్త శంకర్‌రెడ్డి, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ శంకరయ్య అన్నారు. యువజన సంక్షేమశాఖ సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, విపత్తు స్పందన సర్వీస్ శాఖలు సంయుక్తంగా ఎన్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మూడురోజులు శిక్షణ ఇచ్చారు. శనివారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వలంటీర్లకు ధ్రువపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ శిక్షణ పొందినవారు ఎక్కడైనా విపత్తు జరినగినప్పుడు బాధితులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఉప ప్రధానాచార్యులు హేమలత, ఎన్‌ఎస్‌ఎస్ పీవో పోలయ్య, యూత్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త నాగమణి తదితరులు పాల్గొని వలంటీర్ల బాధ్యతలను వివరించారు.



ధ్రువపత్రాలు అందిస్తున్న కళాశాల ప్రధానాచార్యులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

సర్వే నిలిపివేయండి

దేమకేతేపల్లి(చిలమత్తూరు): అగళి నుంచి కొడికొండ వరకు జరుగుతున్న జాతీయ రహదారి పనులను వెంటనే నిలిపివేయాలని మండల పరిధిలోని దేమకేతేపల్లికి చెందిన కొందరు రైతులు, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని దేమకేతేపల్లిలో జరుగుతున్న రహదారి సర్వేను రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు సేకరిస్తున్న భూములు చాల విలువైనవని, ఇక్కడ రోడ్డు వేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయం చూడాలన్నారు. సీపీఎం నాయకులు రైతులకు మద్దతు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుల్ అక్కడికి చేరుకుని సమస్యను ఉన్నతాధికారులకు వివరించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రైతు సంఘం నాయకులు వినోద్ కుమార్, లక్ష్మినారాయణ, వెంకటేశు పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న రైతులు

ఆకట్టుకున్న నృత్యాలు



పూలకుంటలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

హిందూపురంగ్రామీణం: గ్రామాభివృద్ధి అనే అంశంపై పూలకుంట, కగ్గల్లు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం నిర్వహించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో ఎ.హెచ్.గంగప్ప పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్, విజయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని గ్రామాలు ఎలా ఉండాలి, కనీస సౌకర్యాల కల్పన, గ్రామాభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నృత్య, చెక్కభజనలతో చైతన్యం తెచ్చారు.

హిందూపురం

విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసన

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ కూడలిలో విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ప్రతాప్ మాట్లాడుతూ ఇటీవల కార్పొరేటర్ విద్యాసంస్థల్లో దాదాపు 50 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకొన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధకరమన్నారు. విద్యార్థి జ్ఞనసాగర్ మృతికి కారణమైన పాఠశాలను సీజ్ చేసి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో తిప్పేస్వామి, మురళి, భరత్, దినేష్, కిషోర్, రవి, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు(కిలో/రూ.ల్లో)(నిన్నటివి)

హిందూపురంఅర్బన్: వంకాయలు 20, పచ్చిమిరప(బళ్లాపురం) 60-80, బీరకాయలు 20, గోరుచిక్కుడు 40, బెండకాయ 40, బీన్స్ 40, టమోటా 5-8, ముల్లంగి 20, కోస్ 30, కాలీఫ్లవర్ 25, ఉల్లిపాయలు 50, వెల్లుల్లి 60, ఆలుగడ్డలు 20, బీట్‌రూట్ 40, కాకర 40, క్యారెట్ 60-80, సొరకాయలు 30, క్యాప్సికమ్ 60, పచ్చిబఠాణి 30, ఎండుకొబ్బరి 150, గుమ్మడికాయ 30, దొండకాయలు 40, బఠాణి 160, చిక్కుడు 40, పొట్లకాయ 30, మునగకాయలు 80.



పనులను పరిశీలిస్తున్న డీఎం తదితరులు

అభివృద్ధి పనుల పరిశీలన

లేపాక్షి, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం హిందూపురం డిపో మేనేజర్ గోపీనాథ్, ఇంజినీర్ రాంబాబు పరిశీలించారు. పనులను నాణ్యతగా నిర్వహించాలని గుత్తేదారుకు సూచించారు. ఫిబ్రవరి 24, 25 తేదీల్లో నిర్వహించే లేపాక్షి ఉత్సవాల్లోపు పనులను పూర్తిచేసి బస్టాండును అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని తెలిపారు. బస్టాండ్ ఆవరణలో సీసీ రహదారుల నిర్మాణానికి రూ.15లక్షలు, మరుగుదొడ్లు, నీటి సంపు నిర్మాణానికి రూ.4లక్షలు విడుదలైనట్లు వివరించారు. వారి వెంట కంట్రోలర్ భాషా తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతకు సంకల్పం

ఆసుపత్రుల్లో కాయకల్ప్ బృందం తనిఖీ

హిందూపురం, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులను శుభ్రంగా ఉంచడానికి 'కాయకల్ప్' అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్వచ్ఛతను పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. మంచి మార్కులు వచ్చిన ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వం నుంచి బహుమతి అందిస్తారు. ఆస్పత్రుల్లో శుభ్రతతోపాటు మెరుగైన వైద్యం అందనుంది. కాయకల్ప్ బృందం అధికారులు జిల్లాలో పలు ఆస్పత్రుల్ని తనిఖీ చేయనున్నారు. పరిశీలన అనంతరం అంశాలవారీగా మార్కులు వేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రులకు ఇప్పటి నుంచే ముస్తాబు చేస్తూ శుభ్రత పాటిస్తున్నారు.

పరిశీలించే అంశాలివి...

- మౌళిక వసతులు
- బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ
- ఆవరణలో పందులు, ఎలుకలు, కోతులు వంటివి కనిపించకుండా తీసుకొనే జాగ్రత్తలు
- రోగులకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా నియంత్రణ
- భద్రతాపరమైన చర్యలు
- పరికరాల శుభ్రత

గత ఏడాది రెండోస్థానం

జిల్లాలో 2014లో కాయకల్ప్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. గత ఏడాది శుభ్రతలో హిందూపురం ఆస్పత్రి రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచింది. రూ.10 లక్షల నగదు బహుమతి సొంత చేసుకుంది. గత ఏడాది వచ్చిన నిధులతో ఆస్పత్రిలో మౌళిక సదుపాయాలు కల్పించారు. ఈ సంవత్సరం మొదటిస్థానం సాధించేందుకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైరన్ జేఈ వెంకటస్వామి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేశవులు కృషి చేస్తున్నారు. ఆస్పత్రిలోని ఖాళీ స్థలంలో పార్కుల అభివృద్ధి, శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మొదటిస్థానానికి రూ.15 లక్షలు అందిస్తారు.



హిందూపురం జిల్లా ఆసుపత్రి

అంతర్ జిల్లా బృందం రాక

హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో కాయకల్ప్ అధికారుల బృందం శనివారం తనిఖీలు చేపట్టింది. పరిశుభ్రత, ఆస్పత్రిలో మౌలిక వసతులు, దస్త్రాల పరిశీలనను పరిశీలించేందుకు అంతర్ జిల్లా తనిఖీ బృందం కర్నూలు నుంచి వచ్చింది. నంద్యాల ప్రభుత్వాసుపత్రి వైద్యులు లలిత, అసెస్‌మెంట్ అధికారి రూప్‌కుమార్ తనిఖీ చేపట్టారు. వైద్యసేవలు అందుతున్న తీరును వార్డుల్లో రోగులను అడిగి తెలుసుకొన్నారు. అత్యవసర విభాగం నుంచి మొదలుపెట్టి చిన్నపిల్లల వార్డు వరకు మూడు గంటలకు పైగా క్షుణ్ణంగా పరిశీలించారు. 17న కేంద్ర బృందం రానుందన్నారు. అంతర్‌జిల్లా బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. వారివెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేశవులు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రోగులు సహకరించాలి



రోగులు కూడా శుభ్రత పాటించాలి. ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన చెత్తకుండీల్లోనే చెత్తను వేసి సహకరించాలి. ఆస్పత్రిలో, బయట గోడ రాతలు, చిత్రాలతో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నాం.

-డాక్టర్ కేశవులు, ఆస్పత్రి సూపరింటెండెంట్



ఆవిష్కరిస్తున్న ఉప విద్యాశాఖ అధికారి నాగభూషణం

కాలమానిని ఆవిష్కరణ

హిందూపురంఅర్బన్,న్యూస్‌టుడే: స్కూల్‌సహాయకుల సంఘం నూతన సంవత్సర కాలమానిని శనివారం పెనుకొండ డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి నాగభూషణం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గంగాధర్, ప్రతినిధులు లక్ష్మీనరసప్ప, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉప విద్యాశాఖ అధికారిని వారు పూలమాలలతో సన్మానించారు.

జీఎస్టీతో సామాన్యులకు ఇక్కట్లు

హిందూపురంఅర్బన్,న్యూస్‌టుడే: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్ ఆరోపించారు. శనివారం సీపీఐ నియోజకవర్గ మహాసభల సందర్భంగా ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం నుంచి ఇందిరా పార్కువరకు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి జాఫర్, వేమయ్య, నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు, దాదాపీర్ తదితరులు మాట్లాడారు. దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని, నోట్లరద్దు, జీఎస్టీతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెదేపా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో విఫలమైందన్నారు. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో అనంతపురంలో జరిగే జిల్లా మహాసభలు, కడపలో జరిగే రాష్ట్ర మహాసభలకు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, శివప్ప, గోవిందరెడ్డి, వెంకటేష్, కృష్ణానాయక్, బాబు, రామకృష్ణ, ఫకృద్దీన్, అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక... మహాసభల్లో భాగంగా నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నియోజకవర్గ కార్యదర్శిగా దాదాపీర్, సహాయ కార్యదర్శి శివప్ప, కార్యవర్గ సభ్యులుగా సురేష్‌బాబు, శ్రీనివాసరెడ్డి, బాబు, వెంకటేష్, రామకృష్ణ, గోవిందరెడ్డి, కృష్ణ, రామ్మూర్తి, శివప్ప, న్యామత్, మగ్బుల్, రహమతుల్లా, గంగన్న తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ కార్యకర్తల ర్యాలీ

రహదారి ఏర్పాటులో జాప్యంపై గ్రామస్థుల నిరసన

హొన్నంపల్లి(పరిగి): మండల పరిధిలోని హొన్నంపల్లి నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రహదారిని తారురోడ్డుగా మార్చడంలో కొనసాగుతున్న జాప్యాన్ని ప్రజలు శనివారం నిరసించారు. రహదారిపై ముళ్లకంపలు వేసి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. పదేళ్లుగా రహదారి ఏర్పాటులో అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని, వాహన చోదకులు నరకయాతన పడుతున్నారన్నారు. జన్మభూమి గ్రామసభ నిర్వహించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్నారు. యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొంటామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.

దోమతెరల పంపిణీ

పరిగి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమకూర్చిన దోమతెరలను పరిగి బాలుర ఎస్సీ వసతిగృహ విద్యార్థులకు పంపిణీ చేశారు. దోమల బెడదను నియంత్రించేందుకు, రోగాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇవి ఉపయోగపడతాయని డా.ఆదిశేషు, డా. శ్రీక్రాంతి తెలిపారు. కార్యక్రమంలో హిందూపురం మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివన్న, పీహెచ్‌ఎన్ గిరిజమ్మ, సహాయ సంక్షేమాధికారి ఆంజనేయులు, వార్డెన్ వీరనారాయణ పాల్గొన్నారు.

హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

హిందూపురంఅర్బన్,న్యూస్‌టుడే: హిందూపురం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ యువ విద్యార్థి ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి ర్యాలీగా బయలు దేరి తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని ఉపతహసీల్దార్ మైనుద్దీన్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐకాస ప్రతినిధులు ఇందాద్, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్, కదిరీష్, నాగభూషణం, లోకేష్, వెంకటేష్‌రెడ్డి, జబీ తదితరులు మాట్లాడుతూ వాణిజ్యపరంగా హిందూపురం ఎంతో అభివృద్ధి చెంది, జిల్లా కేంద్రానికి అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయన్నారు.



విద్యార్థి యువ ఐకాస ఆధ్వర్యంలో ప్రదర్శన

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ

ధనాపురం(హిందూపురం), న్యూస్‌టుడే: పరిగి మండలం ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభను కనబరచి దక్షిణ భారత ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఈ ప్రదర్శన 7న సికింద్రాబాద్‌లో జరగనుందని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు నీటితో నడిచే వాహనం నమూనా తయారు చేశారని గైడ్ టీచర్‌గా వ్యవహరించిన ఎం.రాధమ్మ అన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 9వ తరగతి విద్యార్థినులు డి.శిరీష, గుల్జార్‌భాను, శిక్షణ ఇచ్చిన రాధమ్మను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



మంత్రి నారాయణ నుంచి బహుమతి అందుకొంటున్న విద్యార్థినులు

EENADU THE EASY WAY CLASSIFIEDS

AGRIBUSINESS

MUSHROOMS

ఫ్రెష్ పుట్టగొడుగుల డీలర్‌షిప్. మష్రూమ్స్ పెంపకం ద్వారా రోజూ ఇంట్లో పనిచేస్తూ 10 వేలు ఆపై ఆదాయం. శిక్షణ ఇచ్చి మష్రూమ్స్ కొంటాం. విత్తనాలు లభించును. ✆ 9966158007.

AUTOMOTIVE

VEHICLES FOR SALE

Sale-A Brand New-2016 Model Eicher Body Type Bag Cement Vehicles-Reg. In Andhra Pradesh. Ct: 9912395688

TATA MARCOPOLO 42 Seaters School Buses 2010- 6,25,000/-. 2012- 8,75,000/-. 2013- 9,75,000/-. 2014- 11,00,000/-, 2015- Eicher Skyline 12,50,000/-. 75% Finance. ✆ 95333 31111.

1) **Tata** Indica CR4eV2 Good Condition, 2014 Model, White Colour, 2) Eicher Jumbo 20.16, Good & Excellent Condition are for Sale. Interest Person Can Send their Offer to prabirbanik@sugunafoods.co.in Ph: 7680901127, 040-30923000

BUSINESS SERVICES

మైక్రోటిక్‌లు మినస్, ఇన్‌వర్టర్స్ మరియు అన్ని రకముల వాహనముల బ్యాటరీస్ డీలర్ ధరకే లభించును. Ph: 9989999062, 9949816662.

WANTED DEALERS/AGENTS

Wanted Dealers for Automobile Equipment (for Mileage) Neoplatron India Pvt. Ltd. Contact Ph: 7337441146.

Wanted Distributors For New Andhra Coffee Industrial Leading in Hyderabad Since-25 Years ✆ 9394957575/ 9394930008

Wanted Distributors. ప్రముఖ కూల్‌డ్రింక్స్ పంపిణీ చేయుటకు పట్టణముల వారీగా/ ఏరియాల వారీగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. ✆ 8125787353, 9849777717.

BUSINESS OFFER

Need Finance or Financial Partner or Equity Partner for Housing Project at Hyderabad Good returns. ✆ 9052400656

Work With Global Garner App In Your Home Town & Earn Monthly Income. Contact: 9100050814

Wanted Finance for well Established Organization in Hyderabad for Monthly Interest Basis ✆ 9581435689/ 9441395689.

అతితక్కువ పెట్టుబడితో ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మిషన్‌లు కలవు. ముడిసరుకు ఇస్తాం, తయారైనవి మేమే కొంటాం. కుమార్ ఎంటర్‌ప్రైజెస్, Rjy, ✆ 93933 32227, (నో ఛార్జెస్).

శ్రీ అన్నయ్ క్యాండిల్స్ ట్రైనింగ్ ఉచితం కొవ్వొత్తులు చేస్తూ రోజూ మంచి ఆదాయం. అచ్చు, మైనము మేమే ఇస్తాము. No Charges. 09791195576, 097908 52975.

నిరుద్యోగ మరియు పార్ట్‌టైమ్ వర్క్ చేసి నెలకు అధిక లాభం సంపాదించుకునే అవకాశం కలదు. ఎటువంటి ఇన్వెస్ట్‌మెంట్ అవసరం లేదు. ✆ 99855 42819.

మంచి ఆదాయం సంపాదించండి. కాగితం ప్లేట్లు/ కప్పులు తయారీ ద్వారా తిరిగి కొనుగోలు. ముడి పదార్థం ఉచితం. కొత్త సంవత్సరం డిస్కౌంట్ అందుబాటులో ఉంది. వాసు ఎంటర్‌ప్రైజెస్. ✆ 8587844784, 9899108864.

Sri క్యాండిల్స్ : మైనపు ఒత్తులు మీ ద్వారా తయారు చేయించి By Back తీసుకోబడును. రోజుకి 3,000/- సంపాదించుకునే అవకాశం. సంప్ర ✆ 98404 19685, 80561 01021.

సోయా మిల్క్, పన్నీర్ తయారీ ట్రైనింగ్ ఇవ్వబడును మరియు మిషనరీస్ సప్లై చేయబడును. సంప్ర: 73968 71871, 93947 71871. Web: www.hindustansoya.org

సొంతంగా ఫైర్ & సేఫ్టీ ఇనిస్టిట్యూట్ పెట్టాలనుకునేవారికి మంచి అవకాశం తక్కువ ధరకే ఫ్రాంఛైజీ లైసెన్స్, సపోర్ట్ ఇవ్వబడును. ✆ 9666696796 / 9666696085.

Are You Looking for Investors to Develop your Business we will do Agents also Contact Call: 8838928406

గొప్ప బిజినెస్ ఆఫర్: చాయ్ బాబు చాయ్ కంపెనీకి డిస్ట్రిబ్యూటర్స్ & టీస్టాల్స్ కొరకు సంప్రII ✆ 93935 25252, 99855 55532, 70137 14142, 90141 42345.

PACKERS & MOVERS

హనుమాన్ ప్యాకర్స్ & మూవర్స్ మీరు ఇల్లు మారాలనుకుంటున్నారా, వెంటనే సంప్రదించండి రామ్‌నరేష్ ఫంక్షన్‌హాల్ హౌసింగ్‌బోర్డు కాలనీ అనంతపురం Ph: 8790704204

COMPUTER EDUCATION

Free Computer Training @ MIIT Computers, SSC, Inter, Degree Studentsకు ఉపాధితో కూడిన శిక్షణ. సంప్రII ప్రజ్వల్ టవర్స్, కమలానగర్, ATP. 8341815999.

EDUCATION

అందరికి ఉచితముగా బైబిలు ట్రైనింగ్ ఇవ్వబడును. స్త్రీలకు, పురుషులకు, దంపతులకు. ఉచితముగా సంప్రదించండి. ✆ 98481 20346.

TUITIONS

శ్రీనివాస కెమిస్ట్రీ అకాడమి JEE (Mains)/ Neet అభ్యర్థులకు 3 నెలలలో ఫిజికల్ & ఆర్గానిక్, కెమిస్ట్రీ పూర్తిచేయబడును. క్లాసస్ స్టార్ట్ 8-1-18. Ph: 9618562274.

DISTANCE EDUCATION

BNYS, BPT, B.Sc, MLT, DMLT, all Para Medical Cources and all Degrees & P.G 100% pass ✆ 89773 59598.

FINANCIAL SERVICES

FINANCIAL PLANNER

CIBIL Issue Clearance Is Possible Contact: FCS, 8977800014, 040-40020011. www.fortunecreditservices.com

HEALTH CARE

హాస్పిటల్ అమ్మబడును. బాడుగ భవనంలో Rent House, రన్నింగ్ హాస్పిటల్, OT, ICU, షేరింగ్ రూమ్స్, జనరల్ వార్డ్స్, ల్యాబ్, ఫార్మసీ, కన్సల్టింగ్ రూమ్స్, రిసెప్షన్ హాల్ అన్ని సదపాయములతో కలిగిన కొత్త మిషన్స్ ఫర్నీచర్‌తో సహా అమ్మబడును. శ్రీకంఠం సర్కిల్, సంప్రII 9440216013, 7013285397.

SKIN

హెచ్.ఐ.వి./ ఎయిడ్స్, చర్మ, సుఖ వైద్య నిపుణులు. Dr. M.శ్రీనివాసరావు, MBBS, D.V. శ్రీసాయి హాస్పిటల్, ఎస్.వి.నగర్, వెస్ట్ చర్చి దగ్గర, Opp. వెస్ట్ రైల్వేస్టేషన్, తిరుపతి. ✆ 0877- 2243016, 6451389.

INDUSTRY

MACHINERY FOR SALE

BEML-D-355 Dozer Fitter with Automatic Ripper Excellent Condition for Lease/ Sale Contact: 9908691735/ 8309724104.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

జ్యోతిష్యంతో విసిగారా? ప్రేమ, పెళ్ళి, సంతానం, వ్యాపారం, ఆర్థిక సమస్యలకు మీ ఇంటివద్దనే పరిష్కారం. ఈ రోజు గురువుగారు అనంతపురంలో 9948831875.

REAL ESTATE

హిందూపురంలో నిర్మించుచున్న చేతన్‌సాయి బృందావనం ఇల్లు, విల్లాస్ కొరకు సంప్రదించండి. 9000402776, 7702342868

విశాఖపట్నంలో ఇండ్లు / స్థలాలు / Flats కొనాలన్నా / అమ్మాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా / తీసుకోవాలన్నా కన్‌స్ట్రక్షన్ & ఇంటీరియర్ వర్క్స్ కొరకు సంప్ర. @ Sunil ✆ 7993034455.

FLAT FOR SALE

రూ.50 వేలకే నవ్యాంధ్ర రాజధాని అమరావతి నందు 1BHK 10 లక్షలు, 2BHK 14 లక్షలు, 15లక్షలు 18 లక్షలకే మీ సొంతం చేసుకోండి. ✆ 79979 93837, 97005 86161.

రూ.15 లక్షలకే 1BHK, 18 లక్షలకే 2BHK ఫ్లాట్స్ రాజధాని అమరావతిలో 50 వేలు చెల్లించి ఫ్లాట్ బుక్ చేసుకోండి. ఈ ఆఫర్ జనవరి 15 వరకే. ✆ 89787 77223, 89788 80223.

ATP నందు RTC బస్టాండు దగ్గరలో మధుర అపార్ట్‌మెంట్ నందు 2 BHK Flat అమ్మబడును. 9848859497, 9398947789.

HOUSE FOR SALE

ATP JNTU దగ్గర LIC కాలనీలో 2.5 సెంట్స్‌లో (35 లక్షల్లో) నిర్మించబోతున్న 2 ఇండివిజువల్ హోమ్స్ బుకింగ్ కొరకు సంప్ర: 8328384465, 9100632003.

అనంతపురం నందు మీ బడ్జెట్ తగ్గ ల్యాండ్ చూపించి తక్కువరేటులో ఇల్లు కట్టించి ఇవ్వబడును. All కన్‌స్ట్రక్షన్స్ & ఇంటీరియల్స్, ఉడ్‌వర్క్స్ చేయబడును. VB బిల్డర్స్ Ph: 9966738330, 9949999621.

హిందూపురం పట్టణంలోని వివిధ ప్రాంతములలో నూతనముగా నిర్మించిన మరియు వాడకములో గల గృహములు 30 లక్షల నుండి కోటి రూపాయల విలువ గలవి అమ్మబడును. 9177520954.

LAND FOR SALE

తిరుపతి నుండి 7 Km అన్ని కార్ల షోరూంల దగ్గర & NH.18Aకు 295 మీటర్ల దూరంలో 1 ఎకరం (రెసిడెన్షియల్ & కమర్షియల్) చుట్టూ 33 అII రోడ్‌తో అమ్మకం. 95739 97225, 85000 59810.

PLOT FOR SALE

శంషాబాద్, షాద్‌నగర్, కొత్తూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, జడ్చర్ల, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో Open Lands, Plots అమ్మబడును/ కొనబడును. ✆ 9848589182/ 9392303122

హైదరాబాద్ పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, కొహెడ, జనచైతన్య, శ్రీమిత్ర, అIIమెట్, బాటసింగారం, తుర్కయాంజాల్, శంషాబాద్‌లో ప్లాట్లు కొనబడును. ★ రవి 9347454990/ 9849454990

అనంతపురము నుండి బెంగుళూరు వెళ్లే NH ప్రక్కన DTCP అప్రూవల్ కలిగిన ప్లాట్స్ అన్ని డెవలప్‌మెంట్స్‌తో తక్కువ ధరలో కలవు. సంప్రII 7995060893.

LEASE / RENT

ATP, రామ్‌నగర్ ఫ్యాంటసీ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ నందు అన్ని వసతులతో కూడిన 2 BHK Flat ఫ్యామిలీకి Rent/ Leaseకు ఇవ్వబడును. Ph: 9440060878.

TOLET

కళ్యాణదుర్గం రోడ్డు, మిలిటరీ క్యాంటీన్ వెనుకభాగంలో గ్రౌండ్‌ఫ్లోర్, 1st ఫ్లోర్ (2 BHK) కొత్త ఇల్లు బాడుగకు కలదు. నీటి వసతి, కారు పార్కింగ్ సౌకర్యం కలదు. Ph: 8309775513.

ATP, ADCC బ్యాంక్ కాలనీ, 4th టౌన్ పోలీస్‌స్టేషన్ కొత్త బిల్డింగ్ దగ్గర తూర్పు ఫేస్ కలిగిన అపార్ట్‌మెంట్‌లో పార్కింగ్, Lift, మంచినీటి వసతి, 2 BHK కలిగిన 3 Flats బాడుగకు కలవు. Ph: 9160238790.

RTC బస్టాండు దగ్గర సాయి మహేశ్వర అపార్ట్‌మెంట్‌లో గ్రౌండ్ ఫ్లోర్, 2 బెడ్‌రూమ్ గల ఇల్లు బాడుగకు కలదు. Ph: 8978970209, 9177734945.

RTO ఆఫీస్ దగ్గర భైరవనగర్ 1st క్రాస్‌లో 9000 Sqc బిల్డింగ్ స్కూల్, కాలేజీ హాస్టల్‌కు బాడుగకు ఇవ్వబడును. Ph: 9948870035, 8501860060.

పద్మావతి బిల్డింగ్ త్రివేణి టాకీస్ వెనుక బజాజ్ షోరూం ప్రక్కన షాపు రూం బాడుగకు ఇవ్వబడును. Ph: 9440289139, 7386238433.

JOBS

వృద్ధాశ్రంలో మంచానవున్న వృద్ధులకు సేవ చేయుటకు ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 8 to 10 వేలు. ✆94936 36855, 89779 27555.

అనంతపురం RTC బస్టాండు దగ్గరలో ఉన్న శాంతి నర్సింగ్‌హోమ్‌లో పనిచేయుటకు అనుభవం గల నర్సులు కావలెను. సంప్రII 9440549184.

సుజాత హోటల్ నందు పనిచేయుటకు సూపర్‌వైజరు, బిల్‌రైటర్, ఆల్‌రౌండర్ క్లీనర్లు, స్టోరు కీపర్స్ కావలెను. Ph: 9492208779.

Mouse I టెక్నాలజీస్ ATP నందు పనిచేయుటకు MS-Office, C, C++, Java, Oracle కోర్సులు వచ్చిన లేడీ స్టాఫ్ కాII 7330833069.

ప్రముఖ సంస్థలలో మెయింటెనెన్స్ ఇంజనీర్స్, DEO, Jr. అసిస్టెంట్స్, అటెండర్స్, సూపర్‌వైజర్స్ M/F. max994466@gmail.com. ✆ 7660097618, 7995913818.

హైదరాబాద్‌లోని ఇళ్ళల్లో 24 గం.లు వృద్ధులకు సేవచేయడానికి, పిల్లలను చూసోవడానికి 100 మంది ఆడ/మగవారు కావలెను. జీతం:10 వేలు. భోజనం+వసతి ఫ్రీ.✆ 7032025222

నర్సులు కావలెను. హైద్రాబాదుకు దగ్గర్లోని అందమైన వృద్ధాశ్రమానికి ANM (8వేలు), GNM (10 వేలు), BSC (13 వేలు) కావలెను. వసతి, భోజనం ఉచితం రిటైర్డ్ నర్సులు కూడా సంప్ర: ✆ 9010922214.

ప్రముఖ స్కూల్ ATP నందు పనిచేయుటకు PRO's, నర్సరీ టీచర్ మరియు తెలుగు బోధించుటకు అనుభవంకల ఉపాధ్యాయులు కావలెను. 8886635551, 8886645551.

హిందూపురంలో నిర్మించుచున్న చేతన్‌సాయి బృందావనం విల్లాస్‌లో మార్కెటింగ్ జాబ్ కొరకు స్త్రీ మరియు పురుషులు కావలెను. Contact: 9100403922.

Wanted Sales Executives for Aayu Copper Bottles. Exp in Home Appliances. CV to krishna_machiraju@yahoo.co.in ✆ 8096688198

Wanted T.S.I for Nandana Foods (Spices) minimum Experience required in This field. ✆ 94926 62624, nandanafoodsmanagement@gmail.com

Bన్యూ మొబైల్స్ షోరూం నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ & క్యాషియర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ESI+PF సదుపాయం కలదు. లోకల్ మొబైల్ షాపులలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. అడ్రస్సు: DL రోడ్, బాలాజీ సర్కిల్, హిందూపూర్. 77997 72648, 93473 08878.

సమతా హిందీ ప్రచారవిభాగ్‌కు జిల్లాలోని అన్ని ప్రాంతాలలో DHOగా చేయుటకు ఇంటర్ ఆపైన అభ్యర్థులు 73826 44910కు SMS/ samatahindi.webplus.net ఆన్‌లైన్‌లో అప్లై చేయగలరు. జీ: 9 వేలు+.

Hyd కోఠిలో లేడీస్ హాస్టల్‌కై లేడీవార్డెన్, లేడీకుక్, వాచ్‌మెన్ ఫ్యామిలి కావాలి. ఏజ్: 35సంIIలోపు. భోజనం + వసతి సౌకర్యం. ఆసక్తిగలవారు మాత్రమే సంప్ర: ✆ 7893218380

AIRTEL డిస్ట్రిబ్యూటర్స్ దగ్గర మార్కెటింగ్ చేయుటకు యువకులు కావలెను. స్మార్ట్‌ఫోన్ కలిగివుండాలి. జీ: 10,000 +ఇన్సెంటివ్స్ + భోజనవసతి కలదు. 83740 70404, 97005 08082.

Required F&B, Manager for a Franchise in Nellore. Free Accommodation & 11K per Month. Exp. 2 to 5 Yrs. Ph: 8688023456.

ప్రముఖ వస్త్ర దుకాణం నందు పనిచేయుటకు కావలెను. జీతం: రూ. 8,000. P.F, ESI, ఉచిత భోజనము, వసతి సౌకర్యం కలదు. పురుషులకు మాత్రమే. Age: 18 to 27 సంవత్సరములు. Contact: 9951902266.

శైలజ ప్లాస్టిక్ ఇండస్ట్రీ నందు పనిచేయుటకు లేడీ అకౌంటెంటు కావలెను. Ph: 7032920079, 9291207840.

అనంతపురం నందు Exide Life ఇన్స్యూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు అడ్వైజర్స్ (ఏజెంట్లు) కావలెను. సంప్రII ✆ 9160613231.

MARKETING / SALES

సేల్స్ ఏజెంట్స్ కావలెను. ఆధునికంగా మన సంస్కృతిని కాపాడుకుందాం అన్ని శుభకార్యాలకు వేద ఆశీర్వచనాన్ని మీ సందేశంతో పాటు వీడియోద్వారా పంపించండి. FB/ వాట్సాప్‌లో షేర్‌చేసుకోండి. Ph: 9701763388

FACULTY / TEACHERS

Wanted Teachers for High School - English-1, Maths-1. For Primary-3 No (Female). PET-1 No. (Male or Female) to work at Kadiri. Cont: 9347410386.

నార్పలలో ప్రముఖ EM స్కూల్ నందు పనిచేయుటకు సైన్స్/ ఇంగ్లీష్ టీచర్స్ కావలెను. హాస్టల్ వసతి కలదు. సంప్రదించండి. 9493312181.

MEDICAL


Medical Rep. Job మెడికల్ రిప్రజంటేటివ్ తెలుగు, ఫ్రెషర్ లేదా అనుభవం గల వారు కావలెను. అనుభవం గల వారికి మొదటి ప్రాధాన్యత సంప్ర: ✆ 9206710477, Email: phamsonpharma@yahoo.com

TOURS & TRAVELS

1/2 & 20/2 గంగా సాగర్ + కామాఖ్యా 6/2 & 6/3 కాశి 2/3 & 30/3 రామేశ్వరం 19/2 & 10/4 పంచ ద్వారాII 20/2 & 6/3 దివ్యదేశII 5/2 & 13/3 కేరళ+శబరి 26/4 & 10/5 చార్‌ధాం. 19/2 రాజస్థాన్. సాయిచరణ్. ✆ 93983 36779.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



నేడు 5కె పరుగు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రతి మండల, మున్సిపాలిటీల్లో 5కె పరుగు నిర్వహించాలని కలెక్టర్ వీరపాండియన్ తెలిపారు. గుంతకల్లులో జిల్లాస్థాయి 5కె పరుగు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు పరుగు నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పని సరిగా హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

వేధింపులపై వేటు

అనంతపురం (అరవిందనగర్): వాణిజ్య పన్నుల శాఖలోని గుంతకల్లు సర్కిల్ డీసీటీఓ శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ ఆశాఖ కమిషనర్ శ్యామలరావు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాలతో ఇక్కడి డీసీ కల్పన చర్యలు తీసుకున్నారు. డీసీటీఓ మామూళ్ల కోసం వ్యాపారులను వేధించడం, వసూళ్లకు ఓ ప్రైవేట్ వ్యక్తిని నియమించుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో వ్యాపారులు కొందరు డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం డీసీ నివేదికను కమిషనర్‌కు పంపించారు. నివేదిక ఆధారంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నైపుణ్యంతోనే రాణింపు

జేఎన్‌టీయూ: నైపుణ్యంతోనే యువత రాణిస్తారని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూలోని సీమెన్స్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీమెన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలతో విద్యార్థులకు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు అందుతాయన్నారు. ఇప్పటి దాకా 49 బ్యాచ్‌లు 1750మంది విద్యార్థులు శిక్షణ పొందారన్నారు. పరిశ్రమలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి శ్రీనివాస్‌కుమార్, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగండి.. ఆపండి!




గండిని పూడ్చే ప్రయత్నం

(మొదటి పేజీ తరువాయి)

కాల్వకు గండ్లు పెట్టేందుకు చూస్తున్నారు. దీంతో జలాశయం వద్ద కాల్వకు వదులుతున్న నీటికి, కాల్వ చివరకు చేరే నీటికి అసలు పొంతన ఉండటం లేదు.

విడుదల నుంచి పంచాయితీయే..

పీఏబీఆర్ కుడి కాల్వ... కూడేరు, గార్లదిన్నె, రాప్తాడు, బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం మండలాల పరిధిలో ఉంది. ఈ కాల్వ 112 కి.మీ. మేర ఉండగా, 42 తూముల పరిధిలో 49 చెరువులు ఉన్నాయి. ఆయా చెరువుల్లో గత ఏడాది కురిసిన వర్షాలతో 20 శాతం మేర నీరుంది. దీంతో వచ్చే ఏడాది తాగునీటి కష్టాలు ఉండకుండా, ముందస్తుగా పీఏబీఆర్ నుంచి నీటిని కూడా విడుదల చేయాలనుకున్నారు. ఇప్పటికే చెరువులో ఉన్న 20 శాతం నీటితోపాటు, కాల్వ ద్వారా మరో 30 శాతం నీటిని ఇచ్చి ప్రతి చెరువును 50 శాతం నింపాలనుకున్నారు. అయితే తొలుత నీటి విడుదల సమయంలోనే పంచాయితీ మొదలైంది. కాల్వకు ఎగువ నుంచి చెరువులను నింపాలని ఒకరు, దిగువున ఉన్న చెరువు నుంచి మొదలుపెట్టి ఎగువున ఉన్న చెరువు వరకు నింపుతూ రావాలని మరొకరు పట్టుబట్టారు. దీనిపై కొద్ది రోజులు తర్జన భర్జనలు జరిగాయి. చివరకు ఎలాగోలా ఒప్పించి, కాల్వ చివరన ఉన్న చెరువు నుంచి క్రమంగా ఎగువకు చెరువులను నింపేలా ఇంజినీర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గత నెల 22న నీటి విడుదల ఆరంభించారు. పది రోజుల్లో నీరు కాల్వ చివరికి చేరుకోవాల్సి ఉన్నా ఇప్పటికే ఏదో మొక్కుబ



కాల్వ నుంచి బయటకు పోతున్న నీరు

డిగా నీరు చేరుతోంది.

కట్టడి చేసినా గండ్లే..

కాల్వకు నీటి విడుదల మొదలైనప్పటి నుంచి రైతులు అనేక చోట్ల గండ్లు పెట్టి నీటిని మళ్లిస్తున్నారు. వివిధ మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల పెద్ద గండ్లు పెడుతుంటంతో వాటిని పూడ్చడం కష్టమవుతోంది. ఒక్కోసారి జలాశయం నుంచి నీటి విడుదల ఆపేసి.. ఆ తర్వాత గండ్లను పూడుస్తున్నారు. ఇందులో ఇంజినీర్లు తొలుత చేసిన ప్రకటన కూడా రైతుల తొందరపాటుకు కారణమవుతోంది. జనవరి నెలాఖరు వరకు కాల్వలో నీటిని విడుదల చేస్తామని తొలుత ప్రకటించారు. వాస్తవానికి జలాశయంలో ప్రస్తుతం 4.2 టీఎంసీల మేర నీరు ఉంది. ఇంకా ఎగువ నుంచి నీరొచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో కుడి కాల్వ పరిధిలో చెరువులకు 2.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని అనుకుంటున్నారు. ప్రస్తుతం రోజుకు 500-600 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. ఇంకా 100-200 క్యూసెక్కులు పెంచనున్నారు. మార్చి రెండో వారం వరకు కాల్వ నుంచి నీటి విడుదల ఉంటుందని ఇంజినీర్లు భరోసా ఇస్తున్నారు. అన్ని చెరువులకు తప్పకుండా నీరిస్తామని చెబుతున్నారు. అయితే రైతులు మాత్రం ఎక్కడా ఆగడం లేదు.

మరోవైపు ఇంజినీర్లు కొందరు నాయకులు, పోలీసుల సహకారం తీసుకొని కాల్వపై పహరా ఏర్పాటు చేశారు. 42 తూముల వద్ద ఇద్దరేసి కానిస్టేబుళ్లతో పహరా ఏర్పాటు చేశారు. అయినా సరే కొన్ని చోట్ల గండ్లు పెడుతున్నారు. తాజాగా గార్లదిన్నె మండలంలోని ముకుందపురం వద్ద రంధ్రాలు పెట్టడంతో నీరు దిగువకు పోతోంది.

వృథా కూడా ఎక్కువే..

మరోవైపు పీఏబీఆర్ కుడికాల్వలో నీటి వృథా కూడా ఎక్కువగానే ఉంటోంది. దాదాపు రెండు దశాబ్దాల కంటే ముందే తవ్విన కాల్వ కావడం, సరైన నిర్వహణ లేకపోవడంతో.. ఈ కాల్వలో అనేక చోట్ల నీరు వృథా అవుతోంది. రంధ్రాల ద్వారా నీరు బయటకు పోవడం, అటవీ ప్రాంతాల పరిధిలో నీటి వృథా ఎక్కువగా ఉంది. ప్రస్తుతం జలాశయం వద్ద కాల్వలోకి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుంటే.. చివరన 112వ కి.మీ. వద్ద ఉన్న మరువపల్లె అగ్రహారం చెరువుకు అతి కష్టం మీద 50 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో దిగువ నుంచి చెరువుల నుంచి నింపుతూ రావాలనే లక్ష్యం కూడా గాడి తప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆధునికీకరణపై దృష్టి..

తాజాగా పీఏబీఆర్ కుడి కాల్వ ఆధునికీకరణపై హెచ్చెల్సీ ఇంజినీర్లు దృష్టిసారించారు. ఈ కాల్వ సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారి, నీటి వృథా ఎక్కువగా ఉండటంతో.. మొత్తం కాల్వ లైనింగ్ చేయించాలని ప్రతిపాదిస్తున్నారు. వాస్తవానికి మూడేళ్ల కిందటే ఈ కాల్వ ఆధునికీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు దాదాపు రూ.315 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అయితే ప్రస్తుతం పెరిగిన ధరల ప్రకారం చూస్తే అంచనా వ్యయం రూ.450-500 కోట్ల వరకు చేరుతుందని భావిస్తున్నారు. పీఏబీఆర్ కుడి కాల్వ ఆధునికీకరణకు సంబంధించి ఎంత వ్యయం అవుతుందనే అంచనా తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని హెచ్చెల్సీ ఎస్ఈ సురేంద్రరెడ్డి 'ఈనాడు'కు తెలిపారు.

ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీ

జనవరి 5, 2018 విజేతలు

1. బి. రోహిత, గుర్రంగూడ, హైదరాబాద్; 2. డి. రామదుర్గ, గుంటూరు; 3. పి.ఎన్.వి.లక్ష్మి, రాజమహేంద్రవరం; 4. లక్ష్మి, ఒంగోలు; 5. ఎన్. భూలక్ష్మి, కొండ్రుపాడు, ఖమ్మం; 6. ఎం. లక్ష్మి, అనంతపురం; 7. ఆర్. ప్రవీణ, చిన్నవాల్తేరు, వైజాగ్; 8. వి. సునీత, విజయవాడ; 9. కె. అరుణ, నెల్లూరు; 10. ఎన్.రోజా, చిన గంట్యాడ, గాజువాక. విజేతల వివరాలు, ఫొటోలు ఈనాడు డాట్‌నెట్‌లో చూడవచ్చు.

21న గిరిజన మహాగర్జన

మారుతీనగర్(అనంతపురం): బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 21న నగరంలో గిరిజన మహాగర్జన నిర్వహిస్తున్నట్లు అనంత గిరిజన ఐకాస నగర అధ్యక్షుడు సూరి తెలిపారు. శనివారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే గిరిజన విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా గిరిజనులు ఐక్యంగా కదిలి మహా గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తర్జనభర్జన!

(మొదటి పేజీ తరువాయి)

వాటాను పొందడానికి వీలుంది. అయితే... ఇక్కడ మరొక సమస్య ఏర్పడింది. కణేకల్లు, జీబీసీ ఆయకట్టుపై ప్రభావం ఉంటుందన్న సమస్య లేకపోలేదు. ఫిబ్రవరి 15వ తేదీ దాకా హెచ్చెల్సీ ప్రధాన కాలువ పారితేనే ఆ రెండు రకాల ఆయకట్టు కింద ఉన్న పంటలు బయట పడేది. ఈ క్లిష్ట పరిస్థితిలో ఏం చేయాలన్న దానిపై అధికారులు తీవ్ర స్థాయిలో మల్లగుల్లాలు పడుతున్నారు.

17.476 టీఎంసీల్లో...!

తుంగభద్ర జలాశయంలో నీటి లభ్యత ఆధారంగా హెచ్చెల్సీ వాటా 17.476 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటికి 14.7 టీఎంసీలు జిల్లాకు చేరాయి. ఇంకా 2.776 టీఎంసీలు రావాల్సి ఉంది. మరో వైపు... కేసీ కెనాల్ మళ్లింపులో మన జిల్లాకు రెండు టీఎంసీలు వచ్చే అవకాశం ఉంది. ఈ రెండింటిని కలిపితే ఇంకా జిల్లాకు 4.776 టీఎంసీలు రావాల్సి ఉంది. ప్రస్తుత 1,500 క్యూసెక్కుల ఇండెంట్ ప్రకారం అయితే ఆ 4.776 టీఎంసీలను తెచ్చుకోడానికి కనీసం 45 రోజులపైగా పట్టనుంది. అయితే ఫిబ్రవరి 10వ తేదీ నాటికే టీబీలోని నిల్వలు పూర్తి కానున్నాయి. అదే... 2 వేల క్యూసెక్కుల ప్రకారం నీటిని తీసుకుంటే నిర్దేశిత గడువులోపు మనకు దక్కాల్సిన ఆ 4.776 టీఎంసీలను తీసుకోవడానికి అవకాశాలు ఎక్కువ ఉంటాయి. ఈ కోణంలోనే కలెక్టర్ వీర పాండియన్ హెచ్చెల్సీ ఎస్ఈ సురేందర్‌రెడ్డి, ఇతర జలవనరుల అధికారులతో సమాలోచనలు చేసినట్లు తెలిసింది. అయితే... 1,500 క్యూసెక్కుల ప్రకారం అయితే ఎక్కువ రోజులు తెచ్చుకోవచ్చని కొందరు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. ఇలా అయితేనే జీబీసీ, హెచ్చెల్సీ ప్రధాన కాలువ కింద ఉన్న పంటలు గట్టెక్కుతాయని అనుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో ఏమి చేయాలన్న దానిపై ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. ఇప్పటికే హెచ్చెల్సీ కింద 88వేల ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయి. హెచ్ఎల్ఎంసీ కింద 35,179 ఎకరాల్లో, జీబీసీ కింద 25151 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అత్యధికంగా ఈ రెండు వ్యవస్థల కిందనే పంటల సాగు అవుతోంది. ప్రస్తుత పద్ధతి ప్రకారం తీసుకుంటే కనీసం ఒక టీఎంసీ నీరు తెచ్చుకోలేని దుస్థితి తలెత్తుతుందన్న అనుమానం వ్యక్తం అవుతోంది. మొత్తమీ తతంగంపై రెండుమూడు రోజుల్లో తేల్చడానికి అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.



కళకళలాడుతున్న హెచ్చెల్సీ

సొంతూరిపై మమకారం...

◆ నీటిశుద్ధి కేంద్రాల ఏర్పాటు ◆ వందల కుటుంబాలకు రక్షిత మంచినీరు సరఫరా



కోనాపురంలో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రం

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: ఆర్థికంగా ఓ స్థాయికి వచ్చిన తరువాత జన్మనిచ్చిన తల్లిదండ్రులను, మాతృభూమిని మరిచిపోతున్న ఈ రోజుల్లో సొంతూరిపై వారు తమ మమకారాన్ని చాటుతున్నారు. గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న సదాశయంతో ఇద్దరు అన్నదమ్ములు శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి ప్రజల గొంతు తడుపుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన దండు శ్రీనివాసులు, దండు ముద్దుకృష్ణ కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగారు. శ్రీనివాసులు ఆస్ట్రేలియాలో, ముద్దుకృష్ణ చెన్నైలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. గ్రామంలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో పేద కుటుంబాలకు దాహార్తిని తీర్చడమే సరైనా సేవగా భావించి గ్రామస్థుల కోరిక మేరకు స్వగ్రామంలో రూ. 3లక్షలు వెచ్చించి శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే సమీప గ్రామం సంతేకొండాపురం గ్రామంలో ఎక్కువ శాతం కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబాలు అనేకం. అక్కడ కూడా రూ. 3 లక్షలు వెచ్చించి శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా తాగునీటి అందిస్తున్నారు. నిర్వహణ బాధ్యతలను గ్రామస్థులకు అప్పగించారు. యువ ఉద్యోగులు మానవతా దృక్పథంతో గ్రామానికి చేయూతనందిస్తున్నారు. అలాగే గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మంచినీటిని అందించాలని ఆరు మాసాల కిందట పాఠశాలకు రూ. 50వేలు విలువ చేసే ఆర్వోప్లాంట్‌ను వితరణ చేశారు.



నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

పక్క గ్రామాల నుంచీ..

కోనాపురం గ్రామంలో ఏడాది నుంచి మంచినీటి సరఫరా కార్యక్రమం కొనసాగుతోంది. దీంతో నిత్యం దాదాపు 400 కుటుంబాలకు మంచినీటిని అందిస్తున్నారు. రెండు గ్రామాల్లో శుద్ధజల కేంద్రాలు ఏర్పాటు చేయడంతో సమీపంలోని యాటకల్లు, గొల్లపల్లి, మామడూరు, పాలవెంకటాపురం ప్రజలు ద్విచక్ర వాహనాల్లో వచ్చి తాగునీటిని తీసుకెళ్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటిని పట్టుకునేలా సదుపాయం కల్పించారు.

ప్రధాన సమస్య తీరింది



గతంలో మంచినీళ్ల లభ్యత లేకపోవడంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. దాతలు స్పందించి శుద్ధజల కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి మా ప్రధాన సమస్య తీరింది. వేలాది మందికి దాహార్తి తీరుతోంది. గతంలో ప్రైవేటు వ్యాపారుల నుంచి 25 లీటర్ల నీటిని రూ. 15లతో కొనగోలు చేసేవాళ్లం. వ్యాపారులు విక్రయించే నీటికంటే ప్లాంటు శుద్ధజలం బాగుంది.

- సత్యనారాయణ, కోనాపురం

మావంతు సహకారం



మా గ్రామస్థులకు రక్షిత మంచినీటి అందించాలని మావంతు బాధ్యతగా మా అన్న శ్రీనివాసులు, నేను కలిసి రెండు శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేశాం. సొంతూరంటే మాకు చాలా ప్రేమ. త్వరలో మా గ్రామస్థులందరికీ ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనే ఆలోచన చేస్తున్నాం. మానవతా దృక్పథంతో చేసే సేవలతోనే సంతృప్తి ఉంటుంది.

- దండు ముద్దుకృష్ణ, దాత

అన్నదమ్ములు.. ఆత్మాభిమానానికి ప్రతీకలు

స్ఫూర్తి

◆ భిక్షాటనమాని బిందెల పరిశ్రమల ఏర్పాటు

◆ ఆదర్శంగా నిలుస్తోన్న మారెన్న సోదరులు



బుడగజంగాల కాలనీలో ఏర్పాటు చేసిన బిందెల పరిశ్రమ

గుత్తి, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఆ అన్నదమ్ములు అందరిలా సంచార జీవనం సాగించేవారు. చదువు సంధ్యలకు నోచుకోకపోవడంతో ఆత్మాభిమానాన్ని చంపుకొని ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేశారు. నిత్యం చీదరింపులు, చీత్కారాలు ఎదురవుతుండటంతో కలత చెంది తామెందుకు అందరిలా గౌరవంగా జీవించకూడదు అని ప్రశ్నించుకొన్నారు. పేదరికంతో బాధపడుతున్నా కన్నీటిని దిగమింగుకొని పస్తులతో ఇబ్బందిపడ్డారు. కష్టమైనా. . నష్టమైనా సహిస్తూనే సొంతంగా బిందెల పరిశ్రమను ఏర్పాటు చేసుకొన్నారు. తాము స్వయం ఉపాధి పొందుతూనే తమవారినీ తలెత్తుకొని బతికేలా చేస్తున్నారు. వారే గుత్తికి చెందిన పెద్దమారెన్న, చిన్నమారెన్న అనే అన్నదమ్ములు.

గుత్తి పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన బుడగజంగం ప్రజలు ఒకప్పుడు సంచార జీవనం సాగించేవారు. భిక్షాటన చేస్తూ తమతోపాటు పిల్లలను కూడా తీసుకువెళ్లేవారు. ఈ నేపథ్యంలో పెద్దమారెన్న 2012లో బిందెల పరిశ్రమను ఏర్పాటు చేశారు. రూ. 35 లక్షల పెట్టుబడి పెట్టి పరిశ్రమను స్థాపించారు. బుడగజంగం సామాజిక వర్గానికి చెందిన కొందరు నూటికి 80 పైసలు వడ్డీకే రూ. 10 లక్షల అప్పులిచ్చారు. అలా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ పరిశ్రమను దినదినాభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. అలాగే తమ సామాజికవర్గం ఉన్నతికి పరితపించారు. అరువుపై తమవారికి బిందెలను ఇస్తున్నారు. వారు ఊరూరా తిరిగి విక్రయించుకుని లాభాన్ని తీసుకుని బిందెల ఖరీదును వారికి చెల్లిస్తున్నారు. పట్టణంలో బుడగజంగం ప్రజలు సుమారు 300 మంది ఉన్నారు. వారు గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, గుంతకల్లుతోపాటు కర్నూలు జిల్లాలోని ప్యాపిలి, పోతుదొడ్డి, జొన్నగిరి తదితర ప్రాంతాలకు వెళ్లి బిందెలను విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

శ్రమకు తగిన గుర్తింపు..

పెద్ద మారెన్న తమ సామాజికవర్గం అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తించిన జ్యోతిరావు పూలే జయంతి కమిటీ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును అప్పట్లో గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం చేయించింది. తరువాత పెద్దమారెన్న తన సోదరుడు చిన్నమారెన్నకు పరిశ్రమను అప్పగించి స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి రూ. 12 లక్షల అప్పు తీసుకుని మరో పరిశ్రమను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బుడగ జంగాల పరిస్థితిలో మార్పు వచ్చింది. సమాజంలో గౌరవప్రదంగా జీవనాన్ని సాగిస్తున్నారు. ఇద్దరు ఎంపీటీసీగాను, ఒకరు పంచాయతీ వార్డు సభ్యుడిగాను ఎన్నికల్లో గెలుపొందారు. ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు సాగుతున్నారు. మరికొంతమంది బిందెలతోపాటు పాతదుస్తులు, సబ్బులు, సర్ఫ్‌పొడి, జిలకర ఆవాలు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాలనీలో ఎవరికి ఏ సమస్య వచ్చినా మారెన్న సోదరులు సామరస్యంగా పరిష్కరిస్తున్నారు. అందరూ ఐక్యంగా శ్రమైక జీవనం సాగిస్తున్నారు. తమ పిల్లలను పాఠశాలలకు పంపుతూ విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు.

భిక్షాటనకు స్వస్తి పలికించాం



బుడగ జంగాల వారిని భిక్షాటకు దూరం చేశాం. సొంతంగా మేం బిందెల పరిశ్రమలను ఏర్పాటు చేశాం. అరువుపై సరకు ఇస్తున్నాం. వారు విక్రయించుకుని వచ్చి మాకు అసలు చెల్లిస్తున్నారు. ఒకప్పుడు మేం కూడా భిక్షాటకు వెళ్లాం. అనేక చీదరింపులు, చీత్కారాలను ఎదుర్కొన్నాం. ఇప్పుడు మాతో పాటు అందరూ గౌరవప్రదంగా జీవిస్తున్నాం. ఆత్మాభిమానంతో ముందుకు సాగుతున్నాం.

- పెద్దమారెన్న

కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి



మాకు తొలుత ఎస్సీ కులధ్రువీకరణపత్రాలు ఇచ్చారు. 2004 తర్వాత తెలంగాణలో మాత్రమే బుడగజంగం వారు ఉన్నారంటూ ఏపీలో కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. కులం ధ్రువీకరణ పత్రాలు లేక పిల్లల చదువులు ఆగిపోతున్నాయి. ఎస్సీలకు వచ్చే ప్రయోజనాలను కోల్పోతున్నాం. స్వయం ఉపాధి రుణాలకు దూరం అవుతున్నారు. ప్రభుత్వం చేయూతను ఇవ్వాలి.

- చిన్నమారెన్న



వీధుల్లో బిందెలు విక్రయిస్తున్న యువకుడు



గెలుపొందిన జ్ఞాపికలతో విద్యార్థులు, అధ్యాపకులు

సాధనే ఆయుధం...
వరించిన విజయం

◆ వరుసగా మూడుసార్లు ఛాంపియన్‌షిప్ కైవసం

◆ క్రీడల్లో వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే : విజయం చేజిక్కించుకోవాలంటే కేవలం పోటీల సమయంలోనే సాధన చేయడం కాదు.. నిరంతరం శ్రమించాలి. క్రమం తప్పకుండా వ్యాయామ ఉపాధ్యాయుల మెలకువలను పాటిస్తూ సన్నద్ధమైతే విజయం తప్పక వరిస్తుంది. అందుకు నిదర్శనమే మడకశిర పట్టణంలోని ఎన్‌జీ రంగా వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు. వివిధ క్రీడల్లో సత్తా చాటుతున్నారు. కళాశాలలో సువిశాలమైన మైదానం ఉండటంతో నిరంతరం సాధన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2015, 1016, 2017 సంవత్సరాల్లో నిర్వహించిన వ్యవసాయ అంతర్ కళాశాలల పోటీల్లో కళాశాల బాలికలు వరుసగా ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఇటీవల బాపట్లలో నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీల్లో బాలికలు వాలీబాల్‌లో మొదటి స్థానం సాధించారు. బాల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే షటిల్, టెన్నికాయిట్‌లో ప్రతిభ కనబరచడంతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కింది. బాలుర విభాగంలో వై. రాజేష్ 200 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో మొదటి స్థానం సాధించాడు. అదేవిధంగా 2017లో ఈ కళాశాల విద్యార్థులు సి. ఇందు, వై. రాజేష్‌లు రెండుసార్లు అఖిల భారతస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై హర్యానాలో పోటీల్లో పాల్గొని ప్రశంసా పత్రాలు పొందారు.

జాతీయ స్థాయిలో ఆడాలని..



మా సొంత ఊరు శ్రీకాకుళం. ఇక్కడి కళాశాలలో ఉన్న మైదానం, శిక్షణతో క్రీడల్లో ప్రతిభ చాటుతున్నాను. వాలీబాల్‌లో నా ప్రతిభను గుర్తించి కళాశాల జట్టులో ఎంపిక చేశారు. ఇటీవల బాపట్లలో జరిగిన వాలీబాల్ పోటీల్లో బాగా ఆడటంతో బెంగళూరులో జరిగే 18వ అఖిల భారత వ్యవసాయ కళాశాలల పోటీలకు ఎంపికయ్యాను. జాతీయ స్థాయిలో ఆడాలనుంది. ఇందుకోసం శ్రమిస్తున్నాను.

- లీలావతి, ద్వితీయ సంవత్సరం

జట్టు విజయంలో కీలక పాత్ర



మాది కళ్యాణదుర్గం. వాలీబాల్ ఆట అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. రెండేళ్లలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో జట్టుకు రెండుసార్లు కెప్టెన్‌గా వ్యవహరించాను. సెంటర్ ప్లేయర్‌గా ఆడుతూ జట్టులో కీలక పాత్ర పోషిస్తున్నాను. జట్టులోని మా స్నేహితులందరూ బాగా ఆడటంతో మూడుసార్లు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించాం. అఖిల భారత స్థాయిపోటీలకు ఎంపికయ్యాం. అక్కడా సత్తా చాటి మడకశిరకు మరింత పేరును తీసుకొస్తాం. ఇందుకోసం ఇప్పటి నుంచే సాధన చేస్తున్నాం.

- ఈశ్వరమ్మ, చివరి సంవత్సరం

మడకశిరకు రాష్ట్రస్థాయి గుర్తింపు



మా కళాశాల బాలికలు మూడుసార్లు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించి రాష్ట్రంలో మడకశిరకు చక్కని గుర్తింపు తెచ్చారు. కళాశాల అసోసియేట్ డీన్, అధ్యాపక బృందం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే మాముందున్న లక్ష్యం. **- బాబా ఫక్రుద్దీన్, పీడీ, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల**

స్వచ్ఛ సంకల్పం..

◆ తడి, పొడి చెత్తతో వర్మీకంపోస్టు తయారీ ◆ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ దిశగా గొట్లూరు



తడి చెత్తను వేసిన న్యాడఫ్ తొట్టెలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పల్లెల్లోకి అడుగు పెట్టగానే ఎక్కడ చూసినా మొదట కనిపించేది చెత్తాచెదారమే. రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో నెలల తరబడి చెత్త పేరుకుపోయి ఉంటుంది. అపరిశుభ్రత తాండవిస్తుంటుంది. ఎక్కడా ఘనవ్యర్థాల నిర్వహణ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితులు అనివార్యంగా మారాయి. ఫలితంగా పందులు, దోమలు, ఈగలు, స్వైరవిహారం.. ఆవెంటే అంటువ్యాధులు ప్రబలడం పరిపాటిగా మారింది. సంకల్పం దృఢంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తోంది గొట్లూరు గ్రామ పంచాయతీ. స్వచ్ఛ భారత్ పిలుపును అందిపుచ్చుకొని జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తోంది.

ధర్మవరం నియోజకవర్గంలోని గొట్లూరు గ్రామ పంచాయతీలో గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ. 10 లక్షల వ్యయంతో 2016 జనవరిలో వర్మీకంపోస్టు తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ గ్రామంలో 1300 నివాస గృహాలు ఉన్నాయి. 4500 మంది జనాభా ఉన్నారు. ఈ పంచాయతీని స్థానిక శాసనసభ్యుడు గోనుగుంట్ల సూర్యనారాయణ దత్తత తీసుకోవడంతో అభివృద్ధి పనులు వేగంగా పుంజుకుంటున్నాయి. ఇక్కడ ఘన వ్యర్థాల నిర్వాహణ కేంద్రం మంజూరై వర్మీకంపోస్టు ఎరువుల తయారీకి కావాల్సిన వనరులు అందుబాటులోకి తెచ్చారు.

ఆదర్శం

12 రకాల వ్యర్థాల సేకరణ..

కేవలం గ్రామంలో చెత్తాచెదారం కాకుండా 12 రకాల వ్యర్థాలను సేకరణ చేస్తారు. అనంతరం ప్లాస్టిక్, గాజు వ్యర్థాలను వేరుచేస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బయట విక్రయిస్తున్నారు. తడి చెత్తను న్యాడఫ్ తొట్లలో వేస్తున్నారు. అనంతరం పొడి చెత్తను వేరుచేసి వర్మీతయారు చేసే తొట్లలో వేస్తారు. రెండు నెలలపాటు ఆ చెత్తను నీటితో తడిపి కుళ్లిస్తారు. అనంతరం వర్మీకంపోస్టు తొట్టెల్లోకి మార్పు చేసి ఒక తొట్టెకు 20 కిలోల చొప్పున వానపాములు వదులుతున్నారు. దీంతో వర్మీకంపోస్టు ఎరువు తయారౌతోంది. ఒక తొట్టెలో నిలువ చేసిన చెత్త నుంచి సుమారు 600 నుంచి 700 కిలోల వర్మీ కంపోస్టు ఎరువు తయారౌతుంది. కిలో రూ. 10 నుంచి రూ. 15 చొప్పున విక్రయించడంతో ఇప్పటివరకు పంచాయతీకి రూ. 70 వేల ఆదాయం వచ్చింది. గ్రామంలో చెత్త కుప్పలు మాయమయ్యాయి. స్థానికంగా 13 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించింది.

తడి, పొడి చెత్త సేకరణ..

గ్రామంలో ఇష్టారాజ్యంగా చెత్తను పారవేయకుండా ఎమ్మెల్యే, సర్పంచి శివయ్య ప్రత్యేక చర్యలు చేపట్టారు. తడి, పొడి చెత్తను వేయడానికి అవసరమైన ప్లాస్టిక్ డబ్బాల కొనుగోలుకు ఎమ్మెల్యే సొంతంగా రూ. 75 వేలు అందించారు. వాటిని ప్రజలకు అందించారు. అందులో వేసిన తడి, పొడి చెత్తను హరిత రాయబారులు (గ్రీన్ అంబాసిడర్లు) సేకరించి 9 రిక్షాల్లో తీసుకెళ్తారు. ఇంటింటా చెత్తతోపాటు రహదారులపై పడిన చెత్తను వారు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.

అవార్డుల పంట

ఈ నేపథ్యంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీ కృషిని గుర్తించి గతేడాది ఏప్రిల్ 24న అమరావతిలో ఉత్తమ పంచాయతీ అవార్డును పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందజేసింది. అదేవిధంగా 2017 అక్టోబర్ 2న అమరావతిలో స్వచ్ఛతే సేవ అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా సర్పంచి శివయ్య అందుకున్నారు. ఆదర్శంగా ఉన్న ఈ వర్మీకంపోస్టు యార్డును జిల్లాలోని అన్ని మండలాల సర్పంచులు, అధికారులు, కడప, పశ్చిమగోదావరి జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు వచ్చి పరిశీలిస్తున్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



అందరి సహకారంతో గ్రామంలో చెత్తలేకుండా చేయడం సాధ్యమౌతుంది. ఎమ్మెల్యే దత్తకు తీసుకోవడంతో మరింత చొరవ చూపుతున్నారు. దీంతో వర్మీకంపోస్టు యార్డును ప్రగతి వైపు నడిపిస్తున్నాం. వర్మీకంపోస్టు ఎరువుకు మంచి గిరాకీ ఉంది. యార్డు వద్ద పచ్చని మొక్కలు పెంచుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాం. మరింత ప్రగతి సాధిస్తాం.

- శివయ్య, గొట్లూరు సర్పంచి, ధర్మవరం



గొట్లూరులో ఘనవ్యర్థ నిర్వహణ కేంద్రం

ఉద్యోగాన్ని వదిలి.. సేద్యానికి కదిలి..

◆ విదేశం నుంచి స్వగ్రామానికి తిరిగొచ్చిన యువకుడు ◆ ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగుతో లాభాలు



పందిర్ల ద్వారా సాగవుతున్న బీర పంట

బెళుగుప్ప, న్యూస్‌టుడే: ఆ యువకుడు చదివింది ఇంజినీరింగ్. చదువుకుతగ్గ ఉద్యోగాలు సాధించాడు. ఉన్నతమైన ఉద్యోగ అవకాశం రావడంతో సొంత దేశం విడిచి ఉగాండాలో మూడేళ్లపాటు ఓ ప్రైవేటు సంస్థలో పనిచేశాడు. చేసే వృత్తిలో సంతృప్తి లేక ఉద్యోగం మానేసి సొంత గ్రామానికి చేరుకున్నాడు. వ్యవసాయ రంగంపై ఉన్న మక్కువతో అటువైపు అడుగులేశాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా కూరగాయల సాగు వైపు దృష్టి సారించాడు. ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకొని బిందు సేద్యం పరికరాలతో బీరకాయల సాగు చేపట్టాడు. అనతికాలంలోనే అధిక లాభాలు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నాడు.

బెళుగుప్ప మండలంలోని నక్కలపల్లికి చెందిన కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ చదువుకొన్నాడు. ఉన్నత అవకాశం రావడంతో ఉగాండాకు వెళ్లాడు. ఎక్కువ జీతం అందుకొంటున్నా.. చేస్తున్న వృత్తిపై సంతృప్తి లేక స్వగ్రామానికి తిరిగొచ్చాడు. తనకున్న నాలుగు ఎకరాల పొలంలో రోజువారీ ఆదాయం వచ్చే పంటలను సాగుచేయాలని భావించి రెండు ఎకరాల తోటలో పందిర్లపై బీరకాయ పంటను సాగును చేపట్టాడు. మామూలుగా సాగు చేస్తే తీగ నేల మీద పారడంతో కాయ దెబ్బతిని నాణ్యత లేకపోగా ధర కూడా ఉండదని భావించి పెట్టుబడి కొంచెం ఎక్కువైనా కర్రలను పాతి వాటికి దారాలను కట్టి బీరకాయ తీగలను అల్లించాడు. నాటిన తర్వాత 50 రోజులకు పంట చేతికి రావడంతో మొదటి కోతలో సుమారు 450 కేజీల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం 600 కేజీల దిగుబడి వస్తోంది. ఇక్కడ మార్కెట్ ధర తక్కువగా ఉండటంతో కోసిన బీరకాయలను పెట్టెల్లో నింపి రెండురోజులకోసారి హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నాడు. అక్కడ కిలో రూ. 28 నుంచి రూ. 32 వరకు అమ్ముడుపోతున్నాయి. అలాగే టమోటా పంటను కూడా సాగు చేస్తున్నాడు.

ఉద్యోగం కన్నా వ్యవసాయమే మిన్న




తక్కువ కాలంలో రోజువారీ ఆదాయం వచ్చే కూరగాయల సాగు చేపడితే బాగుంటుందని భావించి కుటుంబసభ్యుల సహకారంతో టామోటా, బీర సాగు చేశాను. ప్రస్తుతం రెండురోజులకోసారి మార్కెట్‌కు 600 కేజీల వరకు బీరకాయలను తరలిస్తున్నాను. రవాణా, కూలీల ఖర్చుపోను సుమారు రూ. 14000 వరకు ఆదాయం తీసుకుంటున్నాను. ఉగాండాలో నెలరోజుల జీతాన్ని ఇక్కడ సొంత పొలంలో పనిచేసుకుంటూ కేవలం పది రోజుల్లోనే సంపాదిస్తున్నాను. **- కృష్ణారెడ్డి, యువరైతు, నక్కలపల్లి**



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బీరకాయలు

అండమాన్‌లో సాహసాలు 4



బాబోయ్... బాంబ్ సైక్లోన్!



అమెరికాని బాంబ్ సైక్లోన్ భయపెట్టేస్తోంది. అట్లాంటిక్ సముద్రం నుంచి తీరం వైపు దూసుకొస్తున్న ఈ తుపాను బీభత్సానికి భారీగా మంచుకురుస్తోంది. ఇళ్లు... రోడ్లు... చెట్లు ఇలా ఎక్కడ చూసినా మంచే కనిపిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మంచుతో మంచు మేటలు పేరుకుపోయాయి. మైనస్ డిగ్రీల్లో ఉష్ణోగ్రతలు కొనసాగడంతో చుక్క నీరు కనిపించడం లేదు. ఎక్కడికక్కడ మంచు కొండలే. చలి తీవ్రతకు జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ హిమపాతం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర పరిస్థితి ప్రకటించారు.

◆ **మంచు తుపాన్ అంటే ఏంటసలు?**

తుపాన్ అంటే తెలుసుగా... సముద్రంలో ఉన్నట్టుండి అల్పపీడన ప్రాంతం ఏర్పడుతుంది. అంటే అక్కడ గాలి పీడనం తక్కువగా ఉంటుందన్నమాట. దీంతో చుట్టూ ఉన్న గాలి ఆ ప్రాంతంలోకి వేగంగా చొరబడి సుడులు తిరుగుతుంది. ఆ వేగంగా తిరిగే సుడుల్నే తుపాను అంటారు. ఈ తుపాను నీటి మీద నుంచి నేలమీదకు ఎక్కడాన్నే 'తుపాను తీరం దాటడం' అంటారు. ఆ సమయంలో వేగంగా వీచే చల్లగాలుల వల్ల వర్షం కురుస్తుంది. ఇదంతా మనకు తెలిసిందే. అయితే అమెరికాలో ఇప్పుడు చలికాలం. సాధారణంగానే మైనస్ డిగ్రీల్లో ఉష్ణోగ్రత ఉంటుంది. అలాంటప్పుడు ఈ తుపాను ప్రభావం వల్ల పై నుంచి వర్షం కురిస్తే చినుకులు గాల్లోనే మంచుగా మారతాయి. ఇదే మంచు తుపాన్.

◆ **'బాంబ్ సైక్లోన్' అంటే?**

ఉన్నట్టుండి వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఒక్కసారిగా వచ్చే పెను తుపాన్లనే 'బాంబ్ సైక్లోన్లు' అంటారు.

◆ **దీని వేగాన్ని ఎలా లెక్కిస్తారు?**

గాలిలో ఉండే పీడనాన్ని మిల్లీబార్లలో కొలుస్తారు. ఒక ప్రాంతంలో ఉండే గాలి పీడనం గంటకు ఒక మిల్లీబార్‌కి పడిపోతే తుపాన్ నేత్రం ఏర్పడుతుంది. అలాంటి పరిస్థితుల్లో పుట్టే తుపాన్లను బాంబ్ సైక్లోన్లు అంటుంటారు. దీని ప్రభావం వల్ల ఏర్పడే గాలుల వేగం దాదాపుగా గంటకు 130 కిలోమీటర్లు ఉంటుంది.

◆ **బాంబ్ అనే పదం ఎందుకు వచ్చింది?**

1980ల నుంచి ఈ పదం ఎక్కువగా వాడుకలో ఉంది. బాంబ్ అంటే పేలుతుందని కాదు. అంతటి శక్తిమంతమైన తుపాన్ అన్న మాట.

◆ **ఏ కాలంలో ఎక్కువగా వస్తుంటాయి?**

అట్లాంటిక్, పసిఫిక్ సముద్రాల్లో... శీతకాలం సమయంలో ఈ తుపాన్లు ఎక్కువగా పుడుతుంటాయి. చాలా అరుదుగా వేసవి కాలంలోనూ వస్తాయి.

ఆణిముత్యం

ఉన్నత లక్ష్యాల్ని సాధించే క్రమంలో తాత్కాలిక ఆనందాల్ని దూరం చేసుకోవాల్సిందే

– సిసిరో

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Wednesday - వెన్స్‌డే
Campaign - కేంపైన్

సుడోకు

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3x3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.

3	6		7		1		5	
	7	4						9
		8						
	5		4	3		1		
			2	7	8			
		9		6	5		4	
						5		
8						9	3	
	1		9		3		6	4

ట్రాక్టరు ముందు చక్రాలు చిన్నగా ఉంటాయేం?

ఎందుకు ఏమిటి ఎలా

ప్రశ్న: ట్రాక్టరు ముందు చక్రాలు చిన్నగా, వెనుక చక్రాలు పెద్దగా ఎందుకుంటాయి?

- పి.గోవిందరెడ్డి, ఇంటర్, బద్వేల్, కడపజిల్లా



జవాబు: పొలాల్లో ఉండే నేల అంతా సమానంగా, ధృఢంగా ఉండదు. కాబట్టి ఏ వాహనాన్ని నడిపే డ్రైవర్ అయినా అక్కడ ఎక్కువ చోదక శక్తిని(స్టీరింగ్ ఎఫర్ట్)ని పెట్టాల్సి ఉంటుంది.

ట్రాక్టర్ల ముందుండే చక్రాలు వాహనం స్థిరంగా ఉండడానికి, సులభంగా నడపడానికి మాత్రమే అలా అమర్చి ఉంటాయి. అంతే కాకుండా వాటి అమరిక డ్రైవర్ పొలాన్నంతా క్షుణ్ణంగా చూడటానికి వీలుగా ఉంటుంది. కానీ వెనుక ఉండే చక్రాలు పొలం యొక్క నేలను గట్టిగా పట్టి ఉంచేటట్లుగా ఉండాలి. అందుకే దాని వెనక చక్రాల ఉపరితల వైశాల్యం ఎక్కువగా ఉండి వాటి కదలికల వల్ల ఏర్పడే గాలి ఒత్తిడి తక్కువగా ఉంటుంది. దీంతో టైర్లకు, నేలకు మధ్య కావలసినంత స్పర్శావైశాల్యం(కాంటాక్ట్ ఏరియా), ఘర్షణ ఏర్పడతాయి. బురద పొలాల్లో చోదకశక్తిని ఎక్కువ చేయడానికి ఇవి ఎంతో అవసరం.

ట్రాక్టరు వెనుక చక్రాలు కూడా తక్కువ వ్యాసం, తక్కువ ఉపరితల వైశాల్యం (వెడల్పు)తో ఉంటే దాని బరువు వల్ల అది బురద పొలాల్లో దిగబడి, ఇరుక్కుపోతుంది. అందుకే ఈ ఏర్పాటు.

- ప్రొ॥ ఈ.వి. సుబ్బారావు, హైదరాబాద్


జవాబు: సుడోకు

3	6	2	7	9	1	4	5	8
5	7	4	6	8	2	3	1	9
1	9	8	3	5	4	2	7	6
6	5	7	4	3	9	1	8	2
4	3	1	2	7	8	6	9	5
2	8	9	1	6	5	7	4	3
9	4	3	8	1	6	5	2	7
8	2	6	5	4	7	9	3	1
7	1	5	9	2	3	8	6	4

మా చిరునామా:
హాయ్‌బుజ్జీ విభాగం,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
email:
hb.eenadu@gmail.com

చూడండి చెయ్యండి

పక్షుల్ని చూడడం అంటే మనకు బోలెడు ఇష్టం...
వాటికి గింజలేస్తూ ఆడుకోవడమంటే ఇంకానూ...
అవి మన పెరట్లోకే వచ్చి సందడి చేయాలంటే?
మనం బర్డ్ ఫీడర్ చేసి పెట్టేస్తే సరి...
ఎలాగో చూసేసి చటుక్కున చేసేద్దాం!



చేసేద్దాం.. బర్డ్ ఫీడర్!



కావాల్సిన వస్తువులు: 1.ఖాళీ ప్లాస్టిక్ బాటిల్ 2.కత్తెర 3.దారం 4.రంగులు 5. జిగురు 6.గింజలు



1. ముందుగా ఖాళీ బాటిల్‌ని చిత్రంలో చూపించినట్లుగా కత్తిరించుకోవాలి. తర్వాత వాటికి కావల్సిన రంగులు అద్దుకుని సిద్ధం చేసుకోవాలి.



2. బాటిల్ పైభాగాన్ని పై కప్పుగా, కింద భాగాన్ని మట్టుగా పెట్టుకునేలా తయారు చేసుకోవాలి. బాటిల్ మూత భాగానికి రంధ్రం చేసి దారాన్నో, తీగనో బయటకి వేలాడదీసేందుకు వీలుగా ఏర్పాటు చేసుకోవాలి.



3. చివరిగా ఆ రెండు భాగాల్ని అతికించి జిగురు ఆరిపోయాక అందులో గింజలు వేసి బాల్కనీలోనో, చెట్టు కొమ్మకో వేలాడదీసి కాసిన్ని గింజలేస్తే సరి. ఇలాంటిదే ఇంకోదాంట్లో నీళ్లు పోసి పక్కనే ఉంచితే చిన్న చిన్న పక్షులు మన ఇంటి దగ్గర సందడి చేయాల్సిందే మరి.



ప్రసంగిస్తున్న మంత్రి కాలవ

సుందర దుర్గంగా తీర్చిదిద్దుతా

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే రాయదుర్గం ప్రజలు గర్వపడేలా మరో మూడేళ్లలో నియోజకవర్గాన్ని రూ.165కోట్లతో అందమైన సుందరదుర్గంగా తీర్చిదిద్దుతామని మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 15, 18 వార్డుల్లో వార్డు కౌన్సిలర్లు యల్లమ్మ, ఉమ అధ్యక్షతన జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. పట్టణానికి రూ.165కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేయడం దుర్గం ప్రజలపై ఆయనకున్న అభిమానమేనని చెప్పారు. ప్రభుత్వ పరంగా కేవలం రూ.10కోట్లు మంజూరు కాగా తాను వ్యక్తిగతంగా రూ.165కోట్లను సాధించినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి కుటుంబానికి నెలకు రూ.10వేల ఆదాయం లభించేలా ప్రజల జీవన ప్రమాణాలు పెంచి పేదరికంలేని రాయదుర్గంగా అభివృద్ధి చేస్తామన్నారు. గత రెండేళ్లలో పట్టణానికి 3730 ఇళ్లను మంజూరు చేశామన్నారు. పట్టణంలో ముంపు ప్రాంతాలకి శాశ్వత పరిష్కారంగా రూ.2 కోట్లతో పుట్టప్ప తోట వద్ద ప్రధాన మురుగు కాలువను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎం.జ్యోతి, మున్సిపల్ ఆర్డీ రవీంద్రబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటేశులు, మున్సిపల్ కౌన్సిలర్లు పురుషోత్తం, కృష్ణవేణి, పట్టణ తెదేపా అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మెప్మా టీపీవో నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసమ్మేళనానికి ముఖ్యమంత్రి రాక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టపర్తి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వీరపాండియన్, ట్రస్టు సభ్యులు ఆర్.జె. రత్నాకర్ పరిశీలించారు. శనివారం ప్రశాంతినిలయంలోని శాంతిభవన్‌లో ముఖ్యమంత్రి పర్యటనపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. సత్యసాయి విశ్వవిద్యాలయ విద్యార్థుల కోసం రూ.42 కోట్లతో నిర్మించిన ఆధునిక పరిశోధన కేంద్రాన్ని కలెక్టర్, రత్నాకర్‌తో కలిసి పరిశీలించారు. పరిశోధన కేంద్రం చాలా అద్భుతంగా ఉందని కలెక్టర్ ప్రశంసించారు. హిల్‌వ్యూ స్టేడియంలో జరగనున్న క్రీడా సమ్మేళనంలో ముఖ్యమంత్రి పాల్గొనే వేదికను పరిశీలించారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి ముఖ్యమంత్రి ప్రశాంతి నిలయం చేరుకునే రహదారులను క్షుణ్నంగా పరిశీలించారు. వెంటనే దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. 11న ఉదయం విమానాశ్రయం నుంచి ప్రశాంతినిలయం చేరుకొని మహాసమాధిని దర్శించుకుంటారు. తర్వాత స్టేడియంలో జరిగే సాయి విద్యార్థుల క్రీడాసమ్మేళనం తిలకించి, పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తారు. పుట్టపర్తి నుంచి కొత్తచెరువు మరువ వద్ద జలహారతి ఇచ్చేందుకు ఏర్పాట్లను పరిశీలించారు. విమానాశ్రయం, స్టేడియం, చెరువు మరువవద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కొత్తచెరువు వద్ద జలహారతి కార్యక్రమం ముగిసిన వెంటనే విమానాశ్రయానికి చేరుకొని, హెలికాప్టర్‌లో ధర్మవరం వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులు సమన్వయంతో పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ2 ఖాజామొయిద్దీన్, ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ రామవర్మ, తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్య, కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, సీఐలు ఆంజనేయులు, రవికుమార్, జేఈ బాలకాటమయ్య పాల్గొన్నారు.



పరిశోధన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, రత్నాకర్

సమన్వయంతో పని చేయండి

ధర్మవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 11న ధర్మవరంలో జరిగే జన్మభూమి ముగింపుసభ, జలహారతి కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో సభాస్థలి ఏర్పాటును జిల్లా కలెక్టర్ వీరపాండియన్ శనివారం అధికారులతో కలసి పరిశీలించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం కాలనీ ఎదురుగా ఉన్న చెరువు ప్రాంతానికి చేపట్టిన పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. జేసీ-2 ఖాజామొహిద్దీన్, ప్రత్యేకాధికారి వెంకటేశం, ఆర్డీవో బాలానాయక్, మున్సిపల్ కమిషనర్ రవి, డీఎస్పీ రామవర్మ, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్య, తహసీల్దార్ మహబూబ్‌బాషా, తదితర అధికారులతో సమీక్షించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికార యంత్రాంగానికి కలెక్టర్ సూచించారు.



ప్రశంసలు అందుకొంటున్న వీపీపీ తండా విద్యార్థులు

దళిత గిరిజన దినోత్సవంలో తండా యువత

వెంకటాంపల్లి పెద్దతండా (వజ్రకరూరు), న్యూస్‌టుడే: అంతర్జాతీయ దళిత, ఆఫ్రికన్ గిరిజన దినోత్సవంలో తండా యువతకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలతో ఘన సత్కారం లభించింది. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో తొలితరం పట్టభద్రులైన యువతీ, యువకులకు చెన్నైలో శనివారం అవార్డులు ఇస్తూ పతకాలతో సత్కరించారు. మండల పరిధిలోని వెంకటాంపల్లి పెద్దతండాకు చెందిన కమలేనాయక్, శిల్పాబాయి, వెంకటేశ్‌నాయక్, సాలుబాయి, సురేష్‌నాయక్‌లు చెన్నైలోని డాక్టరు ఎంజీఆర్ జానకి మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకుల నుంచి అవార్డులను అందుకున్నారు. వివిధ దేశాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో బంగారు పతకంతోపాటు ప్రశంసాపత్రాలను అందుకోవడం సంతోషంగా ఉందని యువతీ, యువకులు చరవాణిలో సంతోషం వ్యక్తం చేశారు.

అనంత స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దాలి

అనంతపురం(రైల్వే): అనంత రైల్వే స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) విజయప్రతాప్‌సింగ్ తెలిపారు. జనరల్ మేనేజర్ పర్యటన నేపథ్యంలో అనంత రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ప్రత్యేక రైలులో గుంతకల్లు నుంచి ఆయన ఉదయం 8 గంటలకు ధర్మవరం చేరుకున్నారు ధర్మవరం, జంగాలపల్లి రైల్వే స్టేషన్‌లను పరిశీలించి అనంతపురానికి చేరుకున్నారు. అనంత స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రిజర్వేషన్ కౌంటర్, లిఫ్టు పనులను పరిశీలించారు. అనంతరం ఇంజినీర్లతో మాట్లాడుతూ పనులు పూర్తి నాణ్యతలో చేపట్టాలన్నారు. జనరల్ మేనేజర్ పర్యటనలోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. సుందరీకరణతో పాటు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్టేషన్‌లో మరిన్ని సౌకర్యాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్టేషన్ ముఖద్వారం, వేచిఉండు గదుల్లో మరమ్మతులు పూర్తి చేసి, సుందరంగా రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ తిప్పానాయక్, సీఎంఎస్ రమేష్, డీఎస్‌వో హరి, ఏసీఎం అంజినాయక్, సీనియర్ డీపీవో బలరాం, సంక్షేమ అధికారి సాయిరాం, ఆర్పీఎఫ్ కమాండెంట్ ఏలీషా, సీఐ వీకే మీనా తదితరులు పాల్గొన్నారు.



ఆవరణను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం విజయప్రతాప్ సింగ్

ఫార్మా-డీ విద్యార్థుల దీక్ష విరమణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : ఫార్మ్-డి కోర్సుకు తగిన గుర్తింపునిచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు, నిరుద్యోగులు చేపట్టిన దీక్షలు శనివారం ఐదోరోజుకు చేరుకున్నాయి. అనంతపురం, ఉరవకొండ శాసనసభ్యులు ప్రభాకర్‌చౌదరి, విశ్వేశ్వరరెడ్డి వేర్వేరుగా దీక్షా శిబిరానికి విచ్చేశారు. వారు దీక్షల్లో కూర్చొన్న విద్యార్థులు, నిరుద్యోగులకు మద్దతు తెలిపారు. ఎంబీబీఎస్‌తో ఫార్మ్-డి సమానమని చెప్పారు. ఎంసెట్ ఆధారంగా ప్రభుత్వమే ఫీజు రాయితీలు కల్పించింది. దీంతో చాలామంది పేద విద్యార్థులంతా కోర్సులు పూర్తి చేశారు. కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఎలాంటి గుర్తింపు లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంత్ ఎమ్మెల్యేలకు వివరించారు. జిల్లాలోనే కాదు.. రాష్ట్ర, దేశస్థాయిలో సమస్య ఉందని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి ఫోన్లో మంత్రి కామినేని శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఈనెల 22న అమరావతిలో ఫార్మ్-డి కోర్సుపై చర్చిస్తామని, పరిష్కార మార్గం చూపుతామని ఎమ్మెల్యే చూచించారు. దీంతో దీక్షల్లో నిరుద్యోగులు దీక్షలను విరమించారు. అనంతరం రాత్రి నగరంలోని ప్రధాన కూడళ్లలో విద్యార్థులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, మమత, భవానీ, రాజవర్ధన్, ఉష తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి పోరాటం

విశాఖ శారదాపీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాహ్మణుల ఐక్యత, అభివృద్ధి కోసం పర్యటన చేస్తున్నానని, అందులో భాగంగా అనంతపురం నుంచి పర్యటన చేపట్టినట్లు విశాఖ శారదాపీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని బ్రాహ్మణ సంఘం సభ్యుడు జ్వాలాపురం శ్రీకాంత్ స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై పర్యటన చేస్తున్నట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యటించి, అర్చకులు, పురోహితులు, వేదపండితులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న స్వామీజీ

దుర్గ గుడిలో తాంత్రిక పూజలు జరిగాయి...

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో తాంత్రిక పూజలు జరిగాయని స్వరూపానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కనకదుర్గమ్మ గుడిలో తాంత్రిక పూజలు జరిగినట్లు విశ్వసిస్తున్నానన్నారు. ఆలయాల్లో తాంత్రిక పూజలు జరగడం విచారకరమన్నారు. ప్రసార మాధ్యమాల ద్వారా దుర్గగుడిలో ఏ సమయంలో ఏం జరిగిందన్న విషయం బహిర్గతమైందని, విజయవాడ ఎమ్మెల్యే, దుర్గ గుడి పాలకమండలి సభ్యులు కూడా బహిరంగంగా అంగీకరించినా ఆశాఖ మంత్రి పూజలు జరగలేదని చెప్పడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో వేదపండితులు, పీఠాధిపతులు, విశ్రాంత జడ్జి, ఐఏఎస్ అధికారులూ ఎవరూ లేరన్నారు. ఆలయంలో అసలు ఏం జరిగిందో తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తాంత్రిక పూజలు జరిగి ఉంటే సంప్రోక్షణ చేసి, ఆలయశుద్ధి చేయాలని, యజ్ఞయాగాలు జరిపించాలని స్వామీజీ సూచించారు.





ప్రసంగిస్తున్న రమణి, కమలాపాండే

మానవతే విద్యార్థి భవితకు గీత

పుట్టపర్తి, న్యూస్‌టుడే: నేటి యువత మంచిని విస్మరించి, చెడుమార్గం వైపు పయనిస్తున్నారని, విద్యార్థులకు బాల్యం నుంచే మానవత విలువలనే విద్యను బోధించాల్సిన అవసరం ఎంతో అవసరమని అంతర్జాతీయ బాలవికాస్ కోఆర్డినేటర్ రమణి, జాతీయ కోఆర్డినేటర్ కమలాపాండే పేర్కొన్నారు. శనివారం సాయికుల్వంత్ మందిరంలో జాతీయ బాలవికాస్ 5వ స్నాతకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలవికాస్ విద్యావిధానం గురించి పలువురు వక్తలు వివరించారు. సత్యసాయి ప్రభోదించిన మానవతా విలువలను ఆచరించినప్పుడే జీవితాలకు సార్థకతత చేకూరుతుందన్నారు. మానవత విలువలతో కూడిన విద్యను బోధించాలనే లక్ష్యంతో సత్యసాయి 1965లో బాలవికాస్ విద్యావిధానం స్థాపించారని, నాలుగు లక్షల మంది విద్యార్థులకు ఈ విద్య అందుతోందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలు ఐకమత్యంతో ధర్మాన్ని ఆచరించి జీవితం సాఫల్యం చేసుకోవాలన్నారు. బాల్యంలో వేసే విలువల పునాదులు భవిష్యత్తులో వటవృక్షంగా విస్తరించి భావి జీవితాలకు చక్కటి సోపానాలుగా దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ సత్య, ధర్మ, శాంతి, ప్రేమ అహింస అనే పంచసూత్రాలను బాటలుగా వేసుకొని, ముందుకెళ్తే గమ్యస్థానానికి చేరుకోవచ్చన్నారు. ఉదయం ఏపీ బాలవికాస్ విద్యార్థులు “జయ విజయీ భవ’ నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. సాయంత్రం పలువురు వక్తలు, బాలవికాస్ గురువులు బాలవికాస్ విద్యావిధానం విశిష్టత, ఐదేళ్లలో ప్రగతిని వివరించారు. సాయి విద్యార్థులు సంగీత కచేరీ ఆలపించారు. యువత, విద్యార్థులు సంయుక్తంగా కమనీయంగా సాయి భక్తిగీతాలను ఆలపించారు. ట్రస్టు సభ్యులు రత్నాకర్, చక్రవర్తి, ప్రసాదరావు, జాతీయ సత్యసాయి సంస్థల అధ్యక్షుడు నిమీష్ పాండే ఉత్తమ గురువులకు బహుమతులు ప్రదానం చేశారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



విద్యార్థుల నృత్యం

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45 ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: ఈ వారం గ్రహఫలం.. వృత్తి విద్యలో రాణించడానికి శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం ఎలా ఆచరించాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: పాడుతా తీయగా (రిపీట్), 10-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్యకావ్యం) 11-00: జబర్దస్త్ (కామెడీ షో రిపీట్).

మధ్యాహ్నం

12-00: జబర్దస్త్ జల్సా టైం (రిపీట్) 12-30: ఢీ-10 (సుప్రీం డాన్స్ షో) (రిపీట్), 2-00: సండే సూపర్‌హిట్ సినిమా: కత్తిపట్టి శక్తిచాటిన కాకతీయ ధీరవనిత వీరగాథ రుద్రమదేవి (అనుష్క, అల్లు అర్జున్, రానా)

సాయంత్రం

04-30: పుష్పకవిమానం ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు సినీ ప్రయాణం... నటుడు రంగనాథ్, శారద నటించిన జమీందారు గారి అమ్మాయి చిత్ర విశేషాలు. 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 6-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సా టైం (రిపీట్).

రాత్రి

07-00: స్వరాభిషేకం: సుమధుర స్వరకర్తలు అందించిన అపురూప గీతాలతో... 09-00: ఈటీవీ న్యూస్, 9-30: పాడుతాతీయగా యువగళాల స్వరసమరం. 10-30: స్పెషల్ సీరియల్: పిల్ల 11-00: స్పెషల్ మూవీ: మాధురి (అబ్బాస్, మాధురి)

ఈటీవీ ప్లస్

మధ్యాహ్నం
11:00 పోవే..పోరా రిపీట్
12:00 ఎక్స్‌ప్రెస్ రాజా బ్యాండ్ బాజా
01:00 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్ రిపీట్
02:00 పటాస్ పంచెస్ రిపీట్
03:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్

సాయంత్రం
04:00 పటాస్ రిపీట్
05:00 సండే కామెడీ మూవీ.. 'నువ్విలా'

రాత్రి
07:30 పటాస్ పంచెస్ రిపీట్
08:30 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్
09:30 నా షో నా ఇష్టం రిపీట్
10:30 సినిమా చూపిస్త మావ రిపీట్
11:30 పటాస్ రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ సద్గురు సన్నిధిలో (ఉ. 6:00)
- ★ మానస (ఉ. 6:30, 7:00, 10:00, 10:30, 11:00)
- ★ సైజ్ జీరో (ఉ. 7:30)
- ★ అమృతం (ఉ. 8:00, మ. 12:00, 1:00, సా. 6:00, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 12:30, 01:30, సా. 06:30, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 2:00, రా. 7:00, 9:00, 10:00)
- ★ డా.ఈటీవి (ఉ. 09:30, మ. 2:30, 3:30, రా. 7:30, 9:30, 10:30)
- ★ అందరికి ఆరోగ్యం (మ. 3:00)
- ★ అమృతం చిరుధాన్యాల స్పెషల్ (రా. 11:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: నోట్‌బుక్ (రాజీవ్, గాయత్రి) 10-00: మార్నింగ్ షో: పేదరాశి పెద్దమ్మకథ (కాంతారావు) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: మంగమ్మగారి మనవడు (బాలకృష్ణ, సుహాసిని) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: నిన్ను కలిశాక (సంతోష్‌సామ్రాట్, ప్రీతిబాజ్‌పాయ్), రాత్రి: 7-00: ఫస్ట్ షో: అంతులేనికథ (జయప్రద, రజనీకాంత్, కమల్‌హాసన్) 10-00: అపురూపచిత్రాలు : హరనాథ్, జయలలిత నటించిన భక్తిరసచిత్రం 'శ్రీరామకథ' విశేషాలు

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8:30 వావ్ ఏమి రుచి (పార్టీ క్యూసైన్) - పార్టీ కట్‌లెట్ & చికెన్ కోకోనట్ మిల్క్ బనానా ఫ్లవర్, ఉ.9.30: గోరు ముద్దలు - మిక్స్‌డ్ దాల్ మిల్లెట్ కిచిడి, ఉ.9.45: మమ్మీస్ కిచెన్ - చిల్లీ చీజ్ ఫ్రైస్, ఉ.11.00: బాబాయ్ హోటల్ - చెట్టినాడ్ ఎగ్ కర్రీ & చెట్టినాడ్ ఎగ్ దోస, ఉ.11.30, సా.4.30: షాహీ దక్కని - పత్రానీ మచ్చి & దివానీ షోర్బా, మ.12.00, రా.8.30: సూపర్ భీమ్ - గేమ్ షో, మ.1.00, సా.5.30: అతిథి - మీ ఇంటింటి నేస్తం, మ.1.30, రా.10.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.2.00: చోటా షెఫ్ - టమాటో అటుకులు, మ.2.15: పిండివంటలు, ప్రసాదాలు - శెనగపప్పు పాయసం & శెనగపిండి పూరీలు, మ.2.45: పదండి విందుకు - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.3.15: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్‌డ్ వెజ్ సాగూ, మ.3.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, రా.7.30: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - వంకాయ బజ్జీ, రా.7.45: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, రా.8.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలిచెనా బొరుగుల ఉప్మా & పచ్చిమిర్చి మొక్కజొన్న మఫిన్స్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: **ఆత్మవిశ్వాసమే ఆయుధం,** 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **అమ్మ బరువు బిడ్డకు భారమే, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30: తీర్థయాత్ర: శ్రీ మరియమ్మ పేజియమ్మన్ కాళి అమ్మన్ దేవస్థానం, పాలక్కాడ్, కేరళ, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360°, 09-00: మార్గదర్శి: **ఆమీన్ సాయానీ,** 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ (రి), 09 -00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: **ఆత్మవిశ్వాసమే ఆయుధం,** 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30: తీర్థయాత్ర, శ్రీ ముక్కైశివాలయం, పాలక్కాడ్, కేరళ, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **అమ్మ బరువు బిడ్డకు భారమే,** 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360°, 09-00: మార్గదర్శి: **ఆమీన్ సాయానీ,** 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!.

ఏ ఛానల్లో ఏముంది.. 07-01-2018

SVBC: **ఉదయం:** 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు సమాహారం, 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - సూర్యభగవాన్, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు కన్నడ, 10-30 భగవద్గీత - బాలవికాసం, 11-00 భాస్కరం భువనేశ్వరం, 11-30 స్పెషల్ న్యూస్ - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం, 02-00 సినిమా, **సాయంత్రం:** 04-30 కోణార్క్ స్పెషల్, 05-00 లైవ్ ఎస్.డి సేవ + స్పెషల్ న్యూస్ + లక్ష్మీగద్యం, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + భవయామి రఘురామం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు + అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, 09-30 అద్భుత ఆలయాలు - కుక్కె సుబ్రహ్మణ్యస్వామి, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీ రామ రసవాహిని శ్రీ సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీగణేశ సహస్రం, 6-30 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 అర్చన, 7-30 శ్రీ కనకధారస్తోత్రం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 వారఫలం, 9-30 ధర్మక్షేత్రం, 11-00 ధర్మసందేహాలు, 11-30 వేదం.. జీవననాదం, 04-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారస్తోత్రం, 5-30 శ్రీగణేశసహస్రం, 06-00 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 భక్తివిశేషాలు 7-30 వేదం..జీవననాదం, 8-00 స్వరార్చన, 9-00 వారఫలం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తి విశేషాలు 11-00 గోదామృతం.

జీ తెలుగు: **ఉదయం:** 06-30 టెలీషాపింగ్, 07-00 జీటియమ్- టెలీషాపింగ్, 07-30 ఓం కారం, 08-00 డా. సుభాష్ చంద్ర షో, 09-00 సినిమా: కందిరీగ, **మధ్యాహ్నం:** 12-30 సినిమా: లౌక్యం, 03-30 సినిమా: ఆనందోబ్రహ్మ, **సాయంత్రం:** 06-00 సినిమా: దువ్వాడ జగన్నాథం, **రాత్రి:** 09-00 సూపర్ సీరియల్ ఛాంపియన్‌షిప్ సీజన్-2 (రిపీట్), 10-00 గోల్డ్‌రష్ (రిపీట్), 11-00 పోలీస్ డైరీ.

మా: **ఉదయం:** 06-30 మ్యూజిక్ బాక్స్, 07-00 ఫిల్మ్ బేస్డ్, 07-30 విహారి, 08-00 రాశి ఫలాలు, 09-00 సినిమా: మిర్చి, **మధ్యాహ్నం:** 12-00 సినిమా: ఎటో వెళ్లిపోయింది మనసు, 03-00 సినిమా: S/o సత్యమూర్తి, **సాయంత్రం:** 06-00 సినిమా: నిన్నుకోరి, 09-00 సినిమా: జులాయి.

జెమిని: **ఉదయం:** 06-00 జెమిని కొత్త పాటలు, 06-30 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 సెల్ఫీ రాజా స్వీటీ రాణి, 08-30 సినిమా: బ్లేడ్ బాబ్జి, 11-30 సినిమా: రాధా, **మధ్యాహ్నం:** 02-30 సినిమా: లెజెండ్, **సాయంత్రం:** 05-30 సినిమా: కాటమరాయుడు, **రాత్రి:** 08-30 ఫిదా మీ ఫేవరేట్ స్టార్‌తో, 09-30 బ్లాక్‌బస్టర్, 10–30 సినిమా: మురారి.

HBO: ఉదయం: 06-00 లైసెన్స్ టు వెడ్, 07-27 గ్రీన్ లాంథర్న్, 09-30 స్టోర్క్స్, 11-00 టవర్ ఆఫ్ డెత్, మధ్యాహ్నం: 12-42 300: రైజ్ ఆఫ్ యాన్ ఎంపైర్, 02-24 ట్రాన్స్‌ఫార్మర్స్ : రివెంజ్ ఆఫ్ ది ఫాలెన్, **సాయంత్రం:** 05-06 సల్లీ, 06-56 వార్ డాగ్స్, **రాత్రి:** 08-59 ట్రిబుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్, 10-51 స్నాక్స్: ది గ్రేటర్ గుడ్.

Star Movies: **ఉదయం:** 06-16 పిక్సెల్స్, 08-04 ది ఇన్‌క్రెడిబుల్స్, 10-23 కార్స్, **మధ్యాహ్నం:** 12-43 టర్బో, 02-36 జతుర : ఎ స్పేస్ అడ్వెంచర్, **సాయంత్రం:** 04-42 ఫ్రోజెన్, **రాత్రి:** 06-48 రైజ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్, 09-00 కుంగ్ ఫూ హజల్, 11-08 ప్రెడేటర్.

Sony PIX: **ఉదయం:** 06-00 ది క్రానికల్ ఆఫ్ నార్నియా: ది లయన్, ది విచ్ అండ్ ది వార్డ్‌రోబ్, 08-50 మాన్‌స్టర్ హౌజ్, 10-49 ది ఇన్‌క్రెడిబుల్ హల్క్, **మధ్యాహ్నం:** 01-16 కెప్టెన్ అమెరికా: ది వింటర్ సోల్జర్, **సాయంత్రం:** 04-17 రాంబో: ఫస్ట్ బ్లడ్ పార్ట్-2, 06-21 అపోకలిప్టో, **రాత్రి:** 09-00 మిస్టర్ బీన్స్ హాలిడే, 10-55 2 ఫాస్ట్ 2 ఫ్యూరియస్.

తూకం లెక్క... మోసం పక్కా!

- జిల్లాలో చౌకదుకాణాల సంఖ్య: **2,865**
- రేషన్‌కార్డుల సంఖ్య: **11.95** లక్షలు
- ప్రతి నెల బియ్యం సరఫరా: **3,665** మెట్రిక్ టన్నులు
- మధ్యాహ్న భోజనం అమలయ్యే పాఠశాలలు: **3,798**
- విద్యార్థుల సంఖ్య: **3.28** లక్షలు
- అంగన్‌వాడీ కేంద్రాలు: **5,126**
- మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులు: **97,595** మంది
- గర్భిణుల సంఖ్య: **34** వేలు

(మొదటి పేజీ తరువాయి)

మాయాజాలం నిరంతరం కొనసాగుతున్నా అన్నీ తెలిసిన అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించని దారుణంపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

జిల్లాలోని 3,798 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 3.28 లక్షల మంది విద్యార్థులకు, 17 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 5,126 అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల వయస్సు కలిగిన 97,595 మంది చిన్నారులు, 34,910 మంది గర్భిణులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు గోదాముల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నారు. తక్కువ తూకాలతో బియ్యం బస్తాలు అందిస్తున్నారు. బస్తా బరువు చూడకుండానే 50 కిలోల పేరుతో అందజేస్తున్నారు.

ఎక్కడ దగా జరుగుతుంది?...

పౌరసరఫరాల శాఖ గోదాం నుంచి డీలర్లకు బియ్యం సంచుల బరువు చూసి ఆ మేరకు లెక్కగట్టి అందించాల్సి ఉంటుంది. అలా కాకుండా గోదాము నిర్వాహకులు గోదాములకు వచ్చే లారీల్లోని బియ్యం బస్తాలను 50 కిలోలు చొప్పున విలువ కట్టి తూకం వేయకుండా నేరుగా చౌకధర దుకాణాలకు తరలిస్తున్నారు. ఒక వేళ బియ్యం సంచుల



ధర్మవరం పౌరసరఫరాల శాఖ గోదాములో సాంకేతిక యంత్రంతో తూకం వేస్తారు. ఒక్కసారి నాలుగు వేల క్వింటాళ్ల బియ్యం సంచుల బరువు చూస్తారు. వాటిని నికరంగా తూకం వేసి లారీల ద్వారా ఆయా గ్రామాల్లోని డీలర్లకు సరఫరా చేస్తారు. డీలర్ల వద్దకు చేరుకోగానే ఒక్కో బియ్యం బస్తాలో మూడు నుంచి ఐదు కిలోల వరకు తేడా ఉంటోంది.

తూకం వేసినా విడిగా వేయకుండా ఎక్కువ మొత్తంలో చేయడంతో బరువులో తేడా ఉంటోంది. ఒక్కో బస్తాలో రెండు నుంచి ఐదు కిలోల బరువు తక్కువగా ఉంటోంది. దీంతో డీలర్లు తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. సాంకేతిక త్రాసులో రెండు కిలోల సంచులు, డబ్బాలు పెట్టి లబ్ధిదారులకు తక్కువ బియ్యం అందిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక వీరు ఇష్టారాజ్యంగా మోసాలకు పాల్పడుతున్నారు.

పౌష్టికాహారం పంపిణీలో కోత...

ధర్మవరం పట్టణ శివారు కాలనీలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో సీలు వేసిన 50 కిలోల బియ్యం బస్తాను తూకం వేయగా 45 కిలోలకు మించి లేవు. బస్తాకు ఐదు కిలోలు చొప్పున మోసం జరుగుతోంది. ఇంత తక్కువ మొత్తంలో బియ్యం అందితే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంలో కోత విధించాల్సి వస్తోంది. బస్తాలో తక్కువ బియ్యం ఉన్నాయని చెబితే.. మాకు అలాగే అందుతున్నాయని డీలర్లు చెబుతున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొంటున్నారు.

- 2017 డిసెంబరు 11న ధర్మవరం మండలంలోని మోటమర్ల వద్ద ఉన్న కస్తూరిబా బాలికల వసతి గృహాన్ని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. సీలు ఉన్న 50 కిలోల బియ్యం బస్తాను తూకం వేయగా 48.500 కిలోలు బరువు ఉన్నట్లు గుర్తించారు.

తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం

- శ్రీరాములు, తూనికలు, కొలతల శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్, అనంతపురం

పౌరసరఫరాల గోదాముల్లో సాంకేతిక త్రాసులను ఏర్పాటు చేశాం. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా నికరమైన తూకాలకు వెసులుబాటు ఉంది. డీలర్ల సమక్షంలోనే సరకులను తూకం చేసి సరఫరా చేస్తున్నాం. పొరపాట్లు జరగడానికి అవకాశం లేదు. తక్కువ తూకాలతో బియ్యం బస్తాలు సరఫరా చేస్తే ఆ బాధ్యత డీలర్లు వహించాల్సి ఉంటుంది. తప్పకుండా తనిఖీలు చేసి చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం. ఇటీవల కేజీబీవీ వసతి గృహాలు తనిఖీల్లో కూడా తక్కువ తుకాలు బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించాం.

- ధర్మవరం పౌరసరఫరాల గోదాం నుంచి ప్రతి నెల ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తారు. ఈ మూడు మండలాల పరిధిలో 189 చౌక దుకాణాలు ఉన్నాయి. ప్రతి నెల అధికారుల లెక్కల ప్రకారం 10,429.61 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు. డీలర్ల నుంచి మధ్యాహ్న భోజన పథకానికి 236.71 క్వింటాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు 30.15 క్వింటాళ్లు అందజేస్తున్నారు.
- ప్రతి నెల అంగన్‌వాడీ కేంద్రాలకు అందే 50 కేజీల బియ్యం బస్తాలో రెండు కిలోలు చొప్పున కోత విధిస్తే 1.20 క్వింటాళ్లు నష్టపోవాల్సి ఉంటోంది. ఐదు కేజీలు తక్కువ అందితే మూడు క్వింటాళ్లు కోల్పోవాల్సి వస్తోంది. వీటిని భర్తీ చేసేందుకు నిర్వాహకులు నానా అగచాట్లు పడుతున్నారు.
- మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రెండు కిలోలు తక్కువ అందడంతో సుమారు టన్ను బియ్యం, బస్తాకు ఐదు కిలోలు తగ్గితే 2,365 కిలోలు కోల్పోవాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతోంది.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సమాజంపై చిన్నారుల్లో చైతన్యం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమాజంపై చిన్నారుల్లో చైతన్యం నింపే కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ సర్వశిక్ష అభియాన్ శ్రీకారం చుట్టింది. జిల్లాలోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని సైన్సు సెంటర్‌లో పోటీలు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆరోగ్యం, స్వచ్ఛాంధ్ర, బహిరంగ మలమూత్ర రహిత జిల్లా, విద్యా విషయక అంశాలు, గ్రామాల్లో అభివృద్ధి, సహజ సిద్ధంగా నీటి లభ్యత, సాంకేతిక అభివృద్ధి-ఈ పరిపాలన, గ్రామాల్లో ఆర్థిక వృద్ధి ప్రణాళికపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మొదటి, ద్వితీయ స్థానాల్లో వచ్చిన విద్యార్థులకు ఈనెల 11న ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పీఓ సుబ్రహ్మణ్యం, సీఎంఓ ఆనంద్‌బాబు, అసిస్టెంట్ సీఎంఓ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పంచసూత్రాలతో ప్రమాదాల నివారణ

అనంతనేరవార్తలు, న్యూస్‌టుడే: పంచసూత్రాలతో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని డీఐజీ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా జిల్లా పోలీసు శాఖ రూపొందించిన లఘుచిత్రాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన విడుదల చేశారు. అలాగే లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ప్రభుత్వ ఇతర శాఖలతో కలిసి సమష్టిగా పని చేయడంతో 2017లో ప్రమాదాలు తగ్గాయన్నారు. 2015లో రోడ్డు ప్రమాదాల్లో 690 మంది చనిపోగా 2016లో 666, 2017లో 622కు తగ్గాయన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ చేపట్టిన పంచసూత్రాలు ఫలిస్తున్నట్లు చెప్పారు. ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణం ధరించాలని, కారు, జీపులో ప్రయాణించే వారికి సీటు బెల్టు ధరించాలని, అతివేగం వద్దని, పరిమితి మించి ప్రయాణం చేయరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని ప్రజల్లో చైతన్యం తెచ్చారన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య 2016తో పోల్చితే 2017లో 6.6 శాతానికి తగ్గిందన్నారు. క్షతగాత్రుల సంఖ్య 4.5 శాతానికి తగ్గించామన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ద్విచక్ర వాహన చోదకులు విధిగా శిరస్త్రాణం ధరించాలని నవంబరు 9వ తేదీ నుంచి అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ఐశ్వర్యరస్తోగి, అదనపు ఎస్పీ మాల్యాద్రి, డీఎస్పీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



పంచసూత్రాల చిహ్నాలు విడుదలచేస్తున్న డీఐజీ ప్రభాకరరావు, ఎస్పీ అశోక్‌కుమార్



జానపద నృత్యం



జై భారతి అంటూ..

నృత్య శోభితం!

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి కృష్ణకళా మందిరంలో జన్మభూమి సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో నాలుగో రోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు ఉత్సాహంగా సాగాయి. ప్రజా సంక్షేమ పథకాలపై పలు పాఠశాలల విద్యార్థులు జానపద, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, ఆత్మకూరు కేజీబీవీ పాఠశాలల విద్యార్థిని అంకిత భరతమాత వేషధారణ ఆకట్టుకుంది. నటరాజ్ నృత్య ఆకాడమి, శ్రీవినాయక నృత్య కళానిలయం ఆధ్వర్యంలో భరతమాత ముద్దుబిడ్డలమంటూ నృత్య ప్రదర్శన చేశారు. కేఎస్‌ఆర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సాంస్కృతికశాఖ కోఆర్డినేటర్ మురళి, సమాచారశాఖ సూపర్‌వైజర్ పుల్లయ్య, పబ్లిసిటీ అసిస్టెంటు ఫక్రుద్దీన్, పీడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలు పని చేయాల్సిందే

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జన్మభూమి సందర్భంగా ఆదివారం పాఠశాలలు పని చేయాలని ఈమేరకు విద్యాశాఖ కమిషనరు నుంచి ఉత్తర్వులు అందాయని డీఈఓ జనార్దనాచార్యులు తెలిపారు. జన్మభూమి ఉన్న గ్రామాల్లోనూ, లేని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు కచ్చితంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని డీఈఓ ఆదేశించారు.

15 మంది ఎస్‌ఐలకు స్థానాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: వేకెన్సీ రిజర్వు(వీఆర్)లో ఉన్న 15 మంది ఎస్‌ఐలకు స్థానాలు కేటాయిస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొంత కాలంగా ఠాణాల కేటాయింపు కోసం ఎదురు చూస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్లకు ఊరట లభించింది. ఎట్టకేలకు ఠాణాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌ఐ పేరు	కేటాయించిన ఠాణా
1. రాఘవరెడ్డి	తాడిపత్రి
2. శ్రీధర్	తాడిపత్రి
3. నగేష్‌బాబు	అనంత ట్రాఫిక్
4. సద్గురుడు	అనంత ట్రాఫిక్
5. రాజశేఖర్	అనంత ట్రాఫిక్
6. సులోచన	అనంత 1వ పట్టణం
7. సరోజమ్మ	అనంత 2వ పట్టణం
8. దిలీప్‌కుమార్	అనంతపురం
9. మగ్బుల్‌బాషా	కదిరి
10. ఇబ్రహీం	వజ్రకరూరు
11. జమాల్‌బాషా	కళ్యాణదుర్గం
12. విజయకుమార్	రామగిరి
13. డి. శ్రీనివాస్	కనగానపల్లి
14. బలరామరావు	అనంత 2వ పట్టణం
15. శేషగిరి	అనంత ట్రాఫిక్

చేనేతలను ప్రోత్సహించాలి

మారుతీనగర్(అనంతపురం): చేనేత కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జేసీ రమామణి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లలితకళా పరిషత్‌లో ఏర్పాటు చేసిన లేపాక్షి హస్తకళ చేనేత వస్త్ర ప్రదర్శనను శనివారం జేసీ ప్రారంభించారు. ప్రదర్శనలో ఉంచిన హస్తకళ వస్తువులు, చేనేత వస్త్రాలు జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తకళాకారుల జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు వినియోగదారులు ఆదరించాలన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రదర్శనలో నిర్మల్ పెయింటింగ్స్, బ్లాక్‌మెటల్, కొండపల్లి బొమ్మలు, అల్లికలతో పాటు పోచంపల్లి, నారాయణపేట, లక్నో, బెంగాల్ చీరలు ఉంచినట్లు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ సుధీంద్రకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీజీఎం రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అర్జీలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో కొనసాగుతున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో వచ్చిన అర్జీలన్నీ ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాలని కలెక్టర్ వీరపాండియన్ ఆదేశించారు. జన్మభూమి, మీకోసం, మరుగుదొడ్ల నిర్మాణాలపై శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జేసీ రమామణితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఐదు రోజులుగా జన్మభూమిలో 36 వేల వరకు అర్జీలు వచ్చాయన్నారు. వాటిలో 19,511 అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారన్నారు. వాటిలో పింఛన్లు 3,039, రేషన్‌కార్డులకు 2,496, గ్రామీణంలో కొత్త ఇళ్ల కోసం 6,079, పట్టణ ప్రాంతాల్లో గృహాల కోసం 2,391 అర్జీలు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి ప్రతిరోజు ఫిర్యాదుల పరిష్కారంపై టెలికాన్ఫరెన్సు నిర్వహిస్తున్నారని, జిల్లాలో ఫిర్యాదులు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీసుశాఖల సమస్యలే అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నట్లు కలెక్టరు తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణాల్లో పూర్తిగా వెనుకబడ్డామన్నారు. ఈనెల 11న ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తున్నారని, ఆరోజు ప్రధానంగా మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షించనున్నారని, నిర్మాణాలపై శ్రద్ధ చూపి లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం పర్యటన ధర్మవరం, కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల్లో సీఎం పర్యటన ఉంటుందన్నారు. ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రదర్శనశాలలు, వైద్యశిబిరాలను ఆయా మండలాల్లో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వాసుదేవరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వీరపాండియన్, పక్కన జేసీ రమామణి

అనంత జట్టు విజయపరంపర

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్మారక ఆహ్వాన క్రికెట్ పోటీల్లో అనంతపురం జట్టు విజయపరంపర కొనసాగిస్తోంది. వరుసగా మూడో విజయం సాధించి న్యూజిల్యాండ్‌పై పూర్తి ఆధిపత్యం చాటింది. శనివారం అనంత క్రీడా గ్రామంలో జరిగిన పోటీలో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిల్యాండ్ అండర్-15 జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగులు చేసింది. ఓస్కార్‌జాక్సన్ (64*), ఓలివర్ లించ్ (32) బ్యాటింగ్‌లో రాణించినా భారీస్కోరు నమోదు కాలేదు. అనంతపురం బౌలర్ ఆదిత్య (4/28) అద్భుతమైన బౌలింగ్‌తో న్యూజిల్యాండ్ జట్టును కట్టడి చేశాడు. అనంతరం 202 పరుగు విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన అనంతపురం జట్టు 45 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. వరుస విజయాలతో అనంత జట్టు దూసుకెళుతోంది.



అనంతపురం జట్టు బ్యాటింగ్



నాలుగు వికెట్లు తీసిన ఆదిత్య



భారత విదేశాంగ శాఖ నూతన కార్యదర్శిగా విజయ్ కేశవ్ గోఖలే నియమితులయ్యారు. 2018 జనవరి 28 న పదవీ విరమణ పొందనున్న ఎస్. జై శంకర్ స్థానంలో ఈయన బాధ్యతలు చేపడతారు. 2017 లో భారత్-చైనా నడుమ డోక్లామ్‌లో 73 రోజులపాటు చోటు చేసుకున్న సైనిక ప్రతిష్టంభనను చర్చల ద్వారా పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించిన విజయ్ ఈ పదవిలో రెండేళ్ల పాటు ఉంటారు.

ప్రతిభ

పౌరసత్వం పొందిన తొలి రోబో..?

కరెంట్ అఫైర్స్

1. 2018 జనవరి 1 న ఏ రెండు దేశాలు ఆయా దేశాల్లోని అణుకేంద్రాలు, వాటికి సంబంధించిన సమాచారాన్ని పరస్పరం మార్పిడి చేసుకున్నాయి? (ఈ రెండు దేశాల్లోని అణుకేంద్రాలపై పరస్పర దాడుల నిషేధ ఒప్పందం 1988 డిసెంబరు 31 న జరగ్గా, 1991 జనవరి 27 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ప్రతి ఏడాదీ జనవరి 1 న అణుకేంద్రాలు, సంబంధిత అంశాల సమాచారాన్ని మార్చుకుంటారు.)
   - ఎ) ఉత్తర కొరియా - దక్షిణ కొరియా
   - బి) ఇజ్రాయెల్ - పాలస్తీనా
   - సి) ఇరాన్ - ఇరాక్
   - డి) భారత్ - పాకిస్థాన్
2. దేశ ప్రజలకు ఇచ్చిన నూతన సంవత్సర సందేశంలో 'అణ్వాయుధాల ప్రయోగించే మీట ఎల్లప్పుడూ నా టేబుల్‌పైనే ఉంటుంది' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వ్యక్తి ఎవరు?
   - ఎ) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
   - బి) ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్
   - సి) ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ
   - డి) దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్‌జెఇన్
3. భారత్, మొజాంబిక్‌లలో లభ్యమయ్యే బొగ్గు నుంచి మిథనాల్ తయారీకి ఉన్న అవకాశాలపై అధ్యయనానికి కేంద్ర ఉక్కుశాఖ ఎవరి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది? (ఇది 60 రోజుల్లోపు నివేదిక అందించాల్సి ఉంటుంది).
   - ఎ) నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె. సారస్వత్
   - బి) విశాఖ ఉక్కు సీఎండీ పి. మధుసూదన్
   - సి) పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్
   - డి) రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ
4. ప్రకృతి సేద్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (2017 డిసెంబరు 31 నుంచి తొమ్మిది రోజులపాటు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు.)
   - ఎ) రాజేంద్రసింగ్
   - బి) సుభాష్ పాలేకర్
   - సి) బిందేశ్వర్ పాఠక్
   - డి) ఎం.ఎస్. స్వామినాథన్
5. 29 వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని 2018 జనవరి 1 న విజయవాడ స్వరాజ్య మైదానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎవరితో కలిసి ప్రారంభించారు? (మాతృభాషను కాపాడుకునేందుకు 2018 ని 'తెలుగు భాష పరిరక్షణ' సంవత్సరంగా ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు.)
   - ఎ) నరేంద్ర మోదీ
   - బి) ఎం. వెంకయ్యనాయుడు
   - సి) రామ్‌నాథ్ కోవింద్
   - డి) సుష్మా స్వరాజ్
6. ప్రతిష్ఠాత్మక దేశవాళీ క్రికెట్ ఛాంపియన్‌షిప్ రంజీ ట్రోఫీని 2018 జనవరి 1 న ఏ జట్టు నెగ్గింది? (ఇండోర్‌లో జరిగిన ఫైనల్లో 9 వికెట్ల తేడాతో ఏడుసార్లు రంజీ ఛాంపియన్ ఢిల్లీపై ఘనవిజయం సాధించింది. ఈ జట్టు ఈ ట్రోఫీ గెలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ జట్టు కెప్టెన్‌గా ఫైజ్ ఫజల్ వ్యవహరించాడు.)
   - ఎ) బరోడా బి) బెంగాల్ సి) ఝార్ఖండ్ డి) విదర్భ



జైరాం ఠాకూర్ హిమాచల్‌ప్రదేశ్ 14 వ ముఖ్యమంత్రిగా 2017 డిసెంబరు 27 న ప్రమాణ స్వీకారం చేశారు. సిమ్లాలోని ప్రసిద్ధ రిడ్జి మైదానంలో ఈ కార్యక్రమం జరిగింది. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ తొలుత ముఖ్యమంత్రితో, ఆ తర్వాత 11 మంది మంత్రులతో ప్రమాణం చేయించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

7. 78 వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను (నుమాయిష్ - 2018) 2018 జనవరి 1 న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఎవరు ప్రారంభించారు?
   - ఎ) తెలంగాణ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ
   - బి) తెలంగాణ ఆర్థికమంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్
   - సి) తెలంగాణ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
   - డి) పై ముగ్గురూ
8. ఏ రాష్ట్రంలోని ఉత్తర కాశీ జిల్లాలోని మట్లి అనే గ్రామంలో ఐటీబీపీ అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2017 డిసెంబరు 31 న నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు? (చైనాకు సరిహద్దున ఉన్న నెలాంగ్ లోయలో 11,700 అడుగుల ఎత్తున ఉన్న ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు మైనస్ 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతుంటాయి. ఇక్కడ పర్యటించిన తొలి హోంమంత్రిగా రాజ్‌నాథ్ వార్తల్లో నిలిచారు)



   - ఎ) జమ్మూ కశ్మీర్
   - బి) హిమాచల్ ప్రదేశ్
   - సి) సిక్కిం
   - డి) ఉత్తరాఖండ్
9. ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా ఎం. మాలకొండయ్య మంగళగిరిలోని ఏపీ పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏ రోజున బాధ్యతలు తీసుకున్నారు? (ఎన్. సాంబశివరావు స్థానంలో ఈయన బాధ్యతలు స్వీకరించారు.)
   - ఎ) 2017 డిసెంబరు 30
   - బి) 2017 డిసెంబరు 31
   - సి) 2018 జనవరి 1
   - డి) 2018 జనవరి 2
10. ఆకర్షణీయ నగరాల కార్యక్రమం కింద 60 నగరాలకు విడుదల చేసిన రూ. 9,860 కోట్లలో ఎంత శాతం మేర మాత్రమే ఖర్చయినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వెల్లడించింది?
   - ఎ) 7% బి) 17% సి) 27% డి) 37%
11. ఇటీవల ఏ ఐఐటీలో నిర్వహించిన టెక్‌ఫెస్ట్ 2017 లో ప్రపంచంలోనే మొదటి పౌరసత్వం పొందిన రోబో 'సోఫియా' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది? (సోఫియా తొలిసారిగా మన దేశానికి వచ్చింది. అత్యాధునిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సును ఉపయోగించి హాంకాంగ్‌లోని హన్సన్ రోబోటిక్స్ లిమిటెడ్ సంస్థ తయారు చేసిన సోఫియాకు సౌదీ అరేబియా పౌరసత్వం ప్రసాదించింది).
   - ఎ) ఐఐటీ మద్రాస్
   - బి) ఐఐటీ ఖరగ్‌పూర్
   - సి) ఐఐటీ బాంబే
   - డి) ఐఐటీ కాన్పూర్
12. తెలంగాణలో 2016 లో పోలిస్తే 2017 లో నేరాలు ఎంత శాతం పెరిగినట్లు డీజీపీ ఎం. మహేందర్ రెడ్డి వెల్లడించారు?
   - ఎ) 10.93%
   - బి) 12.93%
   - సి) 14.93%
   - డి) 16.93%
13. అధికార పత్రాలను సభలో ప్రవేశపెట్టేటప్పుడు 'అర్పిస్తున్నా' (ఐ బెగ్) అనే పదాన్ని వాడొద్దంటూ ఇటీవల ఎవరు కేంద్ర మంత్రులకు సూచించారు?
   - ఎ) రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్
   - బి) లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్
   - సి) రాజ్యసభ ఛైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు
   - డి) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

మీ అభిప్రాయాలు పంపాల్సిన మెయిల్ ఐడీ
pratibhadesk@eenadu.net

14. దివ్యాంగులను సాధారణ వ్యక్తులు వివాహం చేసుకుంటే ప్రస్తుతం ఇస్తున్న రూ. 50 వేల ప్రోత్సాహాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎంతకు పెంచింది?
   - ఎ) రూ. 75 వేలు
   - బి) రూ. లక్ష
   - సి) రూ. 1.5 లక్షలు
   - డి) రూ. 2 లక్షలు
15. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం 2018 జనవరి 2 న ఏర్పాటు చేసింది. దీనికి ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు? (ఛైర్మన్‌తో పాటు అయిదుగురు సభ్యులుగా నియమితులయ్యారు)
   - ఎ) బోయిళ్ల విద్యాసాగర్
   - బి) చిలకమర్రి నర్సింహ
   - సి) ఎర్రోళ్ల శ్రీనివాస్
   - డి) సుంకపాక దేవయ్య
16. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించ తలపెట్టిన 105 వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను అనివార్య కారణాల వల్ల రద్దు చేసిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఇస్కా) తిరిగి వాటిని 2018 మార్చిలో ఏ నగరంలో నిర్వహించాలని నిర్ణయించింది?
   - ఎ) ఇంఫాల్
   - బి) ఇటానగర్
   - సి) కోహిమా
   - డి) గువహటి
17. ప్రస్తుతం అమెరికాలో కొనసాగుతున్న గూగుల్ ఎక్స్ తొలిసారిగా అమెరికా వెలుపల భారత్‌లోని ఏ నగరంలో తమ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది? (విప్లవాత్మక పరిజ్ఞానాలను అందుబాటులోకి తేవాలనే ప్రధాన లక్ష్యంతో ఈ సంస్థ పరిశోధనలు చేస్తుంటుంది. ఇప్పటికే ఈ సంస్థ ప్రాజెక్ట్ లూన్, ప్రాజెక్ట్ మకాని, ప్రాజెక్ట్ వింగ్, ప్రాజెక్ట్ ఫాగ్‌హార్న్ పేరిట పలు పరిశోధనలు చేపట్టింది.)
   - ఎ) ముంబయి
   - బి) బెంగళూరు
   - సి) విశాఖపట్నం
   - డి) హైదరాబాద్
18. 2016 తో పోలిస్తే 2017 లో ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు ఎంత శాతం పెరిగినట్లు 2017 వార్షిక నేరగణాంక నివేదిక వెల్లడించింది?
   - ఎ) 12.73%
   - బి) 16.73%
   - సి) 20.73%
   - డి) 24.73%
19. 2017 డిసెంబరు 25 న దేశంలోనే తొలి ఏసీ సబర్బన్ రైలును ఏ నగరంలోని బొరివిలి - చర్చిగేట్ స్టేషన్ల మధ్య ప్రారంభించారు?
   - ఎ) దిల్లీ
   - బి) బెంగళూరు
   - సి) చెన్నై
   - డి) ముంబయి
20. 15 ఏళ్ల తర్వాత రాజ్యసభలో ఏ రోజున ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నోత్తరాల జాబితాలోని అన్ని ప్రశ్నలు అడిగే అవకాశం దక్కింది? (చివరిసారి 2002 లో జరిగిన 197 వ సమావేశంలో ప్రశ్నోత్తరాల జాబితాలోని అన్ని ప్రశ్నలను సభలో ప్రస్తావించే అవకాశం దక్కింది. అప్పట్లో ప్రశ్నలు వేసిన 20 మందిలో 10 మంది హాజరుకాకపోవడంతో అది సాధ్యమైంది. కానీ తాజాగా సభలో కొందరు సభ్యులు హాజరు కాకపోయినా వారి స్థానంలో మరికొందరికి అవకాశం కల్పించి మొత్తం 18 మందితో మాట్లాడించారు.)
   - ఎ) 2018 జనవరి 1
   - బి) 2018 జనవరి 2
   - సి) 2018 జనవరి 3
   - డి) 2018 జనవరి 4

జవాబులు

1-డి	6-డి	11-సి	16-ఎ
2-బి	7-డి	12-బి	17-సి
3-ఎ	8-డి	13-సి	18-డి
4-బి	9-బి	14-బి	19-డి
5-బి	10-ఎ	15-సి	20-బి



రచయిత
సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్

- తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు 24 గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించే కార్యక్రమాన్ని 2017 డిసెంబరు 31 అర్ధరాత్రి 12 : 01 గంటలకు ప్రారంభించారు.
- 2014 జూన్ 2 న తెలంగాణ అవతరించే నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 6,573 మెగావాట్లు. 2018 జనవరి 1 నాటికి అందుబాటులోకి వచ్చిన విద్యుత్ 14,913 యూనిట్లు.
- వ్యవసాయానికి 24 గంటల సరఫరా చేయడంతోపాటు రాష్ట్రంలోని అన్ని రంగాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో విద్యుత్ సంస్థలు రూ. 12,316 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్ఠం చేశాయి. 514 కొత్త సబ్ స్టేషన్లు, 1724 కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 19,514 కిలోమీటర్ల కొత్త లైన్లు నిర్మించాయి.
- ఆర్థిక ప్రగతికి సూచికగా పేర్కొనే తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశ సగటును మించింది. తెలంగాణ ఏర్పడే నాటికి తలసరి విద్యుత్ వినియోగం 1200 యూనిట్లు. నేడు 1505 కు పెరిగింది.
- తెలంగాణ విద్యుత్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ మంత్రి జి. జగదీష్ రెడ్డి. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు.

అయిదో విడత 'జన్మభూమి - మా ఊరు'

- 5 వ విడత 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా దర్శిలో 2018 జనవరి 2 న ప్రారంభించారు. జనవరి 11 వరకూ ఈ కార్యక్రమం కొనసాగనుంది.
- జన్మభూమి కార్యక్రమాన్ని గతంలో కంటే భిన్నంగా రోజుకో అంశం చొప్పున 9 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.
- మొదటి రోజు సంక్షేమం - సంతృప్తి, రెండో రోజు ఆరోగ్యం - ఆనందం, మూడో రోజు స్వచ్ఛాంధ్రప్రదేశ్, నాలుగో రోజు విద్య - వికాసం, అయిదో రోజు మౌలిక సదుపాయాలు, ఆరో రోజు సహజ వనరులు - అభివృద్ధి, ఏడో రోజు వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి, ఎనిమిదో రోజు సుపరిపాలన - టెక్నాలజీ వినియోగం, తొమ్మిదో రోజు విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ - పేదరికంపై గెలుపు అనే అంశాల పేరిట 'జన్మభూమి - మా ఊరు'ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమం చివరి రోజు జనవరి 11 న 'ఆనంద లహరి'ని నిర్వహించాలని నిర్ణయించింది.
- ఈ ఏడాది ఉగాది నుంచి పెళ్లికానుక పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రకటించారు. ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 40 వేలు, బీసీలకు రూ. 30 వేలు చొప్పున పెళ్లి సమయంలో వారి ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు. 2018 లో రాష్ట్రంలో లక్ష పెళ్లిళ్లకు సాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.
- పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రూ. 1617 కోట్లతో ఉపకార వేతనాలు అందిస్తున్నామని, కొత్తగా 1.50 లక్షల మందికి రేషన్ కార్డులు అందిస్తున్నామని, 19 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని సీఎం తన ప్రసంగంలో వెల్లడించారు.
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల వర్చువల్ తరగతులు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు తెలిపారు.

Ajay Viswanaduni

Q: Sir, we are chatting in English as per our knowledge. But while talking to others (Directly) in English, the flow is missing. So how to resolve this one?

A: What is important is practice. The more you speak in English wrongly or rightly, without any fear of making mistakes, your English will improve. Don't be afraid of making mistakes; through mistakes we learn. Avoid fear. Whenever you have an opportunity, speak only in English. Language is mostly a matter of practice. Secondly, listen to English news telecasts every day. Read the newspaper every day. This will help you a lot.

Sanyasirao

Q: Sir, I want to know about tenses. How can we find out whether it is a present, past or future?

A: Am, is, are, verbs like go (with I, we, you and they) and goes (with he, she and it), do, does, have, has, verbs beginning with have / has are all present tense forms.

Was / were, verbs like went, sang, liked, did, had, verbs beginning with had are all past tense forms.

All verbs beginning with shall / will are future tense forms.

ప్రతిభ

స్పోకెన్ ఇంగ్లిష్ పాత సంచికల కోసం చూడండి.. www.eenadupratibha.net

SPOKEN ENGLISH
ఆంగ్లభాషణ 973

'Leaps and bounds' means...?



P.V. Madhu

Q: Dear Educator, please clarify the following doubts of English grammar.

i) Does communication mean good speaking skills ONLY? or ALSO includes good skills of reading, writing, expressing, listening, smiling, friendly & encouraging nodding?

A: Communication skills mean, not only good speaking skills, but also communicating your ideas in writing too, and sometimes by signs and gestures. It also includes listening skills.

Q: i) Leaps and bounds ii) Far and wide - వీటికి అర్థం ఏమిటి?

A: i) Make progress very quickly

ii) Over a large area. Eg: His name spread far and wide.

K. Eswaraiah, Guntakal

Q: Sir, please translate the following sentences into Telugu.

1. What is the aim of the land for run.
2. Then what should be the choice for India.
3. I am going fight to the last.
4. I will stick that last.
5. Get tuffs get going.
6. Hard to be parted form.
7. The law is what matters.
8. Father figure. 9. Hands in gloves
10. Get yourself tested
11. He can't see wood for the trees.
12. He took me off to the school.

A: 1) దీని సందర్భం తెలిస్తే తప్ప అర్థం తెలియదు.

2) అప్పుడు భారత్ దేన్ని ఎంచుకోవాలి?

3) చివరిదాకా పోరాడతాను.

4) దాన్ని నేను చివర అంటిస్తాను.

5) ఇది 'Get tough, get going' = 'నిక్కచ్చిగా ఉండి పని కానివ్వు', కానీ సందర్భం తెలిస్తే తప్ప దీని అర్థం సరిగా చెప్పలేం.

6) విడిపోవడం కష్టంగా ఉంటుంది.

7) చట్టం ముఖ్యం. 8) తండ్రిలాంటి వాడు

9) ఒకరితో ఒకరు చేతులు కలపడం, మంచి/ చెడు చేసేందుకు

10) పరీక్ష చేయించుకో

11) చిన్నచిన్న విషయాలను మాత్రమే అర్థం చేసుకుని, పెద్ద విషయాలు పట్టించుకోకపోవడం

12) నన్నతడు బడికి తీసుకెళ్లాడు.

Q: Sir, please translate the following into English.

1. ఈ సిమెంటులో జీవం ఉంది.
2. ఆడపిల్ల చదువు అవనికి వెలుగు.
3. ప్రకృతి వ్యవసాయం (సుభాష్ పాలేకర్ అనే శాస్త్రవేత్త దీని గురించి ప్రచారం చేస్తుంటారు)
4. ఒక్కడే, మంజునాథుడొక్కడే.
5. కల్లంలో కన్నీటి వాన. 6. వాస్తవంలోకి వెలుగు కల.
7. కత్తులు దూసిన పుంజులు 8. రాజకీయ క్రినీడలు.
9. నాన్నకు ప్రేమతో 10. చెమటలు పట్టించాడు.
11. నేను వాళ్లతో అగ్రిమెంట్ రాయించుకున్నాను.
12. నౌకను నావికా దళాధికారి జల ప్రవేశం చేయించారు.

A: 1) This cement has life in it.

2) A woman's education lights up the world.

3) Agriculture without the use of fertilizers / Organic agriculture.

4) There is only one god, that is Manjunath.

5) Rain of tears in the agricultural field.

6) I don't understand the meaning of it. Perhaps the translation is, 'The dream of light in reality'.

7) No correct translation for it.

8) Political shadows

9) To dad with love

10) He made me sweat with fear

11) I had them write the agreement.

12) The navy chief launched the ship.

G. Nageswara Rao

Q: Most of the times while listening English news/ conversation on radio, I have observed, 'I would say' or 'I would recommend' what is the meaning of 'I would' in the context?

A: 1) Here, 'would' means wish. I would say = I wish to say.

Q: a) Minister said last year he would construct a club in the town, but not yet constructed.

b) Minister said last year he will construct a club in the town, but not yet constructed.

- Which sentence is correct?


A: Yes, if the work is not completed till now, we can use will, but would is always better. 'I will say' refers to the future = I am going to say in future.

Syed Azeez

Q: Sir, please explain correct usage of this words: Could, would, has, had, been, might, should, have.

A: 'Could' expresses ability to do something in the past. Eg: I could understand what he said yesterday = I was able to understand what he said yesterday. However, 'could' means to be able to do something in the past, but did not do it.

'Would' is often used as the past tense of will. Eg: He says he will do it (Present tense). He said he would do it (in the past). Would has other meanings too. 'Would' sometimes means 'wish'. Eg: I would (wish) rather go than stay here. 'Would' also means preference. It has other meanings too.



'Has' means to own / possess something, and 'has' is always used with he, she and it, whereas 'have' is used with I, we, you, and they. Eg: a) He/ she has a lot of property. Eg: b) The car (it) has four wheels. 'Had' is the past form of have/ has. They had a lot of property (in the past). He had a car (in the past).

'Been' is not used independently. It is used as, have been, has been, and had been. I/ we/ you/ they have been, and he/ she/ it has been means that I/ we/ you/ they have been, and he/she/it has been at some place or in some position starting from sometime in the past and are there till now or even now.

'Should' = must. He should do it = He must do it (duty / compulsion / necessity).

Srinu Saibaba

Q: Sir, please let me know the meaning of the following words.

i) Somebody else ii) Someone else

iii) In some way or the other

iv) In spite of (eg: In spite of initiate stringent action on corruption somebody else are catching somewhere else).

A: i) Somebody else = ii) someone else = some other person. Eg: He did not do it, but somebody else/ someone else did it.

iii) In some way or the other = in any way.

iv) In spite of = despite. (though / but).

Eg: In spite of his wealth, he does not spend much = He is rich, <u>but</u> he does not spend much.

★ Though very strict action is taken, some people continue to be corrupt.

Kantipudi Kameswara Rao

Q: Respected sir, please let me know whether the following sentence is correct or not.

He saw a young lady of <u>no more</u> than 17.

A: The sentence is correct, though he saw a young lady of not more than 17 is better. However, till the age of 18, girls are called girls and not ladies.



Writer

- M. Suresan

VOCABULARY



1. Passionate = Showing or caused by strong feelings (భావోద్వేగంతో ఉన్న).

Eg: The speaker made a passionate request to the listeners not to yield to corruption.

★ Passionate X Apathetic / indifferent (శ్రద్ధ లేని/ అనాసక్తిగా ఉన్న).

Eg: Some leaders are apathetic/indifferent to people's welfare.

2. Sumptuous = Expensive and of high quality (చాలా ఖరీదైన/ ఉత్తమ శ్రేణికి చెందిన)

Eg: They served us a sumptuous meal.

★ Sumptuous X Economical (పొదుపైన).

Eg: In spite of their wealth, they are very economical.

3. Scandal = An immoral action causing public anger (ప్రజలకు కోపం కలిగించే అవినీతికరమైన పని).

Eg: Most of our ministers are involved in scandals.

★ Scandal X honour (గౌరవం)

4. Degraded = Show disrespect to someone (ఎవరినైనా కించపరిచే).

Eg: Because of his corrupt practices he has been degraded from his respectable position.

★ Degraded X Elevate / promote (ఎత్తయిన స్థానంలో ఉంచు/ ఉన్నతీకరించు).

Eg: Because of his honesty he has been elevated to a higher position.

5. Antidote = A medicine which acts against poison (విషానికి విరుగుడు).

Eg: This will act as an antidote to the poison she has taken.

★ Antidote X venom / poison. (విషం)

Eg: He has taken poison to commit suicide.

మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా...

స్పోకెన్ ఇంగ్లిష్, ప్రతిభ విభాగం,
ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ,
అనాజ్‌పూర్, రంగారెడ్డి జిల్లా.

Email your questions to:
pratibhadesk@eenadu.net



జల తోరణం: మగువల సందడి



చూడకనులు చాలలేదు: కృష్ణమ్మ వైభవం

తరలిరాగ.. సుజల వసంతం

"ముఖ్యమంత్రి చంద్రబాబు విశేష కృషితో బుక్కపట్నం చెరువుకు మునుపెన్నడూ లేనంతగా ఒక టీఎంసీ నీరు వచ్చి చేరింది. కృష్ణా జలాలతో చెరువు సుజల శోభను సంతరించుకుంది. ఈ జల వైభవాన్ని తనివి తీరా చూసేందుకు బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల ప్రజలు శనివారం పోటెత్తారు. రైతన్న మోమున వెలుగు నింపుతూ.. తమ జీవితాలకు భరోసా ఇచ్చిన కృష్ణమ్మకు మనసారా ప్రణమిల్లి.. చంద్రన్నకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకొన్నారు." - చిత్రాలు, ఈనాడు, అనంతపురం



జన సందోహం: సుజలాలు చూసేందుకు వచ్చిన ప్రజలు



హాయ్..బుజ్జీ: బుడతడి ఉల్లాసం



కలకాలం గుర్తుండేలా: సెల్ఫీతో జోష్



ఒళ్లంత.. తుళ్లింత: చిన్నారుల కేరింత



కల.. నెరవేరెనిలా: మరువ పారిందోచ్...



ఎన్నాళ్లకెన్నాళ్లకు..: పెద్దల సంబరం

పౌర పాత్రికేయం!

మీ ప్రాంతంలో ఏదైనా దృశ్యం వింతగా ఉందా..? అందరినీ ఆకర్షిస్తోందా..? ఎవరైనా చేసే సేవలు ఇతరులకు స్ఫూర్తిగా నిలిచాయా..? మీ పరిధిలో అన్యాయం జరుగుతోందా..? ఎదురించాలనే తపన మీలో ఉందా..? బాధాకరమైన మానవీయ చిత్రం అందరికీ తెలియజేయాలని భావిస్తున్నారా..? ప్రమాదాలు, సంఘటనలకు మీరే ప్రత్యక్ష సాక్షులుగా మిగిలారా..? అద్భుతమైన చిత్రం.. దృశ్యాలు మీకు కనిపించాయా..? అయితే ఈ శీర్షిక మీదే..మీ చేతిలో సెల్‌ఫోన్ ఉంటే ఆ దృశ్యాలను క్లిక్‌మనిపించండి. మాకు వాట్సాప్ ద్వారా పంపండి.

చరవాణి: 80085 53282 (గమనిక.. ఈ నెంబరు కంప్యూటర్‌కు అనుసంధానం చేసి ఉన్నందున మీరు పంపే చిత్రాలు మాత్రమే స్వీకరించగలం. వాయిస్ కాల్స్ స్వీకరణకు అవకాశం ఉండదు.)

పదేళ్ల కల.. నెరవేరిందిలా..



మరువ పరిశీలిస్తున్న కలెక్టర్, పల్లె

బుక్కపట్నం, న్యూస్‌టుడే : కరవు నేలకు కృష్ణమ్మను తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ప్రభుత్వ చీఫ్‌విప్ పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గత నెలరోజుల నుంచి హంద్రీనీవా ద్వారా బుక్కపట్నం చెరువుకు నీరు వస్తుండగా శనివారం చెరువు నిండి మరువ పారడంతో ఇక్కడి ప్రజల ఆనందానికి అవధుల్లేవు. ఎమ్మెల్యే పల్లె, కలెక్టర్ వీరపాండియన్ బుక్కపట్నం మరువ వద్ద గంగమ్మకు పూజలు చేశారు. చీరసారెలను వదిలి నమస్కరించారు. పదేళ్ల కల నెరవేరిందని రైతులు, గ్రామస్థులు ఆనందోత్సాహాల మధ్య ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ మరువ ప్రాంతం మొత్తం తిరిగి ప్రజలతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుక్కపట్నం చెరువుకు హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలను అందిస్తామని ముఖ్యమంత్రి గత ఏడాది జనవరి 4న ఇచ్చిన మాటను సరిగ్గా ఏడాదికి నెరవేరి చెరువు నిండి మరువ పారడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. నేడు చెరువు నిండటంతో ఈ ప్రాంతీయులకు బతుకు పట్ల ఆశలు చిగురించాయి. ప్రత్యక్షంగా 3500 ఎకరాలు, పరోక్షంగా మరో 3వేల ఎకరాలు పంటలు సాగవడమే కాకుండా 120 గ్రామాలకు తాగునీటి ఎద్దడి తీరుతుందన్నారు. ఈ చెరువును నింపి తిరిగి వస్తామని ముఖ్యమంత్రి 11న బుక్కపట్నానికి వస్తున్నారన్నారు. ముఖ్యమంత్రికి ఈ ప్రాంతవాసులు ఎప్పుడు రుణపడి ఉంటామన్నారు. అనంతరం డిగ్రీ కళాశాల, డైట్ విద్యార్థులతో కలసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతకాయల రవి, సర్పంచి యశోద, జేసీ2 ఖాజామొయిద్దీన్, ఆర్డీవో రామ్మోహన్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుబ్బారెడ్డి, సయ్యద్‌బాషా, రవీంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.



ఈత కొడుతున్న చీఫ్ విప్

శ్రీఖాద్రీనారసింహుడి ఆలయ సమాచారం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా శ్రీఖాద్రీ లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 4 గంటలకు ఆలయశుద్ధి నివేదన ఉంటుంది. ఉదయం 4.30 నుంచి 7 వరకు ధనుర్మాస ప్రత్యేక అభిషేకం, స్వామివారి దర్శనం కొనసాగుతుంది. ఉదయం 7.30నుంచి 9 గంటల వరకు స్వామివారి దర్శనం నిలిపివేస్తారు. ఉదయం 9 నుంచి 10.30 వరకు 35ఆర్జిత అభిషేకాలు, ఐదు స్వర్ణకవచ సేవలు జరుగుతాయి. 10.30 నుంచి 1.30గంట వరకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది. తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8వరకు స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారు. స్వామివారి నిత్యాన్నదానంలో శనివారం 750 మంది భోజనం చేశారు.

అనంతపురం

కూచిపూడిలో చిన్నారుల ప్రతిభ

సాయినగర్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన అరవింద నృత్య శిక్షణా లయం చిన్నారులు కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచారు. షిరిడిలో జరుగుతున్న షిరిడిసాయి శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కూచిపూడి నృత్యంలో నగరానికి చెందిన కళాకారులు రాధిక, లిఖిత, రిషిత, శ్రద్ధకౌం డిన్య, స్నిగ్ధ, అక్షర నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సంద ర్భంగా కళాకారులు, నృత్యదర్శకుడు, గాయనీగాయకులు సూర్యప్రసాద్, మాధురి, సుధాకర్‌లను షిరిడిసాయి సంస్థాన్ సభ్యులు ఘనంగా సత్కరించారు.



మరుగుదొడ్డిని ప్రారంభిస్తున్న ఎంపీపీ మాధవి

తాటిచెర్ల ఆదర్శం

పాములరాయి, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో తాటిచెర్ల గ్రామం ఆదర్శంగా నిలిచిందని డ్వామా పీడీ జ్యోతిబసు కితాబిచ్చారు. దాదాపు 98 శాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కావడం సంతోషంగా ఉందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేసిన తొలి పంచాయతీగా తాటిచెర్ల గుర్తింపు సాధిస్తుందన్నారు. శనివారం ఐదో విడత జన్మ భూమి కార్యక్రమం అనంత గ్రామీణ మండలం తాటిచె ర్లలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజ రైన ఆయన మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ కింద నిర్మించిన మరుగుదొడ్లకు బిల్లులు రాలేదని, వాటిని తక్ష ణమే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో వీఆర్‌ఓ ఆదినారాయణ, క్షేత్ర సహాయకుడు జనార్దన్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు. జడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్ మాట్లాడుతూ జన్మ భూమి ద్వారా అనేక సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం జరుగుతున్నాయని తెలిపారు. తాటిచెర్ల గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సామాజిక భవన నిర్మాణం, సిమెంటు రహదారులకు రూ.లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, మార్కెట్‌యార్డు మాజీ ఉపాధ్యక్షుడు వెంకటే శ్వర్లు, సర్పంచి రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఎంపీడీఓ ఓబుళమ్మ, జన్మభూమి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూత నంగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు.

రామాయణం పఠిద్దాం

బళ్లారిరోడ్డు, న్యూస్‌టుడే: రామాయణం, రాముని జీవిత విశేషాలను పఠించడం వల్ల ఆధ్యాత్మిక చింతన, ఆత్మశాంతి కలుగుతాయని పండితులు రాధాకృష్ణాచార్యులు తెలిపారు. లక్ష్మీబాయ్ పీహెచ్ కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా భగవద్గీత, రామా యణ ప్రవచనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్యలు, అరాచకాలను ఎదగని ప్రపంచంలో రాముడు తన పాలన కొనసాగించారని, వాటిని ఎలా ఎదు ర్కోవాలో రామాయణం తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో ట్రస్ట్ ఛైర్మన్ గోపాల్‌రావు, వైస్ ఛైర్మన్ మాధవిలత, లక్ష్మి, సుధీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు జన్మభూమి పరుగు

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: జన్మభూమి- మాఊరు కార్యక్ర మాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మూర్తి తెలిపారు. నగరపాలకసంస్థ వద్ద ఉదయం 6 గంట లకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి



ప్రసంగిస్తున్న మేయర్ స్వరూప



వినతులు అందజేస్తున్న జనం

జన్మభూమిలో వినతుల వెల్లువ

- పట్టాల కోసం సీపీఎం నిరసన
- అర్జీలకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: నగరంలో శని వారం జరిగిన జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో ప్రజలు సమస్యలపై ఏకరవు పెట్టారు. ఇళ్లస్థలాలు, రేష న్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని పెద్దసంఖ్యలో అర్జీలు ఇచ్చారు. శ్రీశ్రీ కాలనీలో నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని 49వ డివిజన్‌లో కార్పొరే టర్ భూలక్ష్మి, సీపీఎం నాయకులు బైఠాయించారు. 6, 19, 30, 31, 49 డివిజన్లలో శనివారం జన్మభూమి- మాఊరు కార్యక్రమం జరిగింది. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు విద్యా సాగర్, రహమత్‌బీ, హేమలత, పల్లవి, భూలక్ష్మి సభా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. 19, 30, 31 డివిజ న్లలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఎం కార్పొరేటర్ భూలక్ష్మి, నాయకులు ప్రకాష్, వెంకటనారాయణ తదిత రులు 49వ డివిజన్‌లో జన్మభూమి కార్యక్రమం జరుగు తుండగా ధర్నా నిర్వహించారు. గతంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టాలు కోరుతూ దీక్ష చేశామని, పట్టా లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకూ పట్టాలు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, మేయర్ జన్మభూమి కార్యక్రమానికి రావాలని డిమాండ్ చేశారు. శ్రీశ్రీకాలనీ నగర పరిధిలో లేదని, గ్రామీణ పరి ధిలో ఉన్నందున నగరపాలక సంస్థకు సంబంధం లేదని అధికారులు చెప్పారు. దీంతో సీపీఎం నాయకులు వినతి పత్రం సమర్పించి వెళ్లిపోయారు. శారదానగర్‌లో ఇంటిప ట్టాలు, ప్రధాన కాలువ నిర్మాణం చేపట్టాలని స్థానికులు అధికారులు, పాలకులను నిలదీశారు. హమాలీకాలనీలో జరిగిన కార్యక్రమంలో పింఛన్లు, ఇళ్లపట్టాలు, రేషన్‌కార్డు లకు పెద్దసంఖ్యలో అర్జీలు వచ్చాయి.



బైఠాయించిన సీపీఎం నాయకులు

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

జన్మభూమి కార్యక్రమంలో ప్రజలు అర్జీల రూపంలో ఇచ్చిన సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి పేర్కొన్నారు. 31వ డివిజన్‌లో అర్జీలను ఆయనే స్వయంగా స్వీకరించారు. నిబంధనల ప్రకారం అర్హు లైన వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయిస్తామ న్నారు. గత పాలకులు నగరంలో అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. సామాజిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని జన్మభూమి వేదిక ద్వారా నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు చెల్లించే పన్నులను అభివృద్ధికి సక్రమంగా వినియోగిస్తామన్నారు. మేయర్ స్వరూప మాట్లాడుతూ గతంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేప ట్టాక ప్రజల వద్దకే పాలకులు, అధికారులు వస్తున్నారన్నారు. అర్జీలు తమ ప్రాంతంలోనే ఇవ్వవచ్చని తెలిపారు. ఉచిత విద్య, ఆరోగ్యం, చంద్రన్నబీమా పథకం తదితర సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోం దన్నారు. ఉప మేయర్ గంపన్న, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఆదినారాయణ, కమిషనర్ పీవీవీఎస్ మూర్తి, అదనపు కమి షనర్ కృష్ణమూర్తి, నోడల్ అధికారులు సన్యాసిరావు, ఇసాక్, గుర్నాథ్, దుష్యంత్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

అనంతపురం(విద్యుత్తు), న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో కొన్ని గంటల పాటు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2 ఏడీఈలు శ్రీనివాసులు, అనంతయ్య తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాతూరు, సంగమేశ్‌నగర్, వైఎస్ఆర్‌కాలనీ, అనంత సాగర్‌కాలనీ, కలెక్టర్ కార్యాలయం, పెన్నార్‌భవన్ పరిధి లోని ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శ్రీనగర్‌కాలనీ, రాంనగర్, టీడీపీ కార్యాలయం, రాంనగర్, కోవూరునగర్, వెంకటేశ్వరస్వామి దేవాలయం పరిధిలోని ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విష యాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించా లని వారు కోరారు.

ఆర్థిక సాయం అందించాలి



మాట్లాడుతున్న ఆర్పీఎస్ అధ్యక్షుడు నాగరాజు

రాంనగర్(అనంతపురం): ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిం చాలని రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కరవుకు నిలయమైన జిల్లాలో విద్యా హక్కు చట్టం అమలు చేసి, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థ లలో పేదలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలను నడుపుతూ, అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జనవరి 9న విద్యాసంస్థల బంద్‌కు పిలు పునిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 11న ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామతీర్థ, కిరణ్‌కుమార్, చక్రధర్, సుధాకర్‌యా దవ్, రమేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై చైతన్యం

శారదానగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అనంత గ్రామీణ పంచాయతీ కార్యాలయం కార్యదర్శి లక్ష్మినరసమ్మ తెలిపారు. 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా శనివారం పలు కాలనీల్లో మౌలిక సదుపాయాలపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రదర్శన ప్రారంభించారు. కాలనీలలో పర్యటించి పరిశుభ్రత, పర్యావరణం తదితర అంశాలపై ప్రజలకు తెలియజేశారు. సర్పంచి చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థినులు

అనంతపురం

మైనార్టీ విద్యను బలోపేతం చేద్దాం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: మైనార్టీ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పీఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జిల్లాలోని మదరసాల్లో బోధన చేసే వలంటీర్లకు వారం రోజుల పాటు నిర్వహించే శిక్షణ శనివారం ప్రారంభం అయింది. మదరసాల్లో అరబిక్‌తో పాటు ఇతర సబ్జెక్టులను బోధించడం వల్ల ఉన్నత చదువులు చదవడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 16 మదరసాల్లో ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో బోధన జరుగుతోందన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో క్రీడాకార్యదర్శి జెస్సీ

దక్షిణభారత మండలి జూడో జట్టు ఎంపిక

ఎస్.కె.విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: దక్షిణభారత మండలి జూడో జట్టును వర్సిటీ క్రీడా కార్యదర్శి జెస్సీ ప్రకటించారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠంలో జరిగే పోటీల్లో వర్సిటీ జట్టు తలపడనుంది. పోటీల్లో అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన గోవర్ధన్, వన్నూరుస్వామి, మహమ్మద్ అలి, పీవీకేకే డిగ్రీ కళాశాలకు చెందిన చందునాయుడు తదితరులు ఎంపిక అయ్యారు. మేనేజరుగా ఎమ్.జబీవుల్లా వ్యవహరించనున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

● స్వరూపానందేంద్ర సరస్వతి ● అంబేడ్కర్‌నగర్ రామాలయంలో పూజలు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: దళితవాడల్లో ఆలయాలు వెల్లివిరియాలని విశాఖ శారదాపీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఉదయం నగరంలోని అంబేడ్కర్‌నగర్‌లోని సీతారామచంద్రుల ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను దూరం చేసేందుకు కొందరు రాజకీయ నాయకులు కులాల కుంపట్లను పెట్టారన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. ప్రతి దళితవాడల్లోనూ దేవుడి ఊరేగింపులు వెళ్లాలని కోరుతూ.. నాటి ప్రభుత్వంలో దళిత గోవిందం ఏర్పాటు చేసింది శారదా పీఠమేనన్నారు. గిరిజనుల ఇంట ఆంజనేయస్వామి, హరిజనుల ఇంట అరుంధతి జన్మించారని, అరుంధతి నక్షత్రం చూడనిదే హిందువుల ఇళ్లలో ఏ పెళ్లి పూర్తికాదన్నారు. చాకలి, మంగళి, దళితుడు లేనిదే సమాజం లేదన్నారు. స్వామీజీని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణసంఘం సభ్యులు జ్వాలాపురం శ్రీకాంత్, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం మారుతీనగర్‌లోని కోదండ రామాలయంలో గోదాదేవికి పూజలు నిర్వహించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న స్వరూపానందేంద్ర

విద్యార్థికి సత్కారం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి దక్కింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విజేత ఇర్షాద్ అహ్మద్‌ను సన్మానించారు. ప్రధానాచార్యులు రంగస్వామి, విభాగాధిపతి జనార్ధనరెడ్డి, అధ్యాపకులు శ్రీరాంనాయక్, ప్రభాకర్ రెడ్డి, పౌరసంబంధాల అధికారి డాక్టర్ శ్రీధర్ విద్యార్థిని అభినందించారు.



మొక్క నాటుతున్న మేయర్ స్వరూప, కమిషనర్ మూర్తి, విద్యార్థులు

విద్యార్థుల శ్రమదానం

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: శాంతి స్మారకమందిరం సమీపాన నిర్మిస్తున్న ఉద్యానవనంలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం శ్రమదానం చేశారు. ఉద్యానవనంలో ఉన్న రాళ్లు, ముళ్ల చెట్లు తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, మేయర్ స్వరూప మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యానవనం స్థలంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. ఎన్‌సీసీ అధికారి రంగనాథ్, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీధర్, తెలుగుదేశం నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆచార్యునికి జీవన సాఫల్య పురస్కారం

ఎస్.కె.విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కళాశాల అభివృద్ధి కమిటీ డీన్, ఎంబీఏ విభాగం అధిపతి ఆచార్య వేణుగోపాల్‌రావు జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. శనివారం తమిళనాడులోని భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో అవార్డులను ప్రదానం చేశారు. మేనేజ్‌మెంట్ రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ఎస్కేయూ ఆచార్యునికి మాత్రమే ఈ అవార్డును అందజేశారు.



పురస్కారం అందుకుంటున్న ఆచార్య వేణుగోపాల్‌రావు



సప్తగిరి కూడలిలో నిరసన తెలుపుతున్న నాయకులు

విద్యార్థుల ఆత్మహత్యలు అరికట్టండి

రాంనగర్(అనంతపురం): విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలు నివారించాలని డిమాండ్ చేస్తూ శనివారం సప్తగిరి కూడలిలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కళాశాలలను గుర్తించి అనుమతులు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాము, నాయకులు నరసింహారెడ్డి, కార్తీక్, బసిరెడ్డి, గోపీకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ సంగీత విభావరి

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక విజయవాణి సంగీత కళానిలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం ఆలయంలోని త్యాగరాజస్వామి ప్రతిమకు పంచామృతాభిషేకం, అర్చనలు, సంగీత విద్వాంసుల పంచరత్నగాన సేవలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన సంగీత విభావరి అలరించింది. బెంగళూరుకు చెందిన గాయకులు కాసరవల్లి సోదరీమణులు రూప, దీపలచే కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరి, గీతాలాపనలు చేశారు. కళానిలయం నిర్వాహకులు మురళీకృష్ణ, భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.



గీతాలాపన చేస్తున్న గాయకులు

కష్టిస్తేనే విజయం సొంతం



ఆచార్య నారాయణను సన్మానిస్తూ..

ఎస్.కె.విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: కష్టిస్తేనే విజయం సొంతం అవుతుందని బోట్స్‌వానా విశ్వవిద్యాలయం ఆచార్యులు నారాయణ పేర్కొన్నారు. శనివారం ఎస్కేయూలోని ఆర్థికశాస్త్రం విభాగంలో ఆర్థికశాస్త్రంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు విషయ అవగాహన పెంచుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో అన్ని అంశాల్లో పట్టు సాధించాలని సూచించారు. మానవాభివృద్ధి అంటే జనాభా పెరుగుదల కాదని అక్షరాస్యత, ఆరోగ్యం, సమానత, గౌరవం, జీవన నైపుణ్యాల పెంపు అని గుర్తు చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి వెంకటనాయుడు, మాజీ రిజిస్ట్రార్ దశరథ రామయ్య, ఆచార్యులు జయరాజ్, బావయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

గాండ్లపర్తి (రాప్తాడు): గాండ్లపర్తి గ్రామ నివాసి సత్యమయ్య (50) అనంతపురం ప్రభుత్వ ఆసపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సత్యమయ్య శుక్రవారం ఉదయం చింత చెట్టు పైకి ఎక్కి చింతకాయలు కోస్తున్న సమయంలో అదుపు తప్పి కింద పడిపోయాడు.. దీంతో తలకు, శరీరానికి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

పగటి వేళల్లో డెమో రైళ్లు నడపాలి



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం (రైల్వే), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు పగటి వేళల్లో పాస్టు ప్యాసింజర్ తరహాలో డెమో రైళ్లను నడపాలని దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు హరి కోరారు. వేదిక ప్రతినిధులు హరి, ముత్యాలు శనివారం అనంత రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ జోనల్ కార్యాలయం నుంచి ఇటీవల 8 డెమో రైళ్లను గుంతకల్లుకు కేటాయించారన్నారు. ఈ రైళ్లను పగటి వేళల్లో రద్దీ ఉన్న ప్రాంతాల్లో నడపాలన్నారు. అనంతపురం-కదిరి, అనంతపురం-హిందూపురం, అనంతపురం నుంచి వయా పెండేకల్లు మీదుగా కర్నూలుకు నడపాలని కోరారు. బస్సు ఛార్జీలు పెరగడంతో రోడ్డు మార్గంలో ప్రయాణం చేయడం ఖరీదయిందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు బంధువుల ఊళ్లకు వెళ్లలేక పోతున్నారన్నారు. అనంతపురంలో ఉదయం 9 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు కర్నూలుకు చేరేలా ఒక రైలు నడిపితే కర్నూలు నుంచి తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌కు వెళ్లడానికి వీలవుతుందన్నారు. డెమో రైళ్లను పట్టాలెక్కించాలని కోరారు.

ధర్మవరం

ప్రార్థనాలయాల వద్ద నిఘా పెంచాలి

బీటీఆర్‌కాలనీ (పెనుకొండ), న్యూస్‌టుడే: పెనుకొండలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, దర్గాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్ఐ జనార్దన్ పేర్కొన్నారు. శనివారం పెనుకొండలోని పలు దేవాలయాలు, మసీదుల, దర్గాలు, చర్చిలకు చెందిన మతపెద్దలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎవరైన గుర్తుతెలియని వ్యక్తులు వచ్చినపుడు వాటి పుటేజీల ద్వారా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు.

సవరణ బిల్లును ఉపసంహరించాలి

అంబేడ్కర్‌కూడలి (పెనుకొండ), న్యూస్‌టుడే: మోటారు వాహన చట్ట సవరణ బిల్లు అమలులోకి రాకూడదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. శనివారం పెనుకొండలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవో గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబావలి, సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కేంద్రాలు వెలవెల



నగదు లేక ఎల్సీ కూడలి వద్ద మూతపడిన ఏటీఎం కేంద్రం

ధర్మవరం,న్యూస్‌టుడే: నగదు కష్టాలు ప్రజలకు తప్పడం లేదు. బ్యాంకు ఖాతాలో నగదు ఉన్నా అవసర నిమిత్తం వాటిని తీసుకునేందుకు ఏటీఎం కేంద్రాలకు వెళితే నోక్యాష్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పట్టణంలో రెండు రోజులుగా ఏటీఎం కేంద్రాల్లో నగదు దొరకడం లేదు. రెండు, మూడు చోట్ల మినహా మిగిలిన వాటిలో నగదు ఉంచకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారుల పక్కన ఉన్న ఏటీఎం కేంద్రాల్లో నగదు లేకపోవడంతో బ్యాంకుల సమీపంలో ఉన్న ఏటీఎం కేంద్రాలకు ప్రజలు వెళుతున్నారు. పట్టణంలో 30కి పైగా ఏటీఎం కేంద్రాలు ఉండగా వాటిలో కేవలం నాలుగింటిలోనే నగదును అందుబాటులో ఉంచడంతో ఆ కేంద్రాల వద్ద నగదు కోసం వచ్చినవారు వరుస కడుతున్నారు.

ముందు మలుపు..

పక్కనే గొయ్యి..!

ధర్మవరం పట్టణం,న్యూస్‌టుడే: ధర్మవరం నుంచి చెరువు కట్టకింద ఉన్న రహదారిపై వెళ్లాలంటే ప్రమాదకర మలుపులు తప్పించుకుని దర్శినమల, ఓబుళనాయనపల్లి గ్రామాలకు వెళ్లాలి. చిన్నూరు గ్రామ సమీపాన చెరువు కట్ట మలుపు వద్ద రోడ్డు అంచుల్లో వేసిన మట్టి తొలగిపోయింది. పెద్ద గొయ్యి ఏర్పడింది. ఏ మాత్రం ఆదమరిచి వాహనం నడిపినా..అంతే సంగతులు. అధికారులు స్పందించి రోడ్డు అంచున తెగిపోయిన మట్టిని పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన అంచుల్లో తొలగిన మట్టి

ఇంటికి ఇటుక దెబ్బ

❖ వెయ్యి ఇటుకలు రూ.6,500 ❖ నిర్మాణదారులపై భారం



ఇళ్లనిర్మాణంలో ఉపయోగించే మట్టి ఇటుకలు

ధర్మవరం, న్యూస్‌టుడే: సామాన్యుడు ఇంటి కలను ఇటుక చెదరగొట్టేస్తోంది. ఇటుక ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వెయ్యి ఇటుకలు రూ.6,500 వరకు ధర పలుకుతోంది. ఇటుకబట్టీల వద్ద నుంచి ఇళ్లనిర్మాణం చేసే ప్రాంతానికి తీసుకువచ్చేటప్పటికి మరో రూ.500 ఖర్చవుతోంది. స్థానికంగా తయారుచేసే మట్టి ఇటుకల ధర పెరగడంతో ఇళ్లనిర్మాణం చేపట్టిన వారిపై భారం పడుతోంది. ఇది వరకు రూ.ఐదు వేలకు వెయ్యి ఇటుకలు లభించేవి. గృహ నిర్మాణాలు అధికం కావడంతో ఇటుకబట్టీల నిర్వాహకులు ఇటుకల ధరలను ప్రతి నెల పెంచుతూపోతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ గృహాలపైన ఇటుక ధరల పెరుగుదల దెబ్బ పడుతోంది.

మట్టి ఇటుకలకు డిమాండ్

ధర్మవరం నియోజకవర్గంలో మూడు వేలకు పైగా ఎన్టీఆర్ గృహాలు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటికే సిమెంట్, ఇనుము ధరలు పెరిగి ఇంటినిర్మాణం సామాన్యుడికి భారమైంది. ఈ దశలో ఒకవైపు ఇంటినిర్మాణం చేపట్టే కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోంది. స్థానికంగా లభించే మట్టితో తయారుచేసే ఇటుకలను బట్టీల్లో ఉంచి కట్టెలతో కాల్చి విక్రయిస్తున్నారు. మట్టి ఇటుకలతోనే ఇళ్లనిర్మాణం చేసేందుకు ఎక్కువ మంది మొగ్గుచూపుతుండటంతో ఇటుకబట్టీల వారికి లాభాలను తెచ్చిపెడుతోంది.

సామాన్యుడిపై భారం

ధర్మవరం పట్టణశివార్లలో 30కి పైగా ఇటుకబట్టీలు ఉన్నాయి. ఉత్పత్తి అధికంగా ఉన్నా డిమాండ్ ఉండటంతో బట్టీల నిర్వాహకులు ధర తగ్గించడం లేదు. ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలతో పాటు సొంతఖర్చుతో ఇళ్లనిర్మాణం చేసేవారి సంఖ్య నియోజకవర్గంలో నాలుగు వేల వరకు ఉంది. మరోవైపు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి కొందరు సిమెంట్ ఇటుకలను వినియోగిస్తుండగా మరికొందరు మట్టిఇటుకలనే వినియోగిస్తుండటంతో డిమాండ్ ఏర్పడింది. సొంతిళ్లు నిర్మించుకునేందుకు అష్టకష్టాలు పడే సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఇటుక ధరల పెంపు భారమైంది.

ధర భారంగా ఉంది

ఇంటి నిర్మాణంలో ఉపయోగించే ఇటుక ధర పెరగడం నిర్మాణ వ్యయం మరింత పెరిగింది. ఇప్పటికే సిమెంట్, ఇనుము, కూలీల ఖర్చులు పెరిగాయి. ఇది వరకు వెయ్యి ఇటుకలు రూ.4 వేల నుంచి రూ.5 వేలలోపే లభించేవి. వెయ్యి ఇటుకలపై రూ.2వేల వరకు ధర పెరగడంతో ఇంటినిర్మాణంపై రూ.30వేల వరకు అదనంగా భారం పడుతోంది. ఇటుకల బట్టీల వద్ద ఉత్పత్తి అధికంగా ఉన్నా ధర మాత్రం తగ్గించడం లేదు. **- శ్రీనివాసులు, ఇంటినిర్మాణదారుడు**



నిర్మాణంలో ఉన్న ఇల్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరు

ధర్మవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇకపై అధ్యాపకులు, విద్యార్థులు బయోమెట్రిక్ హాజరు వేయాల్సిందే. శనివారం ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బయోమెట్రిక్‌ను అమలు చేశారు. ఉదయం 9.30 గంటలకు అధ్యాపకులు బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. వారికి ఒక బయోమెట్రిక్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు నాలుగు యంత్రాలను తరగతి గదులలో అందుబాటులో ఉంచారు. ఆధార్ సంఖ్యలో మొదటి నాలుగు అంకెలు వదిలి మిగిలిన ఎనిమిది అంకెలను బయోమెట్రిక్ యంత్రంలో నమోదు చేసి వేలిముద్ర వేయాల్సి ఉంది. సాయంత్రం 4.30 గంటలకు కళాశాల ముగిసిన తర్వాత అధ్యాపకులు, విద్యార్థినులు బయోమెట్రిక్ వేసి ఇళ్లకు వెళ్లాల్సి ఉంది. ఈ విధానం వల్ల ప్రతిరోజు ఎంత మంది విద్యార్థులు కళాశాలకు హాజరవుతున్నారనే విషయం ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.



ఈ-హాజరు వేస్తున్న విద్యార్థినులు

కూరగాయల ధరలు

(నిన్నటివి కిలోల్లో)

ధర్మవరం: పచ్చిమిరప-రూ.25, టమోటా రూ.4, క్యారెట్ - రూ.80, కాకర -రూ.40, వంకాయలు - రూ.15, బీట్‌రూట్ - రూ.40, బంగాళాదుంపలు - రూ.15, చౌడేకాయలు - రూ.30, బీరకాయలు-రూ.30, ముల్లంగి - రూ.30, క్యాబేజి - రూ.30, బీన్స్-రూ.50, బెండ - రూ.20, ఉల్లిపాయలు - రూ.50

నిత్యావసర వస్తువుల ధరలు:

కందిపప్పు-రూ.65, పెసరపప్పు-రూ.75, ఉద్దిబేడలు - రూ.70, శనగబేడలు - రూ.75, బియ్యం(మేలురకం) - రూ.50, రెండోరకం - రూ.40, బెల్లం -రూ.55, చక్కెర - రూ.40, ఎండుమిరప - రూ.80, గోధుమపిండి - రూ.24, వేరుశనగ-రూ.70, చింతపండు - రూ.220.

విద్యతోనే జీవన రూపురేఖల మార్పు



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉత్తమ ఆలోచన విధానం.. క్రమ శిక్షణతో కూడిన విద్య నేర్చుకుంటే జీవన రూపురేఖల్లో మార్పు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఐఏఎస్ కుంటిమద్ది లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ సాయి కృపా జూనియర్ కళాశాల పదో వార్షికోత్సవం బలిజ కల్యాణమండపంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, మాజీ ఐఏఎస్, డీఈవీవో చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలు, ఆచరణలు క్రమశిక్షణగా లేకపోతే వారి చదువంతా వృథాగా మారుతుందన్నారు. సోదరభావంతో ఉంటూ మంచి ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని కోరారు. గత ఏడాది ఇంటర్‌లో 991 మార్కులు, డీఎడ్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థి లతకు ఎమ్మెల్యే రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. పలువురికి పతకాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కృష్ణతేజ, కవి ఏటూరు వెంగన్న, ఏవో చౌడేశ్వరావు, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, శ్రీ సాయి కృపా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సీతారామయ్య, యంబారాము, ట్రెజరీ శంకర్, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ కమతం కాటమయ్య, తెదేపా పట్టణ అధ్యక్షుడు చిప్పల మల్లికార్జున, మాజీ వైస్ ఛైర్మన్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



దీపం పట్టుకుని నాట్యం చేస్తున్న విద్యార్థినులు

ధర్మవరం

జూదరుల అరెస్టు

తాడిమర్రి: నార్శింపల్లి గ్రామం బయట రహస్యంగా పేకాటాడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నట్లు తాడిమర్రి ఎస్సై వేణుగోపాల్ తెలిపారు. ఇతర ప్రాంతం నుంచి వచ్చి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో శనివారం సిబ్బందితో దాడి చేసి, రూ.2,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

నేడు శాకాహార ర్యాలీ

ధర్మవరం సాంస్కృతికం: స్థానిక పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో శాకాహార ర్యాలీ జరుగనుంది. స్థానిక దివ్యధర్మ పిరమిడ్ ధ్యానమందిరం అధ్యక్షుడు గూడూరు ఓబయ్య వివరాల మేరకు ఉదయం 9గంటలకు ధ్యానమందిరం నుంచి బీఎస్ఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల క్రీడామైదానం వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు.

ప్రజల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు



చంద్రన్న కానుకను అందజేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ

ధర్మవరం, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం కోసం తెదేపా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని 22వ వార్డు స్టేట్‌బ్యాంక్ కాలనీ, 23వ వార్డు సిద్ధయ్యగుట్ట కాలనీ వద్ద నిర్వహించిన జన్మభూమి సభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 11న ధర్మవరం పట్టణానికి వస్తున్నారని ఆయన కృషి వల్లే ధర్మవరం చెరువుకు కృష్ణాజలాలు చేరాయని ప్రతి ఒక్కరూ జలహారతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి వెంకటేశం, ఆర్డీవో బాలానాయక్, మున్సిపల్ కమిషనర్ రవి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యుగంధర్, సీడీపీవో పద్మావతి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కమతం కాటమయ్య, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ గవ్వలబాబు, కౌన్సిలర్లు ఉడుముల రామచంద్ర, వై.రాజు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి(ధర్మవరం), న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని బత్తలపల్లి తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లి మండలం సంగాల గ్రామంలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆయాశాఖల అధికారులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి కమలమ్మ, తెదేపా మండల కన్వీనర్ వీరనారప్ప, తదితరులు పాల్గొన్నారు.



చంద్రన్న బీమా పత్రాలు అందిస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ

పేదలకు సంక్షేమ పథకాలు

పోతలనాగేపల్లి(ధర్మవరం పట్టణం): రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా పేదలు సంక్షేమంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని జడ్పీటీసీ సభ్యుడు రామాంజనేయులు, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పోతులనాగేపల్లి గ్రామ పంచాయతీలో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మహబుబ్‌బాషా, ఎంపీడీవో వెంకటరాముడు, ఎంఈవో నూర్ అహ్మద్, ఏపీవో శ్రీరాములు, ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెదేపాతోనే అభివృద్ధి సాధ్యం



చిల్లవారిపల్లి-నడిమిపల్లి రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

తాడిమర్రి(చిల్లవారిపల్లి), న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేస్తామని, గ్రామాల్లో తాగు నీటికి ఎటువంటి కొరత లేకుండా ఏర్పాట్లు చేశామని ధర్మవరం ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారయణ తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిల్లవారిపల్లి గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాలుగు మంచి నీటి ట్యాంకులను ప్రారంభించారు. పీఆర్ శాఖ వారు రూ.1.20 కోట్లతో చేపట్టనున్న చిల్లవారిపల్లి-నడిమిపల్లి రహదారికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజశేఖర్, జన్మభూమి ప్రత్యేకాధికారి శివ సత్యనారాయణ, ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్, ఏవో కాత్యాయని, నాయకులు కన్వీనర్ సాయి, మధుసూదన్ రెడ్డి, రామానాయుడు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలవ వద్ద అధికారులు

రైతులు ఆందోళన చెందవద్దు

తాడిమర్రి: పీఏబీఆర్‌తో అనుసంధానం జరిగిన మండలంలోని అన్ని చెరువులకు నీటితో నింపుతామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పీఏబీఆర్ ఈఈ శుభకుమార్ తెలిపారు. శనివారం ఆయన అధికారులతో కలిసి పీఏబీఆర్ మేడిమాకులపల్లి కుడి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఇప్పటికే పీఏబీఆర్ పరిధిలోని 49 చెరువులు 20 శాతం వర్షాభావ నీటితో ఉన్నాయని, మిగిలిన 30 శాతం పీఏబీఆర్ కుడి కాలువ నీటితో నింపుతామని చెప్పారు. మండలంలోని ఏకపాదంపల్లి, పుల్లంపల్లి(కొత్తపల్లి), పల్లనారాయణపల్లి, మేడిమాకులపల్లి కుంట, తాడిమర్రి పడమటి, ఎం.అగ్రహారం తదితర చెరువులకు నీటితో నింపుతామని రైతులకు భరోసా ఇచ్చారు. మార్చి 15 వరకు నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కాలువ వెంబడి పోలీసులతో గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు తాడిమర్రి ఎస్సై వేణుగోపాల్ తెలిపారు. వీరి వెంట డీఈ మురళిమోహన్, జేఈ శ్రీనివాసులు, నాయకులు ఆదినారాయణ చౌదరి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు తాడిమర్రిలో 5కే రన్

తాడిమర్రి, న్యూస్‌టుడే: తాడిమర్రి పోలీస్ స్టేషన్ నుంచి ఆదివారం ఉదయం 6.30 గంటలకు 5కే రన్‌ను ఏర్పాటు చేశామని ఎంపీడీవో దివాకర్ తెలిపారు. ప్రజలు, అధికారులు, నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను పర్యవేక్షిస్తున్న డీవీఈవో

ఇంటర్‌లో ఉత్తీర్ణతశాతం పెంచాలి

ధర్మవరం: ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా అధ్యాపకులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని డీవీఈవో డాక్టర్ కె.చంద్రశేఖర్‌రావు సూచించారు. శనివారం ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలను డీవీఈవో చంద్రశేఖర్‌రావు, ఆర్ఐవో కార్యాలయ ఏవో చౌడేశ్వరరావు తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థుల ఉత్తీర్ణతకు తీసుకోవాల్సిన మెలకువల గురించి తెలిపారు. బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌తో డీవీఈవో చర్చించారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

మడకశిరకూడలి (పెనుకొండ): పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం బాబయ్యస్వామి మండల స్థాయి క్రీడా పోటీలను బాబయ్యస్వామి దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా కుమారుడు సలావుద్దీన్ బాబా ఆధ్వర్యంలో జరిగాయి. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. మొదటిరోజు బాలుర, బాలికల విభాగంలో షాట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో పూజలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: పాతూరు శ్రీ సూర్యచంద్ర అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం శివమాల భక్తులు మహాహోమం, రుద్రాభిషేకం చేశారు. ప్రధాన అర్చకులు రఘుశాస్త్రి హోమం, ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రంగస్వామి తీర్థప్రసాద నివేదన గావించి భక్తులకు పంచిపెట్టారు. గ్రామస్థులు భారీ సంఖ్యలో హాజరై హోమంలో పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న శివమాలధారులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకుంటే శారీరంగా, మానసికంగా ఉత్సాహంగా ఉంటారని మండల విద్యాశాఖధికారి నూర్ అహ్మద్, ప్రిన్సిపల్ ప్రభాకర్ విద్యార్థులకు సూచించారు. శనివారం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన్మభూమి మా ఊరు మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. గ్రామ స్థాయిలో విజేతలుగా నిలిచిన ధర్మవరం జిల్లా ఉన్నత పాఠశాలతో పాటు గొట్లూరు, దర్శినమల, బీఎస్సార్ బాలురు, సుందరయ్యనగర్ గణేష్ పురపాలక కబడ్డీ క్రీడాకారుల జట్లు పాల్గొన్నాయి. మండల విద్యాశాఖాధికారి పోటీలను ప్రారంభించారు. గొట్లూరు జట్టు విన్నర్స్‌గా, జిల్లా ఉన్నత పాఠశాల(ధర్మవరం) జట్టు రన్నర్స్‌గా నిలిచినట్లు పీడీ నాగరాజు తెలిపారు. ఈ నెల 11వ తేదీన విజేతలకు బహుమతులు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం పార్వతి, పీడీ రఘునాథ్, పీఈటీలు చిత్తప్ప, నాగదీప, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విన్నర్స్‌గా నిలిచిన గొట్లూరు ఉన్నత పాఠశాల క్రీడాకారులు



రన్నర్స్‌గా నిలిచిన పట్టణ ఉన్నత పాఠశాల క్రీడాకారులు

ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోండి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతులకు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ముదిగుబ్బ తహసీల్దార్ మాధవరెడ్డి కోరారు. శనివారం గాండ్లవారిపల్లిలో నిర్వహించిన గ్రామసభ జరిగింది. ప్రభుత్వం రాయితీపై అందించిన రైతురథాన్ని ఆయన నడిపి పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, వైవీఆర్ ప్రాజెక్టు ఛైర్మన్ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

8న మార్కెట్‌యార్డులో సదస్సు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రైతు రుణమాఫీ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఈ నెల 8వ తేదీన ధర్మవరం మార్కెట్‌యార్డులో రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ సంచాలకుడు విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ రైతులు రుణమాఫీ కాకున్నా, తక్కువగా ఖాతాలో నమోదైనా, ఇతర సందేహాలు ఉన్నా అధికారులతో తెలుసుకోవాలని కోరారు.

ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణవాసులకు ప్రతి రోజు మూడు గంటల పాటు తాగునీటి సరఫరా అందే విధంగా రూ.17.50 కోట్లు అమృత్ పథకం నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అన్నారు. శనివారం ఇందిరమ్మకాలనీలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ధర్మవరం మున్సిపాలిటీలో అమృత్ పథకం నిధులతో తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ కమతం కాటమయ్య, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ గవ్వలబాబు, మున్సిపల్ కమిషనర్ రవి, ఈఈ నాగమోహన్, తెదేపా పట్టణాధ్యక్షుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు

తెరపై ఈనాడు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : వాసవి : **ఎం.సీ.ఏ(మిడిల్ క్లాస్ అబ్బాయ్),** కేపీఎస్ : **హలో,** చైతన్య : **ఒక్కక్షణం**

కూరగాయల ధరలు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : టమోటా : రూ. 5, మిరప : 30, బీరకాయ : 30, ఉర్లగడ్డ : 30, క్యారెట్ : 40, ఉల్లిగడ్డ : 50, వంకాయ : 20, బెండకాయ : 30

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా ఎంపిక

నారాయణస్వామివీధి (పామిడి), న్యూస్‌టుడే: స్థానిక నారాయణస్వామివీధికి చెందిన సాకే ఓబులేసును ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎస్.రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగుతామని ఓబులేసు తెలిపారు.



కేసులను విచారిస్తున్న ఏడీజే కమలాదేవి

లోక్‌అదాలత్‌లో సత్వర పరిష్కారం

గుత్తి, న్యూస్‌టుడే: లోక్‌అదాలత్‌లో కేసులు సత్వరమే పరిష్కారం అవుతాయని గుత్తి ఆరోఫాస్టు ట్రాక్ కోర్టు ఏడీజే కమలాదేవి అన్నారు. శనివారం గుత్తిలోని ఏడీజె కోర్టులో లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ కేసులతో కోర్టుల చుట్టూ తిరగరాదన్నారు. కేసులతో విలువైన సమయంతోపాటు డబ్బును కోల్పోవాల్సి వస్తుందన్నారు. చిన్నచిన్న తగాదాలకు కూడా కేసులను పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరగరాదన్నారు. పంతాలు, పట్టింపులకు పోకుండా కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కేసుల వల్ల మనస్పర్థలు మరింతగా ముదురుతాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఒక పీఎల్‌సీ కేసును పరిష్కరించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు సురేష్‌చంద్ర, మహమ్మద్ రసూల్, ఏపీపీ మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు రుణాలు ఇప్పించాలని వినతి

గుంతకల్లు: నిరుద్యోగులకు బ్యాంకుల అధికారులు సకాలంలో రాణాలు ఇచ్చేవిధంగా చూడాలని పట్టణ దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు ఆనంద్ కోరారు. వేదిక సభ్యులు శనివారం ఎమ్మెల్యే జితేంద్రగౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం ఎస్సీ. ఎస్టీ, బి.సి., మైనార్టీలకు రాయితీ రుణాలను మంజూరు చేస్తుంటే పట్టణంలోని కొన్ని బ్యాంకుల వారు రుణాలను ఇవ్వకుండా అనేక ఆంక్షలు పెట్టి తిప్పుకొంటున్నారని ఆరోపించారు. షూరిటీ ఉండాలని, రూ. 40 వేల నుంచి రూ. 80 వేల వరకు డిపాజిట్లు ఉంచాలని నిబంధనలు పెడుతుంటే చాలా మంది నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. బ్యాంకులతో సంబంధం లేకుండా వందశాతం రాయితీతో ప్రభుత్వం రుణాలు ఇచ్చేవిధంగా చూడాలని కోరారు.

మీసేవపై వైజ్ఞానిక సందర్శన

పామిడి, న్యూస్‌టుడే: విద్యార్థులకు విద్యతో పాటు మానసిక వికాసానికి వైజ్ఞానిక సందర్శనలు ఎంతో అవసరమని ప్రిన్సిపల్ హనుమంతరాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో వృత్తి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మీసేవ కేంద్రంలో కొనసాగుతున్న కార్యక్రమాల అవగాహన కోసం పామిడిలోని మీసేవ కేంద్రాల వద్దకు తీసుకెళ్లి పనివిధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వృత్తి విద్యలో 'మీడియా అండ్ ఎన్‌టర్‌టైన్‌మెంట్' కోర్సును అభ్యసిస్తున్న 9వ తరగతి విద్యార్థులకు ఈ అవగాహన సదస్సుకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్యా బోధకుడు కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదాత గోడు ఆలకించేదెవరు..!

వేరుసెనగ అమ్ముకోవడానికి అష్టకష్టాలు ❖ బస్తాలు తరలించడంలో ఆయిల్‌ఫెడ్ అధికారుల నిర్లక్ష్యం



మార్కెట్‌యార్డులో నిల్వ ఉన్న బస్తాలు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి సైతం అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం వేరుసెనగకు మద్దతు ధర ప్రకటించి మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఆయిల్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేసిన బస్తాలను తరలించకపోవడంతో రైతులు బస్తాలు వేసుకుని వచ్చి వారం రోజులపాటు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. కొనుగోలు చేసుకున్నాక ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి 5, 6 రోజులపాటు రైతులు మార్కెట్‌యార్డు చుట్టూ తిరుగుతునే ఉన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో గత నెలరోజుల నుంచి వేరుసెనగ కొనుగోలు జరుగుతోంది. బయట మార్కెట్‌లో దాదాపు రూ.3700 ధర ఉండటంతో ఆయిల్‌ఫెడ్ ద్వారా రూ.4500 ధరకు అమ్ముకోవచ్చని రైతులు ఆశతో వివిధ గ్రామాల నుంచి వేరుసెనగ బస్తాలను కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువస్తున్నారు. మొదట కొద్దిరోజులు బాగానే జరిగింది. అయితే రానురాను కొనుగోలు చేసిన వేరుసెనగ బస్తాలను అయిల్‌ఫెడ్ అధికారులు ఇతర ప్రాంతాలకు తరలించకుండా అలాగే మార్కెట్‌యార్డులో పెట్టారు. దీంతో యార్డు మొత్తం బస్తాలతో నిండిపోయింది. బస్తాలను వేసుకుని వస్తున్న రైతులు సరకును ఉంచడానికి మార్కెట్‌యార్డులో స్థలం లేదు. తప్పని పరిస్థితుల్లో మార్కెట్‌యార్డులోని రోడ్లపైనే, మురుగు కాలువల పక్కన ఉంచి అవస్థలు పడుతున్నారు. కొనుగోలు సక్రమంగా జరగకపోవడంతో రాత్రివేళ చలికి వణుకుతూ ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల నుంచి అధికారులు బస్తాలను తరలిస్తున్నారు.

నియోజకవర్గంలో కొనుగోలు చేసిన వివరాలు

గుంతకల్లు మండలంలో వేరుసెనగ కొనుగోలు దాదాపు 27 రోజుల నుంచి జరుగుతోంది. అప్పటినుంచి ఇప్పటి వరకు 19వేల క్వింటాళ్లు, గుత్తిలో 12 వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. పామిడిలో వేరుసెనగ కొనుగోలు లేదు.

ఆన్‌లైన్‌లో బిల్లు నమోదుకాక..

వేరుసెనగ కొనుగోలు అయిన తర్వాత రైతులకు ఫలానా తేదీన తూకాలు జరిగినట్లు, ఇన్ని క్వింటాళ్లు అయినట్లు బిల్లు ఇచ్చి ఆన్‌లైన్‌లో ఎక్కిస్తే అప్పుడు 20 నుంచి 30 రోజులలోపు ఎప్పుడైనా రైతుల ఖాతాలోకి డబ్బులు పడతాయి. అయితే ఈ ఆన్‌లైన్ ఎక్కించే మిషన్లు సరిగ్గా పని చేయకపోవడం వల్ల వేరుసెనగ కొనుగోలు జరిగి వారంరోజులయినా ఆన్‌లైన్‌లో ఎక్కడం లేదు. రైతులు ప్రతిరోజు కూలీ పనులు వదిలిపెట్టి కొనుగోలు కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని త్వరగా ఆన్‌లైన్‌లో ఎక్కించి డబ్బులు తొందరగా వచ్చేలా చూడాలని రైతులు కోరుకుంటున్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా...



గత డిసెంబర్ 26న వేరుసెనగ బస్తాలను ఆయిల్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేశారు. 15 క్వింటాళ్లు అయ్యాయి. 5 రోజులపాటు రాత్రిపగలు ఉండి కొనుగోలు చేయించాను. కొనుగోలు చేశాక ఆన్‌లైన్‌లో ఎక్కించాలని చెప్పటంతో అప్పటి నుంచి ప్రతిరోజు కొనుగోలు కేంద్రం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగున్నా ఎక్కడం లేదు. అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలి. ***- గోపాల్, మొలకలపెంట***

రైతులకు ముందుగానే తెలియజేశాం

మార్కెట్‌యార్డులో వేరుసెనగ బస్తాలు నిల్వ ఉన్నందున కొద్దిరోజులపాటు బస్తాలను వేసుకుని రావద్దని రైతులకు ముందుగానే తెలియజేశాం. అయినా ఎవరూ వినడం లేదు. గోదాములు ఖాళీగా లేక ఆయిల్‌ఫెడ్ అధికారులు బస్తాలు తరలించడం లేదు. రోజుకు 50 మంది పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. రైతులు సహకరిస్తే అందరివీ కొనుగోలు చేసి బిల్లులు అందేలా చూస్తాం. ***- మల్లికార్జున, సింగిల్‌విండో అధ్యక్షుడు***

పిల్లలను టీవీలకు దూరంగా ఉంచండి

పామిడి, న్యూస్‌టుడే: పది పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టని, అందుకు తల్లిదండ్రులు తమ పిల్లలు మెరుగైన ఫలితాలను సాధించడానికి సహకరించాలని ప్రిన్సిపల్ హనుమంతరాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆయన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. 'అనంత సంకల్పం' అన్న ప్రత్యేక కార్యక్రమం ఈ నెల 2 నుంచి మార్చి 14 వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమలు చేస్తామన్నారు. పిల్లలను టీవీలకు, సెల్‌ఫోన్‌లకు, సినిమాలకు దూరంగా ఉంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

గుంతకల్లు, న్యూస్‌టుడే : పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల యాజమాన్యం విద్యార్థుల జీవితాలతో ఆడుకొంటోందని భారత విద్యార్థి సమాఖ్య డివిజన్ కార్యదర్శి రమేష్, అధ్యక్షుడు పరమేష్ ఆరోపించారు. సమాఖ్య నాయకులు శనివారం కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు యాజమాన్యం నాలుగు నెలల నుంచి వేతనాలను చెల్లించకపోవడంతో వారు కళాశాలకు హాజరు కావడంలేదని తెలిపారు. త్వరలో విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు జరగనున్నాయని, అధ్యాపకులు కళాశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సమాఖ్య నాయకులు కైలాష్, బాబు, హరీష్, బాస్కర్, హరి తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి పట్టణంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాయలసీమ విమోచన సమితి జిల్లా కన్వీనర్ రాజశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని గుత్తి స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ మునివేలుకు వినతి పత్రం అందజేశారు. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గుత్తి పట్టణం దక్షిణ భారత దేశపు నడికేంద్రంగా ఉందని, పట్టణంలో జాతీయ రహదారి, రైల్వే రహదారి ఉన్నాయని తెలిపారు. ఎప్పుడు ప్రమాదం జరిగినా వాహనం గుంతకల్లు పట్టణం నుంచి వచ్చే సరికి నష్టం జరిగిపోతోందని వాపోయారు. గుత్తి ప్రజలు 30 ఏళ్ల నుంచి అధికారులకు వినపించుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శివరాయల్, సీతా రామిరెడ్డి, రాజేష్, సురేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన రాకపోకలు

సత్యనారాయణపేట (గుంతకల్లు), న్యూస్‌టుడే : గుంతకల్లు - కసాపురం రోడ్డులోని సత్యనారాయణపేట వద్ద ఉన్న ఇరుకైన రైల్వే మోరీలో పార్సిల్ లారీ శనివారం మధ్యాహ్నం ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహన చోదకులు, కసాపురానికి వాహనాల్లో వెళ్లే భక్తులు ఇబ్బందులు పడ్డారు. లారీ మోరీగుండా వెళ్లే సమయంలో మురుగు కాలువలోకి ముందు చక్రం వెళ్లడంతో లారీ ఇరుక్కుపోయింది. రోడ్డులో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. కొందరు వాహనాలను దారిమళ్లించారు. ముందే ఇరుకైన మోరీలో మురుగు కాలువ కూడా ఉండటంతో తరచుగా వాహనాలు మురుగు కాలువలో ఇరుక్కుపోవడం సర్వసాధారణంగా మారింది. రెండు గంటల తరువాత లారీని బయటకు లాగారు. మోరీ విస్తరణ పనులకు నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, పార్లమెంటు సభ్యుడు దివాకర్‌రెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు.



మోరీలో ఇరుక్కుపోయిన లారీ

ప్రభుత్వం నిధులను కేటాయించడంలో జాప్యం చేస్తుండటంతో వాహనాలవారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఏడుగురిపై కేసు

గుంతకల్లు, న్యూస్‌టుడే : తీసుకొన్న డబ్బును తిరిగి ఇవ్వాలని అడిగినందుకు తనపై దాడిచేయడమే కాకుండా కులం పేరుతో దూషించారని భాగ్యనగర్‌లో నివాసముంటున్న నరసమ్మ అనే మహిళ ఫిర్యాదు చేసిందని ఒకటో పట్టణ ఎస్.ఐ. వెంకటప్రసాద్ శనివారం తెలిపారు. శ్రీరాంచౌదరి అనేవ్యక్తి కాంటాక్టులో భాగం ఇస్తామని చెప్పి తమ నుంచి రూ.15 లక్షలు తీసుకొన్నాడని ఫిర్యాదులో పేర్కొందని చెప్పారు. కాంట్రాక్టులో భాగం ఇవ్వలేదు, తీసుకొన్న డబ్బును కూడా ఇవ్వలేదని చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో ఆయనతోపాటు ఆయన భార్య నాగమణితో పాటు ప్రసాద్, మహబూబ్‌బాషా, రవి, ఉదయ్‌కిరణ్, వలి అనేవారు కొట్టడానికి వచ్చి నీఅంతు చూస్తామని బెదిరించారని నరసమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్.ఐ. పేర్కొన్నారు. కేసును నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

భర్తపై కేసు

కత్రిమల (పామిడి), న్యూస్‌టుడే: ఓ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తపై శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కత్రిమల గ్రామానికి చెందిన అలివేలమ్మ తనభర్త రాముడు కొంతకాలంగా తనను అనుమానిస్తూ శారీరకంగా మానసికంగా వేధిపింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేసిందని చెప్పారు. దీంతో ఆమె ఫిర్యాదును స్వీకరించి భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

పామిడి: కర్నూల్ జిల్లా పత్తికొండ గ్రామానికి చెందిన లక్ష్మీకి పామిడికి చెందిన అర్జునాచారితో వివాహమైంది. అయితే కొద్ది రోజులుగా భర్తతో పాటు అత్త రుక్మిణమ్మ, మామ ఆంజనేయులు, బావలు కలిసి అదనపు కట్నం తీసుకురావాలని తనను వేధిస్తున్నారని లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు వారందరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.



గుంతకల్లు: సభలో ప్రసంగిస్తున్న అపర్ణ



గుంతకల్లు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జితేంద్రగౌడ్



నెలగొండలో విద్యార్థులు, అధ్యాపకుల మానవహారం



కరిడికొండలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రయ్య



పామిడి: బీమా పత్రాన్ని అందజేస్తున్న ముసలిరెడ్డి తదితరులు

రూ.110 కోట్లతో పట్టణ అభివృద్ధి

రాజేంద్రనగర్ (గుంతకల్లు), న్యూస్‌టుడే : పట్టణంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించడానికి గడచిన మూడున్నరేళ్ల కాలంలో రూ.110 కోట్లు ఖర్చుపెట్టినట్లు ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్, మున్సిపల్ అధ్యక్షురాలు అపర్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనాథ్ గౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి సభలు శనివారం రాజేంద్రనగర్‌తో పాటు మరికొన్ని కాలనీల్లో జరిగాయి. రాజేంద్రనగర్‌లో జరిగిన సభలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా బుడగజంగం వారు బుర్రకథను ప్రదర్శించారు. మున్సిపల్ అధికారులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, తెదేపా నాయకులు చంద్రశేఖర్, ఆనంద్, ఇస్మాయిల్, వెంకటలక్ష్మి, అంజి, మస్తాన్‌యాదవ్, యాస్మీన్, దేవి, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

5కె పరుగుతో రహదారులు నిండిపోవాలి

తిలక్‌నగర్ (గుంతకల్లు): పట్టణంలో ఆదివారం నిర్వహించే అనంతపురం జిల్లాస్థాయి 5 కి.మీ.ల పరుగుతో రోడ్లన్నీ ప్రజలతో నిండిపోయే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ అన్నారు. పరుగు నిర్వహణకు సంబంధించి తన క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి వివిధ శాఖల అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టరుతో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు అవుతున్నారని చెప్పారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు కృషిచేయాలని కోరారు. ఉదయం 7 గంటలకు పరుగు రైల్వే క్రీడామైదానంలో ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌గౌడ్, తెదేపా నాయకులు ఆనంద్, పవన్‌కుమార్ గౌడ్, చంద్రశేఖర్‌రావు, పట్టణ సి.ఐ. రాజా, మున్సిపల్ ఇంజినీరు ఈశ్వరయ్య, వ్యాయామోపాధ్యాయులు నాగార్జున ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కసాపురంరోడ్డు (గుంతకల్లు): పట్టణాల్లో ఉంటున్న విద్యార్థులు గ్రామాలకు వెళితే గ్రామీణుల స్థితిగతులు తెలుస్తాయని ఎస్.ఎస్.జి.ఎస్. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ నాయుడు అన్నారు. కళాశాలలో శనివారం 'గ్రామీణాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై సదస్సు జరిగింది. సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. అధికారి కృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నల్లదాసరపల్లి (గుంతకల్లు గ్రామీణం): ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారం చేయడానికే జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రాయలరామయ్య పేర్కొన్నారు. మండలంలోని నల్లదాసరపల్లి, నెలగొండ గ్రామాల్లో సర్పంచులు పార్వతమ్మ, ఓబుళమ్మ అధ్యక్షతన శనివారం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శంకర్, తహసీల్దారు హరిప్రసాద్, ప్రత్యేక అధికారిని విజయలక్ష్మి, ఈవోఆర్డీ శ్రీకాంత్‌చౌదరి, ఎంఈవో కుళ్లాయప్ప, ఏవో రామకృష్ణ, వైద్యాధికారి రోహినాథ్, పశువైద్యాధికారులు కీర్తికేసైన్, దీపక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

● మరుగుదొడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టి బహిరంగ మలవిసర్జన లేని గ్రామంగా తీర్చిదిద్దుదామని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహబుబ్‌బాషా, కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. మండలంలోని నెలగొండ గ్రామంలో శనివారం మరుగుదొడ్ల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు రామచంద్ర, జాన్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కసాపురం(గుంతకల్లు గ్రామీణం): పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎస్ఎస్‌జిఎస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి బి.కృష్ణయ్య ఆధ్వర్యంలో కసాపురంలో పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల గురించి విద్యార్థులు, అధ్యాపకులు శనివారం ర్యాలీ నిర్వహించి గ్రామంలోని ఆటోస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ వైదేహి, వీఆర్‌వో భరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రామలింగ, ప్రధానోపాధ్యాయురాలు రామాంజనమ్మ, ఉపాధ్యాయుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కరిడికొండ(గుత్తి గ్రామీణం): మండలంలోని కరిడికొండ, తొండపాడు, మామడూరు గ్రామాల్లో సర్పంచులు వెంకటరాముడు, కృష్ణవేణి, తిమ్మారెడ్డిల అధ్యక్షతన జన్మ భూమి.. మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రయ్య, ఎంపీటీసీ నరసింహులు, శ్రీనివాస యాదవ్, సుధాకర్ యాదవ్, అధికారులు హౌసింగ్ ఏఈ రామాంజనేయులు, ఈవోఆర్డీ శశికళ, మండల ఇంజనీరు జ్యోతి పాల్గొన్నారు.

నీలూరు (పామిడి): గ్రామాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ సుమిత్రమ్మ, జడ్పీటీసీ జయలక్ష్మిలు మండల ప్రజలకు సూచించారు. శనివారం మండల పరిధిలోని నీలూరు, కండ్లపల్లి గ్రామాలలో ఎంపీడీవో రమేష్‌నాయక్, రమణారెడ్డిల ఆధ్వర్యంలో 5వ విడత జన్మభూమి..మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ ముసలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పామిడిలోని 15, 16 వార్డులలో జన్మభూమి.. మాఊరు కార్యక్రమాన్ని కమిషనరు నాసిర్‌హుసేన్ ఆధ్వర్యంలో జరిగింది. 18వ వార్డుకు సంబంధించి డీటీ బాలాజీ రాజు విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు పత్రాలను, కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. వైస్‌ఛైర్మన్ బొల్లుశ్యామలాదేవి, కౌన్సిలర్లు రమణారావు, ఉప్పరరామాంజనేయులు, శ్యాంరావు, పట్రాలక్ష్మీదేవి, హాజీరుక్మాన్, ప్రసాద్ మారుతీ, వెంకటేష్, పిక్కలిపార్వతీ, జన్మభూమి కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు



గుత్తి: నృత్యం చేస్తున్న చిన్నారులు

గుత్తి: గుత్తిలోని కండోజీబావి, గుత్తిఆర్.ఎస్.లోని తాతయ్యగుడి వద్ద శనివారం జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఉపతహసీల్దారు మునివేలు, కమిషనర్ ఇబ్రహీం మాట్లాడుతూ జన్మభూమి సభల్లో ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలని కోరారు. ఎల్ఎం పాఠశాలకు చెందిన చిన్నారులు పోటాపోటీగా నృతాలు చేసి అలరించారు. పట్టణబ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, డైరెక్టర్ కృష్ణ, తెదేపా నాయకులు జయన్న, దిల్‌కాశీనా, కౌన్సిలర్ గిడ్డమ్మ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



ధ్రువపత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తికోటలోని కేశవ పిళ్లై ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు రమేష్, అనిల్‌ను శనివారం ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు ఈనెల 3 నుంచి 5 వరకు నెల్లూరులో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. ఈనెల 7 నుంచి 12 వరకు హైదరాబాదులో జరిగే దక్షిణ భారతదేశం స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సుంకన్న, ఉపాధ్యాయులు రామాంజనేయులు అభినందించారు. విద్యార్థులు సమీకృత వ్యవసాయం-ఆహారభద్రత అనే అంశంపై నమూనాను ప్రదర్శించారు.

గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, గుత్తి

E.P. 93/17 O.S. 40/17

ఎస్. ఇంతియాజ్, S/o ఎస్. అమీర్‌బాష, పామిడి
..వాది/డిక్రీహోల్డరు

V/s

పి. నాగేంద్రప్రసాద్, S/o పి. వెంకటరామయ్య, H.No. 5-31A, బ్రాహ్మణవీధి, పామిడి.
..ప్రతివాది/జడ్జిమెంటు డెటారు

ప్రతివాదికి నోటీసు

పై కేసులో ప్రతివాది హాజరు నిమిత్తము పై కోర్టువారు 18-1-2018వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. ఆదినము పగలు 10.30 ని॥లకు ప్రతివాది హాజరై తమ ఆక్షేపణలు దాఖలు చేయనిచో నీ పరోక్షము నందు పై అమలు అర్జీ తీర్మానించబడును.

వాయిదా: 18-1-2018

డా॥ ఎస్.ఎం.సురేంద్ర కుమార్
వాదిపరం వకీలు

నేడు ఎమ్మెల్యే రాక

చీకటిమానిపల్లి, (తనకల్లు) న్యూస్‌టుడే: చీకటిమానిపల్లి, బొంతలపల్లిలో శనివారం నిర్వహించే జన్మభూమి మాఊరు కార్యక్రమంలో ఎమ్మెల్యే అత్తార్‌చాంద్‌బాషా పాల్గొంటారని తెదేపా నాయకుడు సోంపాల్యం నాగభూషణ తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు, పింఛన్లు, రేషన్‌కార్డుల తదితర సమస్యలపై అర్జీల రూపంలో ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కదిరి

బీమా తక్షణ సాయం పంపిణీ

సాదులవాండ్లపల్లి(గాండ్లపెంట),న్యూస్‌టుడే: గాండ్లపెంట మండలం సాదులవాండ్లపల్లి గ్రామానికి చెందిన నాగమ్మ(48) అనారోగ్యంతో శనివారం మరణించింది. బీమామిత్ర లక్ష్మీదేవి చంద్రన్న బీమా కింద తక్షణ సాయం రూ.5 వేలను ఆమె భర్త వేమన్నకు అందజేశారు. చంద్రన్న బీమా చేయించినందున రూ. రెండు లక్షల సాయం అందుతుందని తెలిపారు. అంత్యక్రియలకు తక్షణసాయం కింద రూ.5వేల మొత్తాన్ని అందించామన్నారు.

సంక్షేమ పథకాల అందజేతకే జన్మభూమి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గాండ్లపెంట,న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించడానికే ప్రభుత్వం జన్మభూమిని వేదిక చేసిందని ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా తెలిపారు. శనివారం మల్లమీదపల్లి గ్రామంలో సర్పంచి గంగారత్నమ్మ, ప్రత్యేకాధికారి వన్నూరుస్వామి ఆధర్యంలో జన్మభూమి గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య వికాసానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం మరుగుదొడ్లు, ప్రహరీ, అదనపు తరగతిగదుల నిర్మాణానికి రూ. 23 కోట్లు మంజూరు చేస్తోందన్నారు. కదిరి డివిజన్ ప్రత్యేక పరిశీలన ఐఎఫ్ఎస్ అధికారి భరత్‌కుమార్ అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు.

మల్లమీదపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు కావాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. చిన్నపల్లి నుంచి మల్లమీదపల్లి పాఠశాలకు వచ్చే 20 మంది విద్యార్థులకు బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను విద్యార్థులు కోరారు. ఆయన డీఎంతో ఫోన్లో మాట్లాడి సోమవారం నుంచి బస్సు వస్తుందని తెలిపారు.

● చామాచేనుబైలు గ్రామస్థులు గ్రామంలో సీసీ రహదారులు మంజూరు చేయాలని ప్రత్యేకాధికారికి వినతిపత్రం ఇచ్చారు. సీపీఎస్ ఉపాధ్యాయులు కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఆమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు రవీంద్రరెడ్డి, రమణనాయక్, నరేంద్ర, నాగరాజు, అనిత, అరిఫ్, విద్యాసాగర్, సునిల్‌కరుణాకర్ వినతిపత్రం ఇచ్చారు. ఇళ్లు, పింఛన్, రేషన్‌కార్డులు తదితర సమస్యలపై 186 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఎంపీడీవో శ్రీరాములు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓఆర్డీ ఆనందయ్య, నాయకులు దేవానంద్, హైదర్‌వలి, అల్లాబకష్, కొండయ్య, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

మేకలచెరువు,(నంబులపూలకుంట),న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే తెదేపా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా తెలిపారు. శనివారం మేకలచెరువులో సర్పంచి తిరుపాలమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. గౌడుచెరువు వాండ్లపల్లికి రహదారి సమస్య, మేకలచెరువులో కాపులకు రాయితీ రుణాల మంజూరుపై పై ఇద్దరు యువకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. గూటిబైలు ఉన్నత పాఠశాల బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థునులకు ఎమ్మెల్యే రూ. 2 వేలు ప్రోత్సాహకం అందించారు. చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో సీసీఎల్‌భరత్‌కుమార్, ప్రత్యేకఅధికారి లక్ష్మినరసయ్య, డీటీ కృష్ణప్రసాద్, ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి, ఎంఈవో గోపాల్‌నాయక్, జడ్పీటీసీ మహేశ్వరమ్మ, మాజీ ఎంపీటీసీ పౌవుల్‌రెడ్డి, తెదేపా నాయకుడు వెంకటనారాయణ, అంజినప్పనాయుడు, శ్రీనివాసులు శీనా పాల్గొన్నారు.



మేకలచెరువులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇళ్లు పడగొట్టుకున్నాం..

బండ్లపల్లి, లక్కసముద్రం(తలుపుల), న్యూస్‌టుడే: బండ్లపల్లి, లక్కసముద్రం పంచాయతీల్లో శనివారం గ్రామసభల్లో ఎన్టీఆర్ గృహాలు, రేషన్‌కార్డులు, పింఛన్ల సమస్యలపై ప్రజలు ఏకరువు పెట్టారు. బండ్లపల్లి పంచాయతీలో ఎన్టీఆర్ గృహాలు మంజూరయ్యాయి. పక్కాఇళ్లను నిర్మించుకోండని కొంతమంది నాయకులు చెప్పడంతో బాగున్న ఇళ్లను సైతం పడగొట్టాం. ఆ తరువాత పక్కాఇళ్లు మంజూరు కాలేదని వాపోయారు. ఇలాగైతే తాము ఎలా బతికేది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సమస్యలపై వినతులు ఇచ్చారు. బండ్లపల్లి, లక్కసముద్రం గ్రామసభల్లో రేషన్‌కార్డులు, పాస్ పుస్తకాలు, సంక్రాంతి చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. ప్రత్యేక అధికారి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



తలుపుల : రేషన్ కార్డు అందజేత

క్రీడాపోటీలు

తలుపుల, న్యూస్‌టుడే: ఐదోవిడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా యువకులకు క్రీడాపోటీలు నిర్వహించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు సాయికృష్ణ, ఆదినారాయణ, రాజశేఖర్ తెలిపారు. తొక్కుడుబిళ్ల ఆటలో గుండువారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సంగీత ప్రథమ, తలుపులకు చెందిన హేమలత ద్వితీయ, కస్తూరిబా విద్యార్థి అరుణ తృతీయ స్థానాల్లో రాణించారు. తాడు ఆటలో తలుపులకు చెందిన గాయిత్రి ప్రథమ, గుండువారిపల్లికి చెందిన స్వప్న ద్వితీయ, తలుపులకు చెందిన అఖిల తృతీయ స్థానాల్లో నిలిచారు. శనివారం సాయంత్రం కబడ్డీలో ఉబ్బరవాండ్లపల్లి, తలుపుల జట్లు తలపడినట్లు తెలిపారు. ఈ ఆటల్లో గెలుపొందిన వారందరికి ఈనెల 11న జన్మభూమి గ్రామసభల ముగింపు రోజున ప్రోత్సాహక బహుమతులను అధికారులు పంపిణీ చేస్తారన్నారు.



తలుపులలో కబడ్డీ పోటీ

కలుషితనీటితో రోగాలబారిన పడుతున్నాం

తనకల్లు,న్యూస్‌టుడే: తాగునీటి బోరువద్ద పైపు పగిలి నీరు కలుషితమవడంతో రోగాల బారిన పడుతున్నామని దిగువతొట్లిపల్లి గ్రామస్థులు శనివారం జన్మభూమి సభలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సీజీప్రాజెక్టు ఎడమకాలువ నుండి తమ గ్రామానికి వస్తున్న నీరు ద్వారా వరి పంట సాగుచేసుకుంటున్నామని హంద్రీనీవా కాలువ పనులు జరుగుతుండగా సాగునీటికి హంద్రీనీవా కాలువ కింద దారి ఏర్పాటు చేస్తామన్న అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం వరినారు నాటడానికి సమయం వచ్చిందని అధికారుల నిర్లక్ష్యం వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొక్కంటిక్రాస్ సమీపంలోని నల్లగుట్లపల్లి వద్ద జాతీయ రహదారికి సర్వేనంబరు 91 లో 26 కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోయి రోడ్డున పడ్డాయని సర్వేనంబరు 74లో బాధితులకు పట్టాలిస్తామని కొలతలు వేసి మిన్నకుండిపోయారని రైతుసంఘ నాయకులు అధికారులకు తెలిపారు. వర్షాలకు ఇల్లు దెబ్బతినడంతో ప్రభుత్వం నుండి రూ. 5200 మంజూరయింది ఇంతవరకు డబ్బు అందలేదని గ్రామానికి చెందిన నారాయణస్వామి వినతిపత్రం ఇచ్చారు. ముండ్లవారిపల్లిలో సర్పంచి దాతిక రవి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పెనుగుండుతండాకు రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు ఎంపీడీఓ రమేష్‌బాబుకి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం గ్రామంలో మరుగుదొడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కొండలరావు, తహసీల్దారు లక్ష్మీనాయక్, ఎస్సై శ్రీనివాసులు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు. తెదేపా నాయకులు నాగభూషణ, శీన, శ్రీధర్ పాల్గొన్నారు.



సమస్యలపై ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

ఉపాధి పనులు కల్పిస్తాం

నల్లచెరువు,న్యూస్‌టుడే: ఉబిచెర్ల గ్రామంలో శనివారం జన్మభూమి సభను సర్పంచి కిష్టప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు సమస్యలపై గ్రామస్థులు అధికారులకు వినతులు ఇచ్చారు. ఏపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు పనులు కల్పించే విధానాలు వివరించారు. తహసీల్దారు కళావతి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమఫలాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మగ్బుల్‌బాషా, ఏఓ లక్ష్మిప్రియ, ఎంపీపీ మాబుసాబ్, నాగభూషణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉబిచర్లలో పౌష్టికాహారం పంపిణీ

రక్తదానంతో ప్రాణాలు కాపాడండి

కదిరి, న్యూస్‌టుడే: రక్తదానం చేసి ప్రాణాపాయంలోని వ్యక్తులకు ప్రాణదాతలు కావాలని డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసనాయుడు తెలిపారు. జాతీయ సేవాపథకం, జనజాగృతి సంస్థలు సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాసనాయుడు రక్తదానం ప్రాముఖ్యత, కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఇలాంటి రక్తదాన శిబిరాలను తరచూ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రక్తనిధిలో రక్తం నిల్వ ఉండటం వల్ల ప్రమాదాల్లో గాయపడిన, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అందివ్వటం వల్ల ఎన్నో ప్రాణాలు కాపాడొచ్చని వివరించారు. అందుకు విద్యార్థులు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయటం ప్రథమ కర్తవ్యంగా భావించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌మహమ్మద్, శ్రీదేవి, జనజాగృతి సంస్థ మేనేజర్ శేషాద్రి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కదిరి

నేడు ఓబుళదేవరచెరువులో 5కే రన్

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: మండలపరిషత్ కార్యాలయం నుంచి తిప్పేపల్లి వరకు అయిదు కిలోమీటర్ల పరుగు (5కే రన్) కార్యక్రమం ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని మండలప్రత్యేకాధికారి శివప్రసాద్‌రాజు, ఎంపీడీఓ నాగరాజు పేర్కొన్నారు. ఆరోగ్యజాగ్రత్తలు, వ్యాయామం కోసం ఇది ఎంతగానో దోహదపడుతుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, యువతీ, యువకులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్రీడాకారుడి వితరణ

జంబులవాండ్లపల్లి (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: జంబులవాండ్లపల్లి ప్రాథమికపాఠశాల విద్యార్థులకు అమడగూరు మండలం నుంచి చెన్నై అండర్-19 క్రికెట్‌జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన వేణుగోపాల్ పలకలు, రాతపుస్తకాలు, నిఘంటువులు, అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడటంతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. చదువుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.



నూతనకమిటీ సభ్యులు

శ్రీఖాద్రీ కళా సేవాసంఘం నూతన కమిటీ ఎన్నిక

నాగిరెడ్డిపల్లి, కదిరి పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని అన్ని కళాకారుల సంఘాలు కలిసి ఒక్కటై శ్రీఖాద్రీకళాసేవాసంఘంగా ఏర్పడి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రధానకార్యదర్శి సంపంగి గోవర్ధన్ తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా కోనేరు గంగులప్ప, అధ్యక్షుడిగా కుళ్లాయప్ప, ఉపాధ్యక్షుడిగా రమణ, కోశాధికారిగా శంకర్, కార్యదర్శిగా బాలయ్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కదిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అత్తార్‌చాంద్‌బాషా తెలిపారు. పట్టుగూళ్ల మార్కెట్‌లో శనివారం జన్మభూమి గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పీపుల్స్ ఫస్ట్ అన్న నినాదంతో ప్రజలకు మొదటి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. పథకాలు అందని వారు తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈసందర్భంగా ఆయన బియ్యంకార్డులు, చంద్రన్నబీమా హామీపత్రాలు, చంద్రన్న సంక్రాంతి కానుక సరకులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దేవానంద్, కమిషనర్ ప్రమీల, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, కౌన్సిలర్లు మైనొద్దీన్, చంద్రశేఖర్, శివశంకర్‌నాయక్, నాయకులు ఎస్ఎండీ ఇస్మాయిల్, ముస్తపా, పుల్లయ్య, శ్రీనివాసులు, శేషు పాల్గొన్నారు.

● పట్టణంలోని 11, 16, 8వ వార్డుల్లో శనివారం జన్మభూమి సభల్లో ఛైర్‌పర్సన్ సురియాబాను బియ్యంకార్డులు, చంద్రన్నబీమా బాండ్లను అందజేశారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు చంద్రన్న బీమా తక్షణ సాయం రూ.5వేలను పంపిణీ చేశారు. మిగిలిన మొత్తం నామినీ ఖాతాకు జమచేస్తారని తెలిపారు. కౌన్సిలర్లు లక్ష్మిదేవి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



బీమాబాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

రేపు కదిరికి స్వరూపానందేంద్ర స్వామీజీ రాక

కదిరి, న్యూస్‌టుడే: పట్టణానికి విశాఖ శారదా పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి సోమవారం వస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8న కదిరి వస్తున్న స్వామివారు పదవ తేదీ వరకు శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బస చేస్తారన్నారు. సనాతన హైందవ ధర్మానికి విశాఖలోని శారదాపీఠం పట్టుకొమ్మలాంటిదన్నారు. ఆగమాలకు విఘాతం, దేవాలయ ప్రాంతాల్లో అన్యమత ప్రచారం జరిగినప్పుడు, ఆలయభూములు ఆక్రమణలకు గురైనప్పుడు తక్షణమే వారు స్పందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అర్చక వ్యవస్థ తరపున ముందుండి పోరాటం సాగిస్తున్నారన్నారు. అలాంటి స్వామిజీ రాయలసీమ విజయయాత్రలో భాగంగా కదిరి వస్తున్నారన్నారు. మూడురోజుల పాటు వేదార్చన, తీర్థప్రసాదాల వినియోగం జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి అనుగ్రహం అందుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆలయ కమిటీ మాజీఛైర్మన్ శ్రీహరిప్రసాద్, శివశంకరరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

సంపదతయారీ కేంద్రానికి శ్రీకారం

తనకల్లు,న్యూస్‌టుడే: మండలపరిదిలోని ముండ్లవారిపల్లిలో నూతనంగా నిర్మించదలిచిన చెత్తతో సంపదతయారీ కేంద్రానికి సర్పంచి దాతిక రవి ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ రమేష్‌బాబు భూమిపూజ చేసి ప్రారంభించారు. స్వచ్ఛ గ్రామపంచాయతీలో భాగంగా గ్రామంలో తడి, పొడిచెత్త వేరుచేసి తయారీ కేంద్రంలో వేసి వర్మీకంపోస్ట్ ఎరువును తయారు చేసి రైతులకు ఇస్తారన్నారు. గ్రామంలో చెత్త తరలింపునకు గ్రామపంచాయతీకి మూడు చక్రాల సైకిళ్లు వచ్చినట్లు సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోస్న, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు రఫీమున్నీసా, నాయకులు నాగభూషణ, శీనా, ఎంపీఈఓ హసీనా పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

చీకటిమానిపల్లి,తనకల్లు,న్యూస్‌టుడే: చీకటిమానిపల్లికి చెందిన నజురుల్లా అనారోగ్యంతో బాదపడుతున్న విషయం తెలుసుకున్న వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త డా. సిద్ధారెడ్డి బాదితునికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించినట్లు మండలకన్వీనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నజురుల్లా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం నాయకులు సిద్ధారెడ్డి కి తెలపడంతో ఈ సాయం అందించినట్లు తెలిపారు ఆ మొత్తాన్ని శనివారం కన్వీనర్ చీకటిమానిపల్లిలో బాధితుడికి అందజేశారు. నాయకులు ఈశ్వర్‌రెడ్డి, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ

మహిళలూ మోసపోవద్దు

ధనియానిచెరువు,(నంబులపూలకుంట),న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు దళారుల మాటలు విని మోసపోవద్దని కదిరి డీఎస్పీ శ్రీలక్ష్మీ హెచ్చరించారు. శనివారం రాత్రి ధనియానిచెరువులో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో డీఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లే ముందు కచ్చితమైన ఆధారాలతో వెళ్లాలన్నారు. దళారుల మాయమాటలు విని వెళ్లిన మహిళలు పడుతున్న కష్టాలపై ఆమె వివరంగా అవగాహన కల్పించారు. గిరిజనతండాల్లో ఎక్కువమంది వలసలు వెళ్లారన్నారు. ఇలా వలస వెళ్లకుండా ప్రభుత్వం మహిళలకు ఉపాధి మార్గాలు చూపినట్లు తెలిపారు. మహిళలను ఇతర దేశాలకు తరలించేందుకు సహకరిస్తున్న దళారుల సమాచారం తెలిపితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ మన్సూరుద్దీన్, ఎస్సై రమేష్‌బాబు పాల్గొన్నారు.

గర్భిణి ఆరోగ్యం విషమం..?

కదిరి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణి ఆరోగ్యం విషమించింది. పరిస్థితి ఆందోళనకరంగా ప్రాణాపాయ స్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్టే స్వయంగా మెరుగైన వైద్యసేవలకు అంబులెన్సులో బత్తలపల్లికి ఆర్టీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గాండ్లపెంటకు చెందిన జానకి శనివారం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో వైద్యురాలు పరీక్షించింది. లోపలికి తీసుకెళ్లిన కొద్దిసేపటికే అందరూ ఆందోళనగా బయటకు వచ్చినట్లు ఆసుపత్రిలో ఉన్నవారు చెబుతున్నారు. గర్భసంచి దెబ్బతిని పరిస్థితి విషమించిందని, అత్యవసర సేవలు అందక పోవటం ప్రాణానికే ప్రమాదమని భావించిన వైద్యులు హుటాహుటిన బత్తలపల్లికి తీసుకెళ్లారు. అయితే ఆసుపత్రికి వచ్చిన మహిళ కాన్పు కోసం వచ్చిందా, లేదంటే గర్భస్రావం చేయించుకునేందుకా అనే విషయం తెలియాల్సి ఉంది. ఆందోళన పరిస్థితిని విన్న పలువురు గర్భిణీకి గర్భస్రావం చేసే తరుణంలోనే అపశ్రుతి దొర్లినట్లు ఆసుపత్రిలో చర్చ జరిగింది. ఈ విషయంపై ఇన్‌చార్జ్ పర్యవేక్షకుడు రామకృష్ణను సంప్రదించగా గర్భస్రావం చేయకూడదనే చెబుతున్నాం. ఆసుపత్రికి వచ్చిన గర్భిణికి తీవ్ర రక్తస్రావం జరిగిందని, అందుకే బత్తలపల్లికి రెఫరల్ చేశామని తనకు చెప్పారన్నారు. ఏం జరిగిందన్న విషయంపై పూర్తిస్థాయిలో విచారించి తెలుసుకుంటామన్నారు. తర్వాత వివరాలను వెల్లడిస్తామన్నారు.

ఉపాధ్యాయుల పెద్దమనసు

నల్లచెరువు,న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు పెద్దమనసుతో చిన్నారికి శస్త్ర చికిత్స అందించారు. మండలకేంద్రానికి చెందిన రామచంద్ర కుమార్తె కీర్తన 2వ తరగతి చదువుతోంది. ఆమెకు పుట్టుకతోనే అంగవైకల్యం ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. స్థానిక భవిత కేంద్రంలోని ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు నరసింహులు, వినయ్ కృషితో చిన్నారికి తిరుపతి బర్డ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. చిన్నారి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న ఆసుపత్రి యాజమాన్యం చిన్నారి కుటుంబానికి రూ 30 వేల ఆర్థిక సహాయం అందించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

రైతురథం ట్రాక్టర్ల పంపిణీ

కదిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతులకు మంజూరు చేసిన రైతురథం ట్రాక్టర్లను శనివారం తెదేపా బాధ్యుడు కందికుంట వెంకటప్రసాద్ అందజేశారు. ప్రభుత్వం రాయితీపై తలుపులకు చెందిన జయచంద్రరెడ్డి, కదిరి మండలం ఎగువపల్లికి చెందిన మనోహర్‌నాయుడుకి మంజూరు చేసింది. ఈ ట్రాక్టర్లను కందికుంట నడిపి లబ్ధిదారులైన రైతులకు అందజేశారు. ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటి చేయాలన్న తలంపుతో యాంత్రీకరణలో భాగంగా రాయితీపై ట్రాక్టర్లను ఇస్తోందన్నారు. వాటిని పొందిన రైతులు సక్రమ మార్గంలో వినియోగించుకోవాలన్నారు. వాహనాలను నిరుపయోగంగా మార్చుకుంటే సద్వినియోగంతో సక్రమ కంతుల చెల్లింపుతో సొంతం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆశించిన ఫలితాలను సాధించి లాభసాటి వ్యవసాయాన్ని పండించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, చెన్నకేశవులు, వీరభార్గవరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక జన్మభూమి



మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

కె.వి.పల్లి, (కదిరిపట్టణం), న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి జన్మభూమి మాఊరు గ్రామసభ చక్కటి పరిష్కారవేదిక అని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి సభలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కందికుంట నారాయణమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఛైర్మన్ కందికుంట యశోదాదేవి, కుమ్మరవాండ్లపల్లి సర్పంచి లక్ష్మిదేవమ్మ, మండలాధ్యక్షురాలు లలితమ్మ, తహసీల్దార్ పి.వి.రమణ, ఎంపీడీవో ఆదినారాయణ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి: కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలోని సీపీఐ కాలనీలో కనీస సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. శివారుప్రాంతంలోని కాలనీలో వీధిదీపాలు లేక అవస్థ పడుతున్నామన్నారు. గుట్టలో నిర్మించుకున్న ఇళ్లకు వెళ్లేందుకు రహదారి సదుపాయంలేదని, వీధులన్నీ గుంతలమయంగా మారాయని వాపోయారు. తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. స్థానికులతో పాటు సీపీఐ నాయకులు కదిరిప్ప, లియాఖత్, .జనార్దన్, భాస్కర్ ఉన్నారు.

కూరగాయల ధరలు కేజీ రూ.ల్లో

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మార్కెట్‌లో నిన్నటి ధరలు టమోటా.10, పచ్చిమిర్చి 30, వంకాయ 20, బెండ 40, క్యారెట్ 40, ఆలుగడ్డ 20, బీట్‌రూట్ 50, బీన్స్ 30, ముల్లంగి 30, బీరకాయ 40, సీమవంకాయ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజి 30, కాకర 40, కాలిఫ్లవర్ ఒక్కొటి 30, మునగకాయలు 200, గోరుచిక్కుడు 40, చిక్కుడు 50, యర్రగడ్డలు 40, తెల్లగడ్డలు 60

తెరపై ఈనాడు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే సంగం: హలో రాధిక: ఏంసీఏ, మౌనిక: ఒక్కక్షణం, వేమల: మళ్లీరావా

కళ్యాణదుర్గం

ఘనంగా పడి పూజోత్సవం

కణేకల్లు: స్థానిక ఉరవకొండ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి పడిపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్టుకు అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. గురుస్వాములు చిక్కణ్ణ, నాగప్ప ఆధ్వర్యంలో 18 మెట్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని మొక్కులు చెల్లించుకొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని సుప్రసిద్ధ నేమకల్లు ఆంజనేయస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. శనివారం ప్రధాన అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, వెండి కవచాలంకరణ, పంచామృతాభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైద్య సిబ్బంది సెలవుల్లో.. ప్రజలు ఇబ్బందుల్లో



ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ఇదే

కంబదూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 42 గ్రామాలకు ఇదే పెద్ద ఆసుపత్రి. రోజుకు దాదాపు 200 నుంచి 250 మంది రోగులు వైద్య చికిత్సకు ఆస్పత్రికి వస్తుంటారు. పేరుకే పెద్ద ఆసుపత్రి అయినా రెండు ప్రభుత్వ వైద్యాధికారుల పోస్టులు ఉన్న ఈ వైద్యశాలలో ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రెండవ పోస్టు కాంట్రాక్టు వైద్యుడు కళ్యాణ్‌కుమార్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు కుందుర్పి, ముద్దినాయనపల్లి, కంబదూరు మండలాలు ఇన్‌ఛార్జి ఇవ్వడంతో వారానికి రెండు రోజులు మాత్రమే ఈ వైద్యశాలకు వచ్చి వెళ్తుంటారు. ఉన్న ప్రభుత్వ వైద్యురాలు, స్టాఫ్ నర్స్ ఇద్దరు సెలవుపై వెళ్లడంతో ఆసుపత్రికి వచ్చిపోయే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యురాలు సెలవు పెట్టడంతో ఆసుపత్రిలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మిగిలిన సిబ్బంది ఎవరి విధులు వారివి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వ్యయప్రయాసలతో మారుమూల పల్లె నుంచి మండల కేంద్రంలోని ఆసుపత్రికి వస్తే సరైన వైద్యం అందలేదని ప్రజలు వాపోతున్నారు. రోగుల ఇక్కట్లు జన్మభూమిలోనూ అదే తీరు. కొంతమంది సిబ్బంది మాత్రం ఎప్పుడు వస్తారో. . ఎప్పుడు వెళ్తారో ఎవరికి అంతు చిక్కని విషయం. వందల సంఖ్యలో రోగులు రోజూ ఆసుపత్రికి రావడం ఉన్న సిబ్బందితో పరీక్షలు చేయించుకోవడం వెళ్లడం తప్ప రోగాలు నయం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న ప్రభుత్వ వైద్యాధికారి కుర్చీ

● ఈ విషయంపై వైద్యురాలు రంగవేణి వివరణ అడగ్గా.. తాను డిసెంబర్ 20 నుంచి జనవరి 8 వరకు సెలవుల్లో ఉన్నానని, స్టాఫ్‌నర్స్ జనవరి 11 వరకు సెలవుల్లో ఉన్నారని చెప్పారు. ఇతర సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉన్నం

మొక్కలతోనే పర్యావరణానికి పరిరక్షణ

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి పిలుపునిచ్చారు. శనివారం శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో 5 వేల మొక్కలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ప్రజలందరికీ టేకు, జామ, కానుగ మొక్కలను ఉచితంగా పంపిణీ చేయడం హర్షించదగిన విషయమన్నారు. మొక్కలు పంపిణీ చేసిన ఫౌండేషన్‌కి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ పాపంపల్లి రామాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఫౌండేషన్ మేనేజర్ రాజేష్‌బాబు, లీలాకృష్ణా, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేతికందే ఎత్తులో.. విద్యుత్తు ముప్పు

ముద్దినాయనపల్లి (కళ్యాణదుర్గం గ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ముద్దినాయనపల్లి గ్రామం సమీపంలోని రైతు అక్కులప్ప పొలంలో 11 కేవీ విద్యుత్తు తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. గతంలో తీగలు పైన ఉండేవి. గ్రామంలో ఉన్న తీగలు వాహనాలకు తగులుతాయని, సమీపంలో ఒక స్తంభం వేసి తీగలు ఎత్తు పెంచారు. అదే స్తంభానికి ఉన్న ప్రధాన తీగలు కిందకు వచ్చిన తరువాత తిరిగి పనులు చేస్తామని చెప్పి వెళ్లిపోయారని రైతు తెలియజేశారు. తీగలు కిందకు రావడంతో గడ్డి దొడ్డిలో కనీసం వరిగడ్డి, వేరుసెనగ పొట్టును కూడా వేసుకోలేకపోతున్నామని వాపోయారు. ఇది వరకు తీగలు తగిలి గడ్డివామికి వేసిన ముళ్ల కంచె మొత్తం కాలిపోయిందని, తిరిగి ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నామన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్తు తీగలు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యుత్తు తీగలను చూపుతున్న రైతు

విద్యార్థినికి ఆర్థిక చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే

నాగిరెడ్డిపల్లి (బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎర్రకొండాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని శ్రీలత 20 రోజుల కిందట జరిగిన వాహన ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలపాలైంది. శ్రీలత మండలంలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 7వతరగతి చదువుతోంది. విద్యార్థిని తండ్రి కూడా దివ్యాంగుడు కావడంతో శ్రీలత వైద్యచికిత్స ఖర్చులకు తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను ఉపాధ్యాయులు స్పందించి నాగిరెడ్డిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, తోటి ఉపాధ్యాయులు చేయూతనిందించాలని సంకల్పించారు. దీంతో నియోజకవర్గంలోని పలు మండలాల ఉపాధ్యాయులతో ఆర్థిక మొత్తాన్ని సమీకరించారు. వైద్యఖర్చులకు రూ. లక్ష అందించారు. ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి స్పందిస్తూ రూ.15వేలు, జడ్పీటీసీ సభ్యురాలు గంగమ్మ రూ.5వేలు అందించారు. నగదు మొత్తాన్ని ఎమ్మెల్యే ఉన్నం, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనాచారి చేతుల మీదుగా అందించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వాల్మీకులు

వాల్మీకుల సభను జయప్రదం చేయండి

శెట్టూరు, న్యూస్‌టుడే: వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని ఈనెల 10న పట్టణంలోని నిర్వహించే సభకు వాల్మీకులు తరలిరావాలని మండల వీఆర్‌పీఎస్ అధ్యక్షుడు జయరామ్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో వాల్మీకులు సభకు తరలిరావాలని కోరారు. రాష్ట్ర వీఆర్‌పీఎస్ నాయకులు చంద్రబోస్ సభకు వస్తారన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఇతర సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు.

కంటి సంరక్షణతోనే సుఖమయ జీవితం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: శరీరంలో అత్యంత సున్నితమైన కళ్లను సంరక్షించుకుంటేనే జీవితం ఉజ్వలంగా ఉంటుందని ప్రభుత్వ కంటి వైద్యుడు రమణ అన్నారు. శనివారం మారెంపల్లిలోని గురుకుల పాఠశాలలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురుకులంలోని విద్యార్థులకు వైద్యుడు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు తగు జాగ్రత్తలు తెలియజేశారు. ముగ్గురు విద్యార్థులకు కళ్లద్దాలు అవసరం ఉండటంతో వాటిని తీసుకువచ్చి ఇస్తామన్నారు. కార్యక్రమంలో వార్డెన్ నాగరాజు, ప్రిన్సిపల్ పవన్, పీఈటీ పవన్, ఉపాధ్యాయులు నరసింహులు, సరోజమ్మ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆర్డీటీ ఆధ్వర్యంలో రక్తనిధి శిబిరం



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: మండల వనరుల కేంద్రంలో శనివారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో రక్తనిధి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదానం చేసేందుకు మండలంలోని పలు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, ప్రజలు తరలివచ్చారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తులకు ప్రాణదానం చేసినవాళ్లు అవుతారని ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి పేర్కొన్నారు. రక్తనిధి శిబిరంలో 53మంది రక్తదానం చేసినట్లు ఏటీఎల్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పవన్‌కిషోర్, ఎంఈవో ఓబులపతి, సాలమ్మ, సీవోలు ఆనంద్, నారాయణస్వామి, సీడీసీ సభ్యులు, సీబీటీలు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు నిన్నటివి (కిలో.రూ.ల్లో)

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: వెల్లుల్లి- 50, కందిపప్పు- 65, ఒట్టిమిరప- 90, వేరుసెనగపప్పు- 80, సెనగబేడలు- 70, గోధుమపిండి- 25, ఉప్మారవ్వ- 35, కొబ్బరి- 160, చక్కెర -40, బెల్లం -45, బియ్యం సోనామసూరి - 40(పాతవి), సోనామసూరి- 35(కొత్తవి), రాగులు- 24, జొన్నలు - 25, సజ్జలు - 20, పామాయిల్- 70, సూర్యకాంతి నూనె- 85, పప్పులు-90.

కూరగాయల ధరలు

టమోటా- 10, పచ్చిమిర్చి- 30, వంకాయలు- 30, లావుమిర్చి- 40, ఉల్లి- 40, బెండ- 30, బీర- 40, బీన్స్- 50, కాలీఫ్లవర్ -30, క్యారెట్- 60, బీట్‌రూట్- 40, ముల్లంగి- 40, క్యాబేజీ- 40, కాకర- 40.

సినిమాలు

వెంకటేశ్వర- 2కంట్రీస్, నూర్‌ముబారక్- ఎంసీఏ
సౌభాగ్య- హలో

గ్యాస్ సమాచారం

ఏజెన్సీపేరు	కంపెనీ	పంపిణీ
సాయిరాం	ఇండేన్	5వ తేదీ వరకు- నేడు

కళ్యాణదుర్గం

ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి అమీర్‌బాషా కాలమానిని, డైరీని ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ రామాంజనేయులు, ఆ సంఘం అధ్యక్షుడు అబ్దుల్లా, నాయకులు రవికుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 5కె రన్

రాయదుర్గం: జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఆదివారం ఉదయం 6.30 గంటలకు 5కె రన్‌ను నిర్వహిస్తున్నట్లుగా మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని అక్కడి నుంచి వినాయక సర్కిల్, బళ్లారిరోడ్డులోని ఉక్కడ ఆంజనేయస్వామి, నేతాజి రోడ్డుమీదుగా రైల్వేస్టేషన్ రోడ్డు, కణేకల్లు రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయాన్ని ర్యాలీ చేరుకుంటుందని వివరించారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: మున్సిపాల్టీ పరిధిలో ఉన్న 23 వార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాము. రానున్న రోజుల్లో పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామలక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని 15, 16వ వార్డుల్లో జన్మభూమి - మాఊరు కార్యక్రమం జరిగింది. వార్డులో పలువురికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదని, అర్హులకు అన్యాయం చేస్తున్నారని వైకాపా కార్యకర్త బిక్కి హరి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తమ వార్డు అభివృద్ధికి అధికారులు పక్షపాతం చూపుతున్నారని కౌన్సిలర్, కాంగ్రెస్ పీసీసీ సభ్యులు బాలా నరేంద్రబాబు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రమేష్, కౌన్సిలర్లు విశ్వనాథ్, తిమ్మరాజు, నాగరాజు, కో ఆప్షన్ సభ్యులు అన్వర్, తెదేపా పట్టణాధ్యక్షులు మురళీ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకోడిపల్లి, తిమ్మసముద్రం (కళ్యాణదుర్గం గ్రామీణం): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని తెలుగుయువత నాయకుడు మారుతీచౌదరి అన్నారు. శనివారం మండల పరిధిలోని తూర్పుకోడిపల్లిలో, తిమ్మసముద్రంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు చేసిన జానపద నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, ఎమ్పీడీవో షెహన్‌షా, సర్పంచి చిక్కన్న, తిమ్మసముద్రం గ్రామంలో సర్పంచి నరసింహారెడ్డి, జడ్పీటీసీ కొల్లాపురప్ప, మండల విద్యాధికారి విజయకుమారి, ఏపీవో శ్రీనివాసరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అపిలేపల్లి (కుందుర్పి): మండలంలోని అపిలేపల్లిలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి హాజరయ్యారు. తమకు పెట్టుబడి రాయితీ అందలేదని కొంతమంది రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వ్యవసాయశాఖ అధికారితో ఎమ్మెల్యే చర్చించారు. త్వరలో అందిజేయాలని వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచి రాధ, నోడల్ అధికారి బెనర్జీ, ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ రమేషన్, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ ఆరాధ్య, మండల విద్యాధికారి చెన్నరాయుడు, ఎంపీపీ దీనమ్మ, జడ్పీటీసీ మల్లికార్జున, మండల ఉపాధ్యక్షుడు రవి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రాంపురం (కంబదూరు): మండలంలోని రాంపురంలో స్థానిక సర్పంచు తిరుపాల్ అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు.



అపిలేపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పంచాయతీకి సంబంధించి అంగన్‌వాడీ, కమ్యూనిటీ భవనాలు, తాగు, అన్యాక్రాంతానికి గురవుతున్న చెరువు తదితర అంశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు తెలియజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ విజయ్ శేఖర్, తహసీల్దారు అహమ్మద్, ఎంపీడీవో శివారెడ్డి, ఎస్సై నరసింహుడు, ఎంపీపీ గోవింద చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చింతర్లపల్లి, అయ్యగార్లపల్లి, (శెట్టూరు): మండలంలోని చింతర్లపల్లి, అయ్యగార్లపల్లి గ్రామాల్లో శనివారం సర్పంచులు గౌరమ్మ, భాగ్యమ్మల అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. అయ్యగార్లపల్లిలో ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి మాట్లాడుతూ అర్హులు అందించే దరఖాస్తులు తీసుకుని వారికి న్యాయం చేయడానికే జన్మభూమి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఆర్డీటీ సహకారంతో కొద్దిరోజుల్లో శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చింతర్లపల్లిలో పంటనష్టపరిహారం, రుణమాఫీ, పింఛన్లు, ఉపాధి బిల్లులు తదితర సమస్యలను పరిష్కరించాలంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నోటికి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కవిత, ఎంపీపీ తిమ్మక్క, ఎంపీటీసీ జయమ్మ, ప్రత్యేక అధికారి తిరుపతయ్య, తహసీల్దారు సుబ్రహ్మణ్యం, ఎంఈవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



చింతర్లపల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

బ్రహ్మసముద్రం: మండలంలోని పాలవెంకటాపురం, సంతేకొండాపురం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి హాజరై మాట్లాడారు. డీఈవో జనార్దనాచారి, మండల ప్రత్యేకాధిరి పక్కీరప్ప, ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ సభ్యురాలు గంగమ్మ, సర్పంచులు వనజ, సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. పాలవెంకటాపురంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే ఉన్నం మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీరాములు, ఎమ్పీటీసీ సభ్యులు నారాయణ, కరేగౌడు, తహసీల్దార్ వెంకటశేషు, జన్మభూమి కమిటీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



తిమ్మసముద్రంలో చిన్నారుల నృత్యాలు



రాంపురం: మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు

లక్ష్మంపల్లిలో నాకాబందీ



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై, సిబ్బంది

లక్ష్మంపల్లి(శెట్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మంపల్లిలో శనివారం తెల్లవారుజామున శెట్టూరు ఎస్సై శ్రీకాంత్‌యాదవ్‌తోపాటు, కుందుర్పి, కంబదూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం ఎస్సైలు, సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో ఉన్నవారికి, గతంలో గొలుసుదుకాణాలు నిర్వహించిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 15న గ్రామంలో కొల్లాపురమ్మ జాతర నిర్వహించనున్న నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు పర్యటించారు. అనుమానితులు, కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్థులను కోరారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొనన్నారు.

గిరిజనుల్లో చైతన్యం రావాలి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: గిరిజనులు బాగా చదువుకుని చైతన్యవంతులు కావాలని జిల్లా పరిషత్తు వైస్ ఛైర్మన్ సుభాషినమ్మ, తెదేపా నాయకుడు ఉమామహేశ్వరనాయుడు అన్నారు. శనివారం గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఆ సంఘం కాలమానిని ఆవిష్కరించారు. పట్టణంలోని ఉమామహేశ్వరనాయుడు నివాసంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గిరిజనలు విద్య, వైద్య, రక్షణ రంగాల్లో ఉన్నత హోదాల్లో ఉండాలన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మురళి, ప్రసాద్, విద్యార్థి నాయకులు అశ్వర్థనాయక్, దశరథ్‌నాయక్, చంటినాయక్, రాజేంద్ర, ఎర్రిస్వామినాయక్, నాగేష్‌నాయక్, ధనుంజయ, కృష్ణనాయక్‌లు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న సభ్యులు

పచ్చదనంతోనే మానవ మనుగడ

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని సంరక్షించి మానవ మనుగడ కాపాడాలని మంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలో 15వ వార్డులో గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన శివశక్తిలీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు వివిధ రకాల మొక్కలను ఆయన పంపిణీ చేశారు. మొక్కలు సరఫరా చేసినందుకు సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు. ఆ సంస్థ మేనేజర్ రాజేష్ బాబు, కిరణ్ కుమార్, లీలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్ మృతికి మంత్రి సంతాపం

పట్టణంలోని టిప్పుసుల్తాన్ మసీదులో ఇమామ్‌గా పనిచేస్తున్న మహమ్మద్ షరీఫ్ మృతికి మంత్రి కాలవ శ్రీనివాసులు సంతాపాన్ని తెలిపారు. శనివారం ఉదయం మహమ్మద్ షరీఫ్ ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. ఆయన వెంట మైనార్టీ నాయకులుహమీద్, షబ్బీర్, తదితరులు ఉన్నారు.

9న తహసీల్దారు కార్యాలయ ముట్టడి



నినాదాలు చేస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ఉద్యోగులకు ప్రస్తుతం అమలు చేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని పింఛను సాధన సమితి అధ్యక్షుడు మాధవ, కన్వీనర్ వెంకటేసులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారులందరూ కలిసి పింఛను సాధన సమితిగా కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కోశాధికారిగా జి.పి.నారాయణ, ఉపాధ్యక్షుడుగా చెన్నారెడ్డి, ఈశ్వరయ్య, నరసింహులు, నారాయణ, మల్లికార్జునగౌడ్, నబీరసూల్ తదితరులతో కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ ఈనెల 9వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని వెల్లడించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఉద్యోగులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అలీఖాన్, యోగి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు తోడ్పడండి

రాయదుర్గం: విద్యార్థుల ఉజ్వల భవితకు తల్లిదండ్రులు సహకరించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ప్రకాశ్‌నాయుడు కోరారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఏకాగ్రత, ప్రశాంత వాతావరణంలో చదువుకోవటానికి అన్నిరకాల ఏర్పాట్లు చేయాలి. కొందరు విద్యార్థులు సక్రమంగా చదువుకోక ఉపాధ్యాయులపై అసత్య ఆరోపణలు చేస్తూ వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి పిల్లల విద్యాప్రగతి గురించి తెలుసుకోవాలని సూచించారు.

మడకశిర

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

రొళ్ల, న్యూస్‌టుడే: మండలకేంద్రం రొళ్లలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంజీవప్ప తెలిపారు. ఉప కేంద్రంలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఇరిగేపల్లి(అగళి), న్యూస్‌టుడే: మండలంలోని ఇరిగేపల్లి గొల్లహట్టికి చెందిన ఇద్దరు మహిళలు చెరువులో పడి మృతి చెందిన విషయం విదితమే. స్థానిక నాయకులు మల్లేష్, నింగన్న, జన్మభూమి కమిటీ సభ్యుడు చిక్కన్న చేతుల మీదుగా శనివారం మహిళల భర్తలకు రూ.5 వేల వంతున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ మంజునాథ్, బీమా మిత్ర శాంత లక్ష్మీ, నాయకులు బాలకృష్ణప్ప, కరియన్న, నాగరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్రాంతి కానుకలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తిప్పేస్వామి

మడకశిర, న్యూస్‌టుడే: గ్రామాలు, వార్డుల్లోని సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రభుత్వం జన్మభూమి-మాఊరు నిర్వహిస్తోందని ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. శనివారం పట్టణంలోని 10, 11 వార్డుల్లో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ సంక్రాంతి కానుకలను అందించాలని ఎక్కడైనా ఇబ్బందులు వస్తే ఆయా వార్డు కౌన్సిలర్లపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. వార్డుల్లో శ్రీరామరెడ్డి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకొన్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు సుబ్బరాయుడు, కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షులు మనోహర్, కార్యదర్శి పుల్లయ్య, నాయకులు నారాయణప్ప, మెప్మా సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు


మెళవాయి గోవిందరెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మెళవాయి(మడకశిర గ్రామీణం): ప్రభుత్వం మహిళలను పొదుపు సంఘాల్లో సభ్యులుగా చేర్చి ఆర్థికంగా చేయూత అందిస్తోందని ఎంపీపీ బొజ్జప్ప తెలిపారు. మెళవాయి, కదిరేపల్లి గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు అందిస్తామన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు భూతన్న తదితరులు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచులు పుట్టమ్మ, సావిత్రమ్మ, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, తెదేపా యువత అధ్యక్షులు నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రత్యేక అధికారి పెంచులయ్య, తహసీల్దార్ ప్రసాద్, ఏఓ ముస్తాక్ అహ్మద్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంటు శ్రీధర్, నాయకులు నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి సన్మానం... మెళవాయిలో నిర్వహించిన జన్మభూమిలో భాగంగా సీనియర్ న్యాయవాది, స్వాతంత్య్ర సమరయోధుడు మెళవాయి గోవిందరెడ్డిని అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.

ఆర్‌జీ.పల్లి(అగళి): రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని నాయకులు రామకృష్ణయాదవ్, బసవరాజు పేర్కొన్నారు. మండలంలోని ఆర్‌జీ.పల్లిలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రజలకు వినిపించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సక్రప్ప, ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో సోనిబాయి, ఎంఈవో గోపాల్, తహసీల్దార్ శివశంకర్, హౌసింగ్ ఏఈ రమేష్, ఏఈవో అంబ్రీష్‌రెడ్డి, పశువైద్యశాఖాధికారి జగదీష్‌బాబు, ఏపీవో ఓబుళప్ప, నాయకులు తిప్పేస్వామి, చిక్కప్పయ్య, చంద్రప్ప, బాలకృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుల వివరాలు చదువుతున్న ప్రజాప్రతినిధులు


జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కాకీ(రొళ్ల): జన్మనిచ్చిన గ్రామానికి సేవలందించి రుణం తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జడ్పీటీసీ సభ్యుడు పాండురంగప్ప, ఎంపీపీ నాగరాజు పేర్కొన్నారు. కాకీ పంచాయతీ కేంద్రంలో సర్పంచి నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. ఉన్నత పాఠశాలకు ప్రహరీతో పాటు గ్రామానికి శ్మశానవాటికను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కె.బ్యాడిగెరలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉండటంతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భర్తీ చేయాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో హెచ్‌డీసీ ఛైర్మన్ గురుమూర్తి, నాయకులు మంజునాథ్, దాసిరెడ్డి, మూర్తి, ఎంపీడీఓ సరస్వతి, ప్రత్యేక అధికారి మల్లికార్జున, ఏఓ అహ్మద్ అలీ, ఉప తహసీల్దార్ రాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.


కార్డు అందిస్తున్న తహసీల్దార్ ఓబన్న

అమరాపురం: మండలంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని తహసీల్దార్ ఓబన్న, ఎంపీడీఓ రామారావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని వలస, వి.అగ్రహారం గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. బియ్యం కార్డులు మంజూరైన లబ్ధిదారులకు కార్డులు, ఎన్టీఆర్ గృహ నిర్మాణం చేపట్టే వారికి ఇళ్లపట్టాలు అందజేశారు. వలస పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు నరసింహమూర్తి, శివరుద్రప్ప, సర్పంచి రాధమ్మ, ఎంపీటీసీ గిరిజమ్మతో పాటు చంద్రశేఖర్‌గౌడ్, నిరంజన్, విరుపసముద్రం శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు. వి.అగ్రహారంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున, సర్పంచి కృష్టప్ప, ఎంపీటీసీ రాధాకృష్ణ, ధనుంజయ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతాలు

కరికెర(గుడిబండ): తెదేపా ప్రభుత్వంతోనే గ్రామాల్లో ప్రగతి సాధ్యమని ఎంపీపీ సన్నీరప్ప, మండల తెదేపా కన్వీనర్ మద్దనకుంటప్ప పేర్కొన్నారు. మండలంలోని కరికెరలో మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. జడ్పీటీసీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో సిమెంటు రహదారులు, కాలువలు, విద్యుత్తు సౌకర్యంలాంటి మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులకు పక్కాగృహాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు, రాయితీ రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఇందిరాదేవి, తహసీల్దార్ మోహన్‌దాస్, ఎంపీడీఓ శివయ్య, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఏఈలు రామకృష్ణ, బాలకృష్ణ, శ్యామ్‌సన్, శ్రీనివాసమూర్తి, సర్పంచి గౌరమ్మ, నాయకులు తిప్పేస్వామి, రవిశంకర్, నాగరాజు, శ్రీరామప్ప, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

చోరీకేసు ఛేదించిన పోలీసులు

తిరుమణి(పావగడ), న్యూస్‌టుడే: తాలూకా పరిధిలోని తిరుమణి సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్న సోలార్‌పార్కులో జరిగిన రాగి తీగలు, బ్యాటరీలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ కొత్తగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం శనివారం చోరీకి సంబంధించి నలుగురు నిందితులను అరెస్టుచేశారు. వారి నుంచి తీగలు, బ్యాటరీలు, ఏడు ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఓ.బి.కల్లేషప్ప తెలిపారు. మరో 11మంది నిందితులు ఉన్నారని వారికోసం గాలిస్తున్నామని చెప్పారు. సీఐ శ్రీశైలమూర్తి, తిరుమణి ఎస్ఐ రామకృష్ణ, వై.ఎన్.హోసకోట ఎస్ఐ కోదండరామయ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

బాలబీమా చెక్కు పంపిణీ

ఎం.రాయాపురం(రొళ్ల), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎం.ఆర్.గొల్లహట్టికి చెందిన గిరిజమ్మ కుమారుడు శివన్న మూడునెలల కిందట చెరువులో పడి మృతి చెందాడు. గిరిజమ్మకు శనివారం ఎంఈఓ శ్రీధర్, బాల బీమా కో-ఆర్డినేటర్ దయాశేఖర్‌రెడ్డి రూ.25 వేల చెక్కు అందించారు. అనంతరం కస్తూర్బా, చెర్లోపల్లి, జీరిగేపల్లి పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో నిర్మాణదశలో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. వారివెంట ప్రధానోపాధ్యాయులు మారుతేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిరేతుర్పి(గుడిబండ): బాలల బీమా విద్యార్థులకు అండగా నిలుస్తుందని ఎస్ఎస్ఏ బాలల బీమా జిల్లా కో-ఆర్డినేటర్ జయశేఖర్, ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని హిరేతుర్పి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి కిరణ్‌కు ప్రమాదంలో కళ్లు దెబ్బతినగా రూ.25వేలు మంజూరైందన్నారు. బాలుడి తల్లి లోకమ్మకు శనివారం చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అస్రఫ్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హిరేతుర్పిలో చెక్కు అందజేత

మడకశిర

కౌశల్యాభివృద్ధి తర్ఫీదుకు ప్రాధాన్యం

తుమకూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగులు, విద్యార్థులు కౌశల్యాభివృద్ధి తర్ఫీదు పొందడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు జిల్లాబాధ్యమంత్రి టి.బి.జయచంద్ర పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాష్ట్ర కౌశల్యాభివృద్ధి మండలి, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించిన ఉద్యోగమేళాలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటులో జాప్యంపై గ్రామస్థుల నిరసన

హొన్నంపల్లి(పరిగి): మండల పరిధిలోని హొన్నంపల్లి నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రహదారిని తారురోడ్డుగా మార్చడంలో కొనసాగుతున్న జాప్యాన్ని ప్రజలు శనివారం నిరసించారు. రహదారిపై ముళ్లకంపలు వేసి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. పదేళ్లుగా రహదారి ఏర్పాటులో అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని, వాహనచోదకులు నరకయాతన పడుతున్నారన్నారు.

డిపో ఉన్నా బస్సులు లేవు

ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



ఆటోలో ప్రమాదకరంగా...

మడకశిర, న్యూస్‌టుడే: బస్సులు సక్రమంగా తిరగకపోవటంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మడకశిర డిపో నుంచి మొత్తం 33 బస్సులు నడుస్తున్నాయని ఆర్టీసీ డిపో మేనేజర్ కె. మాధవ తెలిపారు. ఇక్కడ డిపో ఏర్పాటుచేస్తే గ్రామీణులకు అనుకూలమవుతుందని ఆశించినా ఉన్నతాధికారులు కావాల్సిన సర్వీసులు ఇవ్వకపోవడం, ఇచ్చిన బస్సులు పూర్తిస్థాయిలో తిరగకపోవటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పటంలేదు. 2009 డిసెంబరు నుంచి పూర్తిస్థాయిలో మడకశిర ఆర్టీసీ డిపో నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాలకు మంచిరోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు తిరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. కాలం చెల్లినవి, ఇతర డిపోల్లో నిలిపివేసిన బస్సులు తెచ్చి నడుపుతున్నారని, ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయని అంటున్నారు. మండలంలో చందకచర్ల, గౌడనహళ్లి, మణూరు, సి. కొడిగేపల్లి, జిల్లెడికుంట, వై.బి.హళ్లి తదితర ప్రాంతాలకు బస్సులు నడపాలని కోరుతున్నారు.



ఇలాంటి బస్సులో వెళ్లేదెలా?

రోడ్డు సౌకర్యం ఉన్నా...



గ్రామాలకు ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుచేసి రోడ్డు వేయించింది. బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. మడకశిరలో ఆర్టీసీ డిపో ఉన్నా మా గ్రామానికి బస్సులు నడపటం లేదు. ఇప్పటికైనా అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలి. **- టి.నాగభూషణం, జవనడుకు**


ప్రైవేటు వాహనాలు...



గ్రామాలకు ఎక్కువగా బస్సులు వస్తే ఆటోలు ఎక్కాల్సిన అవసరం ఉండదు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తోంది. అధికారులు బస్సులు నడిపేలా చూడాలి.

- చిన్నయ్య, ఈచలడ్డి

ఆలయంలో చోరీ



దొంగలు పడేసి వెళ్లిన హుండీ

పావగడ, న్యూస్‌టుడే: తాలూకా పరిధిలోని పళవళ్లి చెరువుకట్ట కింద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఏఎస్ఐ రామాంజనేయులు వివరాల మేరకు... ఆలయ ప్రధానద్వారం నుంచి లోనికి ప్రవేశించిన దొంగలు హుండీని బయటకు తెచ్చి తెరిచేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆలయంలో ఉన్న కొంత నగదు తీసుకెళ్లారని ఏఎస్ఐ తెలిపారు. బ్యాటరీని పడేసి వెళ్లిపోయారు. ఇదే ఆలయంలో గతంలోనూ చోరీ జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు ఎం.ఎస్.ఆంజనేయులు, నారాయణప్ప, ఓబన్న తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకుని దొంగల్ని అరెస్టు చేయాలని కోరారు. ఆయలం వద్ద వదలివెళ్లిన గడపార, సమ్మెట తదితర వాటిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

శుభ్రతతో రోగాలు దూరం

పెనుకొండరోడ్డు(మడకశిర గ్రామీణం), న్యూస్‌టుడే: ఇళ్లు, కళాశాల, పాఠశాలలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ప్రిన్సిపల్ డాక్టర్ కె.అరుణోదయం తెలిపారు. మండల పరిధిలోని పెనుకొండ రోడ్డులోని పాతలింగారెడ్డి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జాతీయసేవా పథకంలో భాగంగా శ్రమదానం చేశారు. అలర్జీకి కారణమైన మొక్కలను తొలగించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కళాశాల ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలనే బాధ్యత ప్రతి విద్యార్థి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల శ్రమదానం



అన్నదాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాత రమణి, ఎమ్మెల్సీ తదితరులు

షిర్డిసాయిబాబా అన్నదాన కేంద్రం ప్రారంభం

మడకశిర, న్యూస్‌టుడే: పట్టణంలోని షిర్డిసాయిబాబా ఆయల ప్రాంగణలో నూతనంగా నిర్మించిన నిత్యాన్నదాన కేంద్రం, భక్తులకు అవసరమైన వసతిగృహ సముదాయాన్ని శనివారం ప్రారంభించారు. చెన్నైకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కె.వి.రమణి, ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. అనంతరం అన్నదాన కేంద్రంలో భక్తులకు భోజనం వడ్డించారు. ఆలయం సుందరంగా ఉందని సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని వారికి అవసరమైన వసతులు ఉన్నాయని రమణి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, విశ్రాంత డీఎస్పీ చంద్ర ఓబుళరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.టి.ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు గంగులవాయిపాళ్యం ప్రభాకర్ రెడ్డి, మంజునాథ్, కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి

తుమకూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే స్వచ్ఛమైన పాలన సాధ్యమని కేపీసీసీ అధ్యక్షుడు డా.జి. పరమేశ్వర్ పేర్కొన్నారు. శనివారం తుమకూరు తాలూకా గ్రామీణ నియోజకవర్గంలోని గూళూరులో నిర్వహించిన కాంగ్రెస్ 'నడిగె విజయదకడెగె' అనే కార్యకర్తల సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. భాజపా హయాంలో అభివృద్ధి కనుమరుగైనట్లు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసి అన్నివర్గాల అభివృద్ధికి శ్రమించినట్లు తెలిపారు. ఆయకట్టు అభివృద్ధికి రూ. 62 వేల కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. తుమకూరు, కోలారు, చిక్కబళ్లాపుర తదితర జిల్లాలకు శాశ్వతంగా తాగునీరు అందిచడానికి ఎత్తినహొళె పథకం అమలు చేయడం జరిగిందని చెప్పారు. సహకార బ్యాంకుల్లోని రైతుల రుణాలు రూ.8600 కోట్లు మాఫీ చేసినట్లు గుర్తు చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం, వారి పిల్లలకు ఉచిత విద్య, భార్యలకు నెలకు రూ. 2 వేలు ఇచ్చిన ఘనత సిద్ధరామయ్య ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. అభివృద్ధిని ప్రజలకు తెలిపి కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి పాటుపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో గెలుపొందేందుకు పార్టీ నేతలు నడుంబిగించాలని సూచించారు. కోలార్ ఎం.పి, సీడబ్ల్యూసీ సభ్యుడు కె.హెచ్.మునియప్ప మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజలకు పథకాలు రూపొందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

స్వచ్ఛతను కాపాడండి

అమరాపురం, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని వలస ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు. శనివారం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. మరుగుదొడ్లు నిర్మించుకుంటే రోగాలు దరి చేరవని ప్రభుత్వం అందించే రూ.15వేలు ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మరుగుదొడ్ల నిర్మాణంపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వెంటాడుతున్న విద్యుత్తు సమస్య

☛ ఎండుతున్న పంటలు ☛ నియంత్రికల సామర్థ్యం పెంపునకు వినతి



నీరులేక ఎండుతున్న పూలతోట

మధూడి(అగళి), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియంత్రికల సామర్థ్యం తక్కువగా ఉండటంతో అల్ప విద్యుత్తులో మోటార్లు సక్రమంగా పనిచేయటం లేదు. ఈ ఏడాది వర్షాలకు భూగర్భజలం పెరిగి చాలాబోర్లు అందుబాటులో వచ్చాయి. ఈ నేపథ్యంలో విద్యుత్తు వినియోగ సామర్థ్యం పెరిగింది. మోటార్లకు తగిన సరఫరా లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మడకశిర నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.వంద కోట్లు మంజూరు చేసి హెచ్‌వీడీఎస్ పథకం ద్వారా ప్రతి రెండు సర్వీసుకు ఒక నియంత్రిక ఏర్పాటు చేయడానికి సామగ్రి సిద్ధం చేసింది. సంబంధిత గుత్తేదారు మాత్రం మండలానికి వచ్చిన సామగ్రిని పక్క మండలంలో నిల్వ చేసుకుని అక్కడే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ కూడా నియంత్రికలు వెంటనే అందిస్తారన్న ఆశతో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. పగటిపూట 7 గంటల వ్యవసాయ విద్యుత్తు సరఫరా చేస్తున్నా అల్ప విద్యుత్తు సమస్యతో ఇబ్బంది తప్పడంలేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని మధూడి, అగళి, పీ.బ్యాడిగెర గ్రామాల్లో విద్యుత్తు ఉప కేంద్రాలున్నారు. ఇక్కడ నియంత్రికల సామర్థ్యం తక్కువగా ఉంది.

రెండు నెలలుగా ఇబ్బంది

- గోవిందరాజు, రైతు, ఎం.గొలహట్టి

రెండు నెలలుగా సమస్య అధికమైంది. పూలతోటకు నీరు లేదు. బోర్లు మధ్యమధ్యలో నిలిచిపోతున్నాయి. నీళ్లు కూడా పూర్తిస్థాయిలో రావటంలేదు. నియంత్రికలో ఫ్యూజ్ తెగిపోతోంది. మోటార్లు కాలిపోయే ప్రమాదం ఉంది.

అధికారులు అందుబాటులో లేరు

- చిక్కన్న, రైతు, ఇరిగేపల్లి

విద్యుత్తు నియంత్రికలో సమస్యలు వస్తే పరిష్కారానికి సంబంధిత అధికారులు అందుబాటులో లేరు. రైతులే మరమ్మతులు చేసుకోవాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నాం. నియంత్రికలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

జన్మభూమి తర్వాత...

-సంజీవప్ప, విద్యుత్తు ఏఈ, అగళి

మండలంలోని ప్రతి ఫీడర్‌కు విద్యుత్తు నియంత్రికలను ప్రభుత్వం మంజూరు చేసింది. జన్మభూమి పూర్తయిన వెంటనే సర్వే చేసి సామగ్రిని వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తాం. ప్రధానంగా బీఎం.పల్లి, పీ.బ్యాడిగెర, ఎం.రాయాపురం, మధూడి ఫీడర్లలో ఎక్కువగా అల్ప విద్యుత్తు సమస్యలు వస్తున్నాయి.

పెనుకొండ

నిధుల మంజూరుకు హామీ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని జూలుకుంట గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీకే పార్థసారథి గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఆంజనేయస్వామి దేవాలయానికి రహదారి, కల్వర్టు నిర్మాణానికి రూ.10 లక్షలు, బీసీ, ఎస్సీ కాలనీల్లో సిమెంటు రహదారుల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 25 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం నుంచి నాగలూరు గ్రామానికి వెళ్లే తారు రహదారి వరకు రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రహదారి ఏర్పాటులో జాప్యంపై గ్రామస్థుల నిరసన

హొన్నంపల్లి(పరిగి): హొన్నంపల్లి నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రహదారిని తారురోడ్డుగా మార్చడంలో కొనసాగుతున్న జాప్యాన్ని ప్రజలు శనివారం నిరసించారు. రహదారిపై ముళ్లకంపలు వేసి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. పదేళ్లుగా రహదారి ఏర్పాటులో అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని, వాహనచోదకులు నరకయాతన పడుతున్నారన్నారు. జన్మభూమి గ్రామసభ నిర్వహించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్నారు.

దాతల సహకారంతోనే
ర్యాంకులు సాధించాం


కృష్ణమూర్తి


బాబు

రొద్దం, న్యూస్‌టుడే: దాతలు అందించిన సహకారంతోనే పంచాయతీ కార్యదర్శి ఎంపిక పోటీల్లో ర్యాంకులు సాధించినట్లు జిల్లా 5వ ర్యాంకరు కృష్ణమూర్తి, 32వ ర్యాంకరు బాబు పేర్కొన్నారు. మండలంలోని కంబాలపల్లికి చెందిన కృష్ణమూర్తి పట్టుదల, కృషితో బీఎస్సీ బీఈడీ పూర్తి చేశారు. గతంలో వీఆర్‌ఏ ఉద్యోగం సాధించారు. రొద్దం తహసీల్దారు కార్యాలయంలో పని చేసే వీఆరో అనిల్ అందించిన సహాయ, సహకారంతో ఏపీపీఎస్సీ పరీక్షల్లో జిల్లాలో ఐదో ర్యాంకు సాధించినట్లు చెప్పారు. భార్య సాహిత్య కూడా జిల్లా స్థాయి 9వ ర్యాంకు సాధించిందని ఆయన పేర్కొన్నారు. రొద్దంకు చెందిన బాబు బీకాం వరకు చదివి పోటీ పరీక్షలకు మిత్రుడు సతీష్ సాయం పొందారు. పంచాయతీ కార్యదర్శి పరీక్ష ఫలితాల్లో 32వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు.

10న సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం

గాంధీకూడలి (పెనుకొండ), న్యూస్‌టుడే: రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనను తెదేపా నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బీకే పార్థసారథి పేర్కొన్నారు. శనివారం పెనుకొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పలు మండలాల తెదేపా నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల పదో తేదీ పెనుకొండలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో మంత్రి లోకేష్ పాల్గొంటారని తెలిపారు. అదేరోజు గోనిపేట మరువవంకపై నిర్మించిన వంతెనను, గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద నుంచి పెనుకొండకు వచ్చే తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వీటికితోడు స్థానికంగా సిమెంటు రహదారుల నిర్మాణాలకు భూమిపూజ చేస్తారని తెలిపారు. నాయకులకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా చేపట్టాలని సూచించారు. మడకశిర ఎమ్మెల్యే ఈరన్న, తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు కేశవయ్య, మాధవనాయుడు, సవిత, వైఎన్ కుమార్, శ్రీనివాసులు, సర్పంచి అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: ఈనెల 10న పెనుకొండలో జరిగే జన్మభూమి - మాఊరు కార్యక్రమానికి మంత్రి లోకేష్ హాజరవుతారని ఎమ్మెల్యే బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఆర్.మరువపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం రాత్రి తెదేపా నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలను, అభిమానులు, ప్రజలు తరలించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చిన్నప్పయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు, రొద్దం సర్పంచి అశ్వర్థనారాయణ, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ వెంకటరామిరెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఛైర్మన్ ఎంఎస్ నాగరాజు, నాయకులు చంద్రశేఖర్ నాయుడు, వీరాంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

మారుతినగర్ (పెనుకొండ): పెనుకొండలోని మిట్టా ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని ఖాళీ ప్రదేశాన్ని శనివారం జడ్పీ సీఈవో శోభాస్వరూప, డీపీవో సుధాకర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. ఈనెల పదో తేదీన పంచాయతీ రాజ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ జన్మభూమి కార్యక్రమానికి వస్తున్నట్లు జడ్పీ సీఈవో తెలిపారు. అందులో భాగంగా మిట్టా ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో సభా వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. ఆమె వెంట డీఎల్‌పీవో శ్రీనివాసులు, పలువురు మండలస్థాయి అధికారులు ఉన్నారు.


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు


నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బీకే పార్థసారథి

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను హిందూపురం పార్లమెంటు సభ్యుడు నిమ్మల కిష్టప్ప శనివారం పంపిణీ చేశారు. అనారోగ్యం, ఇతర సమస్యలపై సీఎంకు విన్నవించుకోవడంతో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పాలసముద్రం పంచాయతీ పంపనపల్లితండాకు చెందిన మున్నీబాయికి రూ.60 వేలు, గుత్తివారిపల్లికి చెందిన ఆదినారాయణకు రూ.48 వేలు, నార్శింపల్లికి చెందిన నారాయణప్పకు రూ.30 వేలు ప్రకారం మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ తనయుడు శిరీష్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


ఆదినారాయణప్పకు చెక్కు అందజేస్తున్న ఎంపీ

బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలు

గోరంట్ల, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా విద్య వికాసం పేరుతో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం క్రీడాపోటీలు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ఫణిరాజ్ గ్రామీణ ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందాలన్న విషయాలను వివరించారు. అనంతరం కబడ్డీ పోటీలు నిర్వహించారు. గోరంట్ల విద్యార్థులు విజేతగా, బూదిలి విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్-15లో మల్లాపల్లి విన్నర్స్, వానవోలు రన్నర్స్‌గా నిలిచారు. బాలికల విభాగంలో గోరంట్ల విన్నర్స్, మందలపల్లి రన్నర్స్‌గా నిలిచారు. పీడీలు రామ్మోహన్, రాంప్రసాద్, రేఖ, పీఈటీలు అలివేలమ్మ, రామచంద్రనాయక్ పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న బాలురు

ప్రార్థనాలయాల వద్ద నిఘా పెంచాలి

బీటీఆర్‌కాలనీ (పెనుకొండ), న్యూస్‌టుడే: పెనుకొండలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, దర్గాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ జనార్దన్ పేర్కొన్నారు. శనివారం పెనుకొండలోని పలు దేవాలయాలు, మసీదుల, దర్గాలు, చర్చిలకు చెందిన మతపెద్దలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రార్థనాలయ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నిఘా పెరుగుతుందని పేర్కొన్నారు. ఎవరైన గుర్తుతెలియని వ్యక్తులు వచ్చినపుడు వాటి పుటేజీల ద్వారా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు.


పలు మతాల పెద్దలతో చర్చిస్తున్న ఎస్‌ఐ జనార్దన్

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

జూలుకుంట(సోమందేపల్లి), న్యూస్‌టుడే: మెరుగైన విద్యతోనే పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బీకే పార్థసారథి పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం మండలంలోని జూలుకుంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన పాఠ్య సామగ్రిని ఎస్సై ప్రసాద్ సౌజన్యంతో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇష్టంతో చదువుకొని పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ ప్రాంతానికి ప్రస్తుతం కియా కార్ల కంపెనీ, త్వరలో మరిన్ని పరిశ్రమలు వస్తున్నాయని, సక్రమంగా చదువుకొన్న, సాంకేతిక విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు మంచి ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందని చెప్పారు. మొదట స్థానికులకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు సైపుద్దీన్, కేఎం నబీ, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గుట్టూరు(పెనుకొండ పట్టణం): పదోతరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉత్తమ పలితాలు సాధించాలని గుట్టూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు సూచించారు. శనివారం యూటీఎఫ్ మండల నాయకులు హనుమంతు, రవీంద్ర ఆధ్వర్యంలో యూటీఎఫ్ ప్రచురించిన పదో తరగతి మోడల్ పేపర్ పుస్తకాలను పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. మండలంలోని వెంకటగిరిపాళ్యం, రాంపురం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మోడల్ పేపర్ పుస్తకాలను అందించారు. వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాక్షించారు.


విద్యార్థులకు పాఠ్య సామగ్రిని అందిస్తున్న ఎమ్మెల్యే

గుండెపోటుతో మాలధారుడి మృతి

రొద్దం, న్యూస్‌టుడే: మండలంలోని చెరుకూరు పంచాయతీలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారుడు వెంకటేశ్వరరెడ్డి (45) గుండె పోటుతో మృతి చెందారు. శనివారం గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలు.. దాదాపు 40 మంది మాలధారులు మూడో తేదీన ఇరుముడి కట్టుకుని చెరుకూరు గ్రామం నుంచి శబరిమలకు బస్సులో వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి పంపానది నుంచి భక్తులు కాలినడకన పెద్దపాదానికి నడిచి వెళ్తుండగా వెంకటేశ్వరరెడ్డి అస్వస్థతకు గురై అక్కడిక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. శబరిమల నుంచి మృతదేహాన్ని గ్రామానికి తరలించి అంతక్రియలు నిర్వహించారు.

సర్వే నిలిపివేయండి

దేమకేతేపల్లి(చిలమత్తూరు): అగళి నుంచి కొడికొండ వరకు జరుగుతున్న జాతీయ రహదారి పనులను వెంటనే నిలిపివేయాలని మండల పరిధిలోని దేమకేతేపల్లికి చెందిన కొందరు రైతులు, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని దేమకేతేపల్లిలో జరుగుతున్న రహదారి సర్వేను రైతులు అడ్డుకున్నారు.

పెనుకొండ

వాహనాల తనిఖీ

వైజంక న్(సోమందేపల్లి): శనివారం సాయంత్రం ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. శిరస్త్రాణం, సీటుబెల్టు ధరించని ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు, చోదకుల లైసెన్సులను పరిశీలించారు. సక్రమంగా లేని 10మందిపై కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.1,350 అపరాధరుసుం వసూలు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దోమతెరల పంపిణీ

పరిగి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమకూర్చిన దోమతెరలను పరిగి బాలుర ఎస్సీ వసతి గృహ విద్యార్థులకు పంపిణీ చేశారు. దోమల బెడదను నియంత్రించేందుకు, రోగాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇవి ఉపయోగపడతాయని డా.ఆదిశేషు, డా.శ్రీక్రాంతి తెలిపారు. కార్యక్రమంలో హిందూపురం మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివన్న, పీహెచ్ఎన్ గిరిజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

60 చెరువులకు నీటి సరఫరా

- నేటి నుంచి గొల్లపల్లి జలాశయానికి నీరు
- ఎమ్మెల్యే బీకే పార్థసారథి



ఈదులబళాపురంలో లబ్ధిదారురాలికి ఎన్టీఆర్ గృహం మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

జూలుకుంట, ఈదులబళాపురం(సోమందేపల్లి), న్యూస్‌టుడే: పెనుకొండ నియోజకవర్గంలో ఎంపిక చేసిన 23 చోట్ల నుంచి మొత్తం 60 గ్రామాల చెరువులను గొల్లపల్లి జలాశయం నీటితో నింపనున్నట్లు ఎమ్మెల్యే బీకే పార్థసారథి పేర్కొన్నారు. మండలంలోని జూలుకుంట, ఈదులబళాపురం గ్రామాల్లో శనివారం జన్మభూమి-మాఊరు కార్యక్రమ గ్రామసభలను సర్పంచులు రవీంద్రారెడ్డి, అంజనమ్మల అధ్యక్షతన ఎంపీడీవో నాగన్న, తహసీల్దార్ రామాంజనేయరెడ్డి, ప్రత్యేకాధికారి కృష్ణానాయక్ తదితరులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గొల్లపల్లి జలాశయానికి ఆదివారం నుంచి నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. ఏకంగా 60 చెరువులను నీటితో నింపనున్న నేపథ్యంలో పలుచోట్ల మిగిలిపోయిన హంద్రీనీవా కాలువల తవ్వకాలు, ఎత్తిపోతల పథకాల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి హిందూపురం, మడకశిర వరకు నీటిని అందించాలని కృతనిశ్చయంతో పని చేస్తున్నట్లు ప్రకటించారు. పేద ప్రజల సంక్షేమానికి శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని, ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం, చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ జరిగింది. 15మందికి ఎన్టీఆర్ గృహాల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి రవీంద్రారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణ, జన్మభూమి సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మావటూరులో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

మావటూరు(పెనుకొండ పట్టణం): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పెనుకొండ ఎంపీడీవో శివశంకరప్ప అన్నారు. శనివారం పెనుకొండ మండలం మావటూరులో జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఉప తహసీల్దార్ ఈశ్వరయ్య, సీడీపీవో రేవతిజ్యోత్స్న, సర్పంచి సుధాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు నారాయణస్వామి, తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు



మాట్లాడుతున్న సర్పంచి సుశీలాబాయి

గోరంట్ల, న్యూస్‌టుడే: 'సర్పంచిగా ఎన్నికైనప్పటి నుంచి వేడుకుంటున్న ఒక సమస్య పరిష్కారమైతే ఒట్టు అని' వడిగేపల్లి పంచాయతీ సర్పంచి సుశీలాబాయి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వడిగేపల్లి, రెడ్డిచెరువుపల్లి పంచాయతీల్లో శనివారం జన్మభూమి - మాఊరు గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రత్నం, ఈవోపీఆర్డీ అంజినప్ప ఆధ్వర్యంలో వడిగేపల్లిలో జరిగిన సమావేశంలో సర్పంచి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో అల్ప విద్యుత్తు సమస్య ఉందని ఎన్నిసార్లు వేడుకున్నా ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదని, అలాంటపుడు సమావేశాలు ఎందుకు నిర్వహించాలని ప్రశ్నించారు. రెడ్డిచెరువుపల్లిలో సర్పంచి నిడిమామిడప్ప అధ్యక్షతన జరిగిన గ్రామసభకు ఎంపీడీవో ఆజాద్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జన్మభూమి



గర్భిణులకు పండ్లు అందజేస్తున్న సర్పంచి శివ, నాయకులు

రొద్దం, న్యూస్‌టుడే: మండలంలోని తురకలాపట్నం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జన్మభూమి - మాఊరు కార్యక్రమానికి ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎండీపీవో యాదవేంద్ర, తహసీల్దారు రామశేఖర్, జడ్పీటీసీ సభ్యుడు చిన్నప్పయ్య, విద్యాధికారి శ్రీరాములు, ఈవోఆర్డీ నసీమతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. సర్పంచి శివన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడారు. అనంతరం సానిపల్లిలో జరిగిన జన్మభూమిలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ రెండు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి పుష్పావతి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు కమలమ్మ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నరసింహులు, తెదేపా నాయకుడు మాధవనాయుడు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సవరణ బిల్లును ఉపసంహరించాలి



ఏవో గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అంబేడ్కర్‌కూడలి (పెనుకొండ), న్యూస్‌టుడే: మోటారు వాహన చట్ట సవరణ బిల్లు అమలులోకి రాకూడదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. శనివారం పెనుకొండలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవో గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మోటారు వాహన చట్టసవరణ బిల్లును కేంద్రప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోందని తెలిపారు. బిల్లు ఆమోదం పొందితే ఆటోలపై అపరాధ రుసుం ఎక్కువగా విధించే అవకాశం ఉందన్నారు. బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబావలి, సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకల పంపిణీ



సరకులు అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యులు, సర్పంచి

రొద్దం, న్యూస్‌టుడే: రొద్దంలోని రెండో చౌకదుకాణంలో శనివారం చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి జడ్పీటీసీ సభ్యుడు చిన్నప్పయ్య, సర్పంచి అశ్వర్థనారాయణ, తెదేపా మండల కన్వీనర్ చంద్రమౌళి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్రాంతి పండగను పేదలు సంతోషంగా జరుపుకొనే విధంగా ప్రభుత్వం ఉచితంగా సరకులను ఏటా పంపిణీ చేపడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నారాయణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఛైర్మన్ నాగరాజు, పంచాయతీ కన్వీనర్ వీరాంజనేయులు, నాయకులు పెద్దన్న, చంద్రశేఖర్, శేషు, డీలరు ఉగిరప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మండల ప్రత్యేక అధికారి

సామాజిక వికాసానికే సంక్షేమ పథకాలు

హొన్నంపల్లి, (పరిగి), రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, కుటుంబ వికాసానికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మండల ప్రత్యేక అధికారి నాగరంగయ్య పేర్కొన్నారు. హొన్నంపల్లిలో సర్పంచి మైలారప్ప అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఏడుగంటల పాటు ఉచిత విద్యుత్తు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలమునయ్య, తహసీల్దార్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాట్‌పుట్ విసురుతున్న విద్యార్థి

ఉత్సాహంగా క్రీడాపోటీలు

మడకశిరకూడలి (పెనుకొండ), న్యూస్‌టుడే: పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం బాబయ్య స్వామి మండల స్థాయి క్రీడా పోటీలను బాబయ్యస్వామి దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా కుమారుడు సలావుద్దీన్ బాబా ఆధ్వర్యంలో జరిగాయి. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. మొదటిరోజు బాలుర, బాలికల విభాగంలో షాట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ బాబా మాట్లాడుతూ ఫిబ్రవరి నెలాఖరులో జరిగే బాబయ్యస్వామి ఉరుసును పురస్కరించుకొని క్రీడా పోటీలను నిర్వహించి తెలిపారు. విజేతలకు ఉరుసులో జరిగే సర్వమత సమ్మేళనం సభలో బహుమతులు అందజేస్తామని చెప్పారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థి

పుట్టపర్తి

సమస్యల పరిష్కారానికే జన్మభూమి

కస్సముద్రం(అమడగూరు): కస్సముద్రంలో శనివారం సర్పంచి లోకేష్‌రెడ్డి అధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఎంపీపీ వెంకటర మణమ్మ, జడ్పీటీసీ ఉమాదేవి, తహసీల్దార్ సుబ్బలక్ష్మి, నోడల్ అధికారి రామసుబ్బారెడ్డి, ఎంపీడీవో చంద్రారెడ్డి, సర్పంచి లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెద్దమనసు

నల్లచెరువు,న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు పెద్దమనసుతో చిన్నారికి శస్త్ర చికిత్స అందించారు. మండలకేంద్రానికి చెందిన రామచంద్ర కుమార్తె కీర్తన 2వ తరగతి చదువుతోంది. ఆమెకు పుట్టుకతోనే అంగ వైకల్యం ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. స్థానిక భవిత కేంద్రంలోని ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు నరసింహులు, వినయ్ కృషితో చిన్నారికి తిరుపతి బర్డ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు.



పుట్టపర్తిలో ఇళ్ల పట్టాల పంపిణీ



సిద్ధరాంపురం: అధికారులతో వాదిస్తున్న వైకాపా నాయకులు



నల్లమాడ: చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ

సమస్యలపై వినతులు.. లబ్ధిదారులకు ఫలాలు

కర్ణాటకనాగేపల్లి, కోవెలగుట్లపల్లి(పుట్టపర్తి)న్యూస్‌టుడే: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, పథకాలను సద్వినియోగం చేసుకొని ఛైర్మన్ బెస్త చలపతి, పుడా ఛైర్మన్ కడియాల సుధాకర్‌నాయుడు పేర్కొన్నారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి, కోవెలగుట్లపల్లిలో కౌన్సిలర్లు శివలక్ష్మి, గజ్జలకళావతి అధ్యక్షతన జన్మభూమి మాఊరు కార్యక్రమం జరిగింది. ఇందులో ప్రజల నుంచి వినతులు అధికంగా వచ్చాయి. ప్రజల చెంతకే వెళ్లి, అక్కడికక్కడే సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకొని, సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 36 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. రంగవల్లుల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, పట్టణ తెదేపా కన్వీనర్ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు వెంకటాద్రి, కౌన్సిలర్లు లక్ష్మిదేవి, చెన్నకృష్ణమ్మ, ఏఈలు మురళీధర్, స్వాతి, భారతి నాయకులు సత్తి, రాజప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

సిద్ధరాంపురం రహదారికి నిధులు

సిద్ధరాంపురం(బుక్కపట్నం) : ప్రజా సమస్యల పరిష్కార వేదికే జన్మభూమి మా ఊరు అని ప్రజల వారి సమస్యలను తెలియజేసుకునేందుకు చక్కటి మార్గమని మండల ప్రత్యేకాధికారి శోభారాణి, సర్పంచి శ్యామల పేర్కొన్నారు. బుక్కపట్నం మండలంలోని సిద్ధరాంపురంలో గ్రామసభ జరిగింది. ఎన్నో ఏళ్లుగా సిద్ధరాంపురం, దూపంపల్లి రహదారికి కృషి చేస్తున్నామని అందుకు నిధులు మంజూరయ్యాయని ప్రకటించారు. గ్రామానికి చెందిన కేశప్ప పలు సమస్యలపై అభ్యంతరాలు తెలిపారు. ఎంపీటీసీ మల్లేష్ తమ వర్గానికి చెందిన వారికి పింఛన్లు మంజూరు చేయలేదని తమకు న్యాయం చేయాలని అధికారులకు విన్నవించారు. గతంలో అర్హులున్నా పింఛన్లు అందించలేదని గ్రామాభివృద్ధికి సహకరించలేదని ఎన్నోమార్లు గ్రామాభివృద్ధికి తాము చేయూతనందిస్తామని తెలిపినా అభ్యంతరాలు తెలుపుతూ గ్రామాభివృద్ధిని కుంటుపడేలా చేశారని తెదేపా నాయకుడు మల్లిరెడ్డి వైకాపా నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను అడ్డుకోవడానికి పలువురు ప్రయత్నించడంతో రసాభాసగా మారింది. పోలీసులు జోక్యంతో సమస్య సద్దుమణిగింది. పలువురు కార్యక్రమం నుంచి వెళ్లిపోయారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఈశ్వరయ్య, ఏవో నటరాజ్, ఏపీఓ అనిల్, ఎంఈఓ గోపాల్‌నాయక్, జేఈ వెంకట్రాముడు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



ఓడీసీ: వడ్డీమాఫీ పత్రాల అందజేత

అర్హులకు పింఛన్ మంజూరు.

నల్లమాడ: అర్హులైన వారందరికీ పింఛన్, పక్కా ఇళ్లు, రేషన్‌కార్డులు జన్మభూమి కార్యక్రమంలో మంజూరవుతాయని ఎంపీడీవో రాబర్ట్‌విల్సన్, తహసీల్దార్ అబ్దుల్ హమీద్ బాషా తెలిపారు. శనివారం పులగంపల్లిలో సర్పంచి రాజేంద్ర ఆధ్యక్షతన సభ నిర్వహించారు. గ్రామస్థులు అర్హత ఉన్నా పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా పేర్లు వెల్లడించి తర్వాత తొలగించారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వృద్ధులకు సర్ది చెప్పి వినతులను తీసుకొని అధికారులకు అందజేశారు.. దాదాపు 30 వినతులను వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం సంక్రాంతి చంద్రన్న కానుకలను అందజేశారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. మండల కన్వీనర్ మైలే శంకర, నల్లమాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామచంద్ర, వీఆర్‌వో ముబారక్, జన్మభూమి కమిటీ సభ్యులు చంద్ర, లక్ష్మీదేవి, చంద్రకళ పాల్గొన్నారు.

చింతమానుపల్లి (ఓబుళదేవరచెరువు): పేదల అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇస్తూ చంద్రబాబు సారధ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ ఇస్మాయిల్, జడ్పీటీసీ ఓబుళరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతమానుపల్లి పంచాయతీ కమ్మవారిపల్లిలో శనివారం జన్మభూమి సభ సర్పంచి బోయపాటి కవిత అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఐకేపీ మహిళా సంఘాలకు వడ్డీమాఫీపత్రాలను అందజేశారు. విద్యార్థులు చక్కభజన ప్రదర్శన చేశారు. అంగన్‌వాడీలు పౌష్టికాహారంపై ప్రదర్శన ఏర్పాటుచేశారు. మండలప్రత్యేకాధికారి శివప్రసాద్‌రాజు, తహసీల్దార్ ఎల్. రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు, ఏపీఎం నాగమణి, ఏపీఓ మంజుల, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ రామప్పనాయుడు, తెదేపా కన్వీనర్ శంకర్‌నాయుడు, ప్రధానకార్యదర్శి జయచంద్ర, కోఆప్షన్ సభ్యుడు నిజాంవలీ, నాయకులు బోయపాటి చక్రధర్‌నాయుడు, సాంబశివరెడ్డి, అంజి, రాజప్ప, మాబు, ఇర్షాద్, హారున్, వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రామసభలో నిరసన

పుట్టపర్తిగ్రామీణం,న్యూస్‌టుడే: జన్మభూమి గ్రామసభ కార్మిక సంఘాల బైఠాయింపుతో రసాభాసగా మారింది. శనివారం పెడపల్లి పెద్దతండాలో జన్మభూమి గ్రామసభకు వివిధ కార్మిక సంఘాలు సీపీఎం ఆధ్వర్యంలో వచ్చి ఆటో కార్మికులకు నివేశన స్థలాల కేటాయింపులో అధికారుల తీరును నిరసిస్తూ బైఠాయించారు. అర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు నిరసన తెలుపుతామని ఆందోళనకు దిగారు. కార్మికులకు న్యాయం చేయలేని గ్రామ సభలెందుకు దండగని నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. మాజీ సర్పంచి శ్రీరామ్‌నాయక్ జోక్యం చేసుకుని మాట్లాడుతూ ఆటో కార్మికులు స్థానికులయి ఉండి, ఇల్లు లేకపోతే తప్పక ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని, నిరసన వ్యక్తం చేయడానికి వచ్చిన వారిలో స్థానికుల ఎవరూ లేరని, స్థానికులు కాని వారికి స్థలాలు ఇవ్వబోమని, ఉన్న స్థలంలో కొంత షాదీమహల్ నిర్మించగా మిగిలిన స్థలాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి కేటాయించామని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలన్నారు. ఆటో కార్మికుల్లో స్థానికులకు సైతం ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచీ కదలమని వారు భీష్మించారు. ఈ క్రమంలో తండావాసులు కలుగజేసుకుని సీపీఎం, కార్మిక సంఘాల నాయకులను బయటకు నెట్టుకొచ్చారు. ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి ప్రభుత్వం గ్రామ సభలను ఏర్పాటు చేస్తే ఇలా గొడవ చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు, ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు గౌస లాజం, రాము, వీరనారప్ప, బాబా, షామీర్, బాబా వలి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బైఠాయించిన సీపీఎం, కార్మిక సంఘాల నాయకులు

అర్హులందరికి సంక్షేమ ఫలాలు

తలమర్ల (కొత్తచెరువు), న్యూస్‌టుడే: అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలో తలమర్ల, మీర్జాపురం పంచాయతీల్లో సర్పంచులు శ్యాంసుందరరెడ్డి, కేశవయ్యల అధ్యక్షతన ఏర్పాటైన జన్మభూమి గ్రామసభలకు ఎమ్మెల్యే పల్లె, జడ్పీటీసీ మహాలక్ష్మి, ప్రత్యేకాధికారి ఓబులపతి, ఎంపీడీవో రఘునాథ గుప్త, తెదేపా నాయకుడు శ్రీనివాసులు హాజరయ్యారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బలహీన వర్గాల సంక్షేమమమే తెదేపా ధ్యేయమని పేర్కొన్నారు. అందరి ఆరోగ్యం కోసం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరారు. చంద్రన్న బీమా కార్డులు, సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛత మన బాధ్యత

పెడపల్లి(పుట్టపర్తిగ్రామీణం)న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని నిర్మించుకుని వినియోగించినప్పుడే స్వచ్ఛత మన బాధ్యత అన్న పదానికి సార్ధకత చేకూరుతుందని ప్రత్యేకాధికారి కృష్ణమీనన్ అన్నారు. శనివారం పెడపల్లిలో జన్మభూమి కార్యక్రమాన్ని మండల ఉపాధ్యాక్షుడు బొమ్మయ్య అధ్యక్షతన అధికారులు నిర్వహించారు. డ్వాక్రా మహిళలకు వడ్డీరాయితీ, ఉపకారవేతనాలు, చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు. గ్రామంలో మరుగుదొడ్లను అధికారులు ప్రారంభించారు. మరుగుదొడ్లు నిర్మించుకోని వారికి పింఛన్లు, రేషన్, ఇల్లు ఇవ్వబోమని హెచ్చరించారు. పాఠశాలలో క్రీడలను ప్రారంభించి క్రీడా వికాస ప్రాధాన్యం విద్యార్థులకు తెలియజేశారు. ఐసీడీఎస్ ప్రదర్శనలు తిలకించారు. పాఠశాల విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. నోడల్ అధికారి సుభాన్, మండల కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు ఆంజనేయులు, శ్రీరామ్‌నాయక్, అధికారులు సాయిలక్ష్మి, జమునాబాయి, నారాయణరెడ్డి, రాంప్రసాద్, రామచంద్రారెడ్డి, సూర్యనారాయణ, గంగరత్న, సుబ్రమణ్యం, వైద్యురాలు నివేదిత పాల్గొన్నారు.

రేపు కదిరికి స్వామీజీ రాక

కదిరి, న్యూస్‌టుడే: పట్టణానికి విశాఖ శారదా పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి సోమవారం వస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8న కదిరి వస్తున్న స్వామివారు పదవ తేదీ వరకు శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బస చేస్తారన్నారు. మూడురోజుల పాటు వేదార్చన, తీర్థప్రసాదాల వినియోగం జరుగుతాయన్నారు.

భవిష్యత్తులో బ్యాంకుల్లోనే లావాదేవీలు

పుట్టపర్తిగ్రామీణం,న్యూస్‌టుడే: పాఠశాల దశ నుంచే విద్యార్థులు బ్యాంకుల్లో నిర్వహించే ఆర్థిక లావాదేవీలు, నగదు వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలని ఆర్‌బీఐ జిల్లా సమన్వయకర్త రాజేంద్ర తెలిపారు. శనివారం బీడుపల్లి ఉన్నత పాఠశాలలో భారతీయ బ్యాంకులు-ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై 8,9 తరగతుల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అన్ని రకాల ఆర్థిక లావాదేవీలు బ్యాంకుల ద్వారానే జరుగుతాయన్నారు. ఇప్పటి నుంచే వాటి ప్రాధాన్యం తెలుసుకోవడం మంచిదన్నారు. బ్యాంకుల్లో పొదుపు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఇతరులకు డబ్బు అప్పుగా ఇవ్వడం వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. నగదు చెల్లింపు, తీసుకోవడం, డీడీలు, చలానాలు కట్టడం వంటి పనులకు విద్యార్థులు బ్యాంకులకు వెళ్లడం, బ్యాంకుల్లో పొదుపు అలవరుచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నల్లమాడ న్యూస్‌టుడే: కుటాగుళ్ల సబ్‌స్టేషన్ నుంచి నల్లమాడ మండలం సబ్‌స్టేషన్ వరకు గల విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు ఏఈ వెంకటరమణ పేర్కొన్నారు. మండల ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఓబుళదేవరచెరువులో 5కే రన్

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: మండలపరిషత్ కార్యాలయం నుంచి తిప్పేపల్లి వరకు అయిదు కిలోమీటర్ల పరుగు (5కే రన్) కార్యక్రమం ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని మండలప్రత్యేకాధికారి శివప్రసాద్‌రాజు, ఎంపీడీఓ నాగరాజు పేర్కొన్నారు. ఆరోగ్యజాగ్రత్తలు, వ్యాయామం కోసం ఇది ఎంతగానో దోహదపడుతుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, యువతీ, యువకులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హంద్రీనీవా పథక రూపకర్త ఎన్టీఆర్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టరు

కమ్మపాళ్యం (కొత్తచెరువు), న్యూస్‌టుడే: రాయలసీమ జిల్లాల్లో కరవు నివారణకు హంద్రీనీవా పథకాన్ని రూపొందించి, శ్రీకారం చుట్టిన మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుక్కపట్నం చెరువు కృష్ణాజలాలతో నిండిన సందర్భంగా కొత్తచెరువమ్మ ఆలయం దగ్గర జిల్లా కలెక్టరు వీరపాండియన్‌తో కలిసి గంగపూజలు నిర్వహించారు. గంగమ్మకు పసుపు, కుంకుమ సమర్పించి పూజలు నిర్వహించారు. తరువాత గ్రామదేవత ఆలయం దగ్గర ఎన్టీఆర్ విగ్రహాన్ని కృష్ణాజలాలతో అభిషేకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె మాట్లాడుతూ 11న సీఎం కొత్తచెరువమ్మ గుడి దగ్గర ఏర్పాటుచేసిన జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా తెప్పోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. గత జన్మభూమిలో సీఎం ఇచ్చిన హామీమేరకు బుక్కపట్నం చెరువుతో పాటు పరిసరాల్లోని అన్ని చెరువులను నింపారని గుర్తు చేశారు. దీంతో చెరువుల్లో జలకళతో తాగు, సాగునీటి కొరత ఉండదని అందరిలో ఆత్మస్థైర్యం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో జేసీ2 ఖాజామొయిద్దీన్, ఆర్డీవో రామ్మోహన్, హంద్రీనీవా ఎస్‌ఈ రామకృష్ణారెడ్డి, డీఈ రమేష్‌చంద్ర, ఎంపీపీ వాణి, జడ్పీటీసీ మహాలక్ష్మి, కన్వీనర్ దామోదర్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ రఘుపతి, ఆసుపత్రి కమిటీ అధ్యక్షుడు వేణు, తెదేపా నాయకులు శ్రీనివాసులు, దాల్‌మిల్ సూరి, మాజీ సర్పంచి హరినాథ్‌చౌదరి, కొండసాని సురేష్‌రెడ్డి, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్లపై సూచనలు : ముఖ్యమంత్రి రాక సందర్భంగా కొత్తచెరువమ్మ ఆలయం పరిసరాల్లో జరగనున్న గ్రామసభ ఏర్పాట్లను జిల్లా కలెక్టరు వీరపాండియన్ పరిశీలించారు. రోడ్లుభవనాల శాఖ, నీటి పారుదల, రెవెన్యూ, విద్యుత్తు శాఖల అధికారులతో మాట్లాడారు. మరువకు ఎదురుగా ఉన్న కట్టపై సభావేదిక ఏర్పాటుకు అడ్డుగా ఉన్న విద్యుత్తు లైన్లను తొలగించాలని ఆదేశించారు. అలాగే పుట్టపర్తి రోడ్డులోని పోతులప్పగుడి నుంచి కమ్మపాళ్యంలోకి వచ్చే మార్గంలో అడ్డంకులు లేకుండా చేయాలన్నారు. డీఎస్పీ రామవర్మ, సీఐ రవికుమార్, తహసీల్దార్ వసంతకుమార్‌లకు బందోబస్తుకు అవసరమైన చర్యలను సూచించారు.



రాతపుస్తకాలు అందజేస్తున్న వేణుగోపాల్

క్రీడాకారుడి వితరణ

జంబులవాండ్లపల్లి (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: జంబులవాండ్లపల్లి ప్రాథమికపాఠశాల విద్యార్థులకు అమడగూరు మండలం నుంచి చెన్నై అండర్-19 క్రికెట్‌జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన వేణుగోపాల్ పలకలు, రాతపుస్తకాలు, నిఘంటువులు, అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడటంతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. చదువుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. మిట్టపల్లి ఉన్నతపాఠశాలలో క్లర్క్‌గా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు నీళ్ల సీసాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, రవీంద్రనాయక్, ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తారు వేసిన పెడపల్లి-నిడిమామిడి రహదారి

ఆ గ్రామాలకు తీరిన రహదారి కష్టాలు

నిడిమామిడి (పుట్టపర్తిగ్రామీణం) న్యూస్‌టుడే: పదిహేనేళ్ల తరువాత ఆ గ్రామాలకు గుంతల రహదారిలో ప్రయాణ కష్టాలు తీరాయి. పలు గ్రామ సభల్లో, నాలుగు విడతల జన్మభూమి కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు బాగు చేయాలని ప్రధాన సమస్యగా ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకు ఐదోవిడత జన్మభూమి గ్రామసభల నిర్వహణకు ముందే గుంతల రోడ్డుకు తారు వేసి ప్రజల ముందుకు వచ్చారు. మండలంలోని పెడపల్లి-నిడిమామిడి రోడ్డను నిమ్మల కిష్టప్ప మంత్రిగా ఉన్నప్పుడు తారురోడ్డుగా మార్చారు. ఆ తరువాత రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గుంతలతో ప్రయాణం నరకంగా ఉండేది. ఎన్నో ప్రమాదాలు సంభవించాయి. ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారు. ఈ రోడ్డు దాదాపు 20 గ్రామాలకు సౌకర్యంగా ఉంది. రూ.30 లక్షలతో తారు రోడ్డును వేసి ప్రజలకు ఇబ్బందులు తీర్చారు.

సత్యసాయి సేవాదృక్పథం అలవర్చుకోవాలి

నార్సింపల్లి(బుక్కపట్నం), న్యూస్‌టుడే భగవాన్ సత్యసాయిబాబా సేవాదృక్పథాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సత్యసాయి భక్తురాలు లలిత పేర్కొన్నారు. మండలంలోని నార్సింపల్లి పాఠశాల విద్యార్థులకు ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సౌజన్యంతో సత్యసాయి భక్తురాలు లలిత రాత పుస్తకాలు, ఇతర సామగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమవంతుగా చేయూతనందించడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో తమవంతు చేయూతనందిస్తామన్నారు. ప్రతిఒక్కరూ సత్యసాయి సేవా దృక్పథంతో ముందుకు నడిచి గ్రామీణ పాఠశాలలు, గ్రామాల అభివృద్ధికి చేయూతనందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, శ్రీవాణి, పద్మ, శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ



మైదానం అభివృద్ధికి శ్రీకారం

క్రీడామైదానం బాగుకు ఆర్డీటీ సాయం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలోని క్రీడామైదానం చదును చేయడానికి ఆర్డీటీ సంస్థ రూ. 3.74 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఏటీఎల్ వరకుమార్ తెలిపారు. క్రీడల నిర్వహణకు ఆటస్థలం అనువుగా లేకపోవడంతో క్రీడాకారుల విన్నపం మేరకు నిధులు మంజూరు కావడంతో శనివారం కళాశాల ప్రిన్స్‌పల్ బాలగురప్ప, హెచ్‌ఎం చెన్నకృష్ణారెడ్డి, పి.డి సదాశివరెడ్డి, ఏఎస్‌ఐ వెంకటనారాయణ, హెచ్‌సి నాగేశ్వర రెడ్డి పూజలు చేసి, జేసీబీతో పనులను ప్రారంభించారు.

కూరగాయల ధరలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు దినసంతలో నిన్నటి ధరలు. టమోటా 5, పచ్చిమిరప 30, వంకాయలు 20, బెండ 30, ఉల్లిపాయలు 50, బంగాళా దుంపలు 20, కాప్సికం 60, ముల్లంగి 20, బీరకాయలు 30, కాకర 40, క్యారెట్ 60, బీన్స్ 40, చిక్కుడు కాయలు 40, క్యాబేజి 20, అల్లం 60, బీట్‌రూట్ 40.

నిత్యావసర వస్తువుల కిలో ధరలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: బియ్యం: హంస-25, సన్నరకం బియ్యం- 40నుంచి 60 వరకూ, కందిబేడలు-65, శనగబేడలు- 75, పామాయిల్- 70, చింతపండు- 200, పెసరబ్యాల్లు-80, ఎండు మిరప- 90, కొబ్బరి- 160, గోధుమపిండి- 28, శనగపిండి- 90, చక్కెర- 40, బెల్లం- 50, రాగులు- 34, జొన్నలు- 20, సద్దలు- 20, ఉలవలు- 60, కొర్రలు- 40.

తెరపై ఈనాడు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: సందీప్: సప్తగిరి ఎల్ఎల్‌బి, లక్ష్మీ: ఎంసీఏ.

శరవేగంగా హంద్రీనీవా పూర్తి చేయండి

పుట్టపర్తి: ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా కాలువ పరిశీలిస్తారని, పనులను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వీరపాండియన్ అధికారులను ఆదేశించారు. శనివారం పుట్టపర్తి సమీపంలో కోర్టు ఉత్తర్వులతో హంద్రీనీవా 9వ ప్యాకేజీలో 500 మీటర్లలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మూడు రోజులుగా పనులు సరిగా జరగడం లేదని, త్వరితగతిన పూర్తి చేసేందుకు 50 మీటర్లకు ఒకచోట యంత్రాలను ఏర్పాటు చేసి, పనులు చేపట్టాలన్నారు. పనుల్లో గంట గంటకు పురోగతి కన్పించాలన్నారు. పనులను పర్యవేక్షించేందుకు ఇద్దరు రెవెన్యూ సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. ఇలా నత్తనడకన సాగితే, ఎప్పుడు పూర్తి చేసేది..పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజూ పనుల పురోగతిపై నివేదికలు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి కాలువ పరిశీలనకు అవసరమైన ప్రాంతంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆయన వెంట జేసీ2 ఖాజా మొయిద్దీన్, ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ రామవర్మ, ఎస్‌ఈ రామకృష్ణారెడ్డి, ఈఈ శ్రీనివాస్, డీఈ విశ్వనాథ్, తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

సమస్యలను పరిష్కరించాలి

అమడగూరు: పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో నాయకులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు పేర్కొన్నారు. అమడగూరు, ఓబుళదేవరచెరువు మండలాల్లో ఇప్పటికి పంట నష్టపరిహారం అందక రైతులు బ్యాంకులు ,వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఈనెల 9న పుట్టపర్తిలో జరిగే నియోజకవర్గ మహాసభలు జయప్రదం చేయాలన్నారు.

విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలో పాఠశాలకు ప్రశంస

బీడుపల్లి(పుట్టపర్తిగ్రామీణం)న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిన విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలో బీడుపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తయారు చేసిన త్రికోణమితీయ పరికరానికి ప్రశంసలు దక్కాయి. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నెహ్రూ విజ్ఞాన గణిత శాస్త్ర, పర్యావరణ రాష్ట్ర స్థాయి ప్రదర్శన నెల్లూరులో నిర్వహించారు. రాష్ట్రం నుంచి 167 పాఠశాలలు పాల్గొనగా జిల్లా నుంచి ఆరు పాఠశాలలు, అందులో బీడుపల్లి ఉన్నత పాఠశాల పాల్గొంది. ప్రదర్శనకు పాఠశాల నుంచి భౌతిక, గణిత శాస్త్ర బోధకుడు చలపతి తాను తయారు చేసిన లంబకోణ త్రిభుజంలో త్రికోణమితీయ నిష్పత్తి టాన్ 45 డిగ్రీ సాధనం నమూనాను ప్రదర్శనలో ఉంచారు. ఈ సాధనంతో దూరాలు, ఎత్తులు, పొడవు, దగ్గర దూరాలను, భవనాలు, చెట్ల, పర్వతాలు, భూమి సర్వేలు, నదులు, సముద్రాలలో స్టీమర్లు, బోట్ల మధ్య దూరాలను ఎంతో సులభంగా లేజర్ కిరణాల సాయంతో తక్కువ సమయంలో ఎలా కొలుస్తారో వివరించారు. కేవలం రూ.100లతో ఈ సాధనం తయారు చేయవచ్చని చెప్పారు. జిల్లాలో గణితం నమూనా బహుమతి గెలుచుకోగా బీడుపల్లి పాఠశాల నమూనాకు ప్రశంసాపత్రం, ప్రోత్సాహక బహుమతిని సొంతం చేసుకోవడంపై ఉపాధ్యాయుడు చలపతిని ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.



పరికరం గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు

రాయదుర్గం

ఘనంగా పడి పూజోత్సవం

కణేకల్లు: స్థానిక ఉరవకొండ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి పడిపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్టుకు అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. గురుస్వాములు చిక్కణ్ణ, నాగప్ప ఆధ్వర్యంలో 18 మెట్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని మొక్కులు చెల్లించుకొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పింఛను సాధన సమితి కన్వీనర్‌గా లక్ష్మీనారాయణ

రాయదుర్గం, న్యూస్‌టుడే: పాత పింఛను సాధనసమితి కన్వీనర్‌గా ప్రస్తుత ఎన్జీవో అధ్యక్షుడు లక్ష్మీనారాయణను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. స్థానిక ఎన్‌జీవో సంఘం కార్యాలయంలో శనివారం ఆ సంఘాల ప్రతినిధులు హాజరై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా వేణుగోపాలరెడ్డి, హనుమంతరెడ్డి, రామాంజనేయులు, రంగనాథ్, శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, అక్కులప్ప, సీతారామిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈనెల 9న సీపీఎస్ రద్దును కోరుతూ ధర్నాను చేస్తున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం కార్యదర్శి కె.సత్యనారాయణ తెలిపారు.

కోతకు సిద్ధం.. దిగుబడి పతనం

తెగుళ్ల కారణంగా తగ్గిన వరి దిగుబడి



యంత్రాలతో జోరుగా వరి కోతలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో వ్యవసాయ బోర్లు, హెచ్చెల్సీ కాలువ కింద ముందస్తుగా వేసుకొన్న వరి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండు మండలాల్లో రైతులు బీపీటీ సోనా, ఎన్‌ఎల్‌ఆర్ సోనా వంటి రకాలకు చెందిన వరిని సాగు చేశారు. ఏటా ఈ రెండు మండలాలు కలిపి ఖరీఫ్‌లో హెచ్చెల్సీ కింద 30 వేల ఎకరాలు, వ్యవసాయ బోర్లు, చెరువు కింద మరో 5 వేల ఎకరాలు సాగయ్యేది. అయితే గత ఏడాది జులై, ఆగస్టు నెలలో తీవ్ర వర్షాభావం వల్ల హెచ్చెల్సీ కింద పంటలు సాగు చేయలేదు. ఈ సారి మాత్రం బోర్లు, హెచ్చెల్సీ కింద 10 వేల ఎకరాల వరకు వరి సాగయ్యింది.

వరి కోతలకు పెరిగిన డిమాండు..

ఉద్దేహాళ్, ఉంతకల్లు, శ్రీరంగాపురం, శ్రీధరఘట్ట, గోనేహాళ్, శింగానహళ్లి, కృష్ణాపురం, బ్రహ్మసముద్రం, గౌనూరు, ఉప్పరహాళ్, గంగలాపురం, కణేకల్లు, తుంబిగనూరు, మాల్యం, ఉడేగోళం తదితర గ్రామాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం వరి కోత మిషన్‌కు గంటకు రూ. 2200 వెచ్చిస్తున్నారు. కూలీలతో కోత కోయాలంటే ఎకరా వరి పంటను కోసి నూర్పిడి చేసి ధాన్యంను కుప్ప వేయడానికి రూ.6,500 వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. వరి కోత యంత్రం ద్వారా వరిని కోస్తే గడ్డి సగం మాత్రమే వస్తుండటంతో పశువులు ఉన్న రైతులు కొంతమంది కూలీలతో కోత కోయిస్తున్నారు.

తగ్గుతున్న దిగుబడి..

గత సంవత్సరంతో పోలిస్తే వరి దిగుబడి గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఏటా ఎకరానికి 40 బస్తా నుంచి 50 బస్తాల వరకు వరి దిగుబడి వచ్చేది. అయితే ఈ యేడు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కంకి తెగులు, అగ్గి తెగులు కారణంగా దిగుబడి తగ్గింది. దీంతో ఎకరానికి 30 నుంచి 35 బస్తాల్లోపే దిగుబడి వస్తున్నాయి. ఎకరానికి 10 బస్తాల వరకు దిగుబడి తగిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధర అంతంత మాత్రమే..

ప్రస్తుతం ఖరీఫ్‌లో అరకొరగా సాగైన వరికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు.

గత ఏడాది సోనామసూరి ధాన్యం బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు రూ.2 వేల వరకు ఉండేది. ఈ సారి మాత్రం సోనామసూరి క్వింటాలు రూ.1,930, ఎన్‌ఎల్‌ఆర్ రకం వరి అయితే క్వింటాలుకు రూ.1820 నుంచి రూ.1830 వరకు ఉంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఆర్‌ఎన్‌ఆర్64 రకానికి ఏ గ్రేడుగా గుర్తించి రూ.1530గా సోనామసూరి రూ.1510 లుగా ప్రకటించింది. బహిరంగ మార్కెట్ ధరకు ప్రభుత్వ ధరకు క్వింటాలుకు రూ.300 వరకు తేడా ఉండటంతో రైతులు చాలామంది బహిరంగ మార్కెట్ వైపే మొగ్గు చూపుతున్నారు.



ధాన్యం కుప్ప

వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రస్తుతం వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. హెచ్చెల్సీ కింద వరి అరకొర సాగవడంతో పాటు దిగుబడి కూడా తగ్గడంతో పంట పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం మద్దతు ధరను క్వింటాలు రూ.1510 నుంచి రూ. 2500 పెంచాలి. పెరిగిన సాగు ఖర్చులను చూసైనా రైతులను ఆదుకోవాలి.

- లోకనాథ్‌రెడ్డి, శ్రీధరఘట్ట

విద్యార్థుల ఉజ్వల భవితకు తోడ్పడండి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

రాయదుర్గం, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉజ్వల భవితకు తల్లిదండ్రులు సహకరించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ప్రకాశ్‌నాయుడు కోరారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఏకాగ్రత, ప్రశాంత వాతావరణంలో చదువుకోవటానికి అన్నిరకాల ఏర్పాట్లు చేయాలి. కొందరు విద్యార్థులు సక్రమంగా చదువుకోక ఉపాధ్యాయులపై అసత్య ఆరోపణలు చేస్తూ వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి పిల్లల విద్యాప్రగతి గురించి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిపై చర్చించారు.

నేడు 5కె రన్

రాయదుర్గం, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఆదివారం ఉదయం 6.30 గంటలకు 5కె రన్‌ను నిర్వహిస్తున్నట్లుగా మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని అక్కడి నుంచి వినాయక సర్కిల్, బళ్ళారిరోడ్డులోని ఉక్కడ ఆంజనేయ స్వామి, నేతాజి రోడ్డుమీదుగా రైల్వేస్టేషన్ రోడ్డు, కణేకల్లు రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయాన్ని ర్యాలీ చేరుకుంటుందని వివరించారు. రన్‌లో పట్టణానికి చెందిన అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ



కాలమానిని ఆష్కరణలో మున్సిపల్ ఆర్వో అమీర్‌బాషా, ఉపాధ్యాయులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి అమీర్‌బాషా కాలమానిని, దైనిందినిని ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ రామాంజనేయులు, ఆ సంఘం అధ్యక్షుడు అబ్దుల్లా, నాయకులు రవికుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల్లో చైతన్యం రావాలి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: గిరిజనులు బాగా చదువుకుని చైతన్యవంతులు కావాలని జిల్లా పరిషత్తు వైస్ ఛైర్మన్ సుభాషినమ్మ, తెదేపా నాయకుడు ఉమామహేశ్వరనాయుడు అన్నారు. శనివారం గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఆ సంఘం కాలమానిని ఆవిష్కరించారు. పట్టణంలోని ఉమామహేశ్వరనాయుడు నివాసంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గిరిజనలు విద్య, వైద్య, రక్షణ రంగాల్లో ఉన్నత హోదాల్లో ఉండాలన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మురళి, ప్రసాద్, విద్యార్థి నాయకులు అశ్వర్థనాయక్, దశరథ్‌నాయక్, చంటినాయక్, రాజేంద్ర, ఎర్రిస్వామినాయక్, నాగేష్ నాయక్, ధనుంజయ, కృష్ణనాయక్‌లు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే మానవ మనుగడ

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని సంరక్షించి మానవ మనుగడ కాపాడాలని మంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలో 15వ వార్డులో గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన శివశక్తిలీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు వివిధ రకాల మొక్కలను ఆయన పంపిణీ చేశారు. మొక్కలు సరఫరా చేసినందుకు సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు. ఆ సంస్థ మేనేజర్ రాజేష్ బాబు, కిరణ్ కుమార్, లీలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మొక్క పంపిణీ చేస్తున్న మంత్రి కాలవ

ఇమామ్ మృతికి మంత్రి సంతాపం

పట్టణంలోని టిప్పుసుల్తాన్ మసీదులో ఇమామ్‌గా పనిచేస్తున్న మహమ్మద్ షరీఫ్ మృతికి మంత్రి కాలవ శ్రీనివాసులు సంతాపాన్ని తెలిపారు. శనివారం ఉదయం మహమ్మద్ షరీఫ్ ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. ఆయన వెంట మైనార్టీ నాయకులుహమీద్, షబ్బీర్, తదితరులు ఉన్నారు.

కాలనీ కబుర్లు

- పార్వతీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో మురుగు పేరుకుపోయింది. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. మురుగును తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- టీచర్స్ కాలనీలోని ఉత్తర వైపున సీసీ రోడ్లు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.
- కోతిగుట్ట కాలనీలో అనంతపురం ప్రధాన రహదారికి ఆనుకుని మురుగు ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు కదిలేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.
- ఎన్‌టీఆర్ కాలనీలో భంభం బాబా ఆశ్రమానికి వెళ్లే దారిలో దాదాపు 40 కుటుంబాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదు. కేవలం ట్యాంకర్ల పైనే ఆధార పడాల్సి వస్తోంది. పైపులను ఏర్పాటు చేసి తాగునీటి కొరతను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

రాయదుర్గం

వ్యక్తిగత మరుగుదొడ్డితో వ్యాధులు దూరం

43ఉడేగోళం (కణేకల్లు): ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకోవడంతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్యుడు నాగరాజు సూచించారు. శనివారం మండలంలోని 43ఉడేగోళం గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులు. నినాదాలు చేస్తూ.. ప్లకార్డులు చేతపట్టి గ్రామ వీధుల్లో చైతన్య ప్రదర్శన నిర్వహించారు.

మార్కెట్‌లో కూరగాయల ధరలు నిన్నటివి (కిలో..రూ.ల్లో)

వంకాయలు - 20, టమోట - 5, బెండ- 30, కాకర- 30, బీర- 30, క్యాబేజీ- 30, చిక్కుడు- 30, క్యారెట్- 80, అల్లం- 50, పచ్చిమిర్చి- 30, వెల్లుల్లి- 60, క్యాప్సికం- 80, ఉల్లి- 50.

మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివృద్ధి



లంబాడి విద్యార్థినులతో మంత్రి కాలవ

మలపనగుడి (రాయదుర్గం గ్రామీణం), న్యూస్‌టుడే: మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. డి.హిరేహాళ్ మండలం మలపనగుడి గ్రామంలో అధికారులు శనివారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో మంత్రి కాలవ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ 30 ఏళ్ల పాలనతో పోలిస్తే తెలుగుదేశం ప్రభుత్వం మూడున్నరేళ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. అభివృద్ధిపై ఎలాంటి బహిరంగ చర్చకైనా సిద్ధమని సవాలు విసిరారు. ఎన్నికల్లోగా మలపనగుడి గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేస్తానని తెలిపారు. మలపనగుడి గ్రామ పంచాయతీలో రూ.8.55 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. మలపనగుడి గ్రామంలో రూ.15లక్షలతో నూతన గ్రామ సచివాలయం నిర్మిస్తామన్నారు. గంగభవానీ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ అర ఎకరం స్థలం కేటాయించాలని తహసీల్దార్ ఖతిజున్‌కుబ్రాను ఆదేశించారు. రూ.10లక్షలతో నూతన ఆలయం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జన్మభూమి కార్యక్రమంలో లంబాడి విద్యార్థులు నిర్వహించిన నృత్యం ఆకట్టుకుంది. శ్రీనిధి రుణాలు, వడ్డీ లేని రుణాలు అందించి మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, ఎంపీపీ పుష్పావతి, కళ్యాణదుర్గం డివిజన్ జన్మభూమి నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి పరంధామ, ఎంపీడీఓ శివయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



తుంబిగనూరు: వడ్డీరాయితీ మంజూరు పత్రాల పంపిణీ



దర్గాహొన్నూరు: చంద్రన్న కానుకల పంపిణీ

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం, పూలకుంట గ్రామాల్లో మండలాధ్యక్షుడు పూజారి పాలయ్య జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన పేదలు సంక్షేమ పథకాల కోసం వినతులు అందించారు. మండల కన్వీనర్ గిరిమల్లప్ప, పూలకుంట సర్పంచి ముసల్‌రెడ్డి, సర్పంచి అనుసూయమ్మ, ఎమ్పీటీసీ సుజాత, పశువైద్యాధికారి నవీన్‌కుమార్, ఏపీఓ వెంకటేశ్‌నాయక్, ఏఈ దుర్గయ్య, మత్స్యశాఖ నాగరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దర్గాహొన్నూరు (బొమ్మనహాళ్): మండలంలోని దర్గాహొన్నూరు, గోవిందవాడ గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి, జడ్పీటీసీ వాణి పాల్గొని ప్రసంగించారు. అవినీతి రహిత పాలనకు తెదేపా ప్రభుత్వం నిదర్శనమన్నారు. మూడేళ్ల నుంచి విద్యుత్తు లైన్‌మెన్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. విద్యుత్తు లైన్‌మెన్‌ను నియమించాలని ఆందోళన చేశారు. మాజీ ఎమ్మెల్సీ, ప్రత్యేకాధికారి సనావుల్లా విద్యుత్తు ఉన్నతాధికారుల చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఉపకార వేతనాలు, డ్వాక్రా సంఘాలకు పావులా వడ్డీ, చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కేశప్ప, పార్వతి, ఎంపీటీసీ వేమన్న, తెదేపా మండల కన్వీనర్ బలరామిరెడ్డి, తహసీల్దారు శివయ్య, ఉపతహసీల్దారు గురుప్రసాద్, ఎంపీడీఓ గంగన్న, ఈఓఆర్డీ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

తుంబిగనూరు (కణేకల్లు): మండలంలోని తుంబిగనూరు గ్రామంలో జరిగిన జన్మభూమిలో తహసీల్దారు వాణిశ్రీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. 61 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు, మహిళా సంఘాలకు వడ్డీరాయితీ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ పార్వతమ్మ, తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప, ఎంపీటీసీ దేవమ్మ, సర్పంచి మారెన్న తదితరులు పాల్గొన్నారు.

గరుడచేడు (కణేకల్లు): అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలని గరుడచేడు సర్పంచి ప్రవీణ్ అధికారులను కోరారు. మండలంలోని గరుడచేడు గ్రామంలో ఎంపీడీఓ రెహనాబేగం ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

వేపరాళ్ల, మల్లాపురం, (రాయదుర్గం గ్రామీణం): మండలంలోని మల్లాపురం గ్రామంలో గ్రామ సర్పంచి సునీత అధ్యక్షతన జరిగిన జన్మభూమి కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. మల్లాపురం, తండా, పల్లేపల్లి, మెచ్చిరి గ్రామాలను కలుపుతూ ఉన్న ప్రధాన రహదారులను ప్రభుత్వం మరమ్మతులు చేయాలని గ్రామ ప్రజలు అధికారులను కోరారు. గ్రామ ప్రజల నుంచి 18 దరఖాస్తులు అందాయని రాయదుర్గం తహసీల్దారు నాగరాజు తెలిపారు. నాయకులు కమలాక్షుడు, నరేష్, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు. వేపరాళ్ల గ్రామంలో సర్పంచి శంకర్ అధ్యక్షతన జరిగిన జన్మభూమి కార్యక్రమంలో రాయదుర్గం ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీటీసీ తిమ్మక్క, రాయదుర్గం ఎంఈఓ నాగమణి హాజరయ్యారు. పక్కా గృహాలు, పింఛన్ల కోసం 12 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో తెదేపా నాయకులు వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.



మల్లాపురంలో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు



గుమ్మఘట్ట: మాట్లాడుతున్న ఎంపీడీఓ మునెయ్య

బస్సు సర్వీసు వేళలు (గంటల్లో) ఇలా..

కర్నూలు వయా బళ్ళారి: 6.15, 8.15, కర్నూలు అనంతపురం: 6.45, శ్రీశైలం: వయా బళ్ళారి :4.45, బెంగళూరు: 11.15, 22.30, విజయవాడ: 16.30, చెన్నై:19.00, హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్): 20.00, తిరుపతి: 20.30, అనంతపురం వైపు: ఉదయం 5 గంటల నుంచి రాత్రి 20.30 వరకు ప్రతి అరగంటకు ఒక బస్సు బయలుదేరుతుంది. బళ్ళారి వైపు: ఉదయం 5 గంటల నుంచి రాత్రి 19.45 వరకు ప్రతి అరగంటకు ఒక బస్సు బయలు దేరుతుంది. ఉరవకొండవైపు: ఉదయం 5.30 నిమిషాల నుంచి రాత్రి 19.30 వరకు ప్రతి అరగంటకు ఒక పల్లెవెలుగు బస్సు కలదు.

భక్తిశ్రద్ధలతో పూజలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని సుప్రసిద్ధ నేమకల్లు ఆంజనేయస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. శనివారం ప్రధాన అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, వెండి కవచాలంకరణ, పంచామృతాభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కమిటీ సభ్యులు చంద్రన్న, మాల్యం తిప్పన్న ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ కాశీనాథ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బొమ్మనహాళ్: స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ కిటకిటలాడింది. గోవిందుడి నామస్మరణతో ఆలయం మార్మోగింది.



పూజలు అందుకుంటున్న నేమకల్లు అంజన్న



సమస్యలు తెలుసుకొంటున్న మాజీ ఎమ్మెల్యే

హామీలు విస్మరించిన ప్రభుత్వం

కణేకల్లు, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం ఇచ్చిన హామీలు విస్మరించిందని వైకాపా మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని పుల్లంపల్లిలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చిక్కణ్ణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కల్గిస్తే చర్యలు

ఎన్.హనుమాపురం (కణేకల్లు), న్యూస్‌టుడే: ప్రజలంతా కలసిమెలసి జీవించే గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై రామారావు హెచ్చరించారు. శనివారం మండలంలోని ఎన్.హనుమాపురంలో ఎస్సై సిబ్బందితో కలసి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. చిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని ఘర్షణలకు పాల్పడకుండా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



ప్రజలకు సూచనలు ఇస్తున్న ఎస్సై



రొట్టె, పాలను పంపిణీ చేస్తున్న సీహెచ్‌ఓ

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు సీహెచ్‌ఓ ప్రదీప్‌కుమార్, సూపర్‌వైజర్ బాబురాజు పేర్కొన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భిణులకు టీకాల కార్యక్రమం నిర్వహించి పరీక్షలు చేశారు. అనంతరం రొట్టె, పాలను అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ షకీలాబేగమ్, స్టాఫ్‌నర్సు రోజమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాప్తాడు

నేడు రామగిరిలో 5కె రన్

రామగిరి: ఐదో విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రం రామగిరిలో 5కె రన్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పూల నరసింహులు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పరిటాల సునీత ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 6 గంటలకే ప్రారంభమవుతుందని, మండలంలోని అధికారులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల పరిధిలోని పేరూరు గ్రామంలో ఈ నెల 8న జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మైనార్టీ విద్యను బలోపేతం చేద్దాం

అనంతపురం విద్య: మైనార్టీ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పీఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జిల్లాలోని మదరసాల్లో బోధన చేసే వలంటీర్లకు వారం రోజుల పాటు నిర్వహించే శిక్షణ శనివారం ప్రారంభం అయింది. మదరసాల్లో అరబిక్‌తో పాటు ఇతర సబ్జెక్టులను బోధించడం వల్ల ఉన్నత చదువులు చదవడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 16 మదరసాల్లో ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో బోధన జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అలెస్కో బాలమురళి, ఏఎంఓ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి రుణం కొంతైనా తీర్చుకుందాం



ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి పరిటాల సునీత

కనగానపల్లి, న్యూస్‌టుడే: జన్మభూమి రుణం కొంతైనా తీర్చుకోవటానికి ఉన్నత విద్యావంతులు, వ్యాపారులు ముందుకు రావాలని మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. మండలంలోని తగరకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన జన్మభూమి- మాఊరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రగతి పథంలో పయనించేలా వారికి బాసటగా నిలిచిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు తెదేపా ప్రభుత్వం ప్రతి గ్రామంలో సీసీ రహదారులు, అధునాతన పద్ధతిలో అంగన్‌వాడీ భవనాలు, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించటానికి కమ్యూనిటీ, పంచాయతీ, ఆరోగ్య ఉపకేంద్రాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. చిన్నారుల్లో, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా వారి ఆరోగ్యానికి భద్రత కల్పించాలని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలమృతం, అన్న అమృత హస్తం ద్వారా రోజూ నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, లేని పక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామాల్లో పర్యటించి నాలుగు రోజులపాటు అక్కడే ఉండి నిర్మాణాలను చేయిస్తారన్నారు. అనంతరం రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఉద్యానశాఖ అధికారులు ఏర్పాటుచేసిన ఆహార ఉత్పత్తులను పరిశీలించారు. చెరువులకు నీరందించి సాగు, తాగునీటికి ఆటంకం లేకుండా చేయడంతో మంత్రిని గ్రామస్థులు సత్కరించారు. ప్రజల సమస్యలను వినతిరూపంలో అధికారులకు అందజేశారు. రాష్ట్ర పరిశీలకులు రవికుమార్, పీడీ వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ పీడీ హరేరామ్‌నాయక్, ఎంపీడీవో కుళ్లాయిస్వామి, తహసీల్దార్ కుమార్‌స్వామి, ఎంపీపీ పద్మగీత, జిల్లా ఉపాధ్యక్షుడు నెట్టెం వెంకటేష్, జిల్లా కార్యదర్శి మాధవరాజు తదితరులు పాల్గొన్నారు.

పాతపాళ్యంలో..: సమస్యల పరిష్కారానికి జన్మభూమి-మాఊరు కార్యక్రమం సరైన వేదిక అని ఎంపీపీ సరిపూటి పద్మగీత అన్నారు. శనివారం మండలంలోని పాతపాళ్యం గ్రామంలో సర్పంచి నారాయణ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో ఎంపీడీవో కుళ్ళాయిస్వామి మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకాన్ని ప్రజలకు తెలియచేయడమే కాకుండా.. గ్రామాల్లో సమస్యలను నేరుగా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తున్నామని అన్నారు. గ్రామంలోని వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి ప్రజలకు వైద్యసేవలను అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేసి, వాటి ఉపయోగాలను వివరించారు. అనంతరం ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ప్రధాన కార్యదర్శి రాజాకృష్ణ వైద్యుడు శ్రీహర్ష, అధికారులు, జన్మభూమి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రామగిరి: తెదేపా ప్రభుత్వంలో పల్లె ప్రగతే లక్ష్యంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల, అభివృద్ధి పనులను చేపట్టినట్లు ఎంపీపీ పరంధామ యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మాదాపురం గ్రామంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచి సురేంద్రనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మౌలిక సదుపాయాలపై చర్చించారు. మాదాపురం పంచాయితీ పరిధిలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.35 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమం అనంతరం రాయితీపై వచ్చిన మినీ ట్రాక్టర్, చంద్రన్న సంక్రాంతి కానుకలు, ఉపకారవేతనాలు పంపిణీ చేశారు. అనంతరం పలువురు ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు, కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం అర్జీలు ఇచ్చారు. తెదేపా నాయకులు రామ్మూర్తినాయుడు, తహసీల్దార్ ఆదినారాయణ, ఎంపీడీవో పూల నరసింహులు, విద్యుత్తు, ఆర్‌డబ్ల్యూఎస్, గృహనిర్మాణశాఖల ఏఈలు నాగరాజు, జనార్దన, రాజేష్, పశువైద్యురాలు రమాదేవి, ఏవో ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మాదాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన ఏర్పాటుచేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అమరేంద్ర

వెంకటాంపల్లి (చెన్నేకొత్తపల్లి): మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన కనీస వసతులను కల్పించడమే తమ ధ్యేయమని ఎంపీపీ అమరేంద్ర, జడ్పీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, ధర్మవరం మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు ఓబిలేసు పేర్కొన్నారు. మండలంలోని ఓబుళంపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో శనివారం జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రజలకు మంచి నీటిని అందిస్తున్నట్టు చెప్పారు. సీసీదారులు, మురుగుకాల్వలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి చొరవ చూపడమేగాక, వాటిని సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్యకేంద్రాల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. వైద్యశిబిరాన్ని సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. చంద్రన్న సంక్రాంతి కానుకలు, కొత్తరేషన్ కార్డులు, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. ఎంపీడీవో రామాంజనేయులు, తహసీల్దార్ నాగరాజ, ఎంఈవో రాజశేఖర్, ఏపీఎం నాగేంద్ర, తెదేపా మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, స్థానిక సర్పంచులు వెంకటలక్ష్మమ్మ, భాగ్యలక్ష్మి, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.



రామగిరి: మినీ ట్రాక్టరును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయం

సనప (ఆత్మకూరు), న్యూస్‌టుడే: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తమ ధ్యేయమని ఎంపీపీ మారెక్క, జడ్పీటీసీ సభ్యుడు కుళ్లాయప్ప పేర్కొన్నారు. మండలంలోని సనప, రంగంపేట గ్రామాల్లో శనివారం జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టడమే కాకుండా వాటిని పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. గ్రామాల్లోని వీధుల్లో నీటికొళాయిల ఏర్పాటు, సీసీదారుల నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆపై ఐసీడీఎస్ ఏర్పాటుచేసిన స్టాల్‌ను పరిశీలించారు. సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో ఆదినారాయణ, మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చికిత్స పొందుతూ మృతి

గాండ్లపర్తి (రాప్తాడు), న్యూస్‌టుడే: మండలంలోని గాండ్లపర్తి గ్రామ నివాసి సత్యమయ్య (50) అనంతపురం ప్రభుత్వ ఆసపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబీకులు, గ్రామ పెద్దలు తెలిపిన వివరాల మేరకు సత్యమయ్య శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న చింతచెట్టు పైకి ఎక్కి చింతకాయలు కోస్తున్న సమయంలో చెట్టుపై నుంచి అదుపు తప్పి కాలుజారి కింద పడిపోయాడన్నారు. తలకు, శరీరానికి తీవ్రగాయాలు తగలడంతో చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకోసం చేర్పించామన్నారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినటు తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బసినేపల్లి (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలోని బసినేపల్లి గ్రామ మలుపువద్ద శనివారం ఉదయం చోటుచేసుకొంది. ఎస్సై మహ్మద్‌రఫీ తెలిపిన వివరాల మేరకు ధర్మవరం పట్టణం పీఆర్‌టీ వీధికి చెందిన గంగాధర్ స్నేహితులతో కలసి కర్ణాటక రాష్ట్రం పావగడకు దైవదర్శనార్థం వెళుతుండగా.. బసినేపల్లి బస్టాప్‌వద్ద ఆగి ఉన్న ఎడ్ల బండిని ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో గంగాధర్ తీవ్రంగా గాయపడగా, ద్విచక్ర వాహనాల్లో వెనుక వస్తున్న స్నేహితులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గంగాధర్ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనలమేరకు అనంతపురం తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దిగుబడి అంచనాకే పంటకోత ప్రయోగాలు

మామిళ్లపల్లి (కనగానపల్లి), న్యూస్‌టుడే: రైతులు సాగు చేసిన పంటల దిగుబడిని అంచనా వేయటానికే పంటకోత ప్రయోగాలు చేపడుతున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మామిళ్లపలి గ్రామంలోని ఖరీఫ్ సీజన్‌లో బోరుబావుల కింద సాగుచేసిన వరి పంటతో పాటు మెట్ట భూమిలో కంది పంట దిగుబడిని క్షేత్రస్థాయిలో అంచనా వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏటా వర్షభావంతో పంట దిగుబడి వచ్చే సమయానికి వర్షాలు లేక పంట నష్టం వాటిల్లడంతో దిగుబడి తక్కువగా వచ్చేదన్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో పంటకు కావల్సినంత తేమ శాతం భూమిలో పుష్కలంగా ఉందని, దీంతో దిగుబడి శాతం అంచనాకు తగ్గట్టుగా నమోదైందన్నారు. నీటి సామర్థ్యం ఉన్న బోరుబావుల కింద సాగుచేసిన వరి పంటలో కూడా అనుకున్న దాని కంటే దిగుబడి అధికంగానే వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు, విజయభార్గవి, అనుసూయ, రైతులు పాల్గొన్నారు.



వరి పంటలో కొలతలు వేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి నిరంజన్‌రెడ్డి

సాంకేతిక విద్యతో విద్యార్థులకు మేలు

గొందిరెడ్డిపల్లి (రాప్తాడు), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉపాధ్యాయులు సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాలని విద్యాశాఖ అధికారి నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం రాప్తాడు మండలంలోని మండలంలోని గొందిరెడ్డిపల్లి, హంపాపురం ఉన్నత పాఠశాలల్లో విద్యాశాఖ అధికారులు పర్యటించారు. అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు సులువు రీతిలో విద్యను అందించేందుకు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలకు పంపిణీ చేసిన సాంకేతిక పరికరాలు నిరుపయోగంగా ఉంచకుండా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను అందిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

రాప్తాడు

త్వరలో పుల్లయ్యకుంట తండా రహదారి పనులు

కనగానపల్లి, న్యూస్‌టుడే: దశాబ్దాల కాలం గడిచిన రహదారిని అభివృద్ధి చేయకపోవటంతో పుల్లయ్యకుంట తండా మార్గంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేనవారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. సమస్యను మంత్రి పరిటాల సునీత దృష్టికి తీసుకువెళ్లటంతో స్పందించి రహదారి నిర్మాణానికి పంచాయితీ నిధులు రూ.66 లక్షలు మంజూరు చేయించారని ఎంపీపీ పద్మగీత చెప్పారు.

విద్యార్థికి సత్కారం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి దక్కింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విజేత ఇర్షాద్ అహ్మద్‌ను సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రావడంతో రూ.10 వేల నగదు, ప్రశంసా పత్రాన్ని మంత్రి పత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా అందుకున్నారు.



ఆచార్య నారాయణను సన్మానిస్తూ..

కష్టిస్తేనే విజయం సొంతం

ఎస్.కె.విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: కష్టిస్తేనే విజయం సొంతం అవుతుందని బోట్స్‌వానా విశ్వవిద్యాలయం ఆచార్యులు నారాయణ పేర్కొన్నారు. శనివారం ఎస్కేయూలోని ఆర్థికశాస్త్రం విభాగంలో ఆర్థికశాస్త్రంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు విషయ అవగాహన పెంచుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో అన్ని అంశాల్లో పట్టు సాధించాలని సూచించారు. మానవాభివృద్ధి అంటే జనాభా పెరుగుదల కాదని అక్షరాస్యత, ఆరోగ్యం, సమానత, గౌరవం, జీవన నైపుణ్యాల పెంపు అని గుర్తు చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి వెంకటనాయుడు, మాజీ రిజిస్ట్రార్ దశరథరామయ్య, ఆచార్యులు జయరాజ్, బావయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆచార్యుడికి జీవన సాఫల్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఆచార్య వేణుగోపాల్‌రావు

ఎస్.కె. విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కళాశాల అభివృద్ధి కమిటీ డీన్, ఎంబీఏ విభాగం అధిపతి ఆచార్య వేణుగోపాల్‌రావు జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. శనివారం తమిళనాడులోని భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో అవార్డులను ప్రదానం చేశారు. మేనేజ్‌మెంట్ రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ఎస్కేయూ ఆచార్యునికి మాత్రమే ఈ అవార్డును అందజేశారు.



సప్తగిరి కూడలిలో నాయకుల నిరసన

విద్యార్థుల ఆత్మహత్యలు అరికట్టండి

రాంనగర్(అనంతపురం): విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలు నివారించాలని డిమాండ్ చేస్తూ శనివారం సప్తగిరి కూడలిలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కళాశాలలను గుర్తించి అనుమతులు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాము, నాయకులు నరసింహారెడ్డి, కార్తీక్, బసిరెడ్డి, గోపీకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శపాఠశాలలో కంప్యూటర్ విద్యలో శిక్షణ

గ్రామీణ విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించటానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృత్తి విద్య కోర్సులతో మంచి ఫలితాలు వస్తున్నాయి. అన్ని వసతులతో కూడిన విద్యను అందించడానికి ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసి చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆదర్శ పాఠశాలలో విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి లక్ష్యం దిశగా సాగుతున్నారు.



విద్యార్థులకు క్రీడలపై అవగాహన

వసతుల్లో ఆదర్శం.. శిక్షణలో ఆధునికం!

రాప్తాడు, న్యూస్‌టుడే

రాప్తాడు సమీపంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటూ వృత్తివిద్య కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థులకు ఎంపిక చేసి నాలుగు సంవత్సరాల పాటు శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలకు 40 ల్యాప్‌ట్యాప్‌లు, ప్రొజెక్టర్, విద్యుత్తు పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. విద్యార్థులకు రోజుకు గంటపాటు కంప్యూటర్‌పై అవగాహన, ఆన్‌లైన్లో సమాచారం తెలుసుకోవడం, ఇంటర్‌నెట్ వివరాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన, మానవ సంబంధాలు, డ్రాయింగ్ వంటివాటిపై అవగాహన కల్పిస్తున్నారు. ఎంపికచేసిన 80 మంది విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులతో పాటు క్రీడల్లో కూడా తర్ఫీదు ఇస్తున్నారు. ప్రిజమ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వృత్తివిద్య కోర్సులు, వ్యాయామ విద్యను అందిస్తున్నారు. కోర్సు పూర్తయిన వెంటనే కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్నారు. దీంతో కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థులు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకునేందుకు అవకాశం ఉంది.

అన్ని రంగాల్లో రాణించేలా..

- రాజేష్, విద్యార్థి, ఆదర్శ పాఠశాల



ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో విద్యను నేర్పుతున్నారు. ఉపాధ్యాయులు నేర్పిన విద్యను మరచిపోకుండా నేర్చుకుంటున్నాం. ఉపాధ్యాయులు నేర్పిన ప్రత్యేక విద్యతో రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో రాణించడానికి వీలుంది.

క్రీడల్లో మెలకువలు నేర్పుతున్నారు

- వైష్ణవి, విద్యార్థిని, ఆదర్శ పాఠశాల



ఆరో తరగతి నుంచి ఆదర్శ పాఠశాలలో చదువుతున్నాను. నాలుగేళ్లుగా ఆటల్లో పోటీలు నేర్పుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వ్యాయామ విద్యను ప్రవేశపెట్టి క్రీడలు నేర్పుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నేర్పిన విద్యతో క్రీడల్లో రాణించడానికి వీలుంది.

అన్నీ అందుబాటులోకి తెచ్చాం

- శరత్‌చంద్ర, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల



ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సాంకేతిక పరికరాలు అందించారు. పంపిణీ చేసిన పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చాం. పాఠశాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించడంతో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో మెలకువలు నేర్చుకుంటున్నారు.

అలరించిన త్యాగరాజ సంగీత విభావరి

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక విజయవాణి సంగీత కళానిలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం ఆలయంలోని త్యాగరాజస్వామి ప్రతిమకు పంచామృతాభిషేకం, అర్చనలు, సంగీత విద్వాంసుల పంచరత్నగాన సేవలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన సంగీత విభావరి అలరించింది. బెంగళూరుకు చెందిన గాయకులు కాసరవల్లి సోదరీమణులు రూప, దీపలచే కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరి, గీతాలాపనలు చేశారు. కళానిలయం నిర్వాహకులు మురళీకృష్ణ, భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.



గీతాలాపన చేస్తున్న గాయకులు

దక్షిణభారత మండలి జూడో జట్టు ఎంపిక

ఎస్.కె.విశ్వవిద్యాలయం: దక్షిణభారత మండలి జూడో జట్టును వర్సిటీ క్రీడా కార్యదర్శి జెస్సీ ప్రకటించారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠంలో జరిగే పోటీల్లో వర్సిటీ జట్టు తలపడనుంది. పోటీల్లో అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన గోవర్ధన్, వన్నూరుస్వామి, మహమ్మద్ అలి, పీవీకేకే డిగ్రీ కళాశాలకు చెందిన చందునాయుడు తదితరులు ఎంపిక అయ్యారు. మేనేజరుగా ఎం.జబీవుల్లా వ్యవహరించనున్నారు.

నిర్మాణాల్లో తాటిచెర్ల ఆదర్శం

పాములరాయి, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో తాటిచెర్ల గ్రామం ఆదర్శంగా నిలిచిందని డ్వామా పీడీ జ్యోతిబసు కితాబిచ్చారు. దాదాపు 98 శాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కావడం సంతోషంగా ఉందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసిన తొలి పంచాయతీగా తాటిచెర్ల గుర్తింపు సాధిస్తుందన్నారు. శనివారం ఐదో విడత జన్మభూమి కార్యక్రమం అనంత గ్రామీణ మండలం తాటిచెర్లలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ కింద నిర్మించిన మరుగుదొడ్లకు బిల్లులు రాలేదని, వాటిని తక్షణమే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో వీఆర్‌ఓ ఆదినారాయణ, క్షేత్ర సహాయకుడు జనార్ధన్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు. జడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్ మాట్లాడుతూ జన్మభూమి ద్వారా అనేక సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, మార్కెట్‌యార్డు మాజీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సర్పంచి రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఎంపీడీఓ ఓబుళమ్మ, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మరుగుదొడ్డిని ప్రారంభిస్తున్న ఎంపీపీ మాధవి

శింగనమల

నేడు గ్రామ జాతర

నిదనవాడ (శింగనమల), న్యూస్‌టుడే: మండల పరిధిలోని నిదనవాడ, ఇరువెందుల గ్రామాల్లో గ్రామ జాతర నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ పెద్దలు తెలిపారు. నిదనవాడ గ్రామంలోని శ్రీపెద్దమ్మ, శ్రీనల్లమ్మ అమ్మవార్లకు భోనాలను సమర్పించి ప్రత్యేక పూజలను చేస్తున్నట్లు వివరించారు. గ్రామస్థులు ఐక్యతతో గ్రామ దేవతల పూజలను చేస్తున్నామన్నారు. ఇరువెందుల గ్రామంలో పెద్దమ్మ అమ్మవారికి బోనాల పండగ చేస్తున్నట్లు గ్రామ పెద్దలు చెప్పారు.

నిరంజన గురు రంగస్వామి ఆరాధన మహోత్సవం

పుట్లూరు: మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలో ఈ నెల 16న అవధూత శ్రీ నిరంజన గురు రంగస్వామి ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో 16న స్వామివారికి పూజల నిర్వహణ, తీర్థ ప్రసాద పంపిణీ ఉంటాయని చెప్పారు. మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి గ్రామోత్సవం, రాత్రి నుంచి ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమాలు, రాత్రికి భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

దాతల స్ఫూర్తి.. తీరుతున్న దాహార్తి

పాఠశాలల్లో శుద్ధజల ప్లాంట్ల ఏర్పాటుతో తాగునీటి కష్టాలకు చెల్లు



కల్లూరులో శుద్ధ జల యంత్రాన్ని ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో తాగు నీటి సౌకర్యం లేక చాలా చోట్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో నీరు లేక ఎక్కిళ్లు పట్టినా.. తాగటానికి గుక్కెడు నీరు దొరకని పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం దాదాపు అన్ని పల్లెల్లో శుద్ధజలాన్నే తాగుతున్నారు. విద్యార్థులు కూడా ఇంటి నుంచే సీసాల్లో నీటిని పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. వీరి ఇబ్బందులను గుర్తించిన కొందరు దాతలు పాఠశాలల్లో శుద్ధజల ప్లాంట్లను ఏర్పాటుచేసి తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. దీంతో విద్యార్థులకు శుద్ధ జలం అందుబాటులోకి వస్తోంది.

ఆదుకున్న ఔదార్యం

యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ప్రతాప్‌రెడ్డి తాను చదివిన పాఠశాలకు ఏదైనా సాయం చేయాలని భావించారు. విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని తెలుసుకొని, ప్లాంటును ఏర్పాటు చేయాలంటే అధిక వ్యయం అవుతుంది. ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రామంలోని శుద్ధజలం ప్లాంటు నుంచి శుద్ధజలాన్ని క్యాన్ల ద్వారా రెండేళ్లుగా పాఠశాలకు చేరవేస్తూ 109 మంది విద్యార్థులకు శుద్ధ జలాన్ని అందిస్తున్నారు.

పాఠశాల రుణం తీర్చుకోవటానికి..

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నప్పుడు అక్కడి విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను గుర్తించి, శుద్ధజల ప్లాంటును ఏర్పాటు చేయాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా గత ఏడాది సెప్టెంబరు 15న శుద్ధజలం ప్లాంటును ఏర్పాటుచేయటంతో 478 మంది విద్యార్థుల దాహార్తి తీరుతోంది. పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి తాగటానికి నీళ్లు తెచ్చుకోవాల్సిన అవస్థ తప్పింది.

గ్రామస్థుల సహకారంతో..

ఇల్లూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నీటి సమస్యను తెలుసుకున్న గ్రామస్థులు పాఠశాల రుణం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. శుద్ధజల ప్లాంటును ఏర్పాటు చేసి 245 మంది విద్యార్థులకు తాగునీటిని అందిస్తున్నారు.



ఇల్లూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ప్లాంటు

తాగునీటి సమస్య తీరింది



పాఠశాలలో తాగునీరు లేకపోవటంతో విద్యార్థులకు బాగా ఇబ్బందిగా ఉండేది. ఇంటి నుంచి నీటి బాటిళ్లను తీసుకొచ్చి పొదుపుగా వాడుకునేవారు. మధ్యాహ్న భోజనం అనంతరం బాటిళ్లలో నీరు అయిపోతే ఇబ్బందులు పడేవారు. చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకోవటానికి పూర్వ విద్యార్థులు ముందుకువచ్చి పాఠశాలలో శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేశారు. దీంతో తాగునీటి సమస్య తీరింది.

- భాస్కర్‌నారాయణ, ప్రధానోపాధ్యాయుడు, జడ్పీహెచ్‌ఎస్ కల్లూరు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గ్రిగ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

యర్రగుంట్ల (గార్లదిన్నె గ్రామీణం): గ్రిగ్స్ పోటీలను నార్పలలో జనవరి 1 నుంచి 6 వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు హరినాథ్ శనివారం తెలిపారు. త్రోబాల్ విభాగంలో జూనియర్స్, సీనియర్స్‌లో బాలికల జట్టు రన్నర్స్‌గా విజయం సాధించినట్లు పీఈటీలు వెంకటలక్ష్మి, కుమార్ వివరించారు. జూనియర్స్, సీనియర్స్ బాలికలు ప్రతిభ కనబరచడం ఇదే మొదటిసారని హెచ్‌ఎం అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులతోపాటు, గ్రామస్థులు అభినందించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలు

పుట్లూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 16 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ లావణ్య పేర్కొన్నారు. ఏప్రిల్ 8న ప్రవేశ పరీక్షలో పాల్గొనే విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి నెల 16 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. సంబంధిత వివరాలకు ఆదర్శ పాఠశాల్లో సంప్రదించి తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 7032996402 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

బొగ్గు వ్యాపారుల గుట్టు రట్టు

శింగనమల, న్యూస్‌టుడే: అధికారులను పక్కదోవ పట్టించి మోసం చేస్తూ వ్యాపారం చేస్తున్న బొగ్గుల వ్యాపారుల గుట్టు రట్టయింది. అనుమతి ఒక చోట తీసుకొని ఆ అనుమతితో మండల వ్యాప్తంగా వ్యాపారం సాగిస్తున్న వారిని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. తరిమెల గ్రామానికి చెందిన కొందరు వ్యాపారులను శనివారం విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకొన్నారు. నిదనవాడ గ్రామంలో అనుమతి లేకుండా కాల్చుతున్న బొగ్గుల బట్టీని పరిశీలించారు. అక్రమంగా బొగ్గులు తరలిస్తున్నారని వారిని పట్టుకున్నారు. ఈ నెల 5న శింగనమల మండలం రాచేపల్లి నుంచి వెళ్లిన బొగ్గుల లారీని విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తన బృందంతో జిల్లా కేంద్రంలో పట్టుకున్నారు. అనుమతి పత్రాలను పరిశీలించారు. రాచేపల్లి గ్రామంలో బొగ్గులు కాలుస్తున్నట్లు అనుమతి తీసుకొన్నారు. అయితే ఆ గ్రామంలో బొగ్గులు కాల్చడం లేదని అధికారుల తనిఖీలో తేలింది. అక్కడ పొందిన అనుమతితో నిదనవాడ, తరిమెల ఇతర గ్రామాల్లో బొగ్గుల బట్టీలు ఏర్పాటు చేసి బొగ్గులను ఇతర జిల్లాలకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు నిర్ధారించామని విజిలెన్స్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కొందరు వ్యాపారులు అనుమతి పత్రాలతో మోసం చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ తనిఖీలో అటవీ శాఖ అధికారి వెంకటరమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు 5కె రన్

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఆదివారం ఉదయం బుక్కరాయసముద్రంలో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు బీకేఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం. సుమంగళి, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమాల్లో భాగంగా విద్యావికాసం కోసం సర్పంచి రమాదేవి ఆధ్వర్యంలో ఈ 5కె రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 6.30 గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఈ 5కె రన్ ప్రారంభమవుతుందన్నారు. మొదటి మూడు స్థానాల్లో వచ్చిన విజేతలకు బహుమతులు అందిస్తారన్నారు.

పుట్లూరు: మండల కేంద్రం పుట్లూరులోని తహసీల్దారు కార్యాలయం నుంచి ఆదివారం ఉదయం 6.30 గంటలకు 5కే రన్ కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. కడవకల్లులో ఉదయం 8.30 గంటలకు 5కే రన్ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అధికారులు, యువకులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వివరించారు.

గార్లదిన్నె గ్రామీణం: మండలంలోని అన్ని గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య 5కె రన్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. గార్లదిన్నెలో నిర్వహించే కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, జన్మభూమి కమిటీ సభ్యులు, మహిళాసంఘాలు, పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లోనూ పంచాయతీ కార్యదర్శులు ప్రజలతో 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చింతకుంట (పుట్లూరు), న్యూస్‌టుడే: మండలంలోని చింతకుంట బాటసుంకులమ్మ పరిసరాల్లో శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. తాడిపత్రి నుంచి కడవకల్లుకు వస్తున్న ఉల్లికంటి నరసింహుడు కుమారుడు నరసింహుడు వాహనం, కడవకల్లు నుంచి తాడిపత్రికి వెళుతున్న శ్రీనివాసులు, ఓబులేసుల వాహనం పరస్పరం ఢీకొనడంతో వాటిపై ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఉల్లికంటి నరసింహుడుకు కుడికాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ఓబులేసు, శ్రీనివాసులుకు కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నరసింహుడును హుటాహుటిన అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కడవకల్లు గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు.



తీవ్రంగా గాయపడిన నరసింహుడు



బీకేఎస్ రహదారిపై ధర్నా చేస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

మందకృష్ణను విడుదల చేయాల్సిందే

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ ఉద్యమనేత మందకృష్ణను అక్రమంగా జైలులో నిర్బంధించిన ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ శనివారం బీకేఎస్‌లో ఎంఆర్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం- తాడిపత్రి ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు ప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ చేస్తేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని, గత 20 ఏళ్లుగా ఉద్యమం చేస్తున్న నేతను తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా నిర్బంధించటం అన్యాయమన్నారు. మందకృష్ణను విడుదల చేసేవరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. ఎంఆర్పీఎస్ నాయకులు ప్రధాన రహదారిపై రెండు గంటలకుపైగా బైఠాయించటంతో రహదారిపై వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో బుక్కరాయసముద్రం పోలీసులు ఎంఆర్పీఎస్ నాయకులను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు నాగలింగ, వెంకటేష్, సూరి, ఓబుళపతి, రాజశేఖర్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

శింగనమల

ఘనంగా గ్యార్మీ పండగ

పెద్దపప్పూరు: మండలకేంద్రంలో గ్యార్మీ పండగను ముస్లిం సోదరులు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన జెండాలను పురవీధుల్లో ఊరేగించారు. దస్తగిరి స్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పూల మాలలతో దస్తగిరిస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ముస్లిం మత పెద్దలు షెక్షావలి, పకృద్దీన్, అహమ్మద్, హాజీవలి, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం అవసరం

నార్పల గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం అవసరమని పీడీ నగేష్ పేర్కొన్నారు. జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా నార్పల బాలుర ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జన్మ భూమి కార్యక్రమంలో భాగంగా క్రీడాపోటీలను నిర్వహిస్తోందన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



రైతురథం ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నార్పల గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని ఎమ్మెల్యే యామినీబాల, తెదేపా రాష్ట్రకార్యదర్శి ఆలం నరసానాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని రంగాపురం, గూగూడు గ్రామాల్లో శనివారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రహిత పాలనను అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం రైతురథం ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆకుల అరుణ, జడ్పీటీసీ సభ్యురాలు ఆలం శిరీష, వైస్ ఎంపీపీ తిప్పన్న, ఎంపీటీసీ సభ్యులు ఆంజనేయులు, వేణు, తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపీడీవో సాల్మన్‌రాజు అధికారులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని సూరేపల్లి, చాలవేముల, గాండ్లపాడు గ్రామాల్లో శనివారం జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో చాలవేములలో, తహసీల్దారు ఆధ్వర్యంలో సూరేపల్లిలో, హౌసింగ్ ఏఈ యూసఫ్ ఆధ్వర్యంలో గాండ్లపాడులో గ్రామసభలను ఏర్పాటుచేశారు. సూరేపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో తహసీల్దారు పుల్లన్న మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీర్చడమే జన్మభూమి కార్యక్రమ లక్ష్యమని వివరించారు. సర్పంచి రంగమోహన్, ఎంపీటీసీ సభ్యురాలు అనూరాధ, పలువురు అధికారులు పాల్గొన్నారు. సూరేపల్లి, చాలవేముల, గాండ్లపాడు గ్రామాల్లో జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం, తదితర క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు తహసీల్దారు పుల్లన్న బహుమతులను పంపిణీ చేశారు.

గొడ్డుమర్రి (యల్లనూరు): ప్రజా సమస్యలపై ఆయా శాఖల అధికారులు తక్షణమే స్పందించాలని నోడల్ అధికారి సోమశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని చింతకాయమంద, గొడ్డుమర్రి గ్రామాల్లో శనివారం జన్మభూమి గ్రామసభలను తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో విష్ణుప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా గ్రామసభలకు శింగనమల నియోజకవర్గం నోడల్ అధికారి, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీరు సోమశేఖర్, మండల ప్రత్యేకాధికారి రాధాకృష్ణ హాజరయ్యారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. వివిధ సమస్యలపై 50 వినతులు వచ్చినట్లు తహసీల్దారు



చింతకాయమందలో జన్మభూమి గ్రామసభ

పేర్కొన్నారు. చింతకాయమందలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, ఎంఈవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయాధికారి ఆంజనేయులు, వైద్యులు వినయ్‌కుమార్‌రెడ్డి, పర్యవేక్షకురాలు పల్లవి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీకె.పల్లి (బుక్కరాయసముద్రం): అధికారులు, కార్యకర్తలు, ప్రజల సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని తెదేపా జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని దయ్యాలకుంటపల్లి గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామ సభలో ఆయన జడ్పీటీసీ సభ్యుడు రామలింగారెడ్డితో కలసి పాల్గొన్నారు. రెడ్డిపల్లిలో నిర్వహించిన జన్మభూమి గ్రామ సభలో తహసీల్దార్ రామకృష్ణయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు, సర్పంచి ఆదిశేషయ్య ప్రజలకు నూతన పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు, చంద్రన్నబీమా పరిహారాన్ని అందజేశారు. తెదేపా నాయకులు అశోక్, డీకే పల్లి సర్పంచి కాటమయ్య, లక్ష్మినారాయణ, పెద్దప్ప, జొన్నారామయ్య, సీఎస్‌డీటీ పుణ్యవతి, ఏపీఎం నారాయణస్వామి, ఏవో చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిరివరం (గార్లదిన్నె గ్రామీణం): సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారి హీరేనాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని శిరివరం గ్రామంలో శనివారం సర్పంచి రామాంజనేయులు ఆధ్వర్యంలో జన్మభూమి- మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులు పంపిణీ చేశారు. రేషన్‌కార్డులు, పింఛన్లు వంటి పలు సమస్యలపై ఎనిమిది అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్‌రెడ్డి, ఎంఈవో తారాచంద్రానాయక్, ఇన్‌చార్జ్ ఈవో ఆర్డీ ముత్యాలరెడ్డి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కనుంపల్లి (గార్లదిన్నె గ్రామీణం): అర్హులకు అందించే ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో భాస్కర్‌రెడ్డి అన్నారు. కనుంపల్లి గ్రామంలో శనివారం సర్పంచి నల్లపరెడ్డి ఆధ్వర్యంలో జన్మభూమి మాఊరు నిర్వహించారు. గ్రామంలోని రైతులకు పంటనష్టపరిహారం, ఉచిత జింక్, జిప్సమ్, బోరాన్ సక్రమంగా అందలేదని, విద్యుత్తు టాన్స్‌ఫార్మర్‌లు ఇవ్వడం లేదని రైతులుఅధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి 13 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎంపీపీ నాగరాజు, మండల కన్వీనర్ కోటంక జయరాం, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



డీకె.పల్లిలో చంద్రన్నబీమా పత్రాల అందజేత

పేదల సమస్యలు తెలుసుకునేందుకే

నిదనవాడ (శింగనమల): పేదల సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేసేందుకు జన్మభూమి చక్కటి వేదికగా నిలుస్తోందని ఎంపీపీ అమృత పేర్కొన్నారు. మండల పరిధిలోని నిదనవాడ, నాయనవారిపల్లి గ్రామాల్లో శనివారం జన్మభూమి- మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. నాయనవారపల్లిలో (రేషన్, పింఛను, ఎన్టీఆర్ గృహాలకు దరఖాస్తులను స్వీకరించారు. సర్పంచి నరసయ్య గ్రామంలో అభివృద్ధి పనులను వివరించారు. తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీవో జయరాం, వివిధ శాఖల అధికారులు, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



నిదనవాడలో చంద్రన్న కానులకు అందిస్తున్న ఎంపీపీ



శింగనమల: సాముహిక సీమంతాలు చేస్తున్న అధికారులు

పౌష్టికాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం

నాయనవారిపల్లి (శింగనమల), న్యూస్‌టుడే: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో వనజా అక్కమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేంద్ర, సర్పంచి నరసయ్య, ఏపీఎం నీలవేణి, ఏఈవో శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నార్పల గ్రామీణం: తల్లి ఆరోగ్యంగా ఉంటే జన్మించే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని సర్పంచి ఆకుల నాగలలిత పేర్కొన్నారు. నార్పల పంచాయతీ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ద్వారా అమలవుతున్న పథకాలపై స్టాళ్లను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్, నాగనంద, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, లక్ష్మీ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ విద్యార్థులు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛబారత్ కార్యక్రమంలో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడం వల్ల ఉపయోగాలను ప్రజలకు తెలియజేసేందుకు శనివారం విద్యార్థులతోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు. ఇంటింటా సర్వే చేపట్టి ఇదివరకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు లేనివారికి అవగాహన కల్పించారు. దాదాపు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల చిత్రలేఖనం

వెంకటాపురం (బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం. వసుంధరాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ఆకర్షణీయమైన చిత్రాలు గీసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గీసిన చిత్రాలు తోటి విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయులు శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడలు, ఎన్ఎస్ఎస్, చిత్రలేఖనం పోటీలతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించడం వల్ల విద్య, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఉత్తమ చిత్రాలు గీసిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అందరూ. . చదవాలి, అందరూ... ఎదగాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణ రాజు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పద్మజాదేవి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం గార్లదిన్నె ఆదర్శ పాఠశాలలో మండలస్థాయి కబడ్డీ పోటీలను ప్రిన్సిపల్ పద్మాజాదేవి ప్రారంభించారు. ఈపోటీలో బాలుర విభాగంలో మర్తాడు పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా, గార్లదిన్నె పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. బాలికల విభాగంలో గార్లదిన్నె పాఠశాల విద్యార్థినులు విన్నర్స్‌గా, ఇల్లూరు పాఠశాల విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచినట్లు పీఈటీ వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు కళ్యాణి, నూర్‌బాష, శ్రీవాణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాడిపత్రి

మన ఊరు బృందం వితరణ

నిట్టూరు(యాడికి), న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు శనివారం పూర్వ విద్యార్థులు పఠనా సామగ్రిని పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులైన ఉద్యోగులు మన ఊరు బృందంగా ఏర్పడి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందచేస్తున్నట్లు బృందం సభ్యులు ఓబులేసు, కంబన్న, మనోహర్, కంబయ్య తెలిపారు. పూర్వ విద్యార్థుల సాయం పట్ల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణరెడ్డి అభినందనలు తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన ఆంజనేయులు

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన శనివారం మండలపరిధిలోని వంగనూరు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు వంగనూరు గ్రామానికి చెందిన ఆంజనేయులు తాపీమేస్త్రీగా విధులు నిర్వహిస్తున్నాడు. తన విధుల్లో భాగంగా శనివారం ఉదయం గ్రామం నుంచి కూలీల కోసం పట్టణానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొనింది. దీంతో ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మహిళలతో అభివృద్ధి సాధ్యం

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: మహిళలతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు బృంద తెలియజేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కిశోర వికాసంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళాభివృద్ధికి ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయని అన్నారు. మహిళలకు సమస్య వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. లింగవివక్ష చూపకూడదని, అది మన ఇంటి నుంచే ప్రారంభమవ్వాలన్నారు. బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హజరున్, రాజేశ్వరి, దీప్తి, కళ్యాణి, పుష్పలత, శ్రీలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ పండగ

పెద్దపప్పూరు: మండలకేంద్రంలో గ్యార్మీ పండగను ముస్లిం సోదరులు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన జెండాలను పురవీధుల్లో ఊరేగించారు. దస్తగిరి స్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పూలమాలలతో దస్తగిరిస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ముస్లిం మత పెద్దలు షెక్షావలి, పక్రుద్దీన్, అహమ్మద్, హాజీవలి, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న ముస్లిం సోదరులు

నేడు 5కె రన్

తాడిపత్రి పట్టణం: జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు జరుగుతుందని ఆయన అన్నారు. రైల్వే వంతెన నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు నిర్వహిస్తామన్నారు. కావున క్రీడాకారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని 5కె రన్‌ను జయప్రదం చేయాలని ఆయన అన్నారు.

జాతరొస్తోంది.. జన సందడి తెస్తోంది

❖ 27 ఏళ్ల తర్వాత పండగ ❖ తరలిరానున్న భక్తజనం


గ్రామం నడిబొడ్డున వెలసిన జగదాంబ పెద్దమ్మ

యాడికి, న్యూస్‌టుడే: యాడికితో పాటు మండల వ్యాప్త ప్రజలు ఏళ్లుగా ఎదురు చూస్తున్న జన(పెద్దమ్మ) జాతర ఈ నెల 9న యాడికిలో జరగనుంది. 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జాతర నిర్వహిస్తుండటంతో గ్రామంలో సందడి నెలకొంది. జాతరకు దాదాపు రూ.20-30 కోట్లు ఖర్చు అవుతుందని గ్రామపెద్దలు పేర్కొన్నారు. దాదాపు లక్ష వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నట్లు నిర్వహకులు అంచనా వేస్తున్నారు.


జ్యోతుల ఉత్సవాలు (దాచిన చిత్రం)

1962 నుంచి...

కొన్ని ఏళ్ల నుంచి జాతర నిర్వహిస్తున్నప్పటికీ 1962లో నిర్వహించిన జాతరను గ్రామస్థుల విరాళాలతో నిర్వహించినట్లు అప్పట్లో రాసిన దస్త్రాలు చెబుతున్నాయి. 1962లో జాతర నిర్వహణకు రూ.2,039 ఖర్చు చేసినట్లు ఉంది. 1967లో నిర్వహించిన జాతరకు రూ.3,649, 1971లో రూ.4,953, 1982లో రూ.15,779తో, 1990లో చివరి సారిగా జరిగిన జాతరకు రూ.36,704 గ్రామస్థులంతా ఐకమత్యంగా చందాలు వేసుకొని నిర్వహించారని గ్రామస్థులు చెబుతున్నారు.

సామరస్యానికి ప్రతీక...

యాడికిలో దాదాపు 4,500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ లెక్కన ప్రతి కుటుంబానికి 40 నుంచి 50 వేలు వరకు ఖర్చు వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. దాదాపు లక్ష మంది వస్తారని గ్రామీణులు పేర్కొన్నారు. భక్తజనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 300 మంది పోలీసులతో బందోబస్తు ఉంటుందని జాతర నిర్వహకులు తెలిపారు. జాతరను శాంతియుతంగా, సామరస్యంగా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు.

వేడుకాపురం కానున్న యాడికి...

శ్రీకృష్ణదేవరాయులు పాలించిన కాలంలో యాడికిని వేడుకాపురం అనే పేరు ఉండేది. నిత్యం వేడుకలు జరుగుతున్నందున ఆ పేరు వచ్చింది. కానీ కాలక్రమేణా యాడికిగా పేరు మారింది. ఈ జాతరతో యాడికి మరోసారి వేడుకాపురం కానుంది. గ్రామంలోని 16 పవిత్ర ఆలయాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జ్యోతుల ఉత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. జ్యోతుల ఉత్సవం ప్రతి ఏడాది జరుపుతున్నారు. 26 కుటుంబాలకు చెందినవారు అమ్మవారికి కుంభంకాగులు వండుతారని పెద్దలు చెబుతున్నారు.


పోలీసులు, గ్రామపెద్దల ముందస్తు కసరత్తు

అందరికి ఆనందకరం



జాతర నిర్వహణ గ్రామంలో అందరికీ ఆనందకరమే. అన్నదాతలకు, గొర్రెల పెంపకందారులకు శుభప్రదం జరగాలని అమ్మవారిని వేడుకుంటున్నాం. గతంలో 4 నుంచి 8 ఏళ్ల విరామంతో ఈ పెద్దమ్మ జాతర నిర్వహించేవారు. ఈసారి మాత్రమే ఎక్కువ విరామం వచ్చింది. దీంతో గ్రామస్థుల్లో జాతర ఉత్సాహం రెట్టింపవుతోంది. వివిధ రకాల కట్టుబాట్లు, ఆచారాలతో కూడిన ఈ పెద్దమ్మ జాతర ప్రత్యేకమైనది.

- సుబ్బారెడ్డి, నిర్వహకుడు, యాడికి

ప్రజల కోసమే ప్రభుత్వం


కానుకలు పంపిణీ చేస్తున్న రమేష్‌బాబు

యాడికి, న్యూస్‌టుడే: చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన చంద్రన్న సంక్రాంతి కానుకలను శనివారం సీనియర్ తెదేపా నాయకులు రమేష్‌బాబు లబ్ధిదారులకు అందజేశారు. సినిమా థియేటర్ వెనుక ఉన్న చౌకదుకాణానికి వచ్చిన లబ్ధిదారులతో చంద్రన్న కానుకల గురించి అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు. తాము కూడా ఉడతా భక్తిగా పెద్దమ్మ జాతర సందర్భంగా యాడికిలోని నిరుపేదలందరికీ ఉచితంగా బియ్యాన్ని అందజేస్తున్నామని ఆయన తెలిపారు. నాయకులు కుమారరావు, హాజీపీరా, శ్రీరంగ, రహమతుల్లా పాల్గొన్నారు.


రాఘవరెడ్డి


శ్రీధర్

పట్టణ ఎస్సైల నియామకం

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ ఎస్సైలుగా రాఘవరెడ్డి, శ్రీధర్‌లు నియమితులైనట్లుగా పట్టణ సీఐ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఎస్సై ఆంజనేయులు పట్టణఠాణా నుంచి పెద్దపప్పూరుకు బదిలీపై వెళ్లడంతో వారం రోజుల క్రితం రాఘవరెడ్డి, శ్రీధర్‌లు అటాచ్ ఎస్సైలుగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు చేపట్టారు. కాగా శనివారం విడుదలైన బదిలీల్లో ఇరువురు పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్సైలుగా నియమితులయ్యారు. ప్రస్తుతం ముగ్గురు ఎస్సైలు ఉన్నారని ఆయన తెలిపారు.

వసూళ్లతో వ్యాపారులు బెంబేలు

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణంలో ఎక్కడా లేని విధంగా తోపుడు, గంపలు, టీకొట్టు వ్యాపారులతో అధిక ధరలు వసూలు చేస్తున్నారని, వాటిని వెంటనే అరికట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారికి సీపీఐ నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ చిరువ్యాపారులకు వచ్చే అరకొర లాభాల్లో మున్సిపల్ గేట్ అంటూ అధిక డబ్బులు తీసుకుంటే వారు జీవనం ఎలా సాగిస్తారన్నారు. ధరలు తగ్గించకుంటే మీకోసంలో కలెక్టర్‌కు వినతి అందిస్తామని, చిరువ్యాపారులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి, రామ్మోహన్, ఉమాగౌడు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తెరపై ఈనాడు

విజయలక్ష్మి- 2 కంట్రీస్, వరలక్ష్మి- టైగర్ జిందాహై(హిందీ), జయలక్ష్మి- ఒక్క క్షణం, శ్రీలక్ష్మీనారాయణ - ఎంసీఏ, సాయితేజ - హలో, దాదా - అమెజాన్ అడ్వెంజర్, బీహెచ్‌మహల్ - మాతాంగి

తాడిపత్రి

పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరం

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరమని అలాంటి ప్రయాణాలు చేస్తే జైలుకు పంపిస్తామని ఎస్సై ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని చీమలవాగుపల్లిలో ప్రధాన రహదారిపై శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తున్న వాహన చోదకులకు అపరాధ రుసుం విధించారు.

కూరగాయల ధరలు

తాడిపత్రి: నిన్నటి కూరగాయల ధరలు (కేజీ/రూ)

టమోటా - 5, పచ్చిమిర్చి - 20, ఉల్లి - 50, బంగాళదుంప - 30, క్యారెట్ - 60, బీట్‌రూట్ - 30, క్యాబేజీ - 20, గోబీపువ్వు - 30, బీర - 30, ముల్లంగి - 20, వంకాయలు - 20, గోరుచిక్కుడు - 30, బెండ - 30, కాకర - 30, క్యాప్సికం - 50, మొటిక్కాయలు - 30, బీన్స్ - 40.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో 17, 19, 21 వార్డుల్లో జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందరికీ ఇళ్లు పథకంతో గృహం లేని వారికి నిర్మించి ఇస్తోందన్నారు. అలాగే ఎక్కడా లేని విధంగా తాడిపత్రిలోనే పింఛన్లను అందిస్తున్నామని అన్నారు. అంతేకాకుండా చంద్రన్నబీమా, మహిళలకు రుణసౌకర్యం వంటివి ప్రభుత్వం కల్పిస్తోందని సూచించారు. అనంతరం ఆయా వార్డుల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటలక్ష్మి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జిలాన్‌బాషా, మాజీమార్కెట్ యార్డు ఛైర్మన్ నారాయణరెడ్డి, పద్మావతి, సీడీపీవో శశికళ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: నిట్టూరు, చిక్కేపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన జన్మభూమి మాఊరు గ్రామసభల్లో 146 వినతులు అందాయని అధికారులు పేర్కొన్నారు. నూతన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, పింఛన్లు, రుణ ఉపశమన పత్రాలను అధికారులు పంపిణీ చేశారు. వైద్యశిబిరాలను తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీపీ పరిశీలించారు. ఆదివారం లక్షుంపల్లిలో జన్మభూమి మా ఊరు గ్రామసభను నిర్వహించనున్నారు. అధికారులు యోగానందరెడ్డి, నాగమ్మ, లీనావసుంధర, కాశప్ప, రంగనాయకులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ



క్రిష్టిపాడు: క్విజ్‌పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరు, తిమ్మాపురం, చిన్నవడుగూరు పంచాయతీల్లో శనివారం ఆయాగ్రామాల్లో జరిగిన జన్మభూమి మాఊరు గ్రామసభల్లో ఎంపీపీ దేవమ్మ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులకు అన్నీ విధాలుగా న్యాయం చేస్తుందని సూచించారు. సమస్యల పరిష్కరించేందుకే జన్మభూమి గ్రామసభలు ప్రభుత్వం చేపట్టిందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తిమ్మాపురంలో రూ.10లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచి సునీత, ఎంపీపీ ప్రారంభించారు. గ్రామంలో రూ.22లక్షల నిధులతో సీసీరోడ్లు వేసేందుకు ఎంపీపీ భూమిపూజ చేశారు. చిట్టూరులో యువకులకు ఇరుసు పోటీలను నిర్వహించగా, క్రిష్టిపాడు జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలను, చిన్నవడుగూరులో కబడ్డీ, ఖోఖో పోటీలను చేపట్టి బహుమతులను తెదేపా కన్వీనర్ కేశవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏవో రూఫస్‌రోనాల్డ్, ఎంపీడీవో వెంకటచలపతి, ఈవోఆర్డీ అలివేలమ్మ, వైద్యులు శ్రీధర్‌రెడ్డి, వెంకటరమణయ్య, ప్రసూన, ఇంజినీర్లు వెంకటేశ్వర్లు, వరప్రసాద్, వెలుగు ఏపీఎం శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం: పెద్దవడుగూరులోని చేనేతకాలనీలో రూ.10లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి వస్తున్నట్లు ఎంపీపీ, మండల కన్వీనర్ కేశవరెడ్డిలు తెలిపారు.

కోమలి(తాడిపత్రి గ్రామీణం): ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దారు యల్లమ్మ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కోమలి, గంగాదేవిపల్లి, సజ్జలదిన్నె గ్రామాల్లో జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా ప్రభుత్వం ప్రజాభివృద్ధి కోసం చేపట్టిన పథకాల గురించి, వాటి ఫలితాల గురించి సభలో ప్రజలకు తెలియజేశారు. అనంతరం పశువుల్లో నులిపురుగుల నివారణకు పశువుల కాపరులకు డీవార్మింగ్ మందును ఇచ్చారు. అనంతరం గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏపీడీ లావణ్యకుమారి, పశువైద్యాధికారి హేమాంబర్, ఉద్యానశాఖాధికారి ఫజులున్నీషా బేగం, ఆర్ఐ నారాయణస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.



వృషభాలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెత గ్రామంలో శనివారం జన్మభూమి- మాఊరు కార్యక్రమాన్ని తహసీల్దారు రమాదేవి నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో తెదేపా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకొని అర్హులు అభివృద్ధి చెందాలని ఆమె తెలిపారు. జన్మభూమి ప్రాముఖ్యతను వివరించడంతో పాటు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈవోఆర్డీ జిలాన్‌బాషా, వ్యవసాయాధికారి దేవీపద్మలత, ఎంఈవో మాధవ, హరి పాల్గొన్నారు.



పెద్దపప్పూరు: గీతం ఆలపిస్తున్న విద్యార్థులు, అధికారులు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పల్లెలకు బస్సులు నడపాలి

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రి డిపో పరిధిలోని కొన్ని పల్లెలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని, ప్రజల సౌకర్యార్థం బస్సులు నడపాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి నాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం తాడిపత్రి డిపో మేనేజరు ఆవుల నరేంద్రరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు తిరగడం లేదని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెలకే కాకుండా పట్టణాలకు వెళ్లే 50 సర్వీసులను నష్టాల పేరుతో రద్దు చేయడం సబబుకాదన్నారు. దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో కేవలం ఒకే డ్రైవర్‌ను పంపడం అన్యాయమన్నారు. దీంతో రహదారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పల్లెలకు బస్సులను తిప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణరంగయ్య, రామిరెడ్డి, శ్రీనివాసులు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ

గన్నెవారిపల్లికాలనీ (తాడిపత్రి గ్రామీణం), న్యూస్‌టుడే: పేద ప్రజలు సంతోషంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చంద్రన్న సంక్రాంతి కానుకను అందిస్తోందని సర్పంచి రమణ పేర్కొన్నారు. శనివారం గన్నెవారిపల్లి కాలనీలోని చౌకదుకాణం వద్ద చంద్రన్న సంక్రాంతి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పెన్నిధి అని కొనియాడారు. అనంతరం లబ్ధిదారులకు సంక్రాంతి కానుకలను అందించారు. నాయకులు ప్రసాద్, రాము, భాస్కర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



కానుకను అందిస్తున్న సర్పంచి



గ్రామపెద్దలతో వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

జాతర ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

యాడికి, న్యూస్‌టుడే: మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న పెద్దమ్మ జాతర ఏర్పాట్ల గురించి శనివారం డీఎస్పీ మహబూబ్‌బాషా ఆరా తీశారు. పెద్దమ్మ కట్ట, రచ్చకట్ట వద్ద సాగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామపెద్దలు బాలా రమేష్‌బాబు, యాడికి బాబులను కలిసి జాతర ప్రత్యేకతను, చేపడుతున్న పనుల గురించి విచారించారు. అవాంఛనీయ సంఘటనలకు దారితీసే పరిస్థితులేమైనా ఉన్నాయా? అని డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. జాతరలో భక్తుల ప్రశాంతత కోసం పోలీసు బృందాలతో పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్సై శ్రీనివాసులు ఉన్నారు.

ఉరవకొండ

శివదీక్షాపరులకు అన్నదానం

ఉరవకొండ పట్టణం: పట్టణంలో శివదీక్షాపరులకు గవిసిద్దేశ్వర శివదీక్షా సమితి గవిమఠంలో మధ్యాహ్నం పూట అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టింది. దీక్షాపరులు మఠంలోని శివ మందిరంలో పూజల్లో పాల్గొన్న అనంతరం అక్కడే అన్నదానాన్ని సమితి నిర్వహిస్తోంది. పట్టణానికి చెందిన చాలామంది శివదీక్షాపరులు మధ్యాహ్నం వేళ మఠానికి వచ్చి అన్నదానాన్ని స్వీకరిస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

గంగవరం (బెళుగుప్ప), న్యూస్‌టుడే: ప్రతి జన్మభూమి కార్యక్రమంలో ఇళ్లు, పింఛన్లు ఇతరత్రా అర్జీలను పరిష్కరించకుండా జన్మభూమి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. మండలంలో గంగవరం గ్రామంలో శనివారం రాత్రి రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహిస్తున్న జన్మభూమి సభలన్నీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

జనం లేని సభలుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. రూ. కోట్లు ఖర్చు పెట్టి జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందన్నారు. పెట్టుబడి రాయితీకి సంబంధించిన సొమ్ము ఇప్పటికీ రైతులకు అందలేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమం మాదిరిగా కాకుండా పార్టీ కార్యక్రమంగా మార్చడంతో ఇతర పార్టీల నాయకులు హాజరు కావడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా నాయకులు శివలింగప్ప, దుద్దేకుంట రామాంజనేయులు, శివప్ప, బెళుగుప్ప, దుద్దేకుంట గ్రామ సర్పంచులు రామేశ్వరరెడ్డి, ఎర్రిస్వామి, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు అంజినమ్మ, నరసింహప్ప, అశోక్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరత.. లక్ష్యంపై కనిపించని దక్షత

◆ చంద్రన్న పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం ◆ డివిజన్‌లో 1716 గాను సాగయింది 662 ఎకరాల్లోనే



కోతకు వచ్చిన పశుగ్రాసాన్ని పరిశీలిస్తున్న అధికారులు (దాచిన చిత్రం)

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో ప్రధాన పశుగ్రాస పంటయిన వేరుసెనగ, తుంగభద్ర జలాలు రాక వరి పంట అరకొరగా సాగయ్యాయి. దీంతో ఈ ఏడాది పశుగ్రాసం లభ్యత చాలా కష్టంగా మారింది. దానిని సేకరించుకోవడానికి రైతులు పడుతున్న అగచాట్లు వర్ణనాతీతం. ట్రాక్టరు పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాలంటే రూ.వేలల్లో వెచ్చించాల్సి రావడంతో వారి కష్టాలు చెప్పుకోలేనివి. ఈ పరిస్థితి ఉరవకొండ పశుసంవర్ధక డివిజన్ అంతటా ఉంది. ఈ పరిస్థితుల్లో రైతుకు మిగిలింది ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం కల్పిస్తున్న చంద్రన్న పశుగ్రాస క్షేత్రాలే. కానీ వాటి లక్ష్య సాధనలో కొన్నాళ్లుగా పురోగతి కనిపించడం లేదు.

ఉరవకొండ పశు సంవర్ధక డివిజన్‌లో పశుగ్రాస సమస్యను అధిగమించడానికి పశుగ్రాస క్షేత్రాల పెంపునకు ఉన్నత అధికారులు శ్రీకారం చుట్టారు. డివిజన్‌లోని మొత్తం 14 మండలాల్లో 960 పనుల కింద 1922 ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాలను సాగు చేయడానికి ఆయా మండలాల నుంచి డివిజన్ అధికారులకు మండల అధికారులు ప్రతిపాదించారు. వాటిలో 956 పనుల కింద 1915 ఎకరాల్లో దాని సాగుకు మంజూరు కోరుతూ ఈ డివిజన్ ఉప సంచాలకుడు కలెక్టర్‌కు ప్రతిపాదించారు. దీనిని పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు 848 పనుల కింద 1716 ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాలను పెంచడానికి మంజూరు ఇచ్చారు. వీటిని పశుసంవర్ధక శాఖ, ఉపాధి హామీ పథకం సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఎకరాకు రూ. 30 వేలు ప్రకారం కేటాయించారు. అందులో రూ.15 వేలు ఉపాధి పథకం ద్వారా, మరో రూ.15 వేలు పశుసంవర్ధకశాఖ అందించనుంది. ఒక్కో ఎకరాలో మూడు కోతల కింద కనీసం 8 నుంచి 10 టన్నుల గ్రాసం దిగుబడిని సాధించాలన్నది లక్ష్యం. ఆ గ్రాసాన్ని స్థానికంగా ఆయా గ్రామాల్లోని పశు రైతులకే తక్కువ ధరకే దానిని విక్రయించేలా సంబంధిత రైతును ప్రోత్సహించాలన్నది ఉద్దేశం. దీని ద్వారా పశుగ్రాస

రైతుల్లో చైతన్యం తీసుకొస్తాం

మంజూరైన 1716 ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాల సాగుకు చర్యలు చేపట్టాం. కొందరు రైతులు అవగాహన లోపంతో సాధారణ పశుగ్రాసాన్ని సాగుచేశారు. అది ప్రభుత్వ లెక్కలోకి రాదు. ఎంపికయిన లబ్ధిదారులు ఏడాది వరకు దానిని సాగు చేయడానికి ఆస్కారం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పశుగ్రాస క్షేత్రాలను సాగుచేయని రైతుల్లో చైతన్యం తీసుకువచ్చి, లక్ష్యాన్ని చేరుకునే దిశగా ముందుకెళతాం.

- రంగస్వామి, పశుసంవర్ధక ఉప సంచాలకుడు



పచ్చగా పెరిగిన పశుగ్రాస క్షేత్రంలో రైతు

కొరతను అధిగమించడానికి ఆస్కారం ఉంటుందన్నది ప్రభుత్వ భావన.

క్షేత్రస్థాయిలో కనిపించని ప్రోత్సాహం..

ఆ దిశగా క్షేత్రస్థాయిలో వీటి సాగును విస్తృతంగా ప్రోత్సహించేలా ఆ శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇప్పటి వరకు 14 మండలాల్లో 339 పనుల కింద కేవలం 662 ఎకరాల్లో మాత్రమే పశుగ్రాస క్షేత్రాలు సాగయ్యాయి. నిర్దేశించిన లక్ష్యంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఉన్నత అధికారులు మంజూరు చేసిన విధంగా 1716 ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాలు సాగయితే వేసవిలో గ్రాసం కొరత చాలా గ్రామాల్లో తీరడానికి అవకాశం ఉంది. ఆ దిశగా పశుసంవర్ధక అధికారులు సంబంధిత రైతులను చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. ఇలా చేస్తే గ్రాసం సమస్య కనీసం కొన్ని గ్రామాల్లోనైనా తీరడానికి వీలుంటుంది.

గ్రిగ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో గెలుపొందిన కరుట్లపల్లి విద్యార్థులు

కరుట్లపల్లి (కూడేరు), న్యూస్‌టుడే: నార్పల ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో డిసెంబర్ 27 నుంచి ఈనెల 2 వరకు జోన్-9 గ్రిగ్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని కరుట్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. త్రోబాల్ పోటీల్లో బాలుర సీనియర్, జూనియర్ విభాగాల్లో విజేతగా నిలిచారు. దీంతో విజేతలను శనివారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు శేషాచలం, వ్యాయామోపాధ్యాయురాలు రుక్మిణి, కరుట్లపల్లి విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరను సంతోషంగా జరుపుకోండి

గడేకల్లు (విడపనకల్లు), న్యూస్‌టుడే: గడేకల్లు గ్రామంలో 9న జరిగే దేవర కార్యక్రమాన్ని ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సీఐ చిన్న గౌస్ సూచించారు. శనివారం గ్రామంలో సీఐ ప్రజలతో సమావేశం నిర్వహించారు. దేవరను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. గొడవల జోలికి వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల బంద్

ఉరవకొండ పట్టణం: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ర్యాంకుల పేరుతో విద్యార్థులను వేధింపులకు గురి చేయడాన్ని నియంత్రించాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండు చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థలను జీవీఎస్ఎస్, ఎంఆర్‌పీఎస్, ఏబీవీపీ, వైకాపా విద్యార్థి సంఘాలను బంద్ చేయించి నిరసన వ్యక్తం చేశాయి. అనంతరం ఆ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ విశ్రాంత భవనంలో విలేకరులతో మాట్లాడారు. మార్కులు, ర్యాంకుల పేరుతో వారిని మానసికంగా వాటి యజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు వరుసగా పునరావృతం అవుతున్నా ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా ఆ విద్యా సంస్థలపై చర్యలు చేపట్టి, భవిష్యత్తులో విద్యార్థుల ఆత్మహత్యలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు. సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు పురుషోత్తం, పృధ్వీరాజ్, ధనుంజయ, ప్రభాకర్, వినోద్‌కుమార్, వెంకటేశులు, మహేందర్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

పట్టణంలోని సత్యసాయి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో నిల్వ లేనందున నమోదు చేసుకున్న వినియోగదారులకు ఆదివారం వాయుబండల సరఫరా ఉండదని మేనేజరు నరేంద్ర తెలిపారు.

తెరపై ఈనాడు

మల్లేశ్వర్: ఎంసీఏ, బాలాజీ: 2 కంట్రీస్

పట్టుబడిన బియ్యం స్వాధీనం



బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో వెలిగొండ రస్తాలోని గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన చౌక బియ్యాన్ని శుక్రవారం అర్ధరాత్రి విజిలెన్స్ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించగా శనివారం ఉదయం వారు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్ఐ నగేష్ బాబు వెల్లడించారు. విజిలెన్స్ అధికారుల దాడుల్లో 50 కిలోల బరువున్న 86 బస్తాల చౌక బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. వారి సూచనల మేరకు తాము వాటిని స్వాధీనం చేసుకుని, ఆ బస్తాలను పట్టణంలోని పౌరసరఫరాల గోదాములో నిల్వ ఉంచినట్లు చెప్పారు. ఈ బియ్యం మండలంలోని మోపిడి గ్రామానికి చెందిన చంద్రమౌళికి చెందినవిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని వివరించారు.

మెలకువలతో అగ్ని ప్రమాదాల అదుపు



సిలిండరులోని మంటను అదుపు చేస్తున్న అధికారి

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు తగిన మెలకువలతో కొన్ని జాగ్రత్తలను పాటిస్తే వంటగదుల్లో ఏర్పడే గ్యాస్ ప్రమాదాలను సులభంగా అదుపు చేయవచ్చని ఉరవకొండ అగ్నిమాపక అధికారి బసవరాజు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఆ ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండరు ద్వారా మంటలు చెలరేగినప్పుడు వాటిని ఇళ్లల్లో దుప్పటి లేదా ఇతర వాటితో ఎలా అదుపు చేయవచ్చో క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా చూపించారు. అలాగే గ్యాస్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ

క్రీడావికాసానికి అడుగులు

కొనకొండ్ల (వజ్రకరూరు): మండలంలోని కొనకొండ్ల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రీడల సాధనకు అడ్డంకిగా ఉన్న ముళ్లపొదలను శనివారం జేసీబీతో తొలగించారు. ముళ్లపొదలతో ఇబ్బందిగా ఉందని విద్యార్థులు ఎస్సై జనార్దననాయుడు, పోలీసులకు తెలపడంతో యంత్రాన్ని సమకూర్చారు. పీడీ సత్యనారాయణ,గ్రామ పోలీసు పవన్ దగ్గరుండి యంత్రంతో మైదానంలో ముళ్లకంపలు లేకుండా తొలగింపజేశారు.

ఆరో తరగతికి ప్రవేశాలు

విడపనకల్లు: విడపనకల్లు ఆదర్శ పాఠశాలలో 2018-19 విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీరాములు తెలిపారు. ఈనెల 16 నుంచి వచ్చే నెల 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఐదో తరగతి చదువుతున్న పిల్లలు అర్హులనీ.. వివరాలకు ఆదర్శ పాఠశాలను సంప్రదించాలని తల్లిదండ్రులను కోరారు.

ఆరోగ్య సంరక్షణే కీలకం


గర్భిణులతో మాట్లాడుతున్న అధికారులు

ఉండబండ (విడపనకల్లు): ఉండబండంలోని గర్భిణులకు శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. చీఫ్ ఇంజినీరు జలంధర్, ఆర్డీవో మలోల, ఎంపీపీ ప్రతాప్‌నాయుడు, ఎంపీడీవో షకీలాబేగం గర్భిణులకు పసుపు కుంకుమ అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాలతోనే తల్లీబిడ్డకు క్షేమం అన్నారు. కరకముక్కలలో అంగన్‌వాడీ కార్యకర్తలు మొలకెత్తిన విత్తనాలను ప్రదర్శనగా ఉంచారు. ప్రతినిధులు శ్రీదేవి, గీత, శశికళ, స్వర్ణలత, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆడపిల్ల చదువు.. అవనికి వెలుగు

పందికుంట (వజ్రకరూరు): మండలంలోని పందికుంటలో శనివారం జన్మభూమి మాఊరు గ్రామ సభలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల నాటిక అందరినీ ఆకట్టుకుంది. ఆడపిల్లలను చదివిస్తే కలిగే ప్రయోజనాలు, నష్టాలపై విద్యార్థులు నాటిక ప్రదర్శించగా అధికారులు, ప్రజలు మెచ్చుకున్నారు. ఆడపిల్లలను కూడా చక్కగా చదివిస్తే ప్రయోజకులు అవుతారని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో అజయ్‌భాస్కర్ తెలిపారు.

ఆదర్శనీయురాలు.. సావిత్రిబాయి

ఉరవకొండ పట్టణం: సామాజిక ఉద్యమకారిణి, మహిళా అక్షరాస్యతకు తన జీవితాన్ని అంకితం చేసిన సావిత్రిబాయి పూలే నేటి తరం ఉపాధ్యాయినులకు ఆదర్శనీయురాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, జిల్లా కార్యదర్శి రామప్ప చౌదరి పేర్కొన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని సీవీవీ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఆ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆమె జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విడపనకల్లు మండల శాఖ ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రతినిధులు శశికళ, రాధ, సుధారాణి, గాయిత్రి, ఇందుమతి, హేమలక్ష్మమ్మ, గౌతమి, బాధ్యులు గోపాల్, సంజీవకుమార్, రఘు, శ్రీధర్, శేఖర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న లక్ష్మీదేవి

పథకాల సద్వినియోగంతో ప్రగతి


చిన్నముష్టూరులో కానుకల పంపిణీ

చిన్నముష్టూరు (ఉరవకొండ): సంక్షేమ పథకాల సద్వినియోగంతోనే ప్రగతి అని వక్తలు అన్నారు. మండలంలోని చిన్నముష్టూరు,పెద్దముష్టూరులో శనివారం జన్మభూమి-మాఊరు సభలు సర్పంచులు యల్లమ్మ, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. ఎంపీపీ సుంకురత్నమ్మ, ప్రత్యేక అధికారి హిమశైల, ఎంపీడీవో శివకుమార్, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు సువర్ణమ్మ పాల్గొన్నారు. పింఛన్లు, ఇళ్లు మంజూరు చేయాలని గ్రామీణులు కోరారు. నాయకులు విజయభాస్కర్, రామకృష్ణప్ప, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


వెంకటాద్రిపల్లిలో నాయకులను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

అభివృద్ధే లక్ష్యం

విడపనకల్లు: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి తెదేపా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ ప్రతాప్‌నాయుడు, జిల్లా అధికారులు పేర్కొన్నారు. శనివారం ఉండబండ, కరకముక్కలలో జన్మభూమి సభ నిర్వహించగా ఎంపీపీ, జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు జలంధర్, ఆర్డీవో మలోల హాజరయ్యారు. వినతులు స్వీకరించి.. కొత్త రేషన్‌కార్డులు, సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. సర్పంచి వేదవతి, ఎంపీటీసీ పార్వతి, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీవో షకీలాబేగం, అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం

శీర్పి (బెళుగుప్ప): పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షురాలు మాదినేని సుభాషిణమ్మ పేర్కొన్నారు. శీర్పి సర్పంచి హనుమంతరాయుడు అధ్యక్షతన శనివారం వెంకటాద్రిపల్లిలో జన్మభూమి మా ఊరు సభలో పాల్గొన్నారు. పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలను తెలపాలని అధికారులను కోరారు. పంచాయతీ కార్యదర్శి.. నిధుల వివరాలను గ్రామస్థులకు తెలియజేశారు. ఎంపీపీ తిరుపతమ్మ, ఉపాధ్యక్షుడు తిమ్మప్ప, తహసీల్దారు వెంకటాచలపతి, నాయకులు ఉమామహేశ్వరనాయుడు, సునీల్, తిప్పయ్య, ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.

✦ విరుపాపల్లి సర్పంచి పుష్పావతి అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఎంపీడీవో సుధామణి మాట్లాడుతూ, అర్హులైన అందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.


కరకముక్కలలో రేషన్‌కార్డుల పంపిణీ


జరుట్లరాంపురం: అధికారులను ప్రశ్నిస్తున్న స్థానికులు

సమస్యల పరిష్కారం ఊసేదీ?

జరుట్లరాంపురం (వజ్రకరూరు): మండలంలోని జరుట్లరాంపురం, పందికుంటలో శనివారం జన్మభూమి మాఊరు గ్రామ సభలు జరిగాయి. ఎన్టీఆర్ గృహాలను మంజూరు చేయలేదని గ్రామస్థులు అధికారులను ప్రశ్నించారు. రస్తాతో ఇబ్బందిగా ఉందని రాంపురం రైతులు తెలపగా... తహసీల్దార్ ఆదిలింగయ్య మాట్లాడుతూ, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పందికుంటలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నా బిల్లులు రాలేదని ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో అజయ్‌భాస్కర్‌ను అడిగారు. ఉపాధి బిల్లులు కూడా అందలేదని వాపోయారు. ఆర్డీటీ సంస్థ ఇళ్లు మంజూరు చేస్తే పట్టాల్వికపోతే ఎలాగని సర్పంచి లక్ష్మిబాయి, గిరిజనులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తెదేపా నాయకులు శ్రీనివాసులనాయుడు, శ్రీరాములు, వెంకటేశులు పాల్గొన్నారు. పింఛన్లు రాలేదని వృద్ధులు, వితంతువులు అధికారులతో వాగ్వాదానికి దిగగా పోలీసులు జోక్యం చేసుకున్నారు.

మరుగుదొడ్డితో సంపూర్ణ ఆరోగ్యం

ఉదిరిపికొండ (కూడేరు): పతి ఇంటా మరుగుదొడ్డి నిర్మిస్తేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ఊరు పరిశుభ్రంగా ఉంటుందని ప్రత్యేక అధికారి కోదండరామ్ పేర్కొన్నారు. శనివారం ఉదిరిపికొండ గ్రామసభలో ఆయన మట్లాడుతూ, ప్రభుత్వం రూ.56 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు ఏర్పాటు చేసి పుష్కలంగా నీటిని ఇస్తోందన్నారు. సంక్షేమ పథకాలను వివరించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దార్ వసంతలత, ఎంపీడీవో లక్ష్మినారాయణ, వైద్యాధికారి తిప్పయ్య, రామ్మూర్తి, సర్పంచి రామ్మోహన్, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.


ఉదిరిపికొండలో మాట్లాడుతున్న తిప్పయ్య

నేడు 5 కె రన్

బెళుగుప్ప: జన్మభూమి మా ఊరులో భాగంగా బెళుగుప్పలో ఆదివారం 5 కె రన్ ను నిర్వహిస్తామని ఎంపీడీవో సుధామణి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యలయం నుంచి పరుగు ఉంటుందనీ.. క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు.

పింఛను సాధన సమితి తాలూకా కమిటీ ఎన్నిక


నూతన ప్రతినిధులు వీరే

ఉరవకొండ పట్టణం: రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ ఐకాస, పింఛను సాధన సమితి పిలుపు మేరకు ఉరవకొండ తాలుకా పింఛను సాధన సమితి కమిటీ ఎన్నికను శనివారం రాత్రి పింఛనుదారుల భవనంలో నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల్లోని ప్రధాన ప్రతినిధులను ఈ కమిటీకి ఎన్నుకున్నారు. తాలూకా కన్వీనరుగా ఏపీ ఎన్జీవో తాలూకా అధ్యక్షుడిగా భాస్కర్‌బాబు, సభ్యులుగా సుధాకర్, హనుమప్ప, శ్రీరాములు, లింగేష్ బాబు, జగన్నాథ, దావూద్, కిష్టప్ప, రామప్ప ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ, పాత పింఛను విధానాన్ని సాధించుకోవడమే లక్ష్యంగా ఐక్య ఉద్యమాలను బలోపేతం చేస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 9న తాలూకా కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతినిధులు శేఖర్, మృత్యుంజయ పాల్గొన్నారు.